www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

శుక్రవారం | 9-3-2018 | పేజీలు: 18 + 20 | వెల: రూ.5.00 | సంపుటి: 14 సంచిక: 238 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి తె. 6.01 తదుపరి నవమి; నక్షత్రం: జ్యేష్ఠ తె. 3.27 తదుపరి మూల; వర్జ్యం: ఉ.6.59-8.46; దుర్ముహూర్తం: ఉ.8.54-9.41, మ.12.50-1.37; అమృతఘడియలు: సా.5.40-7.27; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.32; సూర్యాస్తమయం: 6.21 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai



రిజర్వేషన్లు రాష్ట్రాల హక్కు

తక్షణమే రాజ్యాంగాన్ని సవరించాలి

రాష్ట్రాలకు స్వేచ్ఛనివ్వాలి: టీఆర్ఎస్

పార్లమెంటులో కొనసాగిన ఆందోళన

'ముస్లిం కోటా' అనడం అవివేకమే

కేంద్ర వైఖరిని తప్పుపట్టిన ఎంపీలు

న్యూఢిల్లీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ల అంశంలో రాష్ట్రాలకు స్వేచ్ఛ కల్పించాలంటూ టీఆర్ఎస్ ఆందోళనను ఉధృతం చేసింది. పార్లమెంటు రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో వరసగా నాలుగో రోజూ సభను స్తంభింపజేసింది. 'ఒక దేశం ఒకే నీతి'ని అవలంబించాలని, కేంద్ర వైఖరి రాష్ట్రాలను గుప్పిట్లో పెట్టుకునేలా ఉండరాదని నినాదాలిస్తూ టీఆర్ఎస్ ఎంపీలు జితేందర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వరరెడ్డి, సీతారాంనాయక్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, జి.నగేష్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీబీ పాటిల్ ప్లకార్డులు పట్టుకుని వెల్‌లో ఆందోళనకు దిగారు. వెంటనే రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4)ని సవరించి రాష్ట్రాలకే ఆ హక్కు వచ్చేలా చేయాలని డిమాండ్ చేశారు. అప్పుడే స్థానికంగా ఏయే వర్గాలకు ఎలా రిజర్వేషన్లు కల్పించాలనే విషయంలో స్పష్టత ఉంటుందని తెలిపారు. అదే సమయంలో ప్రత్యేక హోదా డిమాండ్‌తో టీడీపీ, వైసీపీ ఎంపీలు వెల్‌లోకి వచ్చారు. కావేరీ నీటి యాజమాన్య బోర్డు తక్షణమే ఏర్పాటు

మిగతా 12 వ పేజీలో...

మాటలు చాలు!

మోదీకి బాబు స్పష్టీకరణ | గుడ్ బై | అటు-ఇటు రాజీనామాలు



బాబూ.. మాట్లాడుకుందాం రండి

ఎందుకు తొందర పడుతున్నారు!.. 'రాజీనామాల'పై మోదీ ఫోన్

చర్చలతో సమస్యలు పరిష్కారమవుతాయని ప్రధాని వ్యాఖ్య

నాలుగేళ్లుగా తిరుగుతూనే ఉన్నాం

ఫలితం లేనందునే ఈ నిర్ణయం.. ఆలోచించే తీసుకున్నాం

ఇప్పటికీ ఎన్డీయేలోనే.. మేలు చేస్తే మరిచిపోం: సీఎం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'తొందరెందుకు... కూర్చుని మాట్లాడుకుందాం రండి!'
...అంటూ ప్రధాని మోదీ పిలిచారు!

'నాలుగేళ్లుగా మీ చుట్టూ తిరుగుతున్నాం! ఇక మాటలు చాలు'
...అని చంద్రబాబు తేల్చి చెప్పేశారు.

టీడీపీకి చెందిన అశోక్ గజపతిరాజు, సుజనా చౌదరి కేంద్ర మంత్రి పదవులకు రాజీనామా చేయడానికి రెండు గంటల ముందు... గురువారం ప్రధాని మోదీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫోన్ చేశారు. "రాజీనామాలపై తొందరపడవద్దు. పరస్పరం కూర్చుని మాట్లాడుకుందాం. ఢిల్లీకి రండి" అని ఆహ్వానించారు. ప్రధాని

మిగతా 6వ పేజీలో...

ఆ పది నిమిషాలు

'నాయుడూ జీ' ఎలా ఉన్నారంటూ పలకరింపు

'అంతా సవ్యంగా జరగాలి' అని ముగింపు 8

వైదొలగిన అశోక్, సుజనా



ప్రధానికి రాజీనామా పత్రాలిచ్చిన ఇద్దరు కేంద్ర మంత్రులు

చాలా చేశాం కదా.. మిగతావీ అటూఇటుగా అవుతాయి

రాజీనామాలు దురదృష్టకరం.. టీడీపీ నేతలతో మోదీ

ఒక పార్టీది ద్రోహం.. మరో పార్టీది మోసం: సుజనా

గడియారం వెనక్కి తిప్పాలని అనడం లేదు

విభజన హామీల అమలే కోరుతున్నాం: అశోక్

కామినేని, మాణిక్యాల రాజీనామా.. ఆమోదం

న్యూఢిల్లీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం అధిష్ఠానం ఆదేశం మేరకు ఆ పార్టీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు అశోక్ గజపతిరాజు, సుజనా చౌదరి తమ పదవులకు రాజీనామా చేశారు. గురువారం సాయంత్రం 6 గంటలకు వారు ప్రధాని మోదీ

మిగతా 6వ పేజీలో...

'మలి' అడుగు ఏమిటి?

కేంద్రానికి ఇంకా అవకాశమివ్వాలనే యోచన

అప్పటికీ కుదరకపోతే ఎన్డీయేకూ గుడ్‌బై

8 **ఆ తర్వాత జాతీయ స్థాయిలో తటస్థ వైఖరి**

2 లక్షల టెక్ టీచర్లకు కష్టం

ఏఐసీటీఈ మార్గదర్శకాలతో సంఖ్యను కుదిస్తున్న కాలేజీలు

సుప్రీంకోర్టుకెక్కిన టీచర్లు 14



డీఎంఈ రమేశ్‌రెడ్డి నియామకం చెల్లదు

నిబంధనల మేరకు కొత్త డీఎంఈని నియమించండి

హైకోర్టు ఆదేశం 11

చెప్పి చూద్దాం

రిజర్వేషన్ల పెంపుపై కేంద్రానికి వివరిద్దాం

వారి అభ్యంతరాలకు జవాబులు పంపిద్దాం

స్పందన చూశాకే కార్యాచరణ.. సీఎం నిర్ణయం

ఆర్టికల్ 16(4)లో జనాభా దామాషా అన్లేదు

'తగినంత ప్రాతినిధ్యం' అనే పేర్కొంది

అసాధారణ పరిస్థితుల్లో తప్ప 50% దాటరాదు

రిజర్వేషన్లకు ఆధారాలు, వాస్తవాలు చూపలేదు

వివరణ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి పంపాం

లిఖితపూర్వక వివరణలో కేంద్రం స్పష్టీకరణ

తమిళనాట ఎలా సాధ్యపడిందప్పా!

కోటా పెంపులో కరుణ, జయదే కీలకపాత్ర

41% నుంచి 69శాతానికి పెంచిన ఘనత

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి సంబంధించి కేంద్రం అభ్యంతరాలకు సమాధానం పంపించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. రిజర్వేషన్ల పెంపునకు తాము భావిస్తున్న 'అసాధారణ' కారణాలు ఏమిటో.. పెంచాలని తాము భావించడానికి 'ఆధారం' ఏమిటో వివరించాలని నిర్ణయించింది. తెలంగాణ ఏర్పాటును ఇందుకు ప్రధాన కారణంగా చూపించనుంది. అప్పటికీ కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే, తదుపరి కార్యాచరణను ఆ తర్వాత నిర్ణయించాలని భావిస్తోంది. గిరిజనులు, ముస్లిములకు రిజర్వేషన్లను ఇవ్వలేమంటూ కేంద్రం చేసిన ప్రకటనను 'ఆంధ్రజ్యోతి' ప్రముఖంగా ప్రచురించింది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ల పెంపుపై సీఎం కేసీఆర్

మిగతా12వ పేజీలో...



వి-హబ్ ప్రారంభోత్సవ సభలో మంత్రి కేటీఆర్, టెస్సీ థామస్, జయేశ్ రంజన్, తదితరులు

స్టార్టప్‌లకు కోటి

సర్కారు సాయం.. హైదరాబాద్‌లో మరో సిలికాన్ వ్యాలీ: కేటీఆర్

వి-హబ్ ప్రారంభం.. నేటి నుంచి వెబ్‌సైట్‌లో దరఖాస్తుల స్వీకరణ

అశోక్ పనితీరు అద్భుతం

విమానయానం కొత్తపుంతలు

రాజీనామాతో షాకయ్యా

మూడో ఫ్రంటే ప్రత్యామ్నాయం!

దేశరాజకీయాలు కాంగ్రెస్, బీజేపీకే పరిమితం కాదు

మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు 8

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సృజనాత్మక ఆలోచనలతో వచ్చే ప్రతీ స్టార్టప్‌ను ప్రోత్సహించేందుకు, ఆర్థిక సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఒక్కో స్టార్టప్‌కు రూ.25లక్షల నుంచి రూ.1కోటి వరకు ఆర్థిక సాయం అందిస్తాం. సిలికాన్ వ్యాలీని మక్కా ఆఫ్ ఇన్నోవేషన్‌గా అంటుంటారు. కారణం అక్కడ స్టార్టప్‌లను ప్రోత్సహించే వాతావరణం ఉంది. అలాంటి వాతావరణాన్నే కల్పించి హైదరాబాద్‌లో మరో

మిగతా 11వ పేజీలో...

సీఎం కార్యదర్శిగా సుల్తానియా



సీఎంవోలో అదనపు కార్యదర్శిగా మాణిక్‌రాజ్

ఆరుగురు జేసీలకు పదోన్నతి

ఆరు జిల్లాలకు కొత్త కలెక్టర్లు

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆరుగురు జాయింట్ కలెక్టర్లకు పదోన్నతి లభించింది. వీరిలో ముగ్గురు జేసీలు పనిచేస్తున్న జిల్లాలకే కలెక్టర్లు కాగా, మరో ముగ్గురు ఇతర జిల్లాలకు కలెక్టర్లుగా నియమితులయ్యారు. పశుసంవర్ధక శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ముఖ్యమంత్రి కేసీఆర్ కార్యదర్శిగా నియమితులయ్యారు. తదుపరి ఆదేశాలు

మిగతా 12వ పేజీలో...

ఎంబీసీలకు రుణాలు 11

గత బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించాం

ఈ బడ్జెట్‌లోనూ నిధులు కేటాయిస్తాం:సీఎం

'ఏడాది' ఎత్తివేత

సర్కారు ఆస్పత్రుల్లో పని చేయకున్నా రిజిస్ట్రేషన్

సీఎం ఆదేశం.. పీజీ వైద్య విద్యార్థులకు ఊరట 2

దోస్త్ లేకుంటే కాలేజీ గుర్తింపు రద్దు 2

డిగ్రీ ప్రవేశాల ప్రక్రియలో మార్పులు

అడ్మిషన్ బాధ్యతలు ఉన్నత విద్యామండలికే

నచ్చినవాడిని పెళ్లాడు

యుక్తవయస్కుల పెళ్లిళ్లలో కోర్టు జోక్యం కుదరదు

లవ్ జిహాద్ కేసులో సుప్రీంకోర్టు అంతిమ తీర్పు 14



అలాంటి గోదానం వద్దు!



గోదానం మహాపుణ్యప్రదం. కానీ.. మనకు పనికిరాని గోవులను దానం చేయకూడదు. దానివల్ల కలిగే అనర్థంపై కఠోపనిషత్తులో ఒక కథ ఉంది. ఒకసారి వాజశ్రవుడనే రుషి విశ్వజిత్ యాగాన్ని చేశాడు. దానాలిచ్చే సమయంలో.. ముసలివి, ఇంద్రియపటుత్వం లేని గోవులు ఉండటం వాజశ్రవుడి కుమారుడు నచికేతుడు గమనించాడు. దీనివల్ల తండ్రికి సుఖం లేని లోకం ప్రాప్తిస్తుందనే ఆవేదన కలిగిందతడికి. దీంతో తండ్రిని ఉద్దేశించి.. "ఈ యాగంలో నీ సర్వస్వాన్నీ దానం చేయాలి కదా.. నన్నెవరికిస్తావ్' అని అడిగాడు. తండ్రి సమాధానం చెప్పలేదు. నచికేతుడు రెండు, మూడుసార్లు రెట్టించి అడగడంతో వాజశ్రవుడు విసుగ్గా.. 'నిన్ను యముడికిస్తాను' అని నోరుజారి ఆ తర్వాత బాధపడ్డాడు. నచికేతుడు మాత్రం.. తన తండ్రి ఆడినమాట తప్పిన పాపం మూటకట్టుకోకూడదని భావించి యమలోకానికి వెళ్లాడు. యముడు లేకపోవడంతో మూడు రోజులపాటు అక్కడే ఉపవాసంగా ఉండి వేచి చూశాడు. ఆ తర్వాత అక్కడికి వచ్చిన యముడు.. నచికేతుడిని మూడు రోజులపాటు పస్తు ఉంచినందుకు బాధపడి ఏదైనా వరమిస్తా కోరుకోమన్నాడు. దీనికి నచికేతుడు.. 'మరణించిన తర్వాత ఆత్మ-జీవుడు ఉంటున్నాడా? లేదా?' అనే సందేహానికి సమాధానమే కోరాడు. తొలుత అందుకు అంగీకరించని యముడు.. అతడికి మరణానంతర ఆత్మవిద్య బోధించాడు. ఆ సత్యాన్ని తెలుసుకోవడంతో నచికేతుడు బ్రహ్మరూపాన్ని పొంది తండ్రి వద్దకు తిరిగివెళ్లాడు. మహానుభావుడు కాబట్టి నచికేతుడు.. తన తండ్రి చేసిన దోషాన్ని పోగొట్టుకోగలిగాడు. సామాన్యులకు అది దుస్సాధ్యం కనుక, గోదానం చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. మంచి గోవులను మాత్రమే దానం చేయాలి.

- నిట్టల గోపాలకృష్ణ

Paramjyothi
పరంజ్యోతి

లోకం తీరు



మావద్ద కూడా ఎక్కడుంటున్నాయి సార్!
పన్నుల రూపంలో మీరే తీసుకుంటున్నారుగా!!

ప్రశ్నపత్రం ఫొటో తీసి పంపేస్తున్నాడు!

- ఓ ప్రైవేటు కళాశాల ప్రిన్సిపాల్ నిర్వాకం
- అంతర్గత విభేదాలతో బాగోతం బట్టబయలు
- ఇంటర్ బోర్డుకు అధికారుల ఫిర్యాదు

జగిత్యాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలో ఓ కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థులు నిత్యం పరీక్షలకు ఆలస్యంగా వస్తున్నారు! నిబంధనలకు విరుద్ధంగా వారిని పరీక్షలు రాయడానికి అనుమతిస్తున్నారు! అసలా విద్యార్థులు రోజూ ఆలస్యంగా ఎందుకు వస్తున్నారు? ఇదే అనుమానం అధికారులకు వచ్చింది. ఆరా తీస్తే అసలు బాగోతం బయటపడింది! పరీక్ష కేంద్రానికి అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్ హోదాలో ఉన్న ఓ ప్రిన్సిపాల్ పరీక్ష ప్రశ్నపత్రాలను ముందుగానే సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసి తన కళాశాల విద్యార్థులకు పంపుతున్నాడు. వాటి ఆధారంగా విద్యార్థులు జవాబులను సిద్ధం చేసుకొని కాస్త ఆలస్యంగా పరీక్ష కేంద్రానికి చేరుకుంటున్నారు! ముందే ఓ అవగాహనకు రావడంతో వారిని పరీక్షలు రాయడానికి అనుమతిస్తున్నారు! వారం రోజులుగా జరుగుతున్న ఈ తంతు అంతర్గత విభేదాల కారణంగా బయటపడినట్లు సమాచారం. తాజాగా ఈ వ్యవహారం ఇంటర్ బోర్డు అధికారుల దృష్టికి వెళ్లింది. స్పందించిన అధికారులు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించవద్దంటూ ఆదేశాలు జారీ చేయడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. ఫిబ్రవరి 28 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రతి పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారితో పాటు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్లుగా వ్యవహరిస్తుంటారు. మూడు రోజుల క్రితం జగిత్యాలలోని ఓ ప్రైవేట్ కళాశాల ప్రిన్సిపాల్ అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్ హోదాలో పరీక్షా కేంద్రం లోపలికి వెళ్లి ప్రశ్నపత్రాల సీల్ విప్పుతుండగా, సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీశాడని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం అందించినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీంతో సదరు అధికారులు, జగిత్యాలలోని ప్రైవేట్ కళాశాలల యజమానులు బోర్డుకు ఫిర్యాదు చేశారు. తీవ్రంగా పరిగణించిన ఇంటర్మీడియట్ బోర్డు.. ఆ కళాశాలలో పని చేస్తున్న చీఫ్ సూపరింటెండెంట్‌ను తప్పించాలని ఆదేశించినట్లు తెలిసింది. జగిత్యాలలోని ఒకే కళాశాలకు చెందిన విద్యార్థులు రెండు రోజులు ఆలస్యంగా రావడంపై కూడా ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపైనా బోర్డు ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

యాదాద్రిలో 'గోశాల' స్కాం

- పశుగ్రాస తూకంలో కాంట్రాక్టర్ మోసం
- ఆలయానికి 17.27 లక్షలు నష్టం
- కాంట్రాక్టర్‌పై క్రిమినల్ చర్యలు
- ఏడుగురు ఆలయ ఉద్యోగులకు నోటీసులు


యాదాద్రి గోశాల

యాదాద్రి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి లక్ష్మీనారసింహుడి ఆలయ సన్నిధిలోని గోవుల సంరక్షణకు ఏర్పాటు చేసిన గోశాలకు పశుగ్రాసం సరఫరాలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఆవులకు గ్రాసం సరఫరా చేసే కాంట్రాక్టరు తూకం విషయంలో అవినీతికి పాల్పడ్డాడు. మూడేళ్లలో 3.74లక్షల కిలోల పశుగ్రాసం తూకంలో గల్లంతైందని, దీని విలువ రూ.17.27 లక్షలు ఉంటుందని ఆలయ విచారణ అధికారులు తేల్చారు. కాంట్రాక్టర్‌పై క్రిమినల్ చర్యలకు ఆలయ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ మూడేళ్లలో గోశాలలో విధులు నిర్వహించిన నలుగురు పర్యవేక్షకులు, ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లకు మెమోలు జారీ చేశారు.

తక్కువ తూకంతో ఎక్కువ బిల్లులు

యాదాద్రిలో స్వామివారి అభిషేకం, నివేదనల కోసం అవసరమైన పాలు, పెరుగుతోపాటు పవిత్రమైన గోవుల సంరక్షణ కోసం గుట్ట కింద ప్రత్యేకమైన గోశాలను దేవస్థానం నిర్వహిస్తోంది. ఇక్కడి గోవులకు, లేగదూడలకు అవసరమైన వరిగడ్డి, పచ్చిగడ్డిని మూడేళ్లుగా తుర్కపల్లి మండలం ముల్కలపల్లి కాంట్రాక్టర్ నర్సింహ సరఫరా చేస్తున్నాడు. ఇటీవల గోశాలలో విధులు నిర్వహిస్తున్న పర్యవేక్షకుడికి పశుగ్రాసం సరఫరాపై అనుమానం వచ్చింది. సాధారణంగా తూకం వేసే వేబ్రిడ్జిపై కాకుండా భువనగిరి మండలం రాయిగిరి వద్దగల మరో ఎలక్ట్రానిక్ వేబ్రిడ్జిపై నర్సింహతో తూకం వేయించాడు. ఈ తూకంలో ఒక ట్రాక్టర్‌కు దాదాపు 300 కిలోల దాకా వ్యత్యాసం వచ్చినట్టు సదరు పర్యవేక్షకుడు గుర్తించాడు. విషయాన్ని ఆలయ ఈవోకు నివేదించగా ఆలయ పరిపాలన విభాగం సహాయ కార్యనిర్వహణాధికారి ఎ.చంద్రశేఖర్, మరో ముగ్గురు సూపరింటెండెంట్లతో ప్రత్యేక కమిటీని నియమించారు. ఈ కమిటీ విచారణ చేపట్టడంతో మూడేళ్లుగా పశుగ్రాసం సరఫరా తూకంలో అక్రమాలు జరుగుతున్నాయని తేలింది. గతంలో తప్పుడు తూకం ద్వారా.. దేవస్థానం నుంచి అక్రమంగా కాంట్రాక్టర్ నర్సింహ బిల్లులు కాజేసినట్టుగా గుర్తించారు. మూడు ఆర్థిక సంవత్సరాల్లో ఆలయానికి రూ.17.27 లక్షల నష్టం వచ్చినట్టు తేల్చారు. గోశాలలో 2015 నుంచి 2018 వరకు పనిచేసిన పర్యవేక్షకులు ఎం. శివకుమార్, ఎస్.మల్లేశ్, జె.శంకర్, వి.బాల్‌రెడ్డి, సీనియర్ అసిసెంట్లు బలరాంసింగ్ యాదవ్, జి.రామారావు, డి.రామారావులకు సంజాయిషీలు కోరుతూ ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. గీతారెడ్డి మెమోలు జారీ చేశారు.

ఉద్యోగులు, కాంట్రాక్టర్‌పై చర్యలు

దేవస్థానం నిర్వహిస్తున్న గోశాలలో విధులు నిర్వహిస్తున్న ఆలయ ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా పశుగ్రాసం సరఫరాలో అక్రమాలు జరిగాయి. నాణ్యత లేని పశుగ్రాసం సరఫరా జరగడమే కాకుండా తప్పుడు తూకం వేబిల్లుల ద్వారా దేవస్థానానికి ఆర్థికంగా తీవ్ర నష్టం జరిగింది. మూడేళ్లలో దాదాపు రూ.17 లక్షల నష్టం జరిగినట్టుగా విచారణ కమిటీ నిర్ధారించింది. ఈ మేరకు ఆలయ ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు, కాంట్రాక్టర్‌పై చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటాం.

- ఆలయ ఈవో గీతారెడ్డి

ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నిజామాబాద్	38.1	21.3
ఆదిలాబాద్	36.0	20.0
రామగుండం	36.8	18.4
హైదరాబాద్	36.3	19.8
నల్లగొండ	36.0	23.6

అధికంగా రాత్రి ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గురువారం పలు ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదయ్యాయి. మెదక్‌లో 7 డిగ్రీలు, హకీంపేటలో 5, నల్లగొండలో 2 డిగ్రీల మేరకు రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా మహబూబ్‌నగర్‌లో 38 డిగ్రీలు కాగా, భద్రాచలంలో 37.2, ఆదిలాబాద్‌లో 37, రామగుండంలో 36.8, హైదరాబాద్‌లో 36.3, మెదక్‌లో 36.1 డిగ్రీలు నమోదయ్యాయి.



డ్రాగన్, ఏనుగు డ్యాన్స్ చేయాలి

డ్రాగన్, ఏనుగు కలిసి డ్యాన్స్ చేయాలి. భారత్, చైనా సంబంధాల్లో నిరుడు పరీక్షా కాలం ఎదురైంది. ఇరుదేశాలకు వ్యూహాత్మక దార్శనికత ఉంది. అందుకే డోక్లాం సమస్యను పరిష్కరించుకోగలిగాం. డ్రాగన్, ఏనుగు ఘర్షణ పడరాదు. ఇరుదేశాలూ ఆనందంతో చిందులేయాలి. భారత్, చైనా కలిస్తే 1+1=11 అవుతుంది.

- చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి



మహిళల పట్ల అసభ్యంగా ప్రవరిస్తే బహిరంగ ఉరే!

అన్ని రంగాల్లో అతివలదే పైచేయి. వారి ప్రమేయం లేకుండా ఏ రోజైనా పనులు జరుగుతాయా? మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిని బహిరంగంగా ఉరి తీయాలి.

- మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్

దోస్త్ లేకుంటే కాలేజీ గుర్తింపు రద్దు

డిగ్రీ ప్రవేశాల ప్రక్రియలో పలు మార్పులు.. అడ్మిషన్ బాధ్యతలు ఉన్నత విద్యామండలికే

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల ప్రక్రియ (దోస్త్)ను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చర్యలు చేపట్టింది. దోస్త్ నిబంధనలను పాటించని కాలేజీలకు 2018-19 విద్యా సంవత్సరం నుంచి అనుబంధ గుర్తింపు(అఫిలియేషన్)ను రద్దు చేయాలని నిర్ణయించింది. అలాగే అడ్మిషన్ల పూర్తి బాధ్యతను ఉన్నత విద్యామండలే చేపట్టనుంది. ఇప్పటివరకు అడ్మిషన్ల అధికారం యూనివర్సిటీలకు దక్కడంతో పలు సమస్యలు ఎదురయ్యాయి. దీంతో యూనివర్సిటీల నుంచి పూర్తి బాధ్యతను తీసుకునేలా ఉన్నత విద్యా మండలి అధికారులు ప్రత్యేకంగా నిబంధనలు రూపొందిస్తున్నారు. మరోవైపు అఫిలియేషన్ ప్రక్రియలో భాగంగా తక్కువ సీట్లు భర్తీ అయ్యే కాలేజీల్లో సీట్లను తగ్గించనున్నారు. దీనిపై కాలేజీల యాజమాన్యాలతో చర్చలు జరుపనున్నారు. తక్కువ సీట్లు భర్తీ అయ్యే కాలేజీల మధ్య సయోధ్య కుదిర్చి.. ఆయా కాలేజీలను విలీనం చేసుకునేలా ప్రోత్సహించనున్నారు. ఫలితంగా 2018-19 లో 350 వరకు కాలేజీలు మూతపడే అవకాశం ఉందని అంచనా.

మేలో నోటిఫికేషన్.. స్పాట్ అడ్మిషన్లకు అవకాశం

డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి మే నెలలో దోస్త్ నోటిఫికేషన్‌ను అధికారులు జారీ చేయనున్నారు. జూన్‌లోపు ప్రవేశాల ప్రక్రియ ముగించనున్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ బాధ్యతను ఈ యేడాది కూడా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ)కే అప్పగించాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియలో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం లేదు. దీంతో వేల మంది విద్యార్థులు చివరిలో సీట్లు లభించక విద్యా సంవత్సరాన్ని కోల్పోయారు. 2017-18 విద్యా సంవత్సరంలో సుమారు ఏడు వేల మంది విద్యార్థులకు సీట్లు దక్కలేదు. నాలుగు లక్షల సీట్లు అందుబాటులో ఉండగా అందులో ప్రతిసారి సుమారు రెండు లక్షలకు పైగా సీట్లు మిగిలిపోతున్నాయి. అయినప్పటికీ విద్యార్థులు సీట్లు లభించక విద్యా సంవత్సరం కోల్పోవడం సమస్యగా మారింది. దీంతో ఈయేడాది నుంచి ప్రైవేటు కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం ఇవ్వాలని ఉన్నత విద్యా మండలి అధికారులు ఈ మేరకు నిర్ణయించారు.

'ఏడాది' నిబంధన ఎత్తివేత!

- పీజీ వైద్య విద్యార్థులకు ఊరట
- సర్కారు ఆస్పత్రుల్లో పని చేయకున్నా రిజిస్ట్రేషన్
- రానున్న అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లు
- అధికారులను ఆదేశించిన సీఎం కేసీఆర్

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యలో పీజీ పూర్తి చేసిన విద్యార్థులు కచ్చితంగా ఏడాది పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేయాలన్న నిబంధన తొలగించేందుకు సీఎం కేసీఆర్ సుముఖత వ్యక్తం చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లోనే ఇందుకు సంబంధించిన బిల్లు ప్రవేశపెట్టాలని, ఈ నిర్ణయాన్ని ప్రస్తుత ఏడాది నుంచే అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ ఏడాది పీజీ పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేయకున్నా, వారి విద్యార్హతలను రిజిస్టర్ చేయాలని ఆదేశించారు. మెడికల్ పీజీ పూర్తి చేసిన వారు విధిగా ఒక ఏడాది పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తేనే, వారి విద్యార్హతలను రిజిస్టర్ చేయాలనే నిబంధన అమలవుతోంది. ఈ నిబంధన తొలగించాలని విద్యార్థులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో సీఎం సానుభూతితో పరిశీలించారు. రాష్ట్రంలో వైద్యులు ప్రాక్టీస్ చేసుకోవాలంటే ముందుగా తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. ఇందుకోసం పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు కచ్చితంగా ఏడాది పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేయాలన్న నిబంధన అమల్లో ఉంది. తొలుత ఎంబీబీఎస్ విద్యార్థులకు ఈ నిబంధన ఉన్నా తొలగించారు. ప్రస్తుతం పీజీ విద్యార్థులకు మాత్రం ఈ విధానాన్ని కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో కలిపి 1500 పీజీ సీట్లు ఉన్నాయి. కొన్ని నెలల క్రితం పీజీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులను ప్రభుత్వం సీనియర్ రెసిడెంట్ డాక్టర్లుగా నియమించింది. వీరికి స్టైపండ్ కింద నెలకు రూ.40,000 చొప్పున చెల్లిస్తోంది. ఇందుకోసం ఏడాదికి సుమారు రూ.100 కోట్లు ఖర్చు పెడుతోంది. ఇలా పీజీ విద్యార్థులతోపాటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న వారికీ స్టైపండ్ చెల్లించాల్సి వస్తోంది. వీరికి స్టైపండ్ ఇచ్చే బదులు శాశ్వత ప్రాతిపదికన నియామకాలు చేపడితే బాగుంటుందన్న ఆలోచనతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే వైద్య సిబ్బంది పోస్టుల ఆర్థిక శాఖ ఆమోదం లభించిన పరిస్థితుల్లో 'ఏడాది' నిబంధనను ఎత్తివేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు.

అతడినే నమ్మి వెళుతున్నా!

- నాన్నకు మా పెళ్లి ఇష్టం లేదు.. అయినా దేవుడిపైనే భారంవేశా
- అక్కతో హతురాలు భార్గవి చివరి మాటలు
- ప్రియుడు నరేందర్ తల్లిదండ్రులు అరెస్టు


భార్గవి (ఫైల్)

మోత్కూరు, మార్చి 8: "నేను అతడినే నమ్ముకున్నా.. నాన్నకు పెళ్లి ఇష్టం లేదు. అయినా దేవుడిపై భారంవేసి అతడితోనే వెళ్తున్నా".. ప్రియుడి చేతిలో హత్యకు గురయ్యే ముందు తన అక్కతో భార్గవి ఫోన్‌లో మాట్లాడిన చివరి మాటలివి! ఆమె నమ్మకాన్ని ప్రియుడు నరేందర్ ఘోరంగా వంచించాడు. భార్గవిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి, దారుణంగా హత్యచేశాడు. అయితే, భార్గవి హత్యలో నరేందర్‌కు అతడి తల్లిదండ్రులు కూడా సహకరించారని పోలీసులు నిర్ధారించారు. ఈ కేసులో నరేందర్‌ను ఇప్పటికే రిమాండ్‌లో ఉంచిన పోలీసులు.. నిందితుడి తల్లిదండ్రులు సత్యయ్య, ఆండాలును గురువారం అరెస్టు చేశారు. భార్గవిని నరేందర్ హత్యచేసిన తర్వాత మృతదేహాన్ని పూడ్చిపెట్టడంలో అతడి తల్లిదండ్రులు సహకరించారని తేలింది. గురువారం రామన్నపేట సీఐ శ్రీనివాస్ వివరాలను వెల్లడించారు. యాదాద్రి జిల్లా వెంకటాపురానికి చెందిన భార్గవి (23) డిగ్రీ పూర్తిచేసి, ఆత్మకూర్ (ఎం) మండల కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో పనిచేసేది. ఈ నెల 3న ఆమె హత్యకు గురైంది. బుజిలిపురానికి చెందిన నరేందర్ కొన్నాళ్లు పెట్రోలు పంపులో పని చేసి ఖాళీగా ఉన్నాడు. భార్గవి-నరేందర్ ఐదేళ్లుగా ప్రేమించుకున్నారు. అయితే, పెద్దలు మరో అమ్మాయితో పెళ్లి నిశ్చయించడంతో నరేందర్.. భార్గవిని నమ్మించి తన వ్యవసాయ బావి వద్దకు తీసుకెళ్లి హత్యచేశాడు. ఏమీ తెలియనట్టు ఆ మరుసటి రోజే మరో అమ్మాయి మెడలో తాళికట్టాడు. కుమార్తె కనిపించకపోడంతో భార్గవి తండ్రి లక్ష్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నరేందర్‌పైనే అనుమానాలు వ్యక్తం చేశాడు. నరేందర్‌ను పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో నేరాన్ని ఒప్పుకొన్నాడు.

పెళ్లని నమ్మించాడు

నరేందర్‌తో వెళ్లే ముందు భార్గవి.. హైదరాబాద్‌లో ఉంటున్న తన అక్క ఉషతో చివరిసారిగా ఫోన్‌లో మాట్లాడింది. 'ఇప్పటివరకు నేను సుఖపడిందేమీ లేదు. నరేందర్‌ను పెళ్లి చేసుకుంటే మంచిగ చూసుకుంటాడో, కష్టపెడతాడో తెలియదు. నరేందర్ స్వగ్రామమైన బుజిలాపురంలోని గుట్టపై పెళ్లి చేసుకుందాం రమ్మని పిలిచాడు. వెళ్తున్నా మంచైనా, చెడైనా భగవంతుడిపైనే భారం వేశాను' అని అక్కతో చెప్పుకొంది. నరేందర్ ఖాళీగా తిరుగుతుండడంతో అతడితో పెళ్లికి నాన్న అభ్యంతరపెట్టాడని వాపోయింది.పెళ్లయిన తర్వాత నరేందర్ తల్లిదండ్రులు ఇంటికిరానివ్వకపోతే బయట వేరేచోట ఉంటా మంది. తమ ప్రేమవిషయం మోత్కూరులోని మహిళా మండలి సభ్యులకు, పోలీసులకు కూడా తెలుసునని, వారు తనకే మద్దతిస్తారని అక్కతో చెప్పింది. ఫోన్ సంభాషణను ఉష రికార్డు చేసింది. సోషల్ మీడియాలో ఆడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. కాగా గురువారం భార్గవి అంత్యక్రియలు పూర్తయ్యాయి.

ఒకరిని కాపాడబోయి ఒకరు..

ముగ్గురు అన్నదమ్ముల జలసమాధి

కందూరు ఆలయ కోనేరులో ఘటన

- కనిపించని రక్షణ చర్యలు
- అధికారుల నిర్లక్ష్యమే కారణమన్న భక్తులు


పవన్‌కుమార్ (ఫైల్)


రవికుమార్ (ఫైల్)


ఆంజనేయులు (ఫైల్)

అడ్డాకుల, మార్చి 8: వాళ్లు ముగ్గురు అన్నదమ్ములు. మొక్కులు తీర్చుకునేందుకు కుటుంబసభ్యులతో ఆలయానికి వచ్చి.. ఒకరిని కాపాడబోయి ఒకరు జలసమాధి అయ్యారు. ఈ విషాదం మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం కందూరు రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో జరిగింది. ప్రస్తుతం స్వామివారి క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. గురువారం ఉదయం మహబూబ్‌నగర్ పట్టణంలోని ఏనుగొండకు చెందిన ఉప్పరి చెన్నకేశవులు కుటుంబం మొక్కులు తీర్చుకోవడానికి క్షేత్రానికి వచ్చింది. చెన్నకేశవులుతోపాటు ఆయన కుమారులు రవికుమార్(27), పవన్‌కుమార్(25), ఆంజనేయులు(20) స్నానం చేయడానికి కోనేరులోకి దిగారు. మొదట ఆంజనేయులు కాస్త లోపలికి దిగగానే మరో మెట్టు ఉన్నదని భావించి అడుగు ముందుకేశాడు. కానీ.. అక్కడ లోతు ఎక్కువగా ఉండటంతో నీటిలో మునిగిపోయాడు. ఆంజనేయులును రక్షించడానికి పవన్‌కుమార్ చేయి అందిస్తూ అతడూ నీటిలోకి జారుకున్నాడు. తమ్ముళ్లను కాపాడేందుకు పెద్దవాడైన రవికుమార్ నీటిలోకి దూకగా.. ముగ్గురూ ప్రాణాలు విడిచారు. తాళ్ల సాయంతో కాపాడాలని అక్కడివారు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. గత వేసవిలో కోనేరులో మిషన్‌కాకతీయ పథకం కింద పూడిక తీయడంతో 20 అడుగుల గొయ్యి ఏర్పడింది. కోనేరు వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయకపోవడం, పోలీసులు కానీ, దేవాదాయశాఖ అధికారులు కానీ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతోనే యువకులు జలసమాధి అయ్యారని భక్తులు ఆవేదన వ్యక్తంచేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు పోలీసులు అప్పగించారు.

భవనంపైనుంచి దూకిన ఇద్దరు బాలికలు

పదో తరగతి విద్యార్థినుల ఆత్మహత్య


భార్గవి పటేల్, సావనీ కాలే (ఫైల్)

కొత్తపేట, హైదరాబాద్ సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): భార్గవి పటేల్, సావనీ కాలే.. ఈ ఇద్దరు బాలికల మధ్య చక్కని స్నేహం ఉంది. ఇద్దరూ ఒకేస్కూల్లో పదో తరగతి చదువుతున్నారు. ముక్కుపచ్చలారని వయసులో వారికి అంతగా ఏం కష్టాలు చుట్టిముట్టాయో తెలియదు.. ఎవరైనా మందలించారో తెలియదు! ఇద్దరూ భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. గురువారం రాత్రి 8గంటల ప్రాంతంలో హైదరాబాద్ ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన స్థానికంగా పెను విషాదాన్ని నింపింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డీమార్టు వెనుక సరూర్‌నగర్ రోడ్డులో టీఎన్ఆర్ అపార్టుమెంట్ ఉంది. అందులోని 8వ అంతస్తులో క్రాంతి పటేల్ అనే వ్యాపారి కుటుంబం నివాసముంటోంది. ఆయన కూతురు భార్గవి పటేల్... బైరామల్‌గూడలోని ఆకర్ష ఇంటర్నేషనల్ స్కూల్లో పదవ తరగతి చదువుతోంది. చిత్ర లేఅవుట్‌లో ఉంటున్న నరేంద్ర కాలే డీఆర్డీఏలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన కూతురు సావని.. అదే స్కూల్లో టెన్త్ చదువుతోంది. గురువారం భార్గవి.. కంబైండ్ స్టడీ కోసమని సావని కాలేను అపార్టుమెంట్‌కు పిలిపించుకుంది. భార్గవి కుటుంబ సభ్యులు రాత్రి 7గంటల ప్రాంతంలో కూరగాయలు కొనేందుకు బయటకు వెళ్లారు. ఆ సమయంలో ఇద్దరు స్నేహితురాళ్లు కలిసి అపార్టుమెంట్‌పైకి వెళ్లి అక్కడి నుంచి కిందకు దూకారు. ఈ ఘటనలో తలలకు తీవ్రగాయాలు కావడంతో ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. ఆత్మహత్య చేసుకున్న ప్రాంతంలో సావని రాసిన సూసైడ్‌నోట్ లభించినట్టు పోలీసులు తెలిపారు. అందులో 'తేజు ఐ మిస్ యూ.. డోంట్ క్రై. మామ్మా, పాప్పా సారీ' అని రాసి ఉందని పేర్కొన్నారు. విద్యార్థినుల ఆత్మహత్యకు గల కారణాలు ఏమిటనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.76.66	పాత ధర 68.35
కొత్త ధర రూ.76.70	కొత్త ధర 68.32
పెరిగింది 4 పైసలు	తగ్గింపు 3 పైసలు



కాలేయ కేన్సర్‌పై విటమిన్ 'ఢీ'

టోక్యో, మార్చి 8: తెల్లరక్తకణాలను చురుగ్గా ఉంచి రోగనిరోధక శక్తిని పెంచే విటమిన్.. డీ. అందుకే, రోజూ ఉదయం కనీసం అరగంటసేపు ఎండలో నిలబడాలని వైద్యులు సూచిస్తారు. ఎముకలు, పళ్లు, కండరాలు ఆరోగ్యంగా ఉండేందుకు విటమిన్-డీ చాలా అవసరం.. అంతేకాదండోయ్ దీనివల్ల కాలేయ కేన్సర్ కూడా మన దరి చేరదని చెబుతున్నారు జపాన్‌లోని షింగా యూనివర్సిటీ ఆఫ్ మెడికల్ సైన్స్, నేషనల్ కేన్సర్ సెంటర్ శాస్త్రవేత్తలు.

శరీరంపై వెంట్రుకలుంటే మహిళలకు పీసీఓఎస్

వాషింగ్టన్, మార్చి 8: కొందరు మహిళల్లో అసాధారణంగా గడ్డాలు, మీసాలు రావడం, ఛాతి, వీపు ప్రదేశాల్లో వెంట్రుకలు పెరుగుతాయి. అలా వెంట్రుకలు పెరగడం పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్(పీసీఓఎస్)కు కారణమవుతుందని అమెరికా వైద్యులు హెచ్చరిస్తున్నారు. అండాశయాల మీద చిన్న చిన్న బుడగల్లాంటి తిత్తులు పెరిగి సంతానలేమికి దారి తీస్తుందని వివరించారు. హార్మోన్ల అసమతుల్యత వల్ల మహిళల్లో ఆండ్రోజెన్(మగ సెక్స్ హార్మోన్) ఉత్పత్తి అయ్యి శరీరంపై వెంట్రుకలు పెరుగుతాయని పేర్కొన్నారు.

రిజర్వేషన్ల పెంపు.. నాటకం

గిరిజనులు, ముస్లింలకు అన్యాయం.. కేసీఆర్‌కు వారి ఉసురు తగులుతుంది



టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కు తలపాగాను బహూకరిస్తున్న మహిళానేతలు.. హుస్నాబాద్ బహిరంగ సభకు హాజరైన ప్రజలు

- ఓట్లు అడిగే హక్కు టీఆర్ఎస్‌కు లేదు
- మంత్రివర్గంలో మహిళలకు స్థానమేదీ?
- ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం : ఉత్తమ్
- రాష్ట్రంలో అనాగరిక పాలన : జైపాల్‌రెడ్డి
- కేసీఆర్‌ను గద్దె దింపడమే లక్ష్యం : భట్టి
- టీఆర్ఎస్ పతనం ప్రారంభం : పొన్నం
- అవినీతిపరుడు ఈటల : రేవంత్‌రెడ్డి

సిద్దిపేట/భీమదేవరపల్లి/కరీంనగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ముస్లింలు, గిరిజనులకు రిజర్వేషన్లు పెంచుతామంటూ సీఎం కేసీఆర్ నాటకాలాడుతున్నారని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఇకపై వారిని ఓట్లు అడిగే హక్కు టీఆర్ఎస్‌కు లేదని తేల్చిచెప్పారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో గురువారం ఉదయం ప్రారంభమైన ప్రజాచైతన్య బస్సు యాత్ర ముల్కనూరు, ఎల్కతుర్తి మీదుగా కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో ఉత్తమ్ మాట్లాడుతూ ముస్లింలకు 12శాతం, దళితులకు 10శాతం రిజర్వేషన్లను కల్పిస్తానంటూ కేసీఆర్ చేసిన మోసం.. కేంద్రం ప్రకటనతో బట్టబయలైందన్నారు. ఆ రెండు వర్గాల ఉసురు ఆయనకు తగులుతుందని శాపనార్థాలు పెట్టారు. మహిళలకు మంత్రివర్గంలో స్థానం కల్పించని రాష్ట్రం దేశంలో ఏదైనా ఉందంటే.. అది తెలంగాణ మాత్రమేనని పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం కాంగ్రెస్ అమలు చేసిన పావలా వడ్డీ రుణాలు, అభయహస్తం పింఛన్లు వంటి పథకాలను కేసీఆర్ ప్రభుత్వం నీరుగార్చిందని ధ్వజమెత్తారు. డిసెంబరులో సార్వత్రిక ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, తమ సర్వే ప్రకారం పూర్తి మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ బస్సు యాత్ర సందర్భంగా 17 నియోజకవర్గాల్లో పర్యటిస్తే ఎక్కడ చూసినా కాంగ్రెస్ ప్రభంజనమే కనిపిస్తోందన్నారు. బస్సు యాత్రకు ఎవరూ రావడం లేదన్న కేసీఆర్ మాటలకు హుజూరాబాద్ సభే సమాధానం చెబుతుందని వ్యాఖ్యానిచ్చారు. హుజూరాబాద్‌లో ఈటల రాజేందర్ పని అయిపోందని, రానున్న ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ గెలవడం ఖాయమని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు మీడియా సృష్టి మాత్రమేనని, జాతీయ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువని, బేధాభిప్రాయాలు సహజమేనని వ్యాఖ్యానించారు. టీఆర్ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, కేసీఆర్‌ను ప్రజలు గద్దెదించడం ఖాయమని జోస్యం చెప్పారు. సీనియర్ నేత జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ భాషను కేసీఆర్ బద్నాం చేస్తున్నాడని మండిపడ్డారు. సమస్యలపై ప్రశ్నించినందుకు మంద కృష్ణ, ప్రతాప్‌రెడ్డిని జైల్లో పెట్టించి, రాష్ట్రంలో అనాగరిక పాలన సాగిస్తున్నారని విమర్శించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క మాట్లాడుతూ మహిళలకు ప్రాధాన్యం ఇవ్వని ప్రభుత్వాన్ని గద్దె దింపడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి ఈటల రాజేందర్ నిజాయితీ ముసుగులో అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. బియ్యం కస్టమ్ మిల్లింగ్, రవాణా చార్జీలను పెంచడం ద్వారా గత ఏడాది ప్రభుత్వంపై రూ.270 కోట్ల అదనపు భారం మోపారని విమర్శించారు. 2014-15 సంవత్సరంలో లెవీకి సంబంధించి రూ.600 కోట్లు చేతులు మారాయన్నారు. ఈటల ఒకప్పుడు కమ్యూనిస్టే కావచ్చుగానీ.. ఇప్పుడు దోపిడీదారుడిగా మారాడని ధ్వజమెత్తారు. హాస్టల్ పిల్లలకు సన్నబియ్యంతో అన్నం పెడుతున్నామని గొప్పగా చెబుతున్న మంత్రికి.. రేషన్ బియ్యం రీసైక్లింగ్ దందా కనబడటం లేదని మండిపడ్డారు. సీనియర్ నేత హనుమంతరావు మాట్లాడుతూ కేసీఆర్‌ను తమ పార్టీ నుంచి వెళ్లగొడితేనే టీడీపీలోకి వెళ్లాడని పేర్కొన్నారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుస్నాబాద్ నుంచే టీఆర్ఎస్ పతనం ప్రారంభమైందన్నారు. టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు నేరెళ్ల శారద మాట్లాడుతూ పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించేందుకు డబ్బులు లేవంటున్న కేసీఆర్.. కోట్లు పెట్టి బస్సులు ఎలా కొంటున్నారని ప్రశ్నించారు. సీఎల్పీ ఉప నేత జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టుల రీడిజైనింగ్ పేరిట ప్రభుత్వ పెద్దలు కమీషన్ల కోసం కక్కుర్తి పడ్డారని ఆరోపించారు. షబ్బీర్‌అలీ మాట్లాడుతూ ముస్లిం, గిరిజనుల రిజర్వేషన్ల పెంపుపై టీఆర్ఎస్ ఎంపీలు ప్లకార్డులు పట్టుకొని డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. బిల్లుకు సవరణలు చేస్తారా..? లేక సుప్రీం కోర్టుకు వెళ్తారా..? సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా హుస్నాబాద్ సభలో టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు నేరెళ్ల శారద ఆధ్వర్యంలో మహిళా నేతలు కేక్ కట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్‌సీ ఖుంటియా మహిళా గ్యాలరీలోకి వెళ్లి.. శుభాకాంక్షలు తెలిపారు.



ఉమ్మడి పాలకులు కూడా ఇలా చేయలేదు

- ‘స్ఫూర్తి’ సమావేశానికి అనుమతి నిరాకరణ సరికాదు
- ఉద్యమ లక్ష్యాలకు సర్కారు గండి
- ప్రజల చేతిలో పరాభావం తప్పదు: కోదండ

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ట్యాంక్‌బండ్‌పై శనివారం నిర్వహించతలపెట్టిన ‘మిలియన్ మార్చ్ స్ఫూర్తి’ కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించడాన్ని టీజేఏసీ చైర్మన్, ప్రొఫెసర్ కోదండరాం తీవ్రంగా ఖండించారు. కార్యక్రమానికి అనుమతిని నిరాకరించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమ లక్ష్యాలకు తిలోదకాలిచ్చిందని మండిపడ్డారు. సీమాంధ్ర పాలకుల కుట్రలు భగ్నం చేసి, తెలంగాణ ఉద్యమ తీవ్రతను ప్రపంచానికి చాటి చెప్పిన సంఘటనగా నాటి ‘మిలియన్ మార్చ్’ను ఆయన అభివర్ణించారు. అంతటి గొప్ప కార్యక్రమాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని, ప్రభుత్వం చేయని పనిని తాము చేస్తుంటే.. అనుమతి నిరాకరించడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమాన్ని ఈ తరహాలో కించపరిచే సాహసం సీమాంధ్ర పాలకులు కూడా చేయలేదన్నారు. వందల మంది తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన ఉద్యమ సందర్భాలను తెలంగాణ ప్రభుత్వం గుర్తించకపోవడం దురదృష్టకరమన్నారు. ఎందరో యువకుల ప్రాణత్యాగాలపై అధికారంలోకి వచ్చిన పాలకులు.. భోగాలను అనుభవిస్తూ తెలంగాణ ఆకాంక్షలకు గండికొట్టారని మండిపడ్డారు. అనుమతి నిరాకరణకు పోలీసులు చూపిన కారణాలు హాస్యాస్పదంగా, తెలంగాణ ఉద్యమాన్ని, ఉద్యమకారులను అవహేళన చేసే విధంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పుడు తలపెట్టింది మరో మిలియన్ మార్చ్ కాదని, కేవలం మిలియన్ మార్చ్ స్ఫూర్తితో తలపెట్టిన సమావేశం మాత్రమేనని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా కేవలం ఆట, పాట, మాటలతో నిర్వహించాలని తలపెట్టినదన్నారు. అంతే తప్ప సెలబ్రిటీలతో విందులు, చిందులు, సెల్ఫీలకు తలపెట్టిన కార్యక్రమం కాదన్నారు. ఈ పాలకులకు ప్రజల చేతిలో పరాభవం తప్పదని హెచ్చరించారు.


సంగారెడ్డి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో ఓ మహిళ ఒకే కాన్పులో ముగ్గురు శిశువులకు జన్మనిచ్చింది. ఇస్నాపూర్‌కు చెందిన ఆశారాణి ప్రసవం కోసం బుధవారం ఆస్పత్రిలో చేరింది. గురువారం ఇద్దరు ఆడ, ఒక మగ శిశువుకు జన్మనిచ్చింది. - సంగారెడ్డి అర్బన్

ఉత్తమ టీచర్ల ఎంపిక ఇక సులువు!

- 15 ఏళ్ల సర్వీస్ నిబంధన సడలింపు

హైదరాబాద్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక నిబంధనల్లో మార్పులు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా దరఖాస్తు చేసుకునేందుకు 15 ఏళ్ల సర్వీసును పూర్తి చేసుకుని ఉండాలన్న నిబంధనను తొలగించే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. అలాగే ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసేందుకు దరఖాస్తు చేసే విధానానికి స్వస్తి పలకాలని కూడా భావిస్తున్నారు. ఉన్నతాధికారులే క్షేత్రస్థాయిలో పరిశీలించి అన్ని విధాలుగా అర్హులైన వారిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేయాలని నిర్ణయించారు. దీనిపై త్వరలో తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

‘పది’ విద్యార్థులకు కౌన్సెలింగ్ కేంద్రం

- పరీక్షల ఒత్తిడి తట్టుకునేలా చర్యలు
- పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కిషన్



హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని అధిగమించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ కార్యాలయంలో కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు డైరెక్టర్ కిషన్ తెలిపారు. పరీక్షల నేపథ్యంలో ఒత్తిడికి గురయ్యే విద్యార్థులు 1800 4257 462 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కేంద్రంలో ఉన్న మానసిక వైద్య నిపుణుడు విద్యార్థులతో మాట్లాడి సలహాలు, సూచనలు చేస్తారన్నారు. శుక్రవారం నుంచి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కేంద్రం పనిచేస్తుందని చెప్పారు. పరీక్షల ఒత్తిడితో పలువురు విద్యార్థులు అఘాయిత్యాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు.

ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు ప్రారంభం

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఎంపీలు, ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసుల విచారణకు ఏర్పాటైన ప్రత్యేక కోర్టు గురువారం ప్రారంభమైంది. నాంపల్లి కోర్టు సముదాయంలో నూతన కోర్టును ఎంఎస్‌జే జి. వెంకటకృష్ణయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాల్గవ అడిషనల్ ఎంఎస్‌జే కె. రవీందర్ రెడ్డి, పీపీలు, బార్ అసోసియేషన్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలపై నమోదైన క్రిమినల్ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. సుప్రీంతీర్పు, కేంద్ర ప్రభుత్వ లేఖపై హైకోర్టు న్యాయసలహా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు ఫిబ్రవరి 28న ఉత్తర్వులు జారీ చేసింది.

హదియాకు న్యాయం

ప్రపంచ మహిళాదినోత్సవం నాడు హదియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఉన్నతమైనది, చరిత్రాత్మకమైనది. సుదీర్ఘకాలంగా దేశాన్ని కుదిపేస్తున్న ఈ కేసులో తనకు నచ్చినవాడిని భర్తగా నిర్ణయించుకున్న హదియా హక్కును సుప్రీంకోర్టు కాపాడింది. ఆమెకు ఆ హక్కును దక్కకుండా చేసిన కేరళ హైకోర్టు తీర్పును కొట్టివేసింది. హదియా ప్రేమకు పట్టం కడుతూ, ఇదంతా లవ్‌జిహాదీ వ్యవహారంగా ఆమెకు అడ్డుపడుతున్న ప్రయత్నాలన్నింటినీ న్యాయస్థానం తిరస్కరించింది. హదియా ఎవరి అదుపులోనూ ఉండనవసరం లేదనీ, తనకు నచ్చినవాడితో, నచ్చిన విధంగా ఆమె జీవించవచ్చునని న్యాయస్థానం ప్రకటించింది. ఆమె ఇష్ట ప్రకారం జరిగిన ఈ వివాహంలో జోక్యం చేసుకొనే, ఆమె ఎంపికను కాదనే హక్కు చివరకు న్యాయస్థానాలకు కూడా లేదని తేల్చింది. యుక్తవయస్సుకు వచ్చిన యువతీ యువకుల వివాహ స్వేచ్ఛను సర్వోన్నత న్యాయస్థానం పరిరక్షించిన మరొక సందర్భం ఇది.

సుదీర్ఘకాలంగా సాగుతున్న ఈ కేసులో సుప్రీంకోర్టు వ్యవహారశైలి గమనించినప్పుడు ఈ తీర్పు నిజానికి ఆశ్చర్యం కలిగించదు. కేరళ హైకోర్టు తీర్పు విషయంలో సర్వోన్నత న్యాయస్థానం ఆదినుంచీ సానుకూలత కనబరచలేదు. ఒక మహిళ వివాహాన్ని రద్దుచేసే విషయంలో మీకున్న అధికారాలు ఏమిటో చూసుకున్నారా? అని గతంలోనే న్యాయస్థానం హైకోర్టును ప్రశ్నించింది. ఇద్దరు మేజర్లు ఇష్టపూర్వకంగా చేసుకున్న పెళ్ళిని న్యాయస్థానాలు రద్దుచేయగలవా?, వారి నిర్ణయంలో జోక్యం చేసుకొనే అధికారం వాటికి ఎక్కడిది? అన్నది సుప్రీంకోర్టు ప్రశ్న. ఆమె తనకు తగిన వ్యక్తిని ఎంచుకున్నదా లేదా, ఈ వివాహం ఆమె ప్రయోజనాలను కాపాడుతుందా లేదా అన్న విషయాలు న్యాయస్థానాలు నిర్ధారించలేని, నిర్ధారించకూడని విషయాలని సుప్రీంకోర్టు అంటున్నది. గతంలో హదియాను సుప్రీంకోర్టు పిలిపించుకొని గంటపాటు ఆమె గోడు విన్న విషయం తెలిసిందే. పాతికేళ్ళ వయసున్న తాను ఇష్టపూర్వకంగానే షఫీన్ జహాన్‌ను పెళ్ళాడాననీ, తనకు నచ్చినమేరకే అతడి మతాన్ని స్వీకరించాననీ, ఈ మొత్తం ప్రక్రియలో తనపై ఎవరి ఒత్తిడీ లేదని ఆమె న్యాయస్థానానికి చెప్పుకొచ్చింది. నచ్చినవాడిని చేసుకున్నానని ఓ మేజర్ నిర్ధారించిన తరువాత ఈ వివాహం వెనుక ఏవో కుట్రలూ కుతంత్రాలు పనిచేశాయన్న వాదనలతో తనకు నిమిత్తంలేదని సుప్రీంకోర్టు అంటున్నది.

భాగస్వామిని ఎంపిక చేసుకొనే హక్కును దఖలు పరచడమే కాకుండా, ఆమె వివాహం విషయంలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) జోక్యాన్ని కూడా సుప్రీంకోర్టు నిలువరించింది. ఆమె మంచివాడిని చేసుకున్నదా, చెడ్డవాడిని చేసుకున్నదా అన్నది మీకు సంబంధించిన విషయం కాదు, అది ఆమె తేల్చుకోవాల్సిన అంశం అని జనవరిలోనే సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. మిగతా ఏ అంశాలనైనా దర్యాప్తు చేసుకోండి, ఆమె వివాహాన్ని తప్ప అని సుప్రీంకోర్టు అప్పట్లో చెప్పినదానినే ఇప్పుడు మరోమారు నిర్ధారించడం ద్వారా రెండువైపులా పదునున్న అంశాన్ని సుప్రీంకోర్టు తెలివిగా పరిష్కరించింది. షఫీన్ ప్రేమలో తన కుమార్తె పడటంలోనూ, మతం మారడంలోనూ ఒక విస్తృతమైన కుట్ర ఉన్నదని ఆమె తండ్రి అశోకన్ అంటున్నారు. అతడి మైకంలో పడినందున వివేచనతో నిర్ణయం తీసుకోలేని స్థితిలోకి తన కుమార్తె జారిపోయిందనీ, షఫీన్ ఆమెను పూర్తిగా వశం చేసుకున్నాడని అశోకన్ వాదన. 2016 జనవరిలో అశోకన్ దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను హదియా న్యాయస్థానం ముందు హాజరుకావడంతో కేరళ హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. తాను ఇస్లామ్‌ను అధ్యయనం చేసే పనిలో ఉన్నానని ఆమె అప్పట్లో కోర్టుకు చెప్పింది. ఆ తరువాత ఆగస్టులో అశోకన్ మరొక పిటిషన్ వేస్తూ, తన కుమార్తెను ఐసిస్‌లో పనిచేయించేందుకు వీలుగా దేశాన్ని దాటించే ప్రయత్నం జరుగుతున్నదని ఆందోళన వెలిబుచ్చారు. ఈ పిటిషన్ విచారణలో భాగంగా ఆమె మరోమారు న్యాయస్థానం ముందుకు వచ్చినప్పుడు షఫీన్ ఆమెతో పాటు వచ్చాడు. అతడిని తన భర్తగా ఆమె న్యాయమూర్తికి పరిచయం చేసింది. ఈ చర్య హైకోర్టుకు ఆగ్రహాన్నే కలిగించిందో, అనుమానాలనే రగల్చిందో తెలియదు కానీ, షఫీన్ వ్యవహారాలపై న్యాయస్థానం దర్యాప్తుకు ఆదేశించడం, హదియాను తల్లిదండ్రులకు అప్పగించడం, వారు ఆమెను గృహనిర్బంధంలో ఉంచడం తెలిసిందే. గత ఏడాది మేనెలలో వారి వివాహాన్ని హైకోర్టు రద్దుచేయడంతో, షఫీన్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు రంగంలోకి దిగిన జాతీయ దర్యాప్తు సంస్థ అతడి మీద రెండు క్రిమినల్ కేసులున్నాయనీ, ఈ ఘటన 'సైకలాజికల్ కిడ్నాపింగ్'కు నిలువెత్తు నిదర్శనమని నివేదించింది. షఫీన్‌కు అనుబంధం ఉన్న కొన్ని సంస్థలపై కూడా అది అనుమానాలను వ్యక్తంచేసింది. అనుమానాలేనా, ఏమైనా సాక్ష్యాలున్నాయా? అంటూ న్యాయస్థానం అప్పట్లోనే ఎన్ఐఏను నిలదీసింది. యువతులను వలవేసి, మతం మార్చి, సెక్స్‌బానిసలుగా విదేశాలకు అమ్మేస్తున్న ముఠా ఒకటి ఈ తరహా లవ్‌జిహాద్‌కు పాల్పడుతున్నదని ఆమె తండ్రి తరఫు న్యాయవాది అశోక్ దివాన్ వాదన. ఆమె చుట్టూ అల్లుకున్న ఈ విషవలయాన్ని గుర్తించిన కారణంగానే కేరళ హైకోర్టు వారి వివాహాన్ని రద్దుచేసిందన్నది దివాన్ అంటున్నారు. ఆమె ఇష్టపూర్వకంగా చేసుకున్న వివాహం విషయంలో జోక్యం చేసుకొనే హక్కు ఎవరికీ లేదని శాసిస్తూనే, ఇతరత్రా ఉగ్రకోణాలను దర్యాప్తు చేసుకోవచ్చంటూ ఎన్ఐఏను అనుమతించడం ద్వారా న్యాయస్థానం ఈ వివాదాన్ని తెలివిగా పరిష్కరించింది.

విద్యా, ఉపాధి రంగాలకు పెద్ద పీటవేయాలి!

జనగళం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏర్పడిన ప్రభుత్వానికి ఇది చిట్ట చివరి బడ్జెట్. నేడు రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా రానురాను కనుమరుగయ్యే ప్రమాదంలో ఉంది. పాఠశాల స్థాయి నుంచి వర్సిటీ స్థాయీ వరకు మౌలిక సదుపాయాలు, విద్యార్థులు లేక వాటిని మూసివేసే పరిస్థితి ఉంది. నేడు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివేవారు ఎక్కువమంది పేద, మధ్య తరగతి విద్యార్థులే. సదుపాయాలు లేక చాలా మంది మధ్యలోనే చదువును ఆపేస్తున్నారు. ఒకపక్క ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచినా పట్టించుకోకుండా, ప్రభుత్వ పాఠశాలల్ని తగ్గించే ప్రయత్నం చేస్తుంది ప్రభుత్వం. నియోజక వర్గానికి ఒక డిగ్రీ, జూనియర్ కళాశాలను నిర్మిస్తామని గత బడ్జెట్లో ఇచ్చిన హామీ ఇంతవరకు అమలు కాలేదు. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ఇస్తామన్న ఉచిత బస్‌పాస్, మధ్యాహ్న భోజన పథకం కూడా ఇంతవరకు అమలు కాలేదు. వందేళ్ళ ఉస్మానియాకు రూ.200 కోట్లను కేటాయిస్తే ఇంత వరకు 50 కోట్లు మాత్రమే విడుదల చేసి చేతులు దులుపుకొన్నారు. లక్ష ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చి నాలుగేళ్ళు గడుస్తున్నా పట్టుమని 30,000 ఉద్యోగాలను కూడా కల్పించలేదు. ఈ చిట్టచివరి బడ్జెట్‌ను ప్రజలు ఎన్నికల బడ్జెట్‌గా భావిస్తారు కనుక బడ్జెట్లో పేర్కొనే అంశాలు అమలుకు సాధ్యమయ్యే విధంగా విద్యా ఉపాధి రంగాలకు ప్రాధాన్యతనిస్తూ ఉండాలి. లేదంటే బంగారు తెలంగాణా కేవలం నినాదంగానే మిగులుతుంది.

– **చింత ఎల్లస్వామి,** ఏబీవీపీ రాష్ట సంయుక్త కార్యదర్శి.

కేసీఆర్ నోట రైతు సంక్షేమమా?

రైతులు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని, దేశంలో ఇంతకాలం పాలించిన పార్టీలు రైతుల సమస్యల గురించి పెద్దగా శ్రద్ధ చూపలేదని, అందుకే జాతీయ స్థాయిలో ఒక ఫెడరల్ ఫ్రంట్ కోసం ఆలోచిస్తున్నామని, తెలంగాణ నుంచే జాతీయ రాజకీయాలకు నాంది పలుకుతున్నామనీ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న హంగామాను దేశమంతా గమనిస్తున్నది. రైతుల గురించి, రైతు సంక్షేమం గురించి కేసీఆర్ మాట్లాడుతుంటే.. కసాయి వాడు గొర్రెను బలిచ్చేందుకు తీసుకెళుతూ గొర్రె సంక్షేమం గురించి మాట్లాడుతున్నట్టు అనిపిస్తోంది. వ్యవసాయ అభివృద్ధికి, రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏమేమి చేశాయో వివరించాలంటే చెప్పడానికి సమయం సరిపోదు. అయినా అది నిరంతరం జరిగే ప్రక్రియ, ఆ విషయాలన్నీ బయటకు రావాలంటే పెద్ద చర్చ అవసరం.

ఎన్నో పోరాటాలు, త్యాగాలు, కాంగ్రెస్ పార్టీ, సోనియమ్మ ధృడసంకల్పంతో సాధించుకున్న అరవైఏళ్ళ కల మన తెలంగాణ స్వరాష్ట్రం. గతంలో ఉద్యమ సమయంలో అన్నింటికీ తెలంగాణ రాష్ట్రమే ఏకైక పరిష్కారం అని పదే పదే చెప్పారు కేసీఆర్. రాష్ట్రం ఏర్పడింది, ఆ రాష్ట్రానికి కేసీఆరే ముఖ్యమంత్రి అయ్యారు. అది ప్రజల తీర్పు దాన్ని అందరు గౌరవించాల్సిందే. తెలంగాణలో దాదాపు 40 నెలల పాలన అంటే చిన్న సమయం కాదు. ప్రతి ఏటా దాదాపు లక్షన్నర కోట్ల రూపాలయ బడ్జెట్ ఉన్న సంపన్న రాష్ట్రంలో ముఖ్యమంత్రి పదవి చాల కీలకమైంది. అదీ ఉద్యమనాయకుడిగా చెప్పుకున్న ఆయన చేతిలోనే అధికారం ఉంది. మరి ఇంతకాలం చెప్పిన మాటలు ఏమయ్యాయి? ఎందుకు వ్యవసాయం పండుగ కాలేకపోయింది, ఎందుకు రైతుల ఆత్మహత్యలు ఆగలేకపోయాయి, పండించిన పంటలను రైతులు దిక్కులేక ఎందుకు అగ్నికి ఆహుతి చేస్తున్నారు? ఎందుకు పెట్టుబడులు కూడా రాని దుస్థితి ఏర్పడింది, ఎందుకు దళారీ వ్యవస్థ ఆగలేదు, ఎందుకు రైతులకు పంటల నష్ట



జలయజ్ఞం అమలు చేసి దాదాపు రెండు లక్షల కోట్ల రూపాయలతో 86 భారీ, మధ్యతరహా ప్రాజెక్టులను చేపట్టి సముద్రం పాలవుతున్న వందలాది టీఎంసీల నీటిని బీడు భూములకు పారించిన కాంగ్రెస్‌పై, అనేకానేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, చట్టాలు తీసుకొచ్చి వ్యవసాయాన్ని ఎంతో అభివృద్ధి చేసిన కాంగ్రెస్‌పై ఏదో ఒక వంక పెట్టుకొని నిందారోపణలు చేయడం కేసీఆర్‌కు తగదు.

పరిహారాలు సకాలంలో అందడం లేదు? చివరకు కేంద్రంనుంచి రైతుల నష్టపరిహారాల కోసం వచ్చిన రూ.970 కోట్ల రూపాయలు కూడా ఎలా పక్కదారిపట్టాయి?

'కూట్లే రాయి తీయనోడు ఏట్ల రాయి తీసిన' చందంగా ఉంది కేసిఆర్ వైఖరి. తెలంగాణలో నాలుగేళ్ళలో వ్యవసాయం తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయి రైతాంగం తీవ్రంగా నష్టపోయారు. 2014 ఎన్నికలలో కేసీఆర్ 'లక్ష రూపాయల రుణ మాఫీ' అని మాట మార్చారు. కనీసం 17 వేల కోట్ల రూపాయలు ఒక్క దఫా రైతాంగానికి రుణ మాఫీ చేయలేక మాట తప్పిన కేసీఆర్ రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి అంటూ జాతీయ స్థాయిలో ఫెడరల్ ఫ్రంట్ పెడతాననడం జనాన్ని పిచ్చి వాళ్ళను చేయడమే అవుతుంది.

దేశం మొత్తం మీద తెలంగాణలోను, మరీ ముఖ్యంగా కేసీఆర్ నియోజకవర్గంలోనూ రైతుల ఆత్మహత్యలు ఎక్కువ జరిగాయి. ఇవి కాంగ్రెస్ చెప్తున్న లెక్కలు కావు, రైతు స్వరాజ్య వేదిక అనే స్వచ్ఛంద సంస్థ పక్కాగా ఇచ్చిన సమాచారం. తెలంగాణలో గత డిసెంబర్ నాటికే సుమారు 3,700 మంది రైతులు ఆత్మహత్య చేసుకొన్నారు. ఇంత జరిగినా కేసీఆర్ రైతుల ఆత్మహత్యల గురించి మాట్లాడుతున్నారంటే ఏమనాలి? ఆయన సొంత జిల్లాలో, నియోజకవర్గంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లు కడుతూ రైతుల నుంచి బలవంతంగా భూములు గుంజుకొని వారిపై కేసులు పెట్టి, లాఠీ చార్జీలు చేసి హింసించారు. మల్లన్న సాగర్ బాధితులు వేములఘాట్‌లో, కొండ పోచమ్మ బాధితులు మామిడ్యాలలో ఇంకా టెంట్లు వేసుకొని దీక్షలు చేస్తున్నరు. మిర్చికి, కందులకు, వరికి, టమోటాలకు, ఉల్లిగడ్డ, అల్లం, మొక్కజొన్న, సోయాబీన్, జామాయిల్, సుబాబుల్ తదితర పంటలకు గిట్టుబాటు ధరలు లేక పంటలను నిప్పు పెట్టి దగ్ధం చేసిన తెలంగాణ రైతాంగాన్ని చూసి జాతీయ పత్రికలే పెద్ద పెద్ద వార్తలు రాశాయి. కేంద్రం మద్దతు ధరలు ఇవ్వకపోతే రాష్ట్రం నుంచి ప్రభుత్వం ఎందుకు బోనస్ ఇవ్వలేదో ముందు చెప్పాలి. బోనస్ ఇవ్వకపోగా వ్యవసాయ మార్కెట్‌లలో పోలీసులను పెట్టి రైతులను కొట్టించారు. మార్కెట్‌లలో ధరల స్థిరీకరణ కోసం నిధులు కేటాయిస్తానని ఎన్నికలు ముందు చెప్పి తరువాత రెండేళ్ళు బడ్జెట్లో నిధులు పెట్టినా ఒక్క పైసా ఖర్చు చేయలేదు, మరో రెండేళ్ళయితే కేటాయింపులే లేవు. రైతులు అప్పుల పాలయి ముఖ్యమంత్రి అధికార నివాసం ప్రగతి భవన్ ముందు, సచివాలయం ముందు, అసెంబ్లీ ముందు ఆత్మహత్యలు చేసుకుంటే కూడా ఒక్క రైతు కుటుంబాన్ని పరామర్శించని అమానవీయ ముఖ్యమంత్రి దేశంలో వ్యవసాయం గురించి మాట్లడడం ప్రపంచ వింతలో ఒకటి.


వ్యవసాయానికి కాంగ్రెస్ ఏమి చేసిందని ప్రశ్నిస్తున్న కేసీఆర్, ఒక్కసారి స్వాతంత్ర్యం వచ్చినపుడు వ్యవసాయ ఎలా ఉందో, ఇప్పడెలా ఉందో పరిశీలించాలి. 1947లో జొన్నలను, గోధుమలను అమెరికా నుంచి దిగుమతి చేసుకుని కడుపులు నింపుకునే దశ నుంచి నేడు ప్రపంచంలోనే ఆహార ధాన్యాలను అధికంగా ఎగుమతి చేసే దేశంగా భారత్ ఎదిగిందన్నది గుర్తించాలి. దాదాపు 120 దేశాలకు ఆహార ధాన్యాలను ఎగుమతి చేసే స్థాయికి దేశాన్ని చేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలది కాదా? పేద ప్రజలకు కడుపు నిండా తిండి దొరికేలా ఆహార భద్రత చట్టంతెచ్చి, తక్కువ ధరలకు ఆహార ధాన్యాలను విక్రయించిన ఘనత కాంగ్రెస్ పాలకులది కాదా? కొన్ని వేల సంవత్సరాల నుంచి దేశంలో వ్యవసాయం నడుస్తున్నా 1951 నాటికి భారత భూభాగంలో కేవలం 22 మిలియన్ హెక్టార్ల భూమి మాత్రమే సాగుకు యోగ్యంగా చేయగలిగారు, కానీ కాంగ్రెస్ ప్రభుత్వాలు వచ్చిన తరువాత 2014 నాటికి దాదాపు 190 మిలియన్ హెక్టార్లను వ్యవసాయ యోగ్యంగా చేయగలిగారు. అంతేకాకుండా 2004–2014 మధ్యకాలంలో దాదాపు 10 లక్షల కోట్ల రూపాయలు దేశంలో సాగునీటి రంగ అభివృద్ధికి వ్యయం చేశారు. ఇందిరాగాంధీ హయాంలో చేపట్టిన భూ సంస్కరణలు, పి.వి. నర్సింహారావు హాయంలో చేపట్టిన భూ సంస్కరణలు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాయి. అందరికీ భూమి, ఉపాధి కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వాలు చేపట్టిన పథకాలు, సంస్కరణలు, చట్టాలు వందల సంఖ్యలో ఉన్నాయి. ఇవన్నీ 70వేల పుస్తకాలు చదవిన కేసీఆర్ లాంటి మేధావికి తెలియకపోవడం ఆశ్చర్యంగా ఉంది.

హరిత విప్లవం, క్షీర విప్లవం లాంటివి తెచ్చి వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది కాంగ్రెస్. నాగార్జున సాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్, బాక్రానంగల్ లాంటి అనేక వందల ప్రాజెక్టులు దేశంలో నిర్మించి వేలాది టీఎంసీల నీరు సముద్రం పాలు కాకుండా బీడు భూములకు పారించి పంటలు పండించిన ఘనత కాంగ్రెస్‌ది. నాలుగేళ్ళలో ఒక్క వ్యవసాయ సంబంధ పని కూడా చేయకుండా ప్రగతి భవన్‌లో కునుకు తీసిన కేసీఆర్ ఇప్పుడు కాంగ్రెస్ గురించి, వ్యవసాయం గురించి, రైతుల గురించి మాట్లాడడం వింతగా ఉంది. నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు కాంగ్రెస్ ప్రధాన మంత్రులందరూ వ్యవసాయ అభివృద్ధి గురించి రైతు సంక్షేమం గురించి లోతుగా ఆలోచించి పథకాలను అమలు చేశారు. అంతెందుకు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్ అందించాలనే ఆలోచన చేసి పదేళ్ళ పాటు విజయవంతంగా అమలు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా? జలయజ్ఞం అమలు చేసి దాదాపు రెండు లక్షల కోట్ల రూపాయలతో 86 భారీ, మధ్యతరహా ప్రాజెక్టులను చేపట్టి వందలాది టీఎంసీల నీటిని బీడు భూములకు పారించింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా? ఇప్పుడు కేసీఆర్ ప్రభుత్వం కొనసాగిస్తున్న ప్రాజెక్టుల పనులు అందులో భాగం కాదా? అనేకానేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, చట్టాలు తీసుకొచ్చి వ్యవసాయాన్ని ఎంతో అభివృద్ధి చేసిన కాంగ్రెస్‌పై ఏదో ఒక వంకపెట్టుకొని నిందారోపణలు చేయడం కేసీఆర్‌కు తగదు.

■ **పొన్నాల లక్ష్మయ్య**
మాజీ మంత్రి, మాజీ టీపీసీసీ అధ్యక్షులు

చైనాలో రూపుదాల్చిన ఆర్వెల్ ఊహలు!

■ **బల్బీర్ పుంజ్**



రైట్ పాయింట్



పార్టీ నియంతృత్వం నుంచి ఏక వ్యక్తి నియంతృత్వానికి చైనాపురోగమనంలో ఒక ఆర్వెల్లియన్ సత్యమున్నది. చైనా అధ్యక్షుడు క్సి జిన్‌పింగ్ శాశ్వత పాలనను సాధ్యం చేసేందుకు దేశ ప్రజలను, అధికార వ్యవస్థలను పాలక కమ్యూనిస్టు పార్టీ సంసిద్ధం చేస్తోంది. అధికారంలో ఉన్న అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు ఆ పదవులలో రెండు పర్యాయాలు మాత్రమే ఉండాలన్న రాజ్యాంగ పరిమితిని తొలగించనున్నారు. తద్వారా జిన్‌పింగ్ శాశ్వత పాలనకు దారిని సుగమం చేయనున్నారు.

మీడియాపై సంపూర్ణ, సమగ్ర నియంత్రణ ఉన్న ఏకవ్యక్తి నిరంకుశ పాలన, నియంత కోరుకునే, ఆయనకు అవసరమయ్యే అభిప్రాయాలు మినహా మరి వేటికీ అవకాశమివ్వని, పాలకుని మాటనే సత్యంగా, ఒకే ఒక సత్యంగా ప్రతి ఒక్కరూ శిరసావహించే సమాజాన్ని బ్రిటిష్ రచయిత జార్జ్ ఆర్వెల్ (1903–50) తన నవలల్లో ('యానిమల్ ఫామ్', '1984') చిత్రించారు. అటువంటి పాలనలో యుద్ధ విభాగాన్ని శాంతి విభాగంగా పిలుస్తారు; ప్రచార విభాగానికి సత్యం అని నామకరణం చేస్తారు. ప్రతి ఒక్కరిపై వ్యక్తం కానివ్వడం లేదు. మరి 'చైనా ప్రజలు' సామాజిక మాధ్యమాలలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి ముందు ప్రభుత్వ నియంత్రణలోని ప్రసార, సమాచార మాధ్యమాలన్నీ ఒక 'సత్యాన్ని' పేర్కొన్నాయి: కమ్యూనిస్టు పార్టీ కేంద్రీకృత పాలనా పద్ధతి దేశానికి ఇతోధిక లబ్ధిని చేకూరుస్తున్నందున, ఆ వ్యవస్థలోని అత్యంత కీలక వ్యక్తి, ఆ పాలన మరింతగా సఫలమయ్యేందుకు శాశ్వతంగా అధికారంలో ఉండవల్సిన అవసరం ఎంతైనా ఉన్నది'. మరి 'ప్రజలు' తమకు అవకాశం లభించినప్పుడు వ్యక్తం చేసిన అభిప్రాయాలేమిటో చూద్దామా?

'మనం ఉత్తర కొరియా లాగా అవుతున్నామని' ఒకరు వ్యాఖ్యానించారు. ఉత్తర కొరియాలో దశాబ్దాలుగా కుటుంబ నియంతృత్వ పాలన కొనసాగుతోంది. పాలకుని అభిప్రాయానికి మినహా ఇతర అభిప్రాయాలకు ఎటువంటి మన్నన లేదు. భిన్నాభిప్రాయాలను, వాటిని వ్యక్తం చేసిన వారిని, మరీ ముఖ్యంగా అధికారాన్ని ఆశిస్తున్న వారిని నిర్దాక్షిణ్యంగా నిర్మూలించడం జరిగింది. 'క్సికి ఎంతగా ప్రజాదరణ ఉన్నప్పటికీ దేశాధ్యక్ష పదవిలో ఆయన్ని నిరవధికంగా కొనసాగించేందుకు కమ్యూనిస్టు పార్టీ చేస్తున్న ప్రయత్నాలు దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలకు గురవుతున్నాయని' గత ఆదివారం నాడు బీజింగ్ నుంచి వెలువడిన ఒక వార్త వెల్లడించింది. చాలా మంది తమ దేశాన్ని పొరుగునే ఉన్న ఉత్తర కొరియాతో పోల్చారు. సామాన్య ప్రజల నిరంతర నిఘా ఉంటుంది. టెలివిజన్ తెరపై 'బిగ్ బ్రదర్' బొమ్మ కన్పించినప్పుడల్లా అత్యంత వినయ విధేయతలతో ఆ 'పెద్దన్న'కు సలాం చేయడం ఒక అలవాటుగా మారుతుంది! (రష్యా విప్లవం, అది కలిగించిన ఆశాభంగం 'యానిమల్ ఫామ్' ఇతివృత్తం కాగా, ప్రభుత్వాల నిరంకుశత్వాన్ని నిరోధించకపోతే సత్యానికీ, చరిత్రకు ఎటువంటి దుర్గతిపడుతుందో '1984'లో ఆర్వెల్ ఊహించాడు).

సకల జీవన రంగాలలో బహుళత్వం వర్ధిల్లుతున్న ప్రజాస్వామ్య వ్యవస్థ మనది. భావాలను భావాలు సవాల్ చేసే, నాస్తికత్వం మొదలు బహుదేవతారాధన దాకా, దెయ్యాలు అనే భావన సైతం సమాజ ఆమోదానికి పోటీ పడే వ్యవస్థలో పుట్టి పెరుగుతున్న మనం ఆర్వెల్ ఊహించిన పరిస్థితిని అర్థం చేసుకోవడం చాలా కష్టం. అయితే కమ్యూనిస్టు చైనాలో ఏమి జరుగుతుందో చూడండి. ఆ దేశంలో కమ్యూనిస్టు పార్టీని మినహా మరే రాజకీయ పార్టీని అనుమతించరు. అధ్యక్షుడు జిన్‌పింగ్ నిరవధికంగా దేశ పాలకుడుగా కొనసాగేందుకు అవసరమైన చర్యలను కమ్యూనిస్టు పార్టీ చురుగ్గా చేపడుతోంది. సరే, ఎన్నికలను ప్రకటిస్తారు. వాటి ఫలితాలనూ మహోత్సాహంతో వెల్లడిస్తారు. 99 శాతం మంది, కాదు కాదు 109 శాతం మంది ఓటర్లు క్సికి అనుకూలంగా ఓటు వేశారని లెక్కలు చెప్పుతారు. ఒక అభ్యర్థికి అనుకూలంగా 109 శాతం మంది అనుకూలంగా ఎలా ఓటు వేస్తారని మీరు ఆశ్చర్యపోతున్నారా? కొన్ని పాత నియంతృత్వ వ్యవస్థలలో ఇటువంటి ప్రశ్నలకు సమాధానమివ్వడం జరిగింది. ఏమని? 'అధికారంలో ఉన్న నాయకుడిని (స్టాలిన్, ముగాబే ఇత్యాదులు) ప్రజలు ఎంతగానో అభిమానిస్తున్నారు, విశ్వసిస్తున్నారు. అనేకానేక మంది ఆ నాయకుడి పట్ల తమ విధేయతను ప్రదర్శించడానికి రెండు సార్లు ఓటింగ్‌లో పాల్గొనడం జరిగింది!'

క్సి ప్రచార విభాగం (ఆర్వెల్ మాటల్లో 'సత్యం' విభాగం) కమ్యూనిస్టు పార్టీ చర్యలపై విమర్శలన్నిటినీ తుడిచిపెడుతోంది. అధ్యక్షుడు క్సి జిన్‌పింగ్‌ను శాశ్వతంగా అధికారంలో కొనసాగించాలని 'చైనా ప్రజలు' కోరుకొంటున్నారన్న కమ్యూనిస్టు పార్టీ వాదనకు మినహా మరెటువంటి అభిప్రాయాన్ని

ఏక వ్యక్తి నియంతృత్వం మీడియాను సంపూర్ణంగా నియంత్రిస్తూ, నియంత ఆమోదించే అభిప్రాయాలు మినహా మరే అభిప్రాయాలకు అవకాశమివ్వని, పాలకుని మాటే సత్యంగా, ఒకేఒక సత్యంగా చెలామణీ అయ్యే సమాజాన్ని జార్జ్ ఆర్వెల్ దశాబ్దాల క్రితమే 'యానిమల్ ఫామ్', '1984' నవలల్లో చిత్రించారు. అధ్యక్షుడు క్సి జిన్‌పింగ్ చైనాకు శాశ్వత పాలకుడు కావడమే అటువంటి నిరంకుశ పాలనకు ఒక తిరుగులేని తార్కాణం.

పరిహాస వ్యాఖ్యలను కొంతమంది ఉటంకించారు. మరి సామాజిక మాధ్యమాలను బీజింగ్ పాలకులు పరిశుభ్రం చేస్తున్నారంటే ఆశ్చర్యమేమున్నది?

ఇరుగు పొరుగున ఉన్న దక్షిణాసియా, ఆగ్నేయాసియా దేశాలపై పెత్తనం చెలాయించేందుకు చైనా ప్రయత్నిస్తోంది. క్సి నియంతృత్వ పాలన ఈ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఏక పార్టీ, ఏక వ్యక్తి నియంతృత్వానికి సహకరించడం ద్వారా చైనా మళ్ళీ ప్రపంచ నాయకుడు అయ్యేందుకు మద్దతు ఇవ్వాల్సిన నైతిక బాధ్యత మీపై ఉన్నదని చైనీస్ ప్రజలకు చెప్పేందుకు బీజింగ్ పాలకులు ఏ మాత్రం సందేహించబోరు. ప్రపంచాధిపత్యానికి చైనా చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవడానికై అమెరికాతో కలిసి న్యూఢిల్లీ అనుసరిస్తున్న విధానం సరైనదేననే విషయాన్ని దేశ ప్రజలకు నివేదించాలి.

సరే, చైనా పరిణామాలపై మన కామ్రేడ్స్, మరీ ముఖ్యంగా సిపిఎం వైఖరేమిటో? క్సి శాశ్వత పాలకుడు కావడాన్ని సిపిఎం బహుశా సమర్థించవచ్చు. 'రాజ్యం అదృశ్యమవడం ప్రారంభమవడానికి ముందు' కార్మిక వర్గ నియంతృత్వ పాలన నిరవధికంగా అమలులో ఉండాలని మార్క్స్ రాజకీయ సిద్ధాంతం చెప్పుతుంది మరి. అయితే వాస్తవమేమిటి? దశాబ్దాల పాటు కమ్యూనిస్టు పాలనలో ఉన్న సోవియట్ యూనియన్ మొదలైన దేశాలు మార్క్స్ సైద్ధాంతిక జోస్యాన్ని రుజువు చేయలేదు. నియంతృత్వ పాలన సమకూరుస్తున్న 'ప్రయోజనాల' కంటే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలే మేలని కమ్యూనిస్టు దేశాల ప్రజలు భావించారు. తత్ఫలితంగానే తూర్పు యూరోపియన్ దేశాలలోని కమ్యూనిస్టు నియంతృత్వ వ్యవస్థలు కుప్పకూలిపోయాయి.


రాజకీయ నిరంకుశాధికారం, ఆర్థిక ఉదారవాదం చైనీస్ ప్రజలకు క్రమంగా సంపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ప్రసాదిస్తాయని పలువురు మార్క్సిస్టు మేధావులు భావించారు. కానీ అలా జరగలేదు. పశ్చిమ బెంగాల్‌లో మూడున్నర దశాబ్దాల పాలన అనంతరం మార్క్సిస్టులు ప్రజల తిరస్కరణకు గురయ్యారు. కేరళలో రెండు సంవత్సరాల మార్క్సిస్టు పాలన ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. స్వేచ్ఛాయుత ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చిన మార్క్సిస్టులు తమ అధికారాన్ని పటిష్ఠం చేసుకోవడానికై హత్యలు, హింసాకాండను ఉపయోగించుకొంటున్నారు. ఇది ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురి చేస్తోంది.

ఒకప్పుడు ముంబై, ఆంధ్ర, పంజాబ్, బిహార్ మొదలైన రాష్ట్రాలలో ఒక బలమైన శక్తిగా వర్ధిల్లిన పార్టీ ఇప్పుడు కేవలం మూడు రాష్ట్రాలకు మాత్రమే పరిమితమయింది. ఇరవయో శతాబ్ది తొలి దశాబ్దాలలో ప్రపంచవ్యాప్తంగా అసంఖ్యాక రాజకీయ కార్యకర్తలు, స్వాప్నికులు మార్క్స్‌ను దేవుడుగా ఆరాధించే వారు. ఇరవై ఒకటో శతాబ్ది తొలినాళ్ళ నాటికి ప్రజాస్వామ్యశక్తులు సంపూర్ణ విజయం సాధించాయి. చరిత్ర జలధిలో మునిగిపోకుండా తమను తాము రక్షించుకోవడానికై నియంతృత్వపాలన అనే అప్రయోజక సాధనాన్ని ఆశ్రయిస్తున్నారు. పెట్టుబడిదారులు చరిత్ర చెత్త బుట్టల్లోకి చేరడం ఖాయమని లెనిన్ ఏనాడో జోస్యం చెప్పారు. ఆ చెత్తబుట్టల్లో స్టాలిన్, మావో, క్సిలతోపాటు మన మార్క్సిస్టు నాయకులు కూడా ఉండే రోజును ప్రస్తుత తరం వారు కూడా తప్పకుండా చూస్తారు సుమా!


(వ్యాసకర్త బీజేపీ సీనియర్ నాయకులు)

నిష్క్రమణలూ నిజాలూ

■ **తెలకపల్లి రవి**



గమనం



జోవాదా కియాతో నిభానా పడేగా. మాట ఇస్తే నిలబెట్టుకోవాలి. ఒక మాట ఒక బాణం అన్న రాముడే రాజకీయ చిహ్నంగా రాజ్యాధికారం సాధించుకున్న వారు మరింతగా వాగ్దాన పాలన చేయాలి. చేస్తారనే విశ్వసించారు తెలుగు ప్రజలు. విశ్వసించేలా చేసింది తెలుగుదేశం, ఆ పార్టీ నాయకత్వం. బిజెపి టిడిపి కలిపి కేంద్రంలో ఆంధ్రలో అధికారంలోకి వచ్చాయి నాలుగేళ్లు గడిచాక ఇప్పుడు ఇచ్చిన వాగ్దానాలేవీ కేంద్రం అమలు చేయలేదన్న ఆగ్రహావేదనలు ప్రజల్లో ప్రజ్వరిల్లితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఒప్పుకోక తప్పలేదు. ఇన్నాళ్లు అవమానించారని ముఖ్యమంత్రి శాసనసభలో చెబుతున్నారు. రావలసినవి రాలేదని ఘోషిస్తున్నారు. ఇదే విషయమై మాలాటి వాళ్లం ఈ గమనంలోనే చాలాసార్లు విమర్శిస్తుంటే, చర్చల్లో చెబుతుంటే నెగిటివ్ మైండ్ అన్నారు. ముందే కూసిన కోయిలల వలె కేంద్రం సహాయాన్ని కీర్తిస్తూ సన్మానాలూ తీర్మానాలు చేశారు. అక్కరకు రాని చుట్టము మొక్కిన వరమీయని వేల్పు... అన్న సుమతి పద్యంలా పైనున్న అరుణ్ జైట్లీ మాత్రం ససేమిరా విదిలించేది లేదు పొమ్మని విసిరి కొట్టాక ఆఖరి ఘట్టంలో అనివార్యంగా మోడీ ప్రభుత్వం నుంచి నిష్క్రమించారు. ఎన్‌డిఎను అంటిపెట్టుకునే వున్నారు. ఇప్పటిదాకా అడుక్కున్నాం ఇక ఒత్తిడి చేస్తామని గొప్పగా చెప్పినా ఇంకా వేడుకోలు రాగాలే ఆలపిస్తున్నారు. వీరెంత ఆవేదనగా అశ్రుధారలతో మాట్లాడినా అక్కడ అమితాహం తలకెక్కిన, నమో స్మరణకు అలవాటు పడిన వారు పట్టించుకునే ప్రసక్తి వుండదు. తమకు రాజకీయ లాభం రాని చోట వరాలు వనరులు తరలించడం బిజెపి విధానమే కాదు. మిత్రపక్షాలను మింగడం వారికి వెన్నతో పెట్టిన విద్య అని మహారాష్ట్ర, హర్యానా, అస్సాం, తాజాగా నాగా మిజోరం అనుభవాలు చెబుతున్నాయి. అయినా విభజిత రాష్ట్రానికి విదిలింపులే ప్రసాదం అంటూ ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి పేరుతో అంటకాగిన తెలుగుదేశం ఆలస్యంగా వ్యూహాత్మకంగా బయటకు వస్తున్నది. ఆ స్థానంలో ప్రవేశిద్దామని ఆశలు పెంచుకున్న వైసీపీ నేత జగన్ అవిశ్వాస వ్యూహంతో అస్తిత్వం కాపాడుకోవాలనుకుంటున్నారు.

14వ ఫైనాన్స్ కమిషన్ సాకుతో ప్రత్యేక హోదాను సమాధి చేసినప్పుడూ తాడూ బొంగరం లేని ప్యాకేజి ప్రహసనం నడిపినప్పుడూ ఏళ్లతరబడి పైసలు రాల్చకుండా ప్రదక్షిణలు చేయించినప్పుడూ తెలుగుదేశం నోరెత్తలేదు. పోలవరం ఇఏపి మనకు వరప్రసాదాలైనట్టు వంతపాడిన ఉదంతాలు ఉదహరిస్తే తట్టుకోలేనన్ని వున్నాయి. లోటు భర్తీకి పోటు పొడిచినప్పుడు కూడా మౌనమూనిన సందర్భాలున్నాయి. అభీష్టానికి భిన్నంగా విభజనకు గురైన అగచాట్లలో చిక్కిన రాష్ట్రానికి అత్యవసర ఆర్థిక సహాయం కూడా అందించని కేంద్రంపై అఖిలపక్ష ఒత్తిడి తెచ్చేబదులు ఆర్థిక లాభమే అంతిమమని భావించడం దీనంతటికీ మూల కారణం. పులిమీద పుట్రలా అటూ ఇటూ కేసులూ తిరకాసులతో గట్టిగా మాట్లాడే పరిస్థితి లేకుండా పోయింది. పిట్టపోరు పిట్టపోరు పిల్లి తీర్చినట్టు టిడిపి వైసీపీ వైరుధ్యాలను బిజెపి ఉపయోగించుకోగలిగింది.

ఆర్ద్రత అన్న పదమే నిఘంటువులో లేని ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఆంధ్ర ప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను సానుభూతి కింద తీసిపారేశారు. రాజ్యాంగ కమిట్‌మెంట్‌ను సెంటిమెంటు కింద ఆయింటుమెంటు కింద ఈసడించేశారు. తెలుగు రాష్ట్రాల న్యాయమైన కోర్కెలను పరిష్కరించే బదులు కేంద్రం బలంగా వుంటేనే మీ మనుగడ అని తేలిక చేశారు. ప్రత్యేక హోదా, పారిశ్రామిక రాయితీల ప్రసక్తి లేదు, లోటు ఎంతో తేల్చే పద్ధతి లేదు అంటూ హళ్లికి హళ్లి సున్నకు సున్న వేశారు. ఇఏపి కింద రూపాయి రావాలంటే ప్రత్యేక వ్యవస్థ (స్పెషల్ పర్పస్ వెహికిల్–ఎస్‌పివి) వుండాలంటూ ఆరేడు నెలల కాలం పట్టే కొత్త మెలిక పెట్టారు. అవి అయిపోతే రైల్వేజోన్ వంటివి చిటికలో పని అంటూ చిటిక మాత్రం వేయకుండా చీదరించుకున్నారు. దీనంతటి తర్వాత కూడా భగ్గున మండిపోవడానికి బదులు బాధేస్తుంది అని మాత్రమే అంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబులో అపర బుద్ధుడే అగుపిస్తున్నాడు. ఆయనపై అగ్నిహోత్రుడై విరుచుకుపడే విపక్ష నేత జగన్ అరుణ్ జైట్లీని ఆక్షేపించేబదులు అదంతాఇదివరకు చెప్పిందేనని సరిపెట్టారు. అప్పుడు వూరుకుండి ఇప్పుడు ఎందుకు విమర్శిస్తున్నారని చంద్రబాబును అడుగుతున్నారే గాని అప్పుడూ ఇప్పుడూ తప్పే చెబుతున్న అరుణ్ జైట్లీని నిలదీయడం లేదు. ప్రత్యేక హోదా మంత్రం, అవిశ్వాస తంత్రం తప్ప అన్యమైన ఆయుధాలు కేంద్రంపై ప్రయోగించరాదని నిర్ణయించుకున్నారన్న మాట. ఆఖరి దశకు వచ్చినా ఇంకా దశలవారి వ్యూహం గురించి చంద్రబాబు మాట్లాడుతున్నారు. ఎలాగూ ఫలించని అవిశ్వాసం నోటీసు, నామకార్థపు రాజీనామాలు, తమ ప్రభుత్వం వచ్చాక జరిగే న్యాయం గురించే జగన్ అభిభాషిస్తున్నారు. పాలక పక్షం విఫలమైన చోట ప్రతిపక్షం చొరవ చూపాలి గాని ఇరు పక్షాలూ విఫలం కావడం ఏపీకే ప్రత్యేకం.

ఏమైనా ప్రత్యేకహోదానూ చట్టరీత్యా రావలసిన ప్రయోజనాల సమస్యనూ భూస్థాపితం చేయడంలో జయప్రదమైనామని సంతోషించిన వారికి ఈ తాజా పరిణామాలు చెంపపెట్టే. పైనే చెప్పినట్టు దీనికి కారణం వామపక్షాలూ ప్రత్యేక హోదా సాధన సమితి వంటి సంస్థలూ ప్రజా సంఘాలూ మీడియా చర్చలూ తప్ప రెండు ప్రధాన పార్టీలు కాదు. చివరి నిముషంలో వీరోచితంగా మాట్లాడినా తెలుగుదేశం ఇప్పటివరకూ రాజీపడిన వాస్తవం చెరిగిపోదు. ప్రత్యేక హోదా మంత్ర జపం ఎంత చేసినా కేంద్రంపై ప్రతిఘటనలో వైసీపీ వెనకంజ దాగదు.తమ తమ రాజకీయ ఘర్షణ ఎలా వున్నా రాష్ట్రం కోసం కలసికట్టుగా అడుగేయాలని వారు ఇప్పటికైనా అర్థం చేసుకుంటే కేంద్రం దిగివస్తుంది. సీనియర్ రాజకీయవేత్తగా ఈ విషయంలో ఈ సమయంలో చొరవ తీసుకుని అందరి సహకారం కూడగట్టవలసిన బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబుపై వుంటుంది. రాజకీయ అవసరాలకోసం కేంద్రం అనుచిత వైఖరి వాస్తవాలను బయిటపెట్టడంలో తటపటాయిస్తే అందుకు టిడిపి మూల్యం చెల్లించవలసి వస్తుంది. అలాగే రాష్ట్రానికి సంబంధించిన నిజాలను అంచనాలను పారదర్శకంగా ప్రజల ముందుంచాల్సిన బాధ్యత కేంద్రంపైనా వుంది. ఇది ఆ రెండు పార్టీల ముచ్చట ఎంతమాత్రం కాదు. పరస్పర ఆధిక్యత కోసం వ్యూహాత్మకంగా ఆరోపణలు వినిపిస్తుంటే ఉభయుల బండారమూ తెలుస్తుంది.

సరిగ్గా ఈ సమయంలోనే తృతీయ ప్రత్యామ్నాయం గురించిన చర్చకు తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ తెరలేపడం యాదృచ్ఛికం కాదు. గతంలో చాలాసార్లు మోడీని అతిగా పొగిడిన కెసిఆర్ ఈ పిలుపునివ్వడంలో అంతర్గత వ్యూహాలు మాత్రమే చూస్తే పాక్షికమవుతుంది. రాష్ట్రాల రాజ్యాంగ హక్కులపై ఆర్థిక వనరులపై మోడీ సర్కారు స్వారీ చేస్తున్న తీరుకు స్పందనగానూ చూడాల్సి వుంది. ఒక్కసారి కేంద్రం జోక్యం కారణంగా తప్ప నలభై ఏళ్ల సిపిఎం పాలనలో వున్న త్రిపురలో బిజెపి గెలవగానే లెనిన్ విగ్రహాలు కూలుస్తున్నతీరు దేశానికి ఒక తీవ్ర హెచ్చరికగా వుంది. తన రాజకీయ ముసాయిదాలో కాంగ్రెస్‌తో కలసి వెళ్లే అవకాశం లేదన్న సిపిఎం, కలసి వెళ్లాలంటున్న సిపిఐ, ఇంకా చాలా ప్రాంతీయ పార్టీలు కూడా బిజెపిని మతతత్వం అసహన రాజకీయాలను ఓడించే విషయంలో ఏకీభవిస్తాయి. మరో వైపు రాష్ట్రాల వారి ప్రత్యేకతలూ రాజకీయ వైరుధ్యాలు జాతీయ ప్రాంతీయ పాలకపక్షాల ప్రజా వ్యతిరేక విధానాలను ఓడించాల్సిన పరిస్థితులూ వుంటాయి. యుపిలో ఎస్‌పికి ఉప ఎన్నికల్లో బిఎస్‌పి మద్దతు నివ్వడం గాని, మహారాష్ట్రలో శివసేన దూరం కావడం గాని, రాజస్థాన్ ఎంపి ఉప ఎన్నికల ఫలితాలు గాని మోడీత్వ విజృంభణ పరిమితులేమిటో చెబుతున్నాయి. ఏతావాతా తెలుగు రాష్ట్రాలతో సహా దేశంలో పరిణామాలు ఎన్నికల ముంగిట్లో రాజకీయ పునస్సమీకరణ క్రమాన్ని వేగవంతం చేస్తాయి. మరి ఈ సమరంలో ఏ పార్టీలు ఏ నాయకులు ఏ మేరకు నిలబడేది భవిష్యత్తు చెప్పాలి. దాన్ని బట్టి ప్రజలు తీర్పులివ్వాలి.

14వ ఫైనాన్స్ కమిషన్ సాకుతో ప్రత్యేక హోదాను సమాధి చేసినప్పుడూ తాడూ బొంగరం లేని ప్యాకేజి ప్రహసనం నడిపినప్పుడూ ఏళ్లతరబడి పైసలు రాల్చకుండా ప్రదక్షిణలు చేయించినప్పుడూ తెలుగుదేశం నోరెత్తలేదు. అభీష్టానికి భిన్నంగా విభజనకు గురైన అగచాట్లలో చిక్కిన రాష్ట్రానికి అత్యవసర ఆర్థిక సహాయం కూడా అందించని కేంద్రంపై అఖిలపక్ష ఒత్తిడి తెచ్చే బదులు ఆర్థిక లాభమే అంతిమమని భావించడం దీనంతటికీ మూల కారణం. పులి మీద పుట్రలా అటూ ఇటూ కేసులూ తిరకాసులతో గట్టిగా మాట్లాడే పరిస్థితి లేకుండా పోయింది.

ఇసుక క్వారీల్లో నలుగుతున్న బాల్యం

నిబంధనలు పట్టని ఇసుక వ్యాపారులు.. పిల్లలతో కూలీలుగా పనులు

- పట్టించుకోని యంత్రాంగం
- విద్యార్థి మృతితో కలకలం



ట్రాక్టర్ కింద పడి మృతి చెందిన శ్రీకాంత్ (ఫైల్)

కోటపల్లి, మార్చి 8: ఇసుక క్వారీల్లో బాల్యం చితికిపోతోంది. ఇసుక అక్రమ దందా చేస్తున్న వ్యాపారుల చేతుల్లో వారి నిండు ప్రాణాలు పోతున్నాయి. మంచిర్యాల జిల్లాలో గోదావరి సహా వివిధ నదులు, వాగుల్లోంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వ్యాపారులు.. బాలకార్మికులతో పనులు చేయించుకుంటున్నా.. అధికారయంత్రాంగం చోద్యం చూస్తోంది. తాజాగా వేమనపల్లి సమీపంలోని ప్రాణహిత నదిలో ఇసుక నింపేందుకు వెళ్లిన ఓ విద్యార్థి ఇటీవల మృతిచెందిన ఘటన కలకలం రేపుతోంది. వేమనపల్లికి చెందిన గాండ్ల శ్రీకాంత్ (14) అనే 9వ తరగతి విద్యార్థి.. రాజేశ్, సాయి, అజయ్ అనే సహ విద్యార్థులతో కలిసి స్థానిక ప్రాణహిత నదిలో ఇసుక ట్రాక్టర్లు నింపేందుకు కూలీకి వెళ్లాడు. ట్రాక్టర్ నింపాక, అది అన్‌లోడ్ చేసి వచ్చేదాకా విద్యార్థులంతా నిద్రకు ఉపక్రమించారు. శ్రీకాంత్ ఓ చోట, అతడి మిత్రులు మరోచోట నిద్రించారు. అదే సమయంలో మరో లోడ్ కోసం వచ్చిన ఆ ట్రాక్టర్.. శ్రీకాంత్‌పై నుంచి వెళ్లింది. ఆ బాలుడు అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. డ్రైవర్ అజాగ్రత్తగా రివర్స్ తీయడంతోనే ఈ ఘటన చోటుచేసుకుంది. జిల్లాలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనను అధికారులు గాలికి వదిలేశారనే విషయం ఈ ఘటనతో మరోసారి తెరపైకి వచ్చింది.

ప్రాణహిత నుంచి కొందరు వ్యాపారులు రాత్రివేళ అక్రమంగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొంతకాలంగా ఇసుక అక్రమ రవాణా సాగుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదనే విమర్శలున్నాయి. నీల్వాయి వాగు, ప్రాజెక్టు కాలువలు, రహదారుల నిర్మాణం సాగుతుండగా మండలంలో ఇసుకకు భారీ డిమాండ్ ఏర్పడింది. ఒకవైపు ప్రాణహిత నుంచి ప్రభుత్వపరంగా ఇసుక తరలింపునకు అనుమతులుండగా, మరోవైపు రాత్రివేళ అక్రమ దందాకు కొందరు తెరలేపారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లను పెట్టి ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక నింపేందుకు వందల మంది కూలీలను వినియోగిస్తుండగా... వీరిలో విద్యార్థులను సైతం కూలీలుగా మార్చుతున్నారు వీరిలో రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలకు చెందిన వారే ఎక్కువగా ఉంటున్నారు. వచ్చే డబ్బు ఇంటి అవసరాలకు చేదోడువాదోడుగా ఉంటుందనే ఆశతో ఇసుక నింపేందుకు వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాలలను కార్మికులుగా వినియోగిస్తున్న ఇసుక వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు బలంగా వ్యక్తమవుతున్నాయి.

పిల్లలను పనుల్లోకి తీసుకోవద్దు



పిల్లలను పనుల్లోకి తీసుకోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇసుక తరలింపు లాంటి ప్రమాదకరమైన పనుల్లోకి విద్యార్థులను కూలీలుగా తీసుకెళ్లడం దురదృష్టకరం. ఇలాంటి వ్యాపారులపై పోలీసులు నిఘా పెట్టాలి.

-వసంత్, నీల్వాయి

కఠిన చర్యలు తీసుకోవాలి



ట్రాక్టర్ కింద పడి విద్యార్థి మృతి చెందిన ఘటనతోనైనా అధికారులు కళ్లు తెరవాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. చట్టాలను తుంగలో తొక్కుతున్న ఇసుక వ్యాపారులపై కేసులు నమోదు చేయాలి

-కే రాజారాం, ఆల్గామా

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

కొత్తపల్లి, మార్చి 8: కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఖాజీపూర్ గ్రామంలో బాల్య వివాహాన్ని రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన ఓ బాలికను వేములవాడ రూరల్ మండలం ఫాజిల్‌నగర్ గ్రామానికి చెందిన వంగల శ్రీకాంత్‌కు ఇచ్చి గురువారం ఉదయం వివాహం జరిపించడానికి ముహూర్తం పెట్టారు. దీనిపై కరీంనగర్ ఆర్డీవోకు సమాచారం అందగా ఆయన ఆదేశాల మేరకు తహసీల్దార్ బుధవారం అర్ధరాత్రి ఖాజీపూర్‌లోని బాలిక ఇంటికి సిబ్బందితో వెళ్లారు. అమ్మాయి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వినకపోవడంతో పోలీసుల సహకారంతో వరుడు శ్రీకాంత్‌కు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బాలికతో వివాహం, చట్ట ప్రకారం నేరమని, వెంటనే పెళ్లిని వాయిదా వేసుకోవాలని హెచ్చరించారు. అధికారుల సూచనల మేరకు వరుడు పెళ్లిని వాయిదా వేసుకుంటున్నట్లు తెలిపారు. దీంతో పెళ్లి ఆగిపోయింది.

ఎమ్మార్పీఎస్ బంద్‌కు అర్థం లేదు: పిడమర్తి రవి

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్రం చేస్తున్న జాప్యానికి నిరసనగా రాష్ట్రంలో ఎమ్మార్పీఎస్ బంద్‌కు పిలుపునివ్వడంలో అర్థం లేదని ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి అన్నారు. ఈ నెల 13న తలపెట్టిన బంద్ విషయంలో పునరాలోచించుకోవాలని మందకృష్ణ మాదిగను కోరారు. ఈ విషయమై తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్రాలకే ఇవ్వాలని తెలంగాణ ఎంపీలతో కలిసి ఉద్యమించాల్సిన ఎమ్మార్పీఎస్ తెలంగాణ బంద్‌కు పిలుపునివ్వడంలో అర్థం లేదన్నారు.

అప్పుల ఊబిలో ఆగిన ఊపిరి

- ముగ్గురు రైతుల ఆత్మహత్య



కొమురయ్య



మల్లయ్య

నల్లగొండ క్రైం/నంగునూరు/నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 8: అప్పుల బాధతో ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. నల్లగొండ జిల్లా పానగల్‌కు చెందిన నూకల శ్రీను(38) ఆరెకరాల్లో పత్తి వేసి అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చలేక ఈ నెల 6న ఇంట్లో పురుగు మందు తాగాడు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం మగ్దుంపూర్‌కు చెందిన పెర్న కొమురయ్య (40) మూడు ఎకరాల్లో మొక్కజొన్న, వరి సాగు వేశాడు. పంటలు నష్టపోయి సుమారు రూ.4 లక్షలు అప్పులు మిగిలాయి. దీంతో మనస్తాపానికి గురై బుధవారం వ్యవసాయ బావి వద్ద పురుగు మందు తాగాడు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా నాగనూల్ చెందిన మల్లయ్య (45) ఐదెకరాల్లో సాగు కోసం అప్పులు చేశాడు. వ్యవసాయంలో నష్టం రావడంతో గురువారం ఇంట్లో పురుగు మందు తాగాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు.

ఎస్టీపీపీలో క్రమబద్ధీకరణ రగడ



జైపూర్‌లో కాంట్రాక్ట్ కార్మికుల రాస్తారోకో (ఫైల్)

మంచిర్యాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం పెగడపల్లి వద్ద 1200 మెగావాట్ల సామర్థ్యం గల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్(ఎస్టీపీపీ)లో నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించకపోవడం, కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించిన వారిని క్రమబద్ధీకరించక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో కాంట్రాక్టు కార్మికులు తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలంటూ వారం రోజులుగా ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఈ విద్యుదుత్పత్తి కేంద్రంలో 1500 మంది కార్మికులు అవసరం ఉండగా కేవలం 800 మందితోనే ప్లాంట్ నడిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. 825 మంది భూ నిర్వాసితుల్లో 300 మందికే ఉద్యోగాలిచ్చారని, అవి కూడా రోజూవారీగా రూ. 350 చొప్పున జీతం చెల్లిస్తున్నారని విమర్శలున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చుకున్నవారికి అధిక మొత్తంలో వేతనాలు చెల్లిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దాదాపు 2 వేల ఎకరాల భూములు కోల్పోయిన తమకు శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు ఇవ్వాలనీ, నెలకు కనీసం రూ. 30 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఐదేళ్లలో నేనేమి సాధించా?

- సన్మానాన్ని తిరస్కరించిన ఎంపీటీసీ

అశ్వారావుపేట టౌన్, మార్చి 8: 'ఐదేళ్ల క్రితం ప్రజా ప్రతినిధిగా ఎన్నికయ్యాను. నన్ను ఎన్నుకున్న ప్రజలకు నేనేం న్యాయం చేశా. అభివృద్ధి పనులే చేయలేకపోయాను. నాకెందుకు సన్మానం' అంటూ మహిళా దినోత్సవం రోజున సన్మానాన్ని తిరస్కరించారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎంపీటీసీ హలావత్ జయశ్రీ. గురువారం మహిళా దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వేదిక పైకి వచ్చిన జయశ్రీ రెండు చేతులు జోడించి నమస్కారం చేస్తూ, ఐదేళ్లలో తాను ఎంపీటీసీగా సాధించింది ఏమీ లేదన్నారు. 'నాకంటే గొప్ప వాళ్లు ఎందరో ఉన్నారు. నాకెందుకు ఈ సన్మానం' అంటూ తిరస్కరించారు. సన్మానం పొందకుండానే ఆమె సభా వేదిక నుంచి దిగారు.



సన్మానాన్ని తిరస్కరిస్తున్న ఎంపీటీసీ



పంప్‌హౌస్ నుంచి నీటిని విడుదల చేస్తున్న అధికారులు

మేడారం నుంచి నీటి విడుదల

ధర్మారం, మార్చి 8: మేడారం పంపుహౌస్ నుంచి గురువారం నారాయణపూర్ చెరువుకు నీటిని విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మేడారం రిజర్వాయర్‌లోకి ఈనెల 3న ఎల్లంపల్లి నీరు విడుదల చేయగా గురువారం ఆ నీరు ప్రాజెక్టులోకి చేరింది. అక్కడి నుంచి మేడారంలో నిర్మించిన పంప్‌హౌస్‌లోకి కాల్వ ద్వారా నీటిని వదిలారు. పంప్ హౌస్ నుంచి నారాయణపూర్‌కు నీరు విడుదల చేశారు.

జాతీయస్థాయిలో గజ్జెల మల్లారెడ్డి సాహితీ పురస్కారం

కడప (వైవీయూ), మార్చి 8 : కడప యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ప్రముఖ కవి, సంపాదకుడు గజ్జెల మల్లారెడ్డి స్మారకార్థం ఇచ్చే సాహితీ పురస్కారం ఇక నుంచి జాతీయ స్థాయిలో ప్రదానం చేస్తున్నట్టు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ అత్తిపల్లి రామచంద్రారెడ్డి గురువారం తెలిపారు. పత్రిక, సాహితీ, సామాజిక రంగాలలో విశేష కృషి చేసిన వారికి మల్లారెడ్డి స్మారకనిధి సహాయంతో ఏటా ఈ పురస్కారం ప్రదానం చేయనున్నామని పేర్కొన్నారు. 2015-16 సంవత్సరానికి గాను రచయిత, పాత్రికేయుడు తులనేకృష్ణ, 2016-17 సంవత్సరానికి ఇండియా టుడే అసోసియేట్ ఎడిటర్ రాజేంద్రను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్టు వెల్లడించారు. 2017-18 సంవత్సరానికి గాను రచయిత, పాత్రికేయుడు పాలగిరి విశ్వప్రసాద్‌కు పురస్కారం అందజేస్తామని చెప్పారు. ఈ నెలలోనే కడపలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో ఈ అవార్డులు ప్రదానం చేయనున్నామని పేర్కొన్నారు.

సానుకూల దృక్పథంతో విజయాలు

- వరంగల్ సీపీ సుధీర్‌బాబు

నిట్ క్యాంపస్ (కాజీపేట), మార్చి 8 : జీవితంలో ఉన్నత లక్ష్యాలకు చేరుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. ప్రతి విషయాన్ని సానుకూల దృష్టితో చూసినప్పుడే విజయం సాధ్యమని చెప్పారు. వరంగల్ నిట్‌లో గురువారం స్ప్రింగ్ స్ప్రీ ఉత్సవాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా అవసరమే అన్నారు. కార్యక్రమంలో నిట్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న సీపీ సుధీర్‌బాబు

నిమ్‌సెట్‌లో నెగ్గితే..

నిట్‌లో ఎంసీఏ



దేశంలో సాంకేతిక విద్యను అందించడంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల తరవాతి స్థానం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లదే. మారుతున్న అవసరాలకు అనుగుణంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పరిశ్రమలు కోరుకుంటున్న నైపుణ్యాలను పెంపొందించే విధంగా విద్యను బోధించడంలో నిట్‌లది అందెవేసిన చేయి. అందుకే నిట్‌లలో అడ్మిషన్లకు ఎంతో పోటీ ఉంటుంది. ఇంజనీరింగ్‌తోపాటు ఎంబీఏ, ఎంసీఏ వంటి కోర్సులను కూడా నిట్‌లో బోధిస్తారు. ఈ క్రమంలో 2018-19 విద్యా సంవత్సరానికి ఎంసీఏ (మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్) కోర్సులో ప్రవేశానికి వీలు కల్పించే నిమ్‌సెట్ (నిట్ ఎంసీఏ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్) - 2018కు ప్రకటన వెలువడింది. దీని ద్వారా దేశంలోని అన్ని నిట్‌లలో ఎంసీఏ సీట్లను భర్తీ చేస్తారు.

నిమ్‌సెట్‌ను ఏటా ఒక్కో నిట్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహిస్తుంది. ఈ సారి నిట్ - సూరత్కల్ (కర్ణాటక) నిమ్‌సెట్ - 2018 బాధ్యతలను పర్యవేక్షిస్తుంది. నిమ్‌సెట్‌లో పాల్గొంటున్న ఇన్‌స్టిట్యూట్‌లు, సీట్ల వివరాలు..

ఇన్‌స్టిట్యూట్	సీట్లు
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - వరంగల్	46
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - అగర్తలా	40
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - అలహాబాద్	93
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - భోపాల్	92
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - కాలికట్	46
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - దుర్గాపూర్	30
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - జంషెడ్‌పూర్	92
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - కురుక్షేత్ర	60
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - రాయ్‌పూర్	92
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - సూరత్కల్	92
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - త్రిచి	92

అర్హత

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి రెగ్యులర్ లేదా ఓపెన్ విధానంలో 60 శాతం మార్కులు లేదా 6.5 సీజీపీఏ (ఎస్సీ /ఎస్టీలకు 55 శాతం లేదా 6 సీజీపీఏ)తో బీఎస్సీ / బీఎస్సీ (ఆనర్స్) / బీసీఏ / బీఐటీ (మ్యాథమెటిక్స్ లేదా స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా) లేదా బీఈ / బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పెరుగుతున్న అవకాశాలు

గతంతో పోల్చితే ప్రస్తుతం ఎంసీఏ కోర్సుకు డిమాండ్ పెరుగుతోంది. ఇటీవలి కాలంలో బీఈ / బీటెక్‌కు ప్రత్యామ్నాయంగా ఐటీ రంగంలో ఎంసీఏ చేసిన వారిని రిక్రూట్ చేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. ఇదే విషయాన్ని ఇండియా స్కిల్ రిపోర్ట్ 2018 పేర్కొంది. గతంతో పోల్చితే ఎంసీఏ విద్యార్థులకు 13 శాతం మేర అవకాశాలు పెరిగినట్లు ఈ నివేదిక తెలిపింది. ఈ నివేదిక రూపకల్పనలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ), యూఎన్‌డీపీ (యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్), ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ), పీపుల్ స్ట్రాంగ్ (హెచ్ఆర్ కంపెనీ), వీబాక్స్ (ఆన్‌లైన్ టాలెంట్ అసెస్‌మెంట్ కంపెనీ), సీఐఐ, పియర్సన్ సంస్థలు పాలుపంచుకున్నాయి.

వేర్వేరుగా దరఖాస్తు

నిమ్‌సెట్ ర్యాంక్ ఆధారంగా ఆసక్తి ఉన్న ఇన్‌స్టిట్యూట్‌లకు అభ్యర్థి వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రతి నిట్‌లో సాధారణంగా ఆల్ ఇండియా కోటా, హోమ్ స్టేట్ కోటా సీట్లు ఉంటాయి. కానీ ఎంసీఏ కోర్సుకు ఈ నిబంధన వర్తించదు. ఎంసీఏ కోర్సులోని సీట్లన్నీ ఆల్ ఇండియా కోటా కింద ఉంటాయి. వీటికి ఎవరైనా పోటీపడొచ్చు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రిజర్వేషన్లను అమలు చేస్తారు.

డిమాండ్ ఎక్కువే

జాతీయ స్థాయిలో నిట్‌లకు ప్రాముఖ్యం ఉంది. సమర్థులైన ఆధ్యాపక వర్గం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే అనువైన వాతావరణం, అందుకు తగిన సౌకర్యాలు ఈ ఇన్‌స్టిట్యూట్‌ల ప్రత్యేకత. అందుకే నిట్‌లు అందజేసే ఎంసీఏ కోర్సుకు చాలా డిమాండ్ ఉంటోంది. సాధారణ ఇన్‌స్టిట్యూట్ కంటే నిట్ నుంచి ఎంసీఏ చేసిన వారికి జాబ్ మార్కెట్లో ప్రాధాన్యం లభిస్తుంది. ముఖ్యంగా ఈ ఇన్‌స్టిట్యూట్‌లు పరిశ్రమ కోరుకుంటున్న నైపుణ్యాలను పెంపొందించే విధంగా సిలబస్‌ను బోధిస్తాయి. అంతేకాకుండా 100 శాతం క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉంటాయి. అన్ని ప్రముఖ సంస్థలు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో పాల్గొంటాయి. దాదాపు అందరికీ ఉద్యోగాలు లభించే అవకాశం ఉంటుంది. ప్రధానంగా నిట్ వరంగల్, త్రిచి, సూరత్కల్ ఇన్‌స్టిట్యూట్‌లలో చేరడానికి విపరీతమైన పోటీ ఉంటోంది.

పరీక్ష ఇలా...

నిమ్‌సెట్‌ను జాతీయ స్థాయిలో ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లీష్ భాషలో మాత్రమే ఉంటుంది. ప్రతి సరైన సమాధానానికి నాలుగు మార్కులు కేటాయిస్తారు. నెగిటివ్ మార్కులు కూడా ఉన్నాయి. ప్రతి తప్పునకు ఒక మార్కు కోత విధిస్తారు. సమాధానాలను గుర్తించడానికి 120 నిమిషాల (రెండు గంటలు) సమయం ఇస్తారు. ఇందులో నాలుగు విభాగాల నుంచి 120 ప్రశ్నలు ఇస్తారు. అవి..

విభాగం	ప్రశ్నల సంఖ్య
మ్యాథమెటిక్స్	50
అనలిటికల్ ఎబిలిటీ - లాజికల్ రీజనింగ్	40
కంప్యూటర్ అవేర్‌నెస్	10
జనరల్ ఇంగ్లీష్	20
మొత్తం	120

నిమ్‌సెట్‌లో మ్యాథమెటిక్స్ విభాగం లేదా మొత్తం పరీక్షలో నెగిటివ్ మార్కులు / సున్నా మార్కులు వచ్చిన వారిని అనర్హులుగా పరిగణిస్తారు. ఇద్దరు అభ్యర్థులకు సమాన మార్కులు వచ్చిన పక్షంలో మ్యాథమెటిక్స్‌లో అధిక మార్కులు స్కోర్ చేసిన వారికి ప్రాధాన్యం ఇస్తారు.

ఇలా సిద్ధమవ్వాలి

- **మ్యాథమెటిక్స్:** అత్యధిక వెయిటేజీ ఉన్న విభాగమిది. కాబట్టి దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. ఇందులో సెట్ థియరీ, ప్రొబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్, అల్జీబ్రా, కోఆర్డినేట్ జ్యామెట్రీ, కాలిక్యులస్, వెక్టర్స్ వంటి అంశాల నుంచి ప్రశ్నలొస్తాయి. తొలుత ఆయా అంశాలకు సంబంధించిన ప్రాథమిక సూత్రాలపై అవగాహన పెంపొందించుకోవాలి. హైస్కూల్ స్థాయి గణిత పుస్తకాలను అధ్యయనం చేయాలి. స్టాటిస్టికల్ ఎబిలిటీ కోసం ఇంటర్మీడియెట్ పుస్తకాల ప్రిపరేషన్ అవసరం. ముఖ్యంగా ప్రొబబిలిటీ, ఇనీక్వాలిటీస్ అంశాలకు ఈ స్థాయి ప్రిపరేషన్ తప్పనిసరి. శాతాలు, లాభనష్టాలు, నిష్పత్తులు, మెన్సురేషన్, పని - కాలం, పని - సమయం తదితర అంశాలపై పట్టు సాధించాలి. ట్రిగనోమెట్రీ, సెట్స్ అండ్ రిలేషన్స్, లీనియర్ ఈక్వేషన్స్, ప్రోగ్రెషన్స్ తదితర అంశాలపైనా పట్టు సాధించాలి.
- **అనలిటికల్ ఎబిలిటీ:** ఇందులో డేటా సఫీషియన్సీలో రాణించాలంటే.. అర్థమెటిక్ అంశాలపై పట్టు సాధించడం ప్రధానం. 'స్టేట్‌మెంట్ బేస్డ్' ప్రశ్నలకు ఇచ్చిన స్టేట్‌మెంట్లలో సరైనదేదో గుర్తించాల్సి ఉంటుంది. దీనికోసం సునిశిత పరిశీలన.. గణితంపై ప్రాథమిక అవగాహన తప్పనిసరి. వర్డ్ అనాలజీ, నంబర్ సిరీస్, బ్లడ్ రిలేషన్, సీటింగ్ అరేంజ్‌మెంట్, కోడింగ్, డీ-కోడింగ్, కేలండర్, క్లాక్, ట్రైన్ ప్రాబ్లమ్స్ తదితరాలపై పట్టు సాధించాలి. ఏదైనా ఒక ప్రామాణిక రీజనింగ్ పుస్తకాన్ని తీసుకొని చదివితే సరిపోతుంది.
- **ఇంగ్లీష్ లాంగ్వేజ్:** ఈ విభాగంలో ఆంగ్ల భాషపై అభ్యర్థి సామర్థ్యాన్ని పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. ఇందులో రీడింగ్ కాంప్రెహెన్షన్, వొకాబ్యులరీ, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్, వర్డ్ పవర్, ఫ్రేజెస్ - మీనింగ్స్, సినానిమ్స్, ఆంటోనిమ్స్, సెంటెన్స్ కరెక్షన్, వర్డ్ మీనింగ్స్, టెక్నికల్ రైటింగ్ వంటి అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.
- **కంప్యూటర్ అవేర్‌నెస్:** కంప్యూటర్స్‌పై ప్రాథమిక అవగాహనను పరీక్షించే ప్రశ్నలు ఉంటాయి. ఇందులో కంప్యూటర్ ఆర్గనైజేషన్, సీపీయూ, బేసిక్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఇన్‌పుట్ / అవుట్‌పుట్ డివైజెస్, కంప్యూటర్ మెమొరీ, బ్యాకప్ డివైజెస్ వంటి అంశాలపై ప్రశ్నలు ఉంటాయి. అదేవిధంగా డేటా ఇంటర్‌ప్రిటేషన్‌లో రిప్రెజెంటేషన్ క్యారెక్టర్స్, బైనరీ ఆపరేషన్స్, ఆర్థమెటిక్, ఫ్లోటింగ్ పాయింట్, బులియన్ అల్జీబ్రా, ట్రూత్ టేబుల్స్, వెన్ డయాగ్రామ్స్ వంటి అంశాలపై దృష్టి సారించాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 31, 2018.
- అడ్మిట్ కార్డు (హాల్ టికెట్లు) డౌన్‌లోడింగ్: మే 14-25
- రాత పరీక్ష తేదీ: మే 27, 2018.
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రం: వరంగల్
- ఫలితాల వెల్లడి: జూన్ 6, 2018.
- వెబ్‌సైట్: www.nimcet.in/

సాధారణ పరీక్ష కాదు...

నిట్‌లు జాతీయ ప్రాముఖ్యం ఉన్న సంస్థలు. సాధారణ ఇన్‌స్టిట్యూట్‌తో పోల్చితే నిట్ నుంచి ఎంసీఏ చేయడానికి ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. వరంగల్ నిట్‌లో ఎంసీఏ కోర్సుకు విపరీతమైన డిమాండ్ ఉంది. సీట్లన్ని కచ్చితంగా భర్తీ అవుతాయి. నిమ్‌సెట్ సాధారణ పరీక్ష కాదు. చాలా కష్టపడితేనే ఇందులో విజయం సాధ్యమవుతుంది. కొందరు విద్యార్థులు ఏడాదిపాటు ఇందుకోసమే శ్రమిస్తుంటారు. వరంగల్ నిట్‌లో 46 సీట్లు ఉన్నాయి. ఈ సీట్లన్నీ ఆల్ ఇండియా కోటా పరిధిలోకి వస్తాయి. వీటి కోసం ఎవరైనా పోటీ పడొచ్చు. సీట్ల కేటాయింపులో మాత్రం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రిజర్వేషన్ల విధానంలో అమల్లో ఉంటుంది. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉంటాయి.



- డాక్టర్ ఆర్‌బీవీ సుబ్రమణ్యం
హెడ్, సీఎస్ఈ డిపార్ట్‌మెంట్, నిట్ - వరంగల్.

జాబ్ కార్నర్

ఐఐటీఎంలో రీసెర్చ్ పర్సనల్స్

ఖాళీలు 22

పుణెలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రోపికల్ మెటియరాలజీ (ఐఐటీఎం) రీసెర్చ్ పర్సనల్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

రీసెర్చ్ అసోసియేట్స్

- ఖాళీలు: 12
- కాంట్రాక్ట్ వ్యవధి: ఏడాది
- అర్హత: డాక్టరేట్ (మెటియరాలజీ / అట్మాస్ఫియరిక్ సైన్సెస్ / ఓషనోగ్రఫీ / ఫిజిక్స్ / అప్లయిడ్ ఫిజిక్స్ / జియో ఫిజిక్స్ - మెటియరాలజీ/ మేథమెటిక్స్/ అప్లయిడ్ మేథమెటిక్స్ / స్టాటిస్టిక్స్) పూర్తిచేసి అట్మాస్ఫియరిక్ / ఓషనిక్ / క్లయిమేట్ సైన్సెస్ అంశాల మీద వ్యాసాలు ప్రచురితమై ఉండాలి.
- వయసు: మార్చి 31 నాటికి 35 ఏళ్లు మించకూడదు
- స్టయిపెండ్: నెలకు రూ.36,000తోపాటు హెచ్‌ఆర్ఏ ఇస్తారు.

రీసెర్చ్ ఫెలోస్

- ఖాళీలు: 10
- కాంట్రాక్ట్ వ్యవధి: నాలుగేళ్లు
- అర్హత: పీజీ (ఫిజిక్స్ / అప్లయిడ్ ఫిజిక్స్ / అట్మాస్ఫియరిక్ సైన్సెస్ / మెటరాలజీ / ఓషనోగ్రఫీ / క్లయిమేట్ సైన్స్ / జియో ఫిజిక్స్ - మెటరాలజీ / ఎన్విరాన్‌వెంటల్ సైన్సెస్/ ఎలక్ట్రానిక్స్ / కెమిస్ట్రీ / ఫిజికల్ కెమిస్ట్రీ / ఇనార్గానిక్ కెమిస్ట్రీ / ఆర్గానిక్ కెమిస్ట్రీ / మేథమెటిక్స్/ అప్లయిడ్ మేథమెటిక్స్ / స్టాటిస్టిక్స్) ఉత్తీర్ణతతోపాటు నెట్ / గేట్ / జెస్ట్ / జామ్ అర్హత పొంది ఉండాలి. లేదా ఇంజనీరింగ్ డిగ్రీతోపాటు గేట్ అర్హత పొంది ఉండాలి. లేదా ఎంటెక్ (అట్మాస్ఫియరిక్ / ఓషనిక్ సైన్సెస్) పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థులు పిహెచ్‌డి కోసం రిజిస్టర్ చేసుకొని ఉండాలి.



- వయసు: మార్చి 31 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
- స్టయిపెండ్: నెలకు రూ.25,000 తోపాటు హెచ్‌ఆర్ఏ ఇస్తారు.
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 31
- వెబ్‌సైట్: www.tropmet.res.in/Careers

చారిత్రక తిరుగుబాటుకు.. కారణాలెన్నో

భారతదేశంలో ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా 1857లో చారిత్రక తిరుగుబాటు జరిగింది. బ్రిటిష్ సామ్రాజ్యానికి పునాది వేసిన ప్లాసీ యుద్ధం (1757) తరవాత వందేళ్లకు జరిగిన ఈ ఆందోళనను 1857 సిపాయిల తిరుగుబాటుగా వ్యవహరిస్తారు. దీన్ని ఈస్టిండియా కంపెనీలో పని చేస్తున్న భారతీయ సైనికులు ప్రారంభించారు. ఆ సమయంలో భారతదేశ గవర్నర్ జనరల్ లార్డ్ కానింగ్.



భారతీయుల వ్యతిరేకత

1857 తిరుగుబాటుకు ముందే అనేక ప్రాంతాల్లో కొంత మంది సిపాయిలు బ్రిటిషర్లపై తమ వ్యతిరేకతను ప్రదర్శించారు. 1806లో బెంటింక్ మద్రాస్ గవర్నర్‌గా పని చేస్తున్న కాలంలోనే సిపాయిలు బొట్టు పెట్టుకోరాదనీ, తలపాగా, గడ్డం ఉండరాదని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో వెల్లూరులో సిపాయిలు తిరుగుబాటు చేశారు. 1824లో సముద్రం మీదుగా ప్రయాణించి బర్మాపై యుద్ధానికి వెళ్లాలని ఆదేశించగా, కులం పోతుందన్న భావనతో బారక్‌పూర్ సిపాయిలు తిరుగుబాటు చేశారు. అలాగే 34వ రెజిమెంట్ సిపాయిలు ఫిరోజ్‌పూర్‌లో తిరుగుబాటు చేశారు.

తిరుగుబాటుకు కారణాలు

1857 తిరుగుబాటుకు రాజకీయంగా, సాంఘికంగా, ఆర్థికంగా ఎన్నో కారణాలు ఉన్నాయి. వాటితోపాటు అప్పట్లో ప్రవేశపెట్టిన ఎన్‌ఫీల్డ్ తుపాకుల వినియోగానికి సంబంధించి వచ్చిన వార్తలు కూడా ఈ తిరుగుబాటుకు కారణాలుగా నిలిచాయి. వాటి గురించి వివరంగా తెలుసుకుందాం.

రాజకీయ కారణాలు

- బ్రిటిష్ సామ్రాజ్యవాద విధానాలకు వారన్ హేస్టింగ్స్ పునాది వేశాడు. ఈస్టిండియా కంపెనీ అనుసరించిన పలు విధానాలు కూడా ఈ తిరుగుబాటుకు కారణమయ్యాయి. వెల్లస్లీ (1798 - 1805) సైన్య సహకార పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఈ విధానం ద్వారా అనేక స్వదేశీ రాజ్యాలను స్వాధీనం చేసుకొన్నాడు. ఇలా సైన్య సహకార సంధి కుదుర్చుకొన్న మొదటి స్వదేశీ రాజ్యం హైదరాబాద్. డల్హౌసీ కూడా రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి వివిధ స్వదేశీ రాజ్యాలను కంపెనీలో విలీనం చేశాడు. ఉదాహరణకు సతారా (1848), జైత్‌పూర్ (1849), సంబల్‌పూర్ (1849), పంజాబ్ (1849), భగత్ (1850), భరత్‌పూర్ (1850), ఉదయ్‌పూర్ (1852), ఝాన్సీ (1853), నాగపూర్ (1854), అయోధ్య (1856).
- పీష్వా రెండో బాజీరావు దత్త పుత్రుడైన నానా సాహెబ్ దత్తతను అంగీకరించక అతనికి ఇవ్వాల్సిన రూ.8 లక్షల భరణాన్ని రద్దు చేశారు.
- చివరి మొగల్ చక్రవర్తి 2వ బహదూర్‌షా నివాసాన్ని ఎర్ర కోట నుంచి కుతుబ్ మినార్‌కు మార్చాలని బ్రిటిషర్లు నిర్ణయించారు. 2వ బహదూర్‌షా మరణించిన తరవాత వచ్చే అతని వారసుడికి 'పాదుషా' హోదా ఉండదని గవర్నర్ జనరల్ కానింగ్ ప్రకటించాడు.

సాంఘిక కారణాలు

- భారతీయ సామాజిక, ఆచార వ్యవహారాల్లో బ్రిటిషర్లు జోక్యం చేసుకోవడం ఎక్కువైంది.
- విలియం బెంటింక్ 1829లో సతీ సహగమన నిషేధ చట్టాన్ని చేశాడు.
- డల్హౌసీ 1850లో మతం మార్చుకొన్నవారికి ఆస్తి హక్కును కల్పిస్తూ భారతీయ వారసత్వ చట్టాన్ని ప్రవేశపెట్టడంతోపాటు 1856లో వితంతు పునర్వివాహ చట్టాన్ని ప్రవేశ పెట్టాడు.
- బ్రిటిషర్లు జాతి వివక్షతను ప్రదర్శించారు. ఇటువంటి సాంఘిక కారణాలు తిరుగుబాటుకు దారి తీశాయి.

మత కారణాలు

- క్రైస్తవ మిషనరీలు విస్తృతంగా మత ప్రచారం చేసి అనేక మంది భారతీయులను క్రైస్తవ మతంలోకి మార్చాయి. 1813లో వచ్చిన చార్టర్ చట్టంతో పలు క్రైస్తవ మిషనరీలు మత వ్యాప్తి కోసం భారతదేశానికి వచ్చాయి. భారతీయులను క్రైస్తవ మతంలోకి మార్చడమే ఆంగ్లేయుల ప్రధానోద్దేశమని, అందుకే భారత్‌ను ఆక్రమించుకొన్నారని మేజర్ ఎడ్వర్డ్ వెల్లడించారు. హిందూ, ముస్లిం మతాల్లోని లోపాలను క్రైస్తవ మిషనరీలు బహిరంగంగానే విమర్శించేవి. 1835లో బెంటింక్ ఆంగ్ల విద్యను రాజభాషగా ప్రవేశ పెట్టారు. ఈ విధంగా మతపరమైన కారణాలు కూడా తిరుగుబాటుకు కారణమయ్యాయి.

ఆర్థిక కారణాలు

- బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ ఆర్థిక విధానాలు భారత రైతాంగాన్ని, చేతి వృత్తుల వారిని ఇక్కట్లపాలు చేశాయి. ఇంగ్లండ్‌లో వచ్చిన పారిశ్రామిక విప్లవంతో మన దేశ కుటీర పరిశ్రమలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. బిటిషర్లు ఇక్కడి సహజ వనరులను ఇంగ్లండ్‌కు తరలించేవారు. ఆంగ్లేయుల ఆర్థిక విధానాలు, ఎగుమతులు, భూమి శిస్తుల వల్లే భారత్ పేద దేశంగా మారిందని అప్పటి ప్రముఖ ఆర్థిక వేత్తలు దాదాబాయ్ నౌరోజీ, ఆర్‌సీ దత్‌లు పేర్కొన్నారు.

సైనిక కారణాలు

- బ్రిటిష్ సైన్యంలోని భారతీయ సిపాయిలకు బ్రిటిష్ సైనికులతో సమానంగా పదోన్నతులు, జీత భత్యాలు ఉండేవి కావు. 1856లో లార్డ్ కానింగ్ 'సామాన్య సేవా నియుక్త చట్టాన్ని' ప్రవేశ పెట్టి సిపాయిలు ఎక్కడైనా, ఎప్పుడైనా పనిచేయడానికి సిద్ధంగా ఉండాలని శాసించాడు. కంపెనీ సైన్యంలో భారతీయ సైనికులను సిపాయిలు అనీ, యూరోపియన్ సైనికులను సోల్జర్స్ అనీ పిలిచేవారు. భారత (స్వదేశీ సైన్యం), యూరోపియన్ (విదేశీ సైన్యం) సైన్యాలు 5:1 లేదా 6:1 నిష్పత్తుల్లో ఉండేవి. 1857 తిరుగుబాటు నాటికి భారతీయ, ఆంగ్ల సైన్యాల నిష్పత్తి 81:19గా ఉంది.

తక్షణ కారణాలు

- కంపెనీ ప్రభుత్వం కొత్తగా ఎన్‌ఫీల్డ్ రైఫిల్స్‌ను ప్రవేశపెట్టింది. ఆ తుపాకుల్లో ఆవు, పంది కొవ్వు పూసిన తూటాలను ఉంచుతున్నారనే వదంతి వ్యాపించింది. ఈ తుపాకులను వినియోగించడంలో శిక్షణ నిచ్చేందుకు డమ్‌డమ్, అంబాల, సియాల్ కోటలను ఎంపిక చేశారు. తూటాలను ఇంగ్లండ్‌లోని వూల్‌వ్రిచ్‌లో తయారు చేసేవారు. ఈ అంశాలు కూడా సిపాయిల తిరుగుబాటుకు దారితీశాయి.



బి.వి. నారాయణరెడ్డి



చిన్న రైతులను నిర్వీర్యం చేసే ఇజ్రాయెల్ వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం పట్ల తెలుగు రాష్ట్రాల రైతులు అప్రమత్తంగా వుండాలని హెచ్చరిస్తున్నారు పాలస్తీనా ప్రజలు, రైతుల సంక్షేమం కోసం 15 ఏళ్లుగా కృషి చేస్తున్న ఉద్యమకారిణి, రచయిత్రి **మరెన్ మాంటోవని**. స్టాప్ ద వాల్ ఉద్యమం, పాలస్తీనీయుల భూమి పరిరక్షణ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఆమె తెలుగు రాష్ట్రాలు ఇజ్రాయెల్ అగ్రో టెక్నాలజీ ఉచ్చులో ఎలా చిక్కుకుంటున్నారనే అంశంపై హైదరాబాద్‌లో పాలస్తీనా రైతులతో స్కైప్ ద్వారా ఇష్టాగోష్టి ఏర్పాటు చేశారు. ఆ సందర్భంగా మరెన్ 'కృషి'తో మాట్లాడారు.

ఇంటర్వ్యూ

ఇజ్రాయెల్ ఆగ్రో టెక్నాలజీ వేస్ట్!

తెలుగు రైతులూ పారాహుషార్!

ఇజ్రాయెల్ ఆగ్రో టెక్నాలజీతో ఎడారిని సైతం సస్యశ్యామలం చేస్తామని చెబుతున్నారు. అందులో నిజం లేదంటారా?

ఇజ్రాయెల్‌కు చెందిన నెటాఫిమ్ సంస్థ భారత్‌తో సహా పలు ప్రపంచ దేశాల్లో ఇదే విషయాన్ని ప్రచారం చేసుకుంటున్నది. పాలస్తీనా ప్రజల నుంచి వారి జీవితాలను, భూమిని, వనరులను లాక్కుని, అక్కడి రైతుకు నీరివ్వకుండా, సొంత భూముల్లో సేద్యం చేయనివ్వకుండా ఇజ్రాయెల్ దమనకాండ సాగిస్తున్నది. అలాంటి దేశం ప్రపంచానికి అద్భుతమైన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తామని చెబితే ఎలా నమ్మగలం. తెలుగు రాష్ట్రాలకు డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందిస్తున్న కంపెనీల్లో ఇజ్రాయెల్ దేశానికి చెందిన నెటాఫిమ్ కీలకంగా మారింది. ఈ కంపెనీ ఇజ్రాయెల్ ప్రభుత్వానికి తొత్తు. కుప్పంలో ఇజ్రాయెల్ టెక్నాలజీ ప్రయోగం ఎంతవరకు విజయవంతం అయిందో అందరికీ తెలిసిందే. ఆ టెక్నాలజీ పర్యావరణ హితం కాదని, సుస్థిర వ్యవసాయానికి అనుకూలం కాదని తేలింది. పలు అంతర్జాతీయ సంస్థలు నెటాఫిమ్‌ను నాణ్యత కలిగిన కంపెనీల జాబితా నుంచి తొలగించాయి. అయినా తెలుగు ప్రభుత్వాలు ఇజ్రాయెల్ సాంకేతిక పరిజ్ఞానం అంటూ వందల కోట్లు వృథా చేస్తున్నాయి.

పాలస్తీనా రైతులు పడుతున్న కష్టాలకు నెటాఫిమ్‌కు ఎలా సంబంధం వుందంటారు?

గత ఏడు దశాబ్దాలుగా 75 శాతం పాలస్తీనీయులను ఇజ్రాయెల్ పాలకులు వారి మాతృభూమి నుంచి తరిమివేశారు. పాలస్తీనీయులకు చెందిన 93 శాతం వ్యవసాయ భూముల్ని లాక్కున్నారు. పాలస్తీనా రైతులు సాగు చేసుకునేందుకు నీరివ్వడం లేదు. బందూకుల పహారా మధ్య రైతులు దైన్యంగా సాగు చేసుకుంటున్నారు. దురాక్రమించిన భూభాగాన్ని విభజిస్తూ ఇజ్రాయెల్ భారీగా సరిహద్దు గోడను నిర్మిస్తున్నది. ఈ క్రమంలో పాలస్తీనా రైతులకు ప్రాణాధారమైన లక్షలాది ఆలివ్ చెట్లను కూకటివేళ్లతో పెకలించి వేస్తున్నది. దురాక్రమించిన పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయెల్ పట్టణాలను, పరిశ్రమలను నిర్మించింది. అలా ఏర్పాటైన పరిశ్రమల్లో ఒకటి నెటాఫిమ్. ఈ కంపెనీ ఇజ్రాయెల్ ప్రభుత్వం ఏజెంట్. లక్షల మంది పాలస్తీనీయుల ఉసురుపోసుకుంటున్న అలాంటి కంపెనీతో తెలుగు ప్రభుత్వాలు చేతులు కలపడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి.

డ్రిప్ ఇరిగేషన్‌ను 1966లో ప్రపంచానికి తనే పరిచయం చేశానని నెటాఫిమ్ చెప్పుకుంటున్నది కదా?

అందులో ఏమాత్రం నిజం లేదు. చిన్న రైతులు, పాలస్తీనా ప్రజల కన్నీళ్ల మధ్య ఎదిగిన ఆ కంపెనీ తెలుగు రైతుల సంక్షేమం కోసం పనిచేస్తానంటే ఎలా నమ్మగలం? డ్రిప్ ఇరిగేషన్ పరిజ్ఞానంలో తమకు తిరుగులేదని ఆ సంస్థ తెలుగు ప్రభుత్వాలకు నమ్మబలుకుతోంది. గత ఏడాది తెలంగాణ ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీల రూపంలో 274 కోట్లు ఖర్చు చేసింది. ప్రభుత్వం సిఫారసు చేస్తున్న 28 కంపెనీల్లో నెటాఫిమ్ ఒకటి. కానీ తెలుగు ప్రభుత్వాలకు ఇజ్రాయెల్ ప్రభుత్వ ఏజెంట్ అయిన నెటాఫిమ్ ముందు నుంచే వల వేస్తున్నది. నెటాఫిమ్ పరికరాల నాణ్యతను అధ్యయనం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం వెయ్యి మంది వ్యవసాయ విస్తరణాధికారులను ఇజ్రాయెల్ పంపింది. అందుకోసం కోట్లు ఖర్చు చేసింది. ఆ తరువాత వ్యవసాయ అధికారులు సహజంగానే నెటాఫిమ్ పరికరాలను రైతులకు సూచిస్తారు. అలా ఆ సంస్థ తెలుగు రైతుల్ని మోసం చేస్తున్నది.

కుప్పం తరహా ప్రయోగం నిష్ఫలం అంటారా?

1995లో కుప్పంలో ఇజ్రాయెల్ ఆగ్రో టెక్నాలజీతో చేపట్టిన ప్రాజెక్టు వల్ల చిన్న రైతులు ఎంతో నష్టపోయారు. తెలంగాణ ప్రభుత్వం నేటికీ ఇజ్రాయెల్ ఆగ్రో టెక్నాలజీ వెంటపడుతూనే వున్నది. 2015లో జీడిమెట్లలో ఇండో - ఇజ్రాయెల్ వ్యవసాయ ప్రాజెక్టు చేపట్టారు. 10 ఎకరాల్లో బిందుసేద్యం, పాలీ, నెట్ సాగు పద్ధతుల్లో పండ్లు, కూరలు, పూలు ప్రయోగాత్మకంగా పెంచుతున్నారు. గత ఏడాది ఈ ప్రాజెక్టు కోసం తెలంగాణ ప్రభుత్వం 12.4 కోట్లు ఖర్చు చేసింది. ములుగులో ఇదే తరహాలో 11 కోట్లు ఖర్చు చేసి 50 ఎకరాల భూమిని సిద్ధం చేశారు. అందులో ఇజ్రాయెల్ టెక్నాలజీతో పండ్ల తోటల సాగుకు 18 కోట్ల కేటాయించారు. స్థానిక సాగు పద్ధతుల్ని వదిలేసి ఇజ్రాయెల్ ఆగ్రో టెక్నాలజీ వెంటపడటం విచారకరం.

తెలుగు ప్రభుత్వాలు, రైతులకు మీరిచ్చే సలహా?

ఇజ్రాయెల్ ఆగ్రో టెక్నాలజీ పెద్ద రైతులు, పెద్ద కమతాలను ఉద్దేశించి రూపొందింది. చిన్న రైతులకు అది ఏమాత్రం ఉపయోగపడదని పాలస్తీనా రైతులు ముక్తకంఠంతో చెబుతున్నారు. చిన్న రైతులు అధిక సంఖ్యలో వున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఈ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడదు. స్థానిక వనరులు, అవసరాలకు అనుగుణమైన టెక్నాలజీని ఉపయోగించుకుంటే వ్యవసాయం లాభసాటి అవుతుంది.

- కృషి డెస్క్



సమగ్ర వ్యవసాయానికి చిరునామా ఆ మహిళా రైతు. సేంద్రియ పద్ధతుల్లో జామ, మామిడి సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన కొలన్ పుష్పలతారెడ్డి. సేద్యంతో పాటు, కోళ్లు, గొర్రెలను పెంచుతూ లాభాలు ఆర్జిస్తున్న ఆ మహిళారైతు ప్రస్థానం ఇది.

విజయగాథ

తిరుగులేని సేంద్రియ జామ

జామ, మామిడి సాగు.. గొర్రెలు, కోళ్ల పెంపకం

రంగారెడ్డి జిల్లా మహిళారైతు విజయం

కొలన్ బుచ్చిరెడ్డి, పుష్పలతారెడ్డి దంపతులకు మొండిగౌరెల్లిలో 12 ఎకరాల మెట్ట భూమి వుంది. అందులో ఆరెకరాల భూమిలో జామతోటలు సాగు చేస్తున్నారు. మూడు ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారు. ఐదు బ్రాయిలర్ కోళ్ల షెడ్లు నిర్మించారు. ఒక్కో షెడ్డులో పది వేల కోళ్లు అంటే మొత్తం 50 వేల కోళ్లు పెంచుతున్నారు. నాలుగు ఆవులు, 30 గొర్రెలను పెంచుతున్నారు ఆ మహిళా రైతు. జామ, మామిడితో పాటు సేంద్రియ పద్ధతిలో వరి సాగు చేసి అధిక దిగుబడి సాధించారామె.

లక్షా 30 వేల ఆదాయం

ఆరెకరాల జామ సాగు చేయాలని నిర్ణయించుకుని ముందుగా పొలాన్ని నాగలితో బాగా కలియదున్నించారు. ఆ తరువాత సాధారణ ట్రాక్టర్‌తో దున్నిన పొలాన్ని చదును చేయించారు. పొలం చదును చేసే ముందు పొలంలో ఉన్న గడ్డి, ఇతర వ్యర్థాలను బయట పడేయకుండా పొలంలోనే పాతారు. అలా చేయడం వల్ల ఆ వ్యర్థాలు వర్షం నీటికి నాని భూమి లోపల ఎరువుగా మారాయి. దున్నిన పొలంలో రెండు అడుగుల పొడవు, రెండడుగుల వెడల్పు, రెండు అడుగుల లోతులో గుంటలు తవ్వారు. గుంతల్లో వేపపిండి, గొర్ల ఎరువులు, పశువుల పేడ వేసి మట్టిలో బాగా కలిపారు. అనంతరం దాంట్లో నీరుపెట్టి నెల రోజులు మురుగ పెట్టారు. ఇలా చేయడం వల్ల గుంతలో ఎరువులు మట్టిలో కలిసి పోయి నేల సారవంతం అయింది. ఆ తరువాత ఆ గుంతలో అలబాస ఫేదా, లక్నో 49 రకం జామ మొక్కలు నాటారు. ఒక్కో మొక్కకు ఎనిమిది అడుగుల దూరంలో జామ మొక్కలు నాటారు. మొక్క నాటిన తరువాత గుంత పైభాగంలో పశువుల ఎరువు మిశ్రమం వేసి నీరు పెట్టారు. మొక్కకు రెండున్నర గజాల దూరం వరకు కోపు



గుంత తీసి పశువుల ఎరువు వేశారు. కోపు గుంత తీస్తే వర్షం కురిసినా వర్షం నీరు వృథాగా పోకుండా మొక్కకు అందుతుంది. అంతేగాక మొక్క వేరు లోతుగా వెళుతుంది. ఆ తరువాత మొక్కలకు డ్రిప్‌తో నీరందిస్తే త్వరితగతిన మొక్కకు నీరు చేరి బాగా పెరుగుతుందన్నారు ఆ మహిళా రైతు. మొక్క నాటిన ఏడాదిన్నర వరకు ఎలాంటి తెగులూ రాకుండా తరచూ వేప కషాయం, వేపనూనెలు వాడి చీడపీడలను నివారించారు. మొక్కలకు దగ్గరగా వేప పిండి వేశారు. వేపపిండి నేలలో వేస్తే ఆ చేదుకు తోట వేర్లను పాడు చేసే పురుగులు చనిపోతాయి. వేపనూనె, వేపకషాయం పిచికారీ చేస్తే తోటను పాడు చేసే పురుగులు చనిపోతాయి. మొక్క నాటిన ఏడాదిన్నరకు మొక్క కాతపట్టింది. తోటలో మొలచిన గడ్డి ఇతర పిచ్చిమొక్కలను ట్రాక్టర్‌తో దున్నించి వాటిని నేలలోనే చాలా లోతుగా గోతిలో వేయించారు. దీంతో నేలసారం పెరగడంతో పాటు వర్షం కురిస్తే నీరంతా పొలంలోనే ఇంకేది. మిగిలిన వరదనీరు పొలం చుట్టూ ఉన్న గుంతల్లోనే ఇంకేలా జాగ్రత్తలు తీసుకున్నారు. దీంతో బోరు బావిలో నీరు పుష్కలంగా వుంటున్నది. మొక్కలు నాటిన 18 నెలలకు మొక్క కాత పట్టింది. ఒక మొక్కకు 25 నుంచి 35 కాయలు పట్టాయి. సేంద్రియ పద్ధతుల్లో పండిస్తున్న ఈ జామకు మంచి ధర పలుకుతున్నది. కొందరు వ్యాపారులు నేరుగా తోటకు వచ్చి కిలో 30 నుంచి 40 వరకు ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. వారు రానిపక్షంలో పుష్పలతారెడ్డి స్వయంగా మార్కెట్‌కు వెళ్లి పంటను విక్రయిస్తున్నారు. ఇలా ఎకరం జామ తోట నుంచి ఏటా 1.3 లక్షల ఆదాయం లభించినట్లు ఆమె వివరించారు.

మామిడి నుంచి 4 లక్షల లాభం

ఇదే తరహాలో మూడెకరాల్లో బంగినపల్లి, మల్లిక రకం మామిడి నాటారు. వాటికి నిరంతరం డ్రిప్ ద్వారా నీరందిస్తూ సేంద్రియ పద్ధతుల్లో పెంచారు. ఎకరం మామిడి తోట నుంచి ఏటా 4 లక్షల లాభం పొందారు మహిళా రైతు పుష్పలతారెడ్డి. రెండెకరాల్లో శ్రీవరి సాగు చేశారామె. డ్రమ్ సీడర్‌తో నాట్లు వేయించారు. చీడపీడలు రాకుండా సేంద్రియ ఎరువులు వాడారు. రెండు ఎకరాల పొలంలో 48 క్వింటాళ్ల బియ్యం పొందారామె. గతేడాది 60 గొర్రె పిల్లలు అమ్మి 80 వేల రూపాయలు సంపాదించారు. ప్రస్తుతం 20 గొర్రెలను పెంచుతున్నారు. వాటిని తన జామ, మామిడి తోటల్లోనే మేపుతున్నారు. వాటి వ్యర్థాలను పంటలకు ఎరువుగా వాడుతున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, యాచారం



సేంద్రియమే శరణ్యం

రసాయన ఎరువులు పంటలకు వాడితే పొలం పాడవుతుంది. వాతావరణం కలుషితం అవుతుంది. ఆహారపదార్థాలలో పోషక విలువలు తగ్గిపోతాయి. ఆవుపేడ, ఆవుమూత్రం, గొర్ల మంద, వేపకషాయం, వేపనూనె, వేపపిండి సద్వినియోగం చేసుకుంటే ఎంతో నాణ్యమైన ఆహారపదార్థాలు పండించుకోవచ్చు. పుస్తకాల్లో చదివి సేంద్రియ సేద్యం నేర్చుకున్నాను. ఈ తరహా సేద్యం వల్ల మనం ఆరోగ్యంగా వుంటాం. నేల కూడా ఆరోగ్యంగా వుంటుంది.

- కొలన్ పుష్పలతారెడ్డి, మహిళా రైతు, మొండిగౌరెల్లి



కుర్మయ్య



పాలమూరులో క్వినోవా పండింది

18 గుంటల్లో రెండున్నర క్వింటాళ్లు పండించిన రైతు కుర్మయ్య

శీతాకాలంలో మాత్రమే పండే దక్షిణ అమెరికాకు చెందిన క్వినోవా పంటను సాగు చేసి రైతులకు ఆదర్శంగా నిలిచారు పాలమూరు రైతు పెద్దబావి కుర్మయ్య. 18 గుంటల భూమిలో రెండున్నర క్వింటాళ్ల క్వినోవా దిగుబడి సాధించి కలెక్టర్ ప్రశంసలు అందుకున్నారు.



క్వినోవాను సంపన్నుల ఆహారం అంటారు. ఆ పంట సాగులో పాలమూరు రైతు విజయం సాధించారు. ఇది శీతాకాలంలో మాత్రమే పండుతుంది. మహబూబ్‌నగర్ మండలం చౌదర్‌పల్లికి చెందిన పెద్ద బావి కుర్మయ్యకు రెండెకరాల పొలం వుంది. అందులో 18 గుంటల్లో దక్షిణ అమెరికాకు చెందిన క్వినోవా సాగు చేపట్టారు. వ్యవసాయాధికారుల ప్రోత్సాహంతో కిలో విత్తనాలను ఉచితంగా పొందారు. అక్టోబర్ 9వ తేదీన విత్తనాలు నారుమడిలో చల్లుకొని 20 రోజులు నారు పెంచారు.

> **క్వినోవాకు చలి వాతావరణం ఉండాలి. ముందస్తు రబీగా ఈ పంటను సాగు చేసుకోవడం మంచిది. సేంద్రియ పద్ధతిలో పంట పండించాను. నీరు కూడా పెద్దగా అవసరం లేదు. దిగుబడి ఖర్చు 5 వేలకు మించలేదు. వ్యవసాయ అధికారులు ఈ పంటను క్వింటాలుకు 5 వేల చొప్పున విత్తనంగా కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చారు.**
>
> - కుర్మయ్య, రైతు

అక్టోబర్ 29న తన పొలంలో క్వినోవాను నాటారు. అప్పటినుంచి పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. మొత్తం 120 రోజుల పంట కాలంలో రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా, పూర్తిగా సేంద్రియ పద్ధతిలో క్వినోవా సాగు చేశారు. గోమూత్రం, ఆవుపేడతో చేసిన జీవామృతాన్ని పిచికారీ చేశారు. క్వినోవా నాటడానికి ముందు పొలంలో ఆవుపేడ, శనగపిండి మిశ్రమాన్ని చల్లుకున్నారు. వ్యవసాయాధికారుల సూచనలతో ఎప్పటికప్పుడు మెళకువలు పాటిస్తూ పంటను కాపాడుకున్నారు. గత నెల 21న మహబూబ్‌నగర్ కలెక్టర్ రోనాల్డ్‌రోస్ కుర్మయ్య పొలాన్ని సందర్శించారు. ఆయన కృషిని అభినందించారు. కుర్మయ్య స్ఫూర్తితో రైతులంతా అధిక లాభాలొచ్చే క్వినోవా లాంటి కొత్త రకం సాగు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఫిబ్రవరి చివరి వారంలో క్వినోవా కోసి నూర్పిళ్లు చేయగా, రెండున్నర క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని కుర్మయ్య చెప్పారు.

కొత్త పంట



క్వినోవా ఆరోగ్యకరం

క్వినోవాలో మంచి పోషక విలువలుంటాయి. హైదరాబాద్‌తో పాటు మెట్రోనగరాల్లో క్వినోవాకు క్రమంగా గిరాకీ పెరుగుతోంది.

క్వినోవాలో 14 నుంచి 10 శాతం మాంసకృత్తులు, లైసీన్, మిథయోనైన్ అనే అరుదైన అమినో ఆమ్లాలు, బీ, ఈ విటమిన్లు, ఇనుము, క్యాల్షియం, మెగ్నీషియం, సూక్ష్మపోషకాలు, పీచు పదార్థాలు వుంటాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, మహబూబ్‌నగర్

నయా మాల్

బండ్ ఫార్మర్‌కు భలే గిరాకీ

జగిత్యాల జిల్లాలో ఆదరణ

వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగింది. స్థానిక పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా రైతులు స్వంతంగా ఆలోచన చేసి కొత్త వ్యవసాయ పరికరాలను రూపొందించుకుంటున్నారు. ఇలాంటిదే బండ్ ఫార్మర్ (బెడ్ మేకర్) పరికరం.

బెడ్ పద్ధతిలో పంటల సాగు చాలా ఉపయోగకరంగా వుండే ఈ బెడ్‌మేకర్‌ను జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి ప్రాంతంలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. నీటి వృథాను అరికట్టడంతో పాటు కలుపు ఇబ్బందులు ఉండవు. ఎరువులు కూడా నేరుగా మొక్కలకే అందుతాయి. ఈ పద్ధతిలో పసుపు, అల్లం పంటలను ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎక్కువగా సాగు చేస్తుంటారు. మిర్చి, టమాట, చెరుకు, పుచ్చకాయ, ఆకుకూరలు, కొత్తిమీర, క్యారెట్ పలు రకాల కూరగాయలు కూడా ఈ పద్ధతిలో సాగు చేసుకోవచ్చు. దీని వల్ల మొక్కలకు నేరుగా నీళ్ల తగలవు. మట్టి మాత్రం తడుస్తుంది. వేరుకుళ్ల లాంటి తెగుళ్లతోపాటు చాలా రోగాలు రాకుండా నివారించే వీలుంటుంది.

ఈ బెడ్ మేకర్ (బండ్ ఫార్మర్)ను కేవలం రూ.30 వేల నుంచి రూ.35 వేలలో తయారుచేసుకోవచ్చు. మెట్‌పల్లి ప్రాంతంలో రైతులే దీన్ని తయారు చేసుకుని ఉపయోగిస్తున్నారు. రైతులు బెడ్‌లు వేస్తే అవి సరిగా రావడం లేదు. ఈ బెడ్‌మేకర్‌తో బెడ్‌లు వేస్తే భూమి మొత్తం ఎటు చూసినా ఒకే సైజులో వస్తాయి. ట్రాక్టర్ వెనకాల ఒకటి, రెండు బెడ్‌లు వచ్చేలా ఈ బెడ్ మేకర్‌ను రూపొందించారు. గంటలోనే ఎకరం భూమిలో బెడ్‌లు వేయవచ్చు. ఈ బెడ్ మేకర్‌ల కోసం జగిత్యాల జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి కూడా రైతులు పెద్ద సంఖ్యలో మెట్‌పల్లికి వస్తుంటారు. ఉద్యానశాఖ దీనిపై సబ్సిడీ ఇస్తే ఎంతో ఉపయోగంగా వుంటుందని రైతులు అంటున్నారు.



- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, జగిత్యాల వ్యవసాయం

బీట్‌రూట్ ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తుందో దాన్ని సాగు చేసే రైతులకు అంతకంటే లాభాలు పండిస్తుంది. రెండెకరాల్లో బీట్‌రూట్ సాగు చేసి నాలుగు లక్షల రూపాయల ఆదాయం పొందారు ఖమ్మం జిల్లా చిమ్మపుడి గ్రామానికి చెందిన రైతు మోహన్‌రెడ్డి.

లాభాల బీట్‌రూట్ సాగు

రెండెకరాల సాగుతో నాలుగు లక్షల ఆదాయం

వైవిధ్యం



ఖమ్మం జిల్లా రఘునాథపల్లెకు చెందిన పలువురు రైతులు ఇప్పటికే కూరగాయలు సాగు చేస్తూ నిత్యం ఆదాయం పొందుతున్నారు. ఇదే మండలం చిమ్మపుడి గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి కాస్త భిన్నంగా ఆలోచించారు. వికారాబాద్ జిల్లాలో సాగవుతున్న బీట్‌రూట్ పంటను చూశారు. అక్కడి రైతులు అనుభవాలు అడిగి తెలుసుకున్నారు. తన రెండెకరాల పొలంలో బీట్‌రూట్ సాగు ప్రారంభించారు. ఇది స్వల్పకాలిక పంట. కేవలం 70 రోజుల్లో చేతికి వస్తుంది. సాగు ఖర్చు కూడా తక్కువ. ఖర్చు ఎకరానికి 20 వేలకు మించదు. 35 రోజులకే పొలంలో బీట్‌రూట్ గడ్డ ఏర్పడుతుంది. బీట్‌రూట్ గింజల ధర కిలో రూ.రెండు వేలు. సాళ్లు చేసి నాటితే ఎకరానికి రెండు కిలోల గింజలు పడతాయి. జొన్న మాదిరిగా చల్లితే మూడు కిలోలు గింజలు కావాల్సి వుంటుందన్నారు రైతు మోహన్‌రెడ్డి. ఈ పంటకు పది రోజులకు ఒక్కసారి నీళ్ల అందించాల్సి వుంటుంది. ఇలా మొత్తం దిగుబడి ఖర్చు ఎకరాకు 20 వేల వరకు వస్తుంది. ఎకరాకు 100 నుంచి 120 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మార్కెట్ రేటు ప్రకారం క్వింటాకు రూ. 2వేల చొప్పున ఎకరాకు రెండు లక్షల ఆదాయం వస్తుందన్నారు ఆ రైతు. ప్రస్తుతం పంట ఆశాజనకంగా వుంది. దిగుబడి అనుకున్న దానికంటే పెరిగే అవకాశం వుంది. ఈ రైతు ప్రయోగాన్ని సాటి రైతులు ఆసక్తిగా గమనిస్తున్నారు. ఖర్చు తక్కువ, రాబడి అధికంగా వుండటంతో ఇప్పటికే కొందరు రైతులు బీట్‌రూట్ సాగు ప్రారంభించడం విశేషం.



> ### తక్కువ కాలంలో ఎక్కువ ఆదాయం
>
> తక్కువ కాల వ్యవధి వున్న పంటలు అధిక లాభాలనిస్తాయి. వాణిజ్య పంట కోసం ఏడాది పాటు ఎదురుచూడాలి. లాభాలు గ్యారెంటీ లేదు. బీట్‌రూట్ వంటి వెరైటీ పంటలతో తక్కువ కాల వ్యవధిలో ఎక్కువ లాభాలు వస్తాయి.
>
> - మోహన్‌రెడ్డి, రైతు

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, రఘునాథపాలెం

గృహ శోభ

అందం.. ఆరోగ్యం

పెరట్లో, ఇంటి ముందు ఖాళీస్థలంలో, చివరకు ఇంట్లో కూడా ఔషధ మొక్కలు పెంచుకోవచ్చు. గాలిని శుభ్రం చేయడంతో పాటు సువాసనలు వెదజల్లే ఈ మొక్కలు కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని ఎంతగానో పెంపొందిస్తాయి.



పుదీన

లెమన్ గ్రాస్

ఇంటి అందాన్ని పెంచే మొక్కలతో పాటు కుటుంబ సభ్యులకు ఆరోగ్యాన్ని పంచే మొక్కలను ఇంట్లోనే పెంచుకోవచ్చు. ఇంటి లోపల కుండీల్లో లేదా కాస్త గాలి, వెలుతురు వున్న వరండా, బాల్కనీ, ప్రహరీగోడల మీద కూడా ఈ మొక్కలను పెంచుకోవచ్చు. ఔషధ గుణాలు పుష్కలంగా వుండే ఈ మొక్కలు కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు మధురమైన సువాసనల్ని పంచుతాయి. పెద్దగా శ్రమ లేకుండా, తక్కువ ఖర్చుతో, తక్కువ స్థలంలో ఈ మొక్కల్ని పెంచుకునే అవకాశం వుంది.



తులసి

సబ్జా

వాము

తులసి : వేల సంవత్సరాలుగా ప్రతి ఇంట్లో తులసిని పెంచడం సంప్రదాయంగా వస్తున్నది. తులసి ఔషధ గుణాలకు నిలయం. తులసి ఆకులను వేడి నీటిలో తేనెతో కలిపి తీసుకోవడం వల్ల జలుబు, దగ్గు నుంచి ఉపశమనం లభిస్తుంది. శరీరంలోని మాలిన్యాలను తులసి శుద్ధి చేస్తుంది. ఇంట్లో కాస్త ఎండపొడ వుండే చోట చిన్న కుండీలో కూడా తులసిని పెంచుకోవచ్చు.

లెమన్ గ్రాస్ : నిమ్మగడ్డికి ఈ కాలంలో మంచి డిమాండ్ వుంది. ఎన్నో ఔషధ గుణాలున్న ఈ నిమ్మగడ్డిని కాస్త పెద్ద కుండీలో పెంచుకోవచ్చు. నిమ్మగడ్డి టీ ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. ఈ ఆకుల్ని ఎండబెట్టి పౌడర్‌గా చేసుకుని తాగితే శరీరానికి ఉత్సాహం లభిస్తుంది. సువాసనలు వెదజల్లే నిమ్మగడ్డి ఇంట్లో క్రిమికీటకాలు రాకుండా కూడా చూస్తుంది.

వాము మొక్క : వాము మొక్కను కాస్త పెద్ద కుండీలో పెంచుకోవచ్చు. ముదురుపచ్చని ఆకులతో ఇంటి అందాన్ని పెంచే వాము మొక్క ఔషధాలకు నిలయం. వాము ఆకులు వంటల్లో వాడుకోవచ్చు. వాము ఆకులు అజీర్తిని తగ్గించి ఆకలిని పెంచుతాయి.

పుదీన: పుదీన మొక్కలను కాస్త పెద్ద కుండీలో పెంచుకోవచ్చు. మంచి వాసన రావడంతో పాటు పుదీనలో ఎన్నో ఔషధ గుణాలున్నాయి. రుచిని, ఆకలిని పెంచే గుణం వున్న పుదీన ప్రతి ఇంట్లో వుండాల్సిన మొక్కల్లో ఒకటి.


సబ్జా మొక్క : పెరట్లో, వరండాలో, బాల్కనీల్లో కుండీల్లో సబ్జా మొక్కలను పెంచుకోవచ్చు. సబ్జా గింజలు వేసవిలో చలవ చేస్తాయి. శరీరాన్ని కాంతివంతంగా చేస్తాయి. బరువు తగ్గేందుకు కూడా సబ్జా గింజలు ఉపయోగపడతాయి.

సుగంధ మొక్క : దోమలను పారద్రోలడంతో పాటు కంటికి ఇంపుగా వుండే సుగంధ మొక్కను చిన్నసైజు కుండీలో కూడా పెంచుకోవచ్చు.

- కృషి డెస్క్



మాటలు చాలు!



(మొదటి పేజీ తరువాయి)

ఆహ్వానాన్ని చంద్రబాబు సున్నితంగానే తిరస్కరించారు. "నాలుగేళ్లుగా ఢిల్లీ చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. అన్ని కోణాల నుంచి ఆలోచించిన తర్వాతే రాజీనామాలపై నిర్ణయం తీసుకున్నాం. ఇప్పుడు వాటిపై మాట్లాడటానికి రాలేము" అని స్పష్టం చేశారు. నిజానికి... బుధవారం రాత్రే ప్రధానితో మాట్లాడి, తమ నిర్ణయం చెప్పి, ఆపై రాజీనామాల గురించి ప్రకటించాలని చంద్రబాబు ప్రయత్నించారు. ప్రధాని ఓఎస్డీకి కాల్ చేసి మాట్లాడగా... 'నేను ప్రధానికి ఇన్ఫామ్ చేస్తాను' అని అటువైపు నుంచి బదులు వచ్చింది. ఆ తర్వాత ఎలాంటి స్పందన రాలేదు. గురువారం మోదీ ఫోన్ చేశారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం వారి మధ్య జరిగిన సంభాషణ ఇది...

ప్రధాని: నాయుడూజీ ఎలా ఉన్నారు?

సీఎం: బాగున్నాను సర్.

ప్రధాని: బుధవారం రాత్రి నాకు బాగా ఆలస్యమైంది. అందుకే మీ ఫోన్‌కు ప్రతిస్పందించలేకపోయాను. గురువారం ఉదయమే రాజస్థాన్ వెళ్లడంతో మాట్లాడటం కుదరలేదు!

సీఎం: ఓకే సర్.

ప్రధాని: మా మంత్రివర్గం నుంచి వైదొలగాలని మీరు తీసుకొన్న నిర్ణయం చూశాను. ఎందుకు తొందరపడుతున్నారు? మనం కూర్చుని మాట్లాడుకొందాం. సమస్యలు ఉంటానే ఉంటాయి. ఎన్ని వీలైతే అన్ని పరిష్కరించుకొందాం. మీరు ఢిల్లీ రండి!

సీఎం: దానికి సమయం మించిపోయింది. మేం నాలుగేళ్లుగా ఢిల్లీ చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. మిమ్మల్ని కూడా అనేకసార్లు కలిశాం. ఓపికగా ఎదురు చూశాం. ఆఖరి బడ్జెట్ వరకూ కూడా సహనంతోనే ఉన్నాం. కానీ, మీ ప్రతిస్పందన మాకు నిరాశ కలిగించింది. ప్రజల్లో కూడా ఇది భావోద్వేగానికి దారితీసింది. తప్పని పరిస్థితుల్లో మా అసంతృప్తి వ్యక్తం చేయడానికి రాజీనామాల నిర్ణయం తీసుకొన్నాం. ఇది నా ఒక్కడి నిర్ణయం కాదు. మొత్తం ఎంపీలు, మా పార్టీ నేతలు, రాష్ట్ర ప్రజలందరి సమష్టి నిర్ణయం. అన్నీ ఆలోచించే తీసుకొన్నాం. మర్యాదపూర్వకంగా మీకు తెలియచేశాకే ప్రకటించాలనుకొన్నాం. మీరు అందుబాటులోకి రానందుకే ప్రకటించేశాం!

ప్రధాని: కొన్ని పరిష్కారం అయినట్లుగా నాకు అధికారులు సమాచారం అందించారు కదా!

సీఎం: ప్రత్యేక హోదా ఎవరికీ ఇవ్వడం లేదని గతంలో మాకు చెప్పారు. కానీ, ఆ ప్రయోజనాలు ఇటీవల కొన్ని రాష్ట్రాలకు పొడిగించారు. దానిని మాకూ వర్తింప చేయాలని కోరాం. కుదరదని చెప్పారు. పారిశ్రామిక రాయితీలు హోదా ఉన్న రాష్ట్రాలకు పొడిగించారు. పార్లమెంటులో ఇచ్చిన హామీ ప్రకారం మాకూ ఇవ్వాలన్నాం. ఇవ్వలేమని చెప్పారు. హోదా బదులు రాష్ట్రానికి ఇస్తామన్న ప్రత్యేక ఆర్థిక సాయం కింద ఈ రోజు వరకూ మాకు పైసా అందలేదు. లోటు భర్తీ కింద చాలా రావాలి. కొద్దిగా తేల్చి అదే ఇస్తామంటున్నారు. రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ, ఓడ రేవు... ఇలా ఏవీ తేల్చలేదు. ఇప్పుడు మిగిలిన రాష్ట్రాలతో మాకు పోటీ పెడుతున్నారు. పార్లమెంటులో విభజన చట్టం మిగిలిన రాష్ట్రాలకు తేలేదు కదా? ఇచ్చిన హామీల అమలు గురించే మేం అడుగుతున్నాం. వేరేవి అడగడం లేదు!

ప్రధాని: మీ ఆవేదనను అర్థం చేసుకున్నాను. కూర్చుని మాట్లాడుకుంటే ఫలితం వస్తుందన్నది నా విశ్వాసం. అందుకే, మరోసారి రమ్మంటున్నాను.

సీఎం: చర్చలకు మేం వ్యతిరేకం కాదు. మా సమస్యలు పరిష్కరిస్తామంటే ఎందుకు వద్దంటాం? మేం మంత్రి పదవుల నుంచి మాత్రమే వైదొలిగాం. ఎన్డీయే కూటమి నుంచి తప్పుకోలేదు. మిత్రపక్షంగానే ఉన్నాం. ఇప్పటికైనా మీరు చేయండి. మీ మేలు మర్చిపోలేం!

ప్రధాని: అన్నీ సవ్యంగా జరుగుతాయని అనుకుంటున్నాను!

(అని ప్రధాని తన సంభాషణ ముగించారు)

అశోక్ పనితీరు అద్భుతం

- ఆయన హయాంలో విమానయానం కొత్తపుంతలు
- పేపర్లో రాజీనామా వార్త చూసి షాకయ్యా: కేటీఆర్



హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి బిజినెస్): అశోక్ గజపతి రాజు హయాంలో పౌర విమానయానం కొత్తపుంతలు తొక్కిందని, ఆయన పనితీరు అద్భుతమని మంత్రి కేటీఆర్ కొనియాడారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 70 ఏళ్ల పాటు దేశంలో 70 విమానాశ్రయాలు మాత్రమే ఉన్నాయని, గజపతిరాజు, ఆయన బృందం కృషి, చొరవ వల్ల మూడేళ్లలోనే కొత్తగా 50-60 విమానాశ్రయాలు ఏర్పాటయ్యాయన్నారు. గురువారం ఉదయం నిద్ర లేవగానే పేపర్‌లో పౌరవిమానయాన శాఖ మంత్రిగా ఆయన రాజీనామా చేసినట్లు వచ్చిన వార్త చూసి ఆశ్చర్యపోయానని చెప్పారు. రాజకీయాల్లో ఏం జరుగుతుందో ఊహించలేమని, రాజకీయ ప్రస్థానంలో దేనికైనా సిద్ధంగా ఉండాలన్నారు. గురువారం బేగంపేట విమానాశ్రయంలో వింగ్స్ ఇండియా-2018 పేరుతో ప్రారంభమైన విమానయాన రంగ ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. వాస్తవానికి ఈ వేడుకలను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు ప్రారంభించాల్సింది. ఆయన రాజీనామా చేయడంతో కేటీఆర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశీయ విమానయాన రంగం అభివృద్ధికి గజపతిరాజు చేసిన కృషి అసాధారణమని,ఉడాన్‌కు అందించిన ఉత్తేజం అభినందనీయమన్నారు.

వైసీపీ తప్పుడు ప్రచారం : అనంతకుమార్

న్యూఢిల్లీ, మార్చి 8: ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ, ఇతర ప్రతిపక్షాలు ప్రత్యేక హోదాపై తప్పుడు ప్రచారంతో ముఖ్యమంత్రి చంద్రబాబుపై రాజకీయంగా ఒత్తిడి పెంచుతున్నారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అందువల్లే కేంద్ర కేబినెట్ నుంచి ఆయన తన మంత్రులను ఉపసంహరించి ఉంటారని గురువారమిక్కడ తెలిపారు. 'ప్రత్యేక హోదా ఇవ్వాలని టీడీపీ డిమాండ్ చేసింది. దీనిపై మేం చర్చిస్తున్నాం. దురదృష్టవశాత్తూ వైసీపీ, ఇతర పార్టీలు తప్పుడు ప్రచారంతో రాష్ట్ర రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేసుకక్తున్నాయి. ఏపీకి కేంద్రం ఏమీ చేయలేదని వైసీపీ దుష్ప్రచారం చేస్తోంది. రాజకీయ ఒత్తిడి కారణంగా చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. లేదంటే ఆయన ఎప్పుడూ బీజేపీతోనే' అని చెప్పారు. 14వ ఆర్థిక సంఘం నివేదిక తర్వాత ప్రస్తుతం ఏ రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేదని.. అయినా రూ.14,500 కోట్ల మేర ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చామని.. అదనంగా రూ.5 వేల కోట్లు ఇచ్చామని తెలిపారు.

అశోక్, సుజనా రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

నివాసానికి వెళ్లారు. తమ రాజీనామా పత్రాలను సమర్పించి.. దాదాపు 20 నిమిషాలు ఆయనతో మాట్లాడారు. రాజీనామాకు కారణాలను వివరించారు. కేంద్ర మంత్రిగా దేశ ప్రజలకు సేవ చేసేందుకు తమకు అవకాశం ఇచ్చినందుకు ప్రధాని మోదీకి పౌరవిమానయాన మంత్రి అయిన అశోక్, శాస్త్ర సాంకేతిక సహాయ మంత్రి సుజనా చౌదరి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల భావోద్వేగాలను గౌరవించి, తమ పార్టీ అధ్యక్షుడు తీసుకున్న నిర్ణయం మేరకు రాజీనామా చేస్తున్నానని సుజనా తన రాజీనామా పత్రంలో పేర్కొన్నారు. 'గత 3 ఏళ్ల నాలుగు మాసాల పాటు పరిపాలనలో రాజకీయంగా, వ్యక్తిగతంగా మీరు మద్దతిచ్చారు. మీ నాయకత్వంలో పనిచేయడం ఉత్సాహాన్నిచ్చింది' తెలిపారు. రాజీనామాను రాష్ట్రపతికి పంపించి ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రివర్గంలో ఉన్నన్ని రోజులు తనకు సహకారం అందించినందుకు అశోక్ కూడా ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సుజనా నివాసంలో ఇద్దరూ విలేకరులతో మాట్లాడారు. 'మమల్ని గౌరవంగా స్వాగతించి మేమిచ్చిన పత్రాలను ప్రధాని నిశితంగా పరిశీలించారు. జరిగిన ఆలస్యమేదో జరిగిపోయిందని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అండగా ఉంటామని, ఆ దిశగా పనిచేస్తామని, రాష్ట్ర ప్రజలకు సేవ చేస్తుంటామని చెప్పారు. ఇవన్నీ చేశాం కదా.. మిగిలినవి రెండు మూడు రోజులు అటూ ఇటుగా అవుతాయని, రాజీనామాలు చేయడం దురదృష్టకరమని మోదీ అన్నారు' అని సుజనా వెల్లడించారు. 2016లో ప్రకటించిన ప్యాకేజీలో ఒక్కటి కూడా అమలు కాలేదని, అందుకే పరిస్థితి ఇంతవరకు వచ్చిందని చెప్పానన్నారు. 'ముఖ్యమంత్రి చాలా ప్రయత్నం చేశారని, ఏపీకి నష్టం జరగకుండా అన్నీ తీసుకురావాలని ప్రయత్నించారన్న సంగతిని మోదీ దృష్టికి తీసుకెళ్లాను' అని చెప్పారు. ఎన్డీయేలో ఉన్నా లేకున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ బాధ్యత నెరవేర్చాల్సి ఉంటుందని, చట్టంలో ఉన్నవన్నీ రాష్ట్ర ప్రజల హక్కు అని, ఎవరి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ అంశాలు స్వయంగా ప్రధాన మంత్రి పరిష్కరించేవి కావని, వివిధ శాఖలు అమలు చేయాల్సినవని పేర్కొన్నారు. 'మిగతా రాష్ట్రాలతో సమానంగా ఎదగడానికి కేంద్రం మనపై అదనపు దృష్టి సారించాలి. కేంద్రం కొంత చేసింది. మొత్తమే చేయలేదని అనడానికి లేదు. బిల్లులో ఉన్నవి కొన్ని జాప్యమయ్యాయి. చట్టంలో లేనివీ కేంద్రం చేసింది. ఆ విషయంలో వివాదమేమీ లేదు' అని సుజనా స్పష్టం చేశారు. కానీ భావోద్వేగంతో కూడుకున్న ప్రధాన అంశం ప్రత్యేక హోదాను ప్రకటించలేదని, దాని స్థానంలో ప్రత్యేక ప్యాకేజీ అన్నారని, దాన్ని కూడా అమలు చేయలేదని, దాంతో ప్రజల భావోద్వేగం ప్రకారం తాను నడుచుకోవలసి వచ్చిందన్నారు. రాజీనామాలు వద్దని బుజ్జగిస్తూ తమ ఇద్దరికీ బీజేపీ నేతలెవరూ ఫోన్ చేయలేదని స్పష్టం చేశారు. మంత్రివర్గంలో లేకుండా స్వతంత్రంగా ఉంటే హామీల సాధనకు కృషి చేయడానికి స్వేచ్ఛ ఉంటుందని స్పష్టం చేశారు. 'ఒక జాతీయ పార్టీ ద్రోహం చేసింది. మరో జాతీయ పార్టీ మోసం చేసింది. ఏ పార్టీ ఏదో దేశం అర్థం చేసుకోవాలి' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన నిధులకు రాష్ట్ర ప్రభుత్వం లెక్కలు చెప్పడం లేదని కేంద్ర ఆర్థిక శాఖ వర్గాలు అంటున్నాయని ఆయన దృష్టికి తీసుకురాగా.. 'గవర్నమెంట్ ఫైనాన్షియల్ రెగ్యులేషన్ ప్రకారం నిధుల వినియోగ ధ్రువీకరణ పత్రాలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఇచ్చేసింది. దీనిపై మీడియా అంటే ఎందుకు చెప్పాలి? సంబంధిత శాఖ కార్యదర్శి ముందుకొచ్చి అంటే చర్చకు సిద్ధం' అని సుజనా ప్రకటించారు.



ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న అశోక్, సుజనా

'రాష్ట్ర ప్రజలు చాలా త్యాగాలు చేశారు. ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇప్పుడు వాటిని ఎలా నెరవేరుస్తారన్నది ప్రశ్న. మొదటి నుంచి దాని గురించే విజ్ఞప్తి చేస్తున్నాం. రాష్ట్రం అంటే రాజ్యాంగపరంగా భారత దేశ పరిధిలోది. మధ్యయుగాల్లో మాదిరిగా యుద్ధాలు జరగవు'
– అశోక్ గజపతి రాజు

'భారత దేశంలో ఏపీ భూభాగమే కదా! రాష్ట్ర విభజన చట్టంలో ఉన్న హామీలు మా హక్కు.. వాటిని సాధిస్తాం. ప్రభుత్వంలో ఉండాల్సిన అవసరం లేదు'
– సుజనా చౌదరీ

ప్రధానిని మర్యాదపూర్వకంగా కలిశాం..

అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ.. రాజీనామా చేయాలని తమ పార్టీ ఆదేశించిన నేపథ్యంలో వైదొలిగామన్నారు. ఇంత కాలం కలిసి పనిచేసినందున మర్యాదపూర్వకంగా ప్రధానిని కలిశామని చెప్పారు. పని చేయడానికి ప్రధాని మంచి బృందాన్ని ఇచ్చారని, తనకు అప్పగించిన పౌరవిమానయాన శాఖ ప్రపంచంలో నంబర్ వన్‌గా ఎదిగిందని చెప్పారు. ఎన్డీయేలోనే కొనసాగుతామని చంద్రబాబు ప్రకటించిన విషయం గుర్తుచేశారు. జాతీయ పార్టీల వల్ల సమస్యలు తలెత్తాయన్నారు. విభజన సమయంలో ఆ పార్టీలు కొన్ని హామీలు ఇచ్చాయని.. వాటిని అమలు చేయాలని రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరూ కోరుతున్నారని తెలిపారు. ఇప్పుడు వాటిని వివిధ రకాలుగా చూస్తున్నారని చెప్పారు. ప్రధానికి రాష్ట్ర సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉందని, పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ మద్దతు లేకపోతే రాష్ట్ర విభజన జరిగేదే కాదని అభిప్రాయపడ్డారు. ఇప్పుడు గడియారాన్ని వెనక్కి తిప్పాలని తాను అనడం లేదని, ఇచ్చిన హామీలను అమలు చేయాలనే విజ్ఞప్తి చేస్తున్నామని స్పష్టం చేశారు. సభలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నప్పుడు రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదించకూడదని.. కానీ విభజన చట్టాన్ని మాత్రం ఆమోదించారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉదయమే చేద్దామనుకున్నా..

నిజానికి ఉదయమే ప్రధానిని కలిసి రాజీనామాలు సమర్పించాలని అశోక్, సుజనా భావించారు. ఉదయం 11 గంటలకు పార్లమెంటులోని టీడీపీ కార్యాయలంలో కూర్చుని.. ప్రధాని కార్యాలయానికి ఫోన్ చేసి అపాయింట్‌మెంట్ అడిగారు. ఆ సమయంలో ప్రధాని కూడా పార్లమెంటులోని తన కార్యాలయంలో ఉన్నారు. మరికొద్ది సేపట్లో ఆయన రాజస్థాన్ పర్యటనకు వెళ్తున్నారని, సాయంత్రం 4 గంటల తర్వాత ఢిల్లీ వస్తారని పీఎంవో అధికారులు సమాచారమిచ్చారు. సాయంత్రం ఆయన వచ్చాక 6 గంటలకు అపాయింట్‌మెంట్‌ను ఖరారు చేస్తున్నట్లు తెలిపారు. దాంతో మోదీని ఆ సమయంలో కలిసి రాజీనామాలు ఇచ్చేశారు.



పార్లమెంట్ ఆవరణలో నినాదాలు చేస్తున్న ఏపీ టీడీపీ ఎంపీలు

'మలి' అడుగు ఏమిటి?

- కేంద్రానికి ఇంకా అవకాశం ఇవ్వాలనే యోచన
- అప్పటికీ కుదరకపోతే ఎన్డీయేకూ గుడ్‌బై
- ఆ తర్వాత జాతీయ స్థాయిలో తటస్థ వైఖరి
- రాష్ట్రానికి మేలు చేసే వారికే మద్దతు
- ఆచితూచి టీడీపీ భవిష్యత్ నిర్ణయాలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

కేంద్రానికి కటీఫ్ చెప్పేశారు! ఇది 'తొలి అడుగు' అని టీడీపీ అధినేత చంద్రబాబు పేర్కొన్నారు. మరి... రెండో అడుగు ఏమిటి? ఎన్డీయే నుంచి కూడా వైదొలగుతారా? అదే జరిగితే... కేంద్రంలో టీడీపీ పాత్ర ఎలా ఉంటుంది? ఇలా అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే... ఎన్డీయే కూటమి నుంచి బయటకు రావడానికి మరికొంత సమయం తీసుకోవాలని టీడీపీ భావిస్తున్నట్లు తెలిసింది. రాష్ట్రానికి రావాల్సిన సాయం అందివ్వడానికి కేంద్రానికి మరి కొంత సమయం ఇవ్వాలని, అప్పటికీ ఫలితం లేకపోతే అప్పుడు ఎన్డీయే కూటమి నుంచి బయటకు రావాలని ఆ పార్టీ అధిష్ఠానం యోచిస్తున్నట్లు సమాచారం. "మాకేమీ ఎన్డీయే, బీజేపీలపై వ్యతిరేకత, ద్వేషం లేవు. రాష్ట్రానికి ఇచ్చిన హామీలు నెరవేర్చకపోడంపైనే విభేదాలు నెలకొన్నాయి. కేంద్రం వైఖరిపై మా అసమ్మతిని వ్యక్తం చేయడానికి మొదటి అడుగుగా కేంద్ర మంత్రివర్గం నుంచి బయటకు వచ్చేశాం. ఎన్డీయే కూటమిలో కొనసాగడం ద్వారా కేంద్రానికి మరో అవకాశం ఇవ్వాలనుకొంటున్నాం. వారి నుంచి సానుకూల ప్రతిస్పందన వచ్చి కొన్ని సమస్యలు పరిష్కరిస్తే మంచిదే. దాని కోసం కొంతకాలం వేచి చూస్తాం. ఫలితం లేకపోతే మా నిర్ణయం మేం తీసుకొంటాం" అని ఆ పార్టీ ముఖ్యుడు ఒకరు తెలిపారు. మోదీ ఫోన్ చేసినప్పుడు కూడా చంద్రబాబు ఇదే వైఖరి ప్రదర్శించారని గుర్తు చేశారు. ఎన్డీయే నుంచి కూడా వెంటనే బయటికి రావాలన్న కొందరి డిమాండ్ల వెనుక రాజకీయ లక్ష్యాలున్నాయని టీడీపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. "బీజేపీ నుంచి మేం దూరం జరగాలని కోరుకొనేవారు ఇటువంటి డిమాండ్లు పెడుతున్నారు. ఒక అడుగు వేసి కేంద్రంపై ఒత్తిడి పెంచుతున్నాం. దాని ఫలితం చూసి తదుపరి అడుగు వేస్తాం" అని ఒక మంత్రి చెప్పారు. కేంద్రం వైఖరిపై టీడీపీ నేతలకు పెద్దగా ఆశలు లేకపోయినా సహనం కోల్పోరాదన్న అభిప్రాయంతో ఉన్నారు. బీజేపీ జాతీయ నాయకత్వం రాజకీయ నిర్ణయం తీసుకొంటే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని, అప్పుడు రాష్ట్రం లాభపడుతుందని వివరిస్తున్నారు.

అప్పుడు తటస్థమే...

ఎన్డీయేకు కూడా దూరం జరిగే పక్షంలో భవిష్యత్తులో జాతీయ స్థాయిలో తటస్థ పాత్ర దిశగా తెలుగుదేశం అడుగులు వేసే సూచనలు కనిపిస్తున్నాయి. ఏ కూటమిలోనూ లేకుండా రాష్ట్రానికి ఎవరు సాయం చేయడానికి ముందుకు వస్తే వారికి ఎన్నికల తర్వాత మద్దతు ఇవ్వాలన్నది ఆ పార్టీ యోచన. కేంద్రంలో వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీకి సొంతంగా మెజారిటీ వచ్చే అవకాశం కనిపించడం లేదని, ఈ పరిస్థితుల్లో వీలైనన్ని ఎక్కువ సీట్లు గెలుచుకుంటే రాష్ట్రానికి రావాల్సినవి రాబట్టుకోవచ్చునని ఆ పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మూడో ఫ్రంట్ వంటి నినాదాలు వినిపిస్తున్నా టీడీపీ ప్రస్తుతం వాటిపట్ల అంత ఆసక్తిగా లేదు. ఒక ప్రాంతీయ పార్టీ అధినేత గురువారం ఆయనతో మాట్లాడాలని ప్రయత్నించినా చంద్రబాబు స్పందించలేదు. 'మూడో ఫ్రంట్ అనేదానిలో అనేక పరస్పర విరుద్ధ వ్యవహారాలు ఉన్నాయి. బెంగాల్‌లో మమత, వామపక్ష పార్టీలు పరస్పరం పోటీ పడుతున్నాయి. అవి రెండూ జాతీయ స్థాయిలో ఒకే ఫ్రంట్‌లో ఉండటం ఎక్కువ రోజులు సాధ్యం కాదు. ఆ రెండూ లేకుండా మూడో ఫ్రంట్ సాధ్యం కాదు. ఇటువంటి వైరుధ్యాలు చాలా ఉన్నాయి. అందుకే ఆ విషయంలో తొందరపడటం లేదు' అని చంద్రబాబుకు సన్నిహితంగా ఉండే నేత ఒకరు తెలిపారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నందువల్ల భవిష్యత్తుపై ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలని టీడీపీ భావిస్తోంది.

పార్లమెంటులో టీడీపీ దూకుడు

- పార్టీ టీషర్టులు ధరించి వెల్‌లోకి..
- ప్రత్యేక హోదా సాధనే లక్ష్యంగా నిరసన
- ఆరు ప్రధాన డిమాండ్లతో నినాదాలు
- నాలుగోరోజూ స్తంభించిన ఉభయసభలు

న్యూఢిల్లీ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సాక్షిగా అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఇచ్చిన ప్రత్యేక హోదా, పన్నుల మినహాయింపు హామీలు అమలు చేయాల్సిందేనంటూ టీడీపీ ఎంపీలు ఆందోళన తీవ్రం చేశారు. వరుసగా నాలుగోరోజైన గురువారం కూడా సభాకార్యకలాపాలు జరగనివ్వకుండా ఉభయసభలను స్తంభింపజేశారు. చట్ట ప్రకారం తమ రాష్ట్రానికి దక్కాల్సిన అన్ని ప్రయోజనాలను సాధించే వరకూ పోరాటం తప్పదంటూ టీడీపీ ఎంపీలు నిరసనగళం విప్పారు. అయితే, గురువారం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే రోజూలా టీడీపీ ఎంపీలు స్పీకర్ పోడియంలోకి వెళ్లి నిరసనకు దిగలేదు. మహిళా దినోత్సవం నేపథ్యంలో స్పీకర్ వచ్చి మహిళలను ఉద్దేశించి సందేశం ఇచ్చే దాకా ఎలాంటి నినాదాలూ ఇవ్వకుండా ఎంపీలు సంయమనం పాటించారు. అనంతరం ఎంపీలు తోటనర్సింహం, రామ్మోహన్‌నాయుడు, గల్లాజయదేవ్, రవీంద్రబాబు, జేసీ దివాకర్‌రెడ్డి, అవంతి శ్రీనివాస్, కొనకళ్ల నారాయణ, శివప్రసాద్, మురళీమోహన్, కేశినేని నాని, మాల్యాద్రి శ్రీరాం, నిమ్మల కిష్టప్ప ప్లకార్డులు ప్రదర్శిస్తూ... 'ఆంధ్రప్రదేశ్‌ని ఆదుకోండి.. ఇష్టం లేని విభజనతో రాష్ట్రం నష్టపోయింది... విభజన హామీలు వెంటనే అమలు చేయాలి... ప్రత్యేక హోదా ఇవ్వాలి' అంటూ గట్టిగా నినాదాలిచ్చారు. అదే సమయంలో ప్రత్యేకహోదా డిమాండ్‌తో వైసీపీ ఎంపీలు, కావేరి నీటి నిర్వహణ బోర్డు తక్షణమే ఏర్పాటు చేయాలంటూ అన్నాడీఎంకే ఎంపీలు, నీరవ్ మోదీ అంశంపై తృణమూల్ ఎంపీలు, కొందరు కాంగ్రెస్ ఎంపీలూ నిరసనకు దిగారు. దీంతో సభ మధ్యాహ్నం 12 గంటల వరకూ వాయిదా పడింది. తిరిగి సభ ప్రారంభమైనా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో స్పీకర్ సభను వాయిదా వేశారు. పెద్దల సభలోనూ ఎంపీలు సీఎం రమేశ్, తోట సీతారామలక్ష్మి, టీజీ వెంకటేశ్ చైర్మన్ పోడియం వైపు దూసుకెళ్లారు. ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు.

డిమాండ్లతో టీషర్టులు

టీడీపీ ఎంపీలు లోక్‌సభలో వినూత్న పంథాలో ఆందోళన చేశారు. 'విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు అమలు చేయండి, రైల్వే జోన్, ప్రత్యేక హోదా, పారిశ్రామిక ప్రోత్సాహకాలు, రెవెన్యూ లోటు భర్తీ, కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు' అనే డిమాండ్లతో ప్రత్యేకంగా ప్రింట్ చేసిన టీషర్టులను ధరించారు. మొత్తం పసుపు రంగులో ఉన్న వీటిపై ముందు, వెనుకా తమ డిమాండ్లను రాయడంతోపాటు ముందు వైపు పార్టీ చిహ్నం ముద్రించి ఉంది. మెడలో పార్టీ కండువాలు సైతం ధరించి రావడంతో మిగిలిన ఎంపీల్లో వీరు ప్రత్యేకంగా కనిపించారు. జేసీ దివాకర్‌రెడ్డి మాత్రం టీషర్ట్ ధరించకుండా మెడలో కట్టుకుని హాజరయ్యారు.



తొడగొట్టి మీసం మెలేసిన జేసీ

టీడీపీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి తన దైన శైలిలో వ్యవహరించారు. గురువారం ఉదయం పార్లమెంటు ఆవరణలో నిరసన తెలియజేస్తున్న వైసీపీ ఎంపీల దగ్గరికి వెళ్లి తొడగొట్టి... మీసం మెలేసి... సవాల్ విసిరారు! "ఏ సుబ్బారెడ్డీ (వైసీపీ ఎంపీ).... బయటికి రా. రాజీనామాలు చేసి రండి... ప్రజల్లోకి వెళ్దాం" అంటూ సవాల్ విసిరారు. దానికి వైసీపీ ఎంపీలు స్పందిస్తూ.. 'ప్రత్యేకహోదా కోసం మేం పోరాడుతూనే ఉన్నాం' అన్నారు. రెండు నిమిషాలపాటు అక్కడ ఆయన హల్‌చల్ సృష్టించారు. అక్కడే ఉన్న విలేకరులతో "వీరు ఇంతేనయ్యా... ఏం చేయలేరు. ఫొటోలకు ఫోజులివ్వడం వరకే వీళ్ల వ్యవహారం' అన్నారు. మరోవైపు, పార్లమెంటు ఆవరణలో టీడీపీ ఎంపీలు నిరసనలు కొనసాగించారు.

జగన్ వైపు బీజేపీ గాలి?

- ఓ వ్యాపార సంస్థ మధ్యవర్తిత్వం
- ఇక క్లీన్‌చిట్‌లు మొదలవుతాయా?
- 34 కోట్ల ఎఫ్‌డీ జప్తులో క్లీన్‌చిట్

న్యూఢిల్లీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): 'జగన్‌తో మాకు ఎలాంటి రహస్య ఒప్పందం లేదు. వచ్చే ఎన్నికల్లో జగన్‌తో చేతులు కలపాలన్న ఉద్దేశం కూడా మాకు లేదు. మీరు అనవసరంగా అపోహ పడుతున్నారు' అని ఇటీవల బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా తనను కలిసిన టీడీపీ నేతలకు చెప్పినప్పటికీ... పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా కనపడుతోందని రాజకీయ, అధికార వర్గాలు భావిస్తున్నాయి. జగన్, బీజేపీ పెద్దల మధ్య సయోధ్య కుదిర్చేందుకు ఒక బడా వ్యాపార సంస్థతోపాటు కొన్ని రాజకీయ శక్తులు కూడా రంగ ప్రవేశం చేశాయనే ప్రచారం ఢిల్లీలో జరుగుతోంది. జగన్ కంపెనీల ఆడిటర్, ఎంపీ విజయ సాయి రెడ్డి కూడా ఢిల్లీలో అమిత్ షా, మోదీ కటాక్ష వీక్షణాలు జగన్‌పై ప్రసరించేలా చేశారని... కొన్ని రహస్య సమావేశాలు కూడా జరిగాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. జగన్‌కు ఈడీ కేసుల్లో క్లీన్ చిట్ ఇవ్వడం, కేసుల విషయంలో సీబీఐ తదుపరి చర్యలు తీసుకోకపోవడం, ఆయన రాజకీయంగా బలోపేతం కావడానికి పరోక్ష సహకారం అందించడం వంటి ప్రయోజనాలు కేంద్రం ద్వారా లభించవచ్చునని చెబుతున్నారు. తాజాగా జగతి పబ్లికేషన్‌కు చెందిన రూ.34.6 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్‌ల జప్తు కేసులో ఈడీ అప్పిలేట్ అథారిటీ క్లీన్ చిట్ ఇచ్చింది. మాధవ్ రామచంద్రన్, ఏకే దండమూడి, టీఆర్ కన్నన్‌ల నుంచి పెట్టుబడులు స్వీకరించినందుకు ఇదే కేసులో సీబీఐ ఐపీసీలోని వివిధ సెక్షన్ల కింద, మనీ లాండరింగ్, అవినీతి నిరోధక చట్టాల కింద చార్జిషీటు దాఖలు చేసింది. అయితే... ఈ విషయంలో క్విడ్ ప్రోకో జరగలేదని తాజాగా ఈడీ అప్పిలేట్ అథారిటీ క్లీన్ చిట్ ఇవ్వడాన్ని ప్రత్యేకంగా గమనిస్తున్నారు.

నిధులకు అదే 'కేంద్రం'

- రాష్ట్రానికి కేటాయింపులపై స్పష్టత ఇవ్వని కేంద్రం

అమరావతి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్రం వద్ద డబ్బులున్నాయ్! అందులో రాష్ట్రానికి రావాల్సినవీ ఉన్నాయ్! కానీ... ఎంతిస్తామో కేంద్ర బడ్జెట్‌లో చూపలేదు! ఇప్పటిదాకా ఆ 'మూటల లెక్క' విప్పనే లేదు. దీంతో రాష్ట్ర బడ్జెట్‌లో కేంద్ర సహాయంపై భారీ 'అంచనాలు' చూపించారు. కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో ఏకంగా 50,635 కోట్లు వస్తాయని అంచనా వేశారు. పోలవరం నిధులు, రాజధాని నిర్మాణానికి సహాయం, ప్రత్యేక ప్యాకేజీ కింద రావాల్సినవీ, నిబంధనల ప్రకారం అన్ని రాష్ట్రాలకు ఇస్తున్నట్లుగా ఇచ్చేవీ... ఇలా అన్నీ కలిపి గ్రాంట్లపై భారీగా ఆశలు పెట్టుకున్నారు. అయితే... ఇది వాస్తవాలకు దూరంగా ఉందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి చివరి నాటి వరకు రాష్ట్రానికి రూ.18,200 కోట్లు మాత్రమే గ్రాంట్ల రూపంలో వచ్చాయి. వచ్చే ఏడాది మరో వెయ్యి లేదా రెండు వేల కోట్లు పెరిగే అవకాశం ఉంది. కానీ, ఏకంగా ఆ గ్రాంట్ల మొత్తాన్ని రూ.50,695 కోట్లకు పెంచేయడం గమనార్హం. ఆయా రంగాలకు కేంద్ర బడ్జెట్‌లో జరిగిన కేటాయింపులకు అనుగుణంగానే తమ అంచనాలున్నాయని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో రైతు సంక్షేమానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థల అభివృద్ధికి పెద్దపీట వేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రం కూడా ఆయా పథకాలకు భారీగా బడ్జెట్ పెంచేసింది. ఉదాహరణకు... ఎరువుల నిల్వకు సంబంధించిన సదుపాయాల కల్పన కోసం గత ఏడాది రాష్ట్రం రూ.5 కోట్లు మాత్రమే కేటాయించింది. కానీ, ఈసారి ఆ మొత్తాన్ని రూ.40 కోట్లకు పెంచింది. దీనికి కారణం కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి భారీగా కేటాయింపులు పెంచడమే. అలాగే... వ్యవసాయ, అనుబంధ రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.12355.22 కోట్లు కేటాయించింది. గత ఏడాది కంటే ఇది 36 శాతం అధికం. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి ఇచ్చిన ప్రాధాన్యమే ఇక్కడా ప్రతిఫలించిందని చెబుతున్నారు. ఇక... చేనేత, మహిళా సంక్షేమం, దివ్యాంగుల సంక్షేమం, గృహ నిర్మాణం... ఇలా అన్ని రంగాలదీ ఇదే పరిస్థితి.

అతి నమ్మకమా...

ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నప్పుడే కేంద్రం నుంచి ఏపీకి ప్రత్యేక సహాయం అందలేదు. అలాంటిది ఇప్పుడు కేంద్రంపై ఆశలు పెట్టుకోవచ్చా... అనే సందేహాలు తలెత్తుతున్నాయి. 'మేం ఇచ్చిన నిధులకు లెక్కలు చెప్పడం లేదు' అని కేంద్రం చెబుతోంది. నిజానికి... నిధుల వినియోగ ధ్రువపత్రాలు సమర్పించడంలో ఏపీ దేశంలోనే మూడో స్థానంలో ఉంది. అయినా... నిధుల విషయంలో రాష్ట్రంపై కరుణ చూపించలేదు. మరి ఇప్పుడు పరిస్థితి ఎలా ఉంటుందనే ఆందోళన కనిపిస్తోంది. ఈ అంచనాలు తలకిందులైతే... ఆయా పథకాల నిర్వహణ రాష్ట్రానికి తలకుమించిన భారమవుతుందన్న విశ్లేషణలు వస్తున్నాయి. పైగా రాష్ట్రం అప్పులు చేయాలన్నా దానికీ కేంద్రం అనుమతే కావాలి. ఇప్పటికే రాష్ట్రం తన ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటి అప్పులు చేస్తోంది. ఇప్పటిదాకా కేంద్రం దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు. ఇకపై కొర్రీలు పెట్టే అవకాశాన్ని తోసిపుచ్చలేం. 'కేంద్రం రాష్ట్రాలకు బడ్జెటరీ మద్దతు ఇస్తుంది. మనం బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తేనే కేంద్రాన్ని కూడా గట్టిగా అడగగలం' అని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల ముందు 1.91 లక్షల కోట్ల భారీ బడ్జెట్ ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం తనకున్న ఆర్థిక వనరుల సామర్థ్యాలను కూడా భారీగా పెంచి చూపింది. ఈ ఆర్థిక వనరుల్లో సింహభాగం రాష్ట్ర సొంత ఆదాయానిదే. ఈసారి ఆదాయార్జన శాఖల నుంచి రూ.65,535 కోట్లు వస్తాయని అంచనా వేసింది.

నెలాఖరు నాటికి 75 విమానాల ఆర్డర్ : జెట్ ఎయిర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ప్రైవేట్ విమానయాన దిగ్గజం జెట్ ఎయిర్‌వేస్.. మరో 75 చిన్న విమానాలు కొనుగోలు చేసేందుకు రెడీ అవుతోంది. ఈ నెలాఖరునాటికి ఈ విమానాలు కొనుగోలు చేయాలని చూస్తున్నట్లు జెట్ ఎయిర్‌వేస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వినయ్ దూబే వెల్లడించారు. విమానయాన తయారీదారులతో త్వరలోనే ఒప్పందం కుదుర్చుకోవచ్చని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. నెలాఖరుకల్లా డీల్ ఖరారయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. దేశీ మార్కెట్లో కార్యకలాపాలను విస్తరించేందుకు మరో 75 విమానాలు కొనుగోలు చేయాలని గత ఏడాది అక్టోబరులో జెట్ ఎయిర్‌వేస్ ఛైర్మన్ నరేష్ గోయల్ నిర్ణయించారని ఆయన తెలిపారు. కాగా జెట్ ఎయిర్ ఇప్పటికే 75 బోయింగ్ 737 మాక్స్ విమానాల కొనుగోలుకు ఆర్డర్ చేసింది. ఈ ఏడాది జూలై-ఆగస్టులో ఈ విమానాలు డెలివరీ కావచ్చని భావిస్తోంది.

ఏవియేషన్ హబ్ తెలంగాణ

పెట్టుబడులకు భారీ అవకాశాలు..అంతర్జాతీయ సంస్థలకు మంత్రి కెటిఆర్ పిలుపు

బేగంపేటలో ఏవియేషన్ విశ్వవిద్యాలయ కేంద్రం ఏర్పాటు చేయాలి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఏవియేషన్, ఏరోస్పేస్ విభాగాల్లో తెలంగాణ శరవేగంతో దూసుకుపోతున్నదని, ఈ రంగాల్లో ఉజ్వల భవిష్యత్తు, మంచి అవకాశాలు రాష్ట్రంలో ఉన్నాయని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కె తారక రామారావు అన్నారు. బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో వింగ్స్ ఇండియా 2018ను ప్రారంభించిన అనంతరం కెటిఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర పారిశ్రామిక విధానంలో ఏరోస్పేస్, రక్షణ రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం కల్పించామని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో (పిపిపి) దేశంలో తొలి విమానాశ్రయం జిఎంఆర్ నిర్వహణలో హైదరాబాద్‌లోనే ప్రారంభమైందని ఆయన అన్నారు. అలాగే ఉడాన్ పథకం కింద చిన్న విమానాల రాకపోకలకు కూడా జిఎంఆర్ విమానాశ్రయం ఎంతో అనుకూలంగా ఉన్నదని చెప్పారు. విమానయాన రంగం అభివృద్ధికి మౌలిక వసతులు ప్రధానంగా స్థలాల కొరత పెద్ద అవరోధమన్న అభిప్రాయం పలువురు ప్రకటిస్తున్నారని, తెలంగాణలో అలాంటి వసతుల కల్పనకు స్థలాలు పుష్కలంగా ఉన్నందు వల్ల ఇక్కడ ఎంఆర్‌ఓ కేంద్రాలు, సిబ్బంది శిక్షణ కేంద్రాలు, టెక్నాలజీ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేసే విషయం పరిశీలించాలని ఆయన ప్రముఖ సంస్థలకు పిలుపు ఇచ్చారు. హైదరాబాద్ కేంద్రంగా అంతర్జాతీయ సర్వీసులు ప్రారంభించేందుకు ముందుకు రావాలని అంతర్జాతీయ విమానయాన సంస్థలను ఆయన కోరారు.

ఏరోస్పేస్ రంగానికి అత్యంత నిపుణులైన మానవ వనరులు అవసరమని, ఈ రంగంలో విదేశీ సంస్థలతో భాగస్వామ్యాలకు గల అవకాశాలు తమ ప్రభుత్వం పరిశీలిస్తున్నదని కెటిఆర్ చెప్పారు. తెలంగాణలో ఏవియేషన్ విశ్వవిద్యాలయం అనుబంధ కేంద్రం ఒకటి ఏర్పాటు చేయాలని సభలో ఉన్న పౌరవిమానయాన శాఖ కార్యదర్శి చౌబేకు ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం వృధాగా ఉన్న బేగంపేట ఎయిర్‌పోర్టులో దాన్ని ఏర్పాటు చేసినట్టయితే అది పూర్తి స్థాయిలో వినియోగంలోకి వస్తుందని ఆయన సూచించారు. ఏవియేషన్ రంగంలో నిపుణులకు శిక్షణ ఇచ్చేందుకు ఫ్రెంచ్ ఏరోస్పేస్ అకాడమీ, బ్రిటన్‌కు చెందిన క్రాన్‌ఫీల్డ్ విశ్వవిద్యాలయం, అమెరికాకు చెందిన ఎంబ్రీ రిడిల్ విశ్వవిద్యాలయం వంటి సంస్థలతో ఇప్పటికే భాగస్వామ్యాలు కుదుర్చుకున్నామని ఆయన చెప్పారు. దేశంలోనే అత్యుత్తమమైన ఫ్లయింగ్ స్కూళ్లుగా ఉన్న తెలంగాణ రాష్ట్ర ఏవియేషన్ అకాడమీ, రాజీవ్‌గాంధీ ఏవియేషన్ అకాడమీ, జిఎంఆర్ ఏవియేషన్ అకాడమీ ఇక్కడ పని చేస్తున్నాయని ఆయన తెలిపారు.

ఉడాన్‌లో కీలక భాగస్వామి

చిన్న నగరాలకు విమానయాన సదుపాయం కల్పించేందుకు కేంద్రం ప్రకటించిన ఉడాన్ పథకంలో తెలంగాణ కీలక భాగస్వామిగా ఉన్నదని కెటిఆర్ చెప్పారు. ఇందులో భాగంగా కొత్తగూడెంలో కొత్త విమానాశ్రయం ఏర్పాటు చేస్తున్నామని, వరంగల్ విమానాశ్రయాన్ని కూడా అభివృద్ధి చేస్తున్నాయని తెలిపారు.

బేగంపేట, వరంగల్, హకీంపేట, దుండిగల్, నాదర్‌గుల్, రామగుండం వంటి చిన్న విమానాశ్రయాలను అభివృద్ధి చేసే యోచన ఉన్నట్టు ఆయన తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న ఫార్మాసిటీకి మద్దతుగా ఖమ్మం జిల్లాలోని జక్రానపల్లిలో కూడా ఒక విమానాశ్రయాన్ని ప్రతిపాదించినట్టు ఆయన చెప్పారు. రాష్ట్రంలో హెలీటూరిజం ఇప్పటికే ప్రారంభించామని, హుస్సేన్‌సాగర్ కేంద్రంగా సీ ప్లేన్ సర్వీసులు ప్రారంభించే అవకాశాలు పరిశీలిస్తున్నామని ఆయన అన్నారు.


విమానయాన రంగంలో అవకాశాలు, ఫైనాన్సింగ్‌పై శ్వేతపత్రం విడుదల చేస్తున్న కెటిఆర్, చౌబే, విమానయాన రంగం ప్రతినిధులు

బిజినెస్ విమానాలకు భారత్ అనుకూలం కాదు

దసో ఏవియేషన్ ప్రతినిధి వాదిమ్ ఫ్లెడ్జర్



భారత్ బిజినెస్ విమానాలకు అనుకూలంకాదని ఫ్రాన్స్‌కు చెందిన దసో ఏవియేషన్ ప్రతినిధి వాదిమ్ ఫ్లెడ్జర్ వ్యాఖ్యానించారు. దేశంలో బిజినెస్ విమానయానం వృద్ధికి అవకాశాలు అపారంగానే ఉన్నప్పటికీ మౌలిక వసతుల లోపం ప్రధాన అవరోధంగా ఉందన్నారు. వాదిమ్ 'ఆంధ్రజ్యోతి బిజినెస్' ప్రతినిధితో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. విమానాశ్రయాల్లో ఇలాంటి విమానాలకు పార్కింగ్ స్థలాలు కేటాయించడం, విమానాలు రాకపోకలు సాగించేందుకు అవసరమైన స్లాట్‌లు కేటాయించడం వంటివి జరిగినప్పుడే ఈ రంగం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కనీసం ప్రాంతీయ కనెక్టివిటీ పెంచే చర్యల్లో భాగంగా చేపట్టిన ఉడాన్ వంటి పథకాల్లో అయినా బిజినెస్ ఎయిర్‌లైన్స్‌కి స్లాట్‌ల కేటాయింపు వంటివి జరగాలని, ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు.

ఫాల్కన్ 8 ప్రత్యేకతలెన్నో...

ఫాల్కన్ 8 విమానం ఎన్నో ప్రత్యేకతలు కలిగి ఉన్నదని, ఇది చార్టర్డ్ విమానాల ఆపరేటర్లు, వ్యాపారవేత్తలకు అత్యంత సౌకర్యవంతమైనదని ఫ్లెడ్జర్ చెప్పారు. సాధారణంగా ఇలాంటి విమానాలు దిగేందుకు పెద్ద రన్‌వేలు అవసరమని, కానీ ఫాల్కన్ 8 నిట్టనిలువుగా చిన్న రన్‌వే మీద కూడా దిగుతుందని ఆయన తెలిపారు. అలాగే గగనతలంలో కల్లోలిత వాతావరణం ఏర్పడిన సమయాల్లో ఈ విమానం కుదుపులేవీ లేకుండా స్థిరంగా నడుస్తుంది గనుక ప్రయాణించే వారు ఎలాంటి భయభ్రాంతులకు లోను కాకుండా హాయిగా ప్రయాణం చేయవచ్చని చెప్పారు. ఈ విమానం ధర 38 మిలియన్ డాలర్లు (రూ.2470 కోట్లు).

అంతమాటన్నారా...?

భారత్ బిజినెస్ విమానాలకు అనుకూలమైన దేశం కాదని ఫ్లెడ్జర్ చేసిన వ్యాఖ్యను పౌరవిమానయాన శాఖ కార్యదర్శి ఆర్ఎన్ చౌబే వద్ద ప్రస్తావించగా ఫ్లెడ్జర్ అలాంటి వ్యాఖ్య ఎందుకు చేశారో తనకు అర్థం కావడంలేదని విస్మయం ప్రకటించారు. ప్రభుత్వం ప్రకటించిన మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం కింద తాము విదేశీ విమానయాన సంస్థలు దేశంలో తయారీ కార్యకలాపాలు చేపట్టేందుకు ఎంతో ప్రోత్సాహం ఇస్తున్నట్టు చెప్పారు. ఇలాంటి విమానాలకు అవసరమైన మౌలిక వసతులు పెంచడంపై కూడా తాము దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. ఎవరికైనా ఎలాంటి ఫిర్యాదులున్నా తమకు తెలియచేసినట్టయితే వాటిని పరిశీలించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు.



సందడి కరువు

- **డజనుకు మించని విమానాలు**
- **కేంద్ర మంత్రులు గైర్హాజరు..ఫాల్కన్ 8 ఒక్కటే ఆకర్షణ**
- **విన్యాసాలు, గగన విహారాలు లేవు**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వింగ్స్ ఇండియా 2018 ఎయిర్‌షో అత్యంత నిరుత్సాహపూరితంగా కనిపించింది. ఆకస్మికంగా నెలకొన్న రాజకీయ పరిణామాల కారణంగా పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్‌గజపతి రాజు, సహాయ మంత్రి జయంత్ సిన్హా హాజరుకాలేకపోయారు. కనీసం తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు కూడా రాకపోవడం వైమానిక రంగాల ప్రతినిధులకు నిరాశ కలిగించింది. 'వింగ్స్ ఇండియా 2018' పేరుతో గొప్పగా నామకరణం చేసిన ఈ ప్రదర్శన పట్ల విమానయాన సంస్థల నుంచి గాని, విమాన తయారీ సంస్థల నుంచి గాని స్పందన, ఉత్సాహం కనిపించలేదు. గతంలో కనీసం 40 నుంచి 50 విమానాలు వచ్చేవి. ఈసారి కేవలం 13 విమానాలే వచ్చాయి. వాటిలో ఐదు రెండేసి సీట్లున్న చిన్న విమానాలు, ఒక హెలీకాప్టర్ ఉన్నాయి. గత ఎయిర్‌షోలన్నింటిలోనూ ఖతార్ ఎయిర్‌వేస్, గల్ఫ్ ఎయిర్‌వేస్, ఎమిరేట్స్, బోయింగ్, ఎయిర్‌బస్ వంటి ప్రముఖ అంతర్జాతీయ విమానయాన సంస్థలు, ఎ320, ఎ380, డ్రీమ్‌లైనర్ వంటి విమానాలు వచ్చేవి. ఈ ఏడాది అవేవీ మచ్చుకైనా కనిపించలేదు. చివరికి ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియా కూడా ఒక్క విమానాన్ని ప్రదర్శనకు పెట్టలేదు. వచ్చిన కొద్దిపాటి సంస్థలు కూడా ఒక వ్యాపార తంతుగానే ఎయిర్‌షోను పరిగణించాయి తప్పితే సందర్శకులకు కనువిందు చేసే ప్రయత్నం చేయలేదు. గతంలో వైమానిక విన్యాసాలు (ఏరోబాటిక్స్), కొన్ని వైమానిక సంస్థలు నిర్వహించే గగనతల విహారాలు సందర్శకులను ఆకట్టుకునేవి. ఈసారి అలాంటి ఆకర్షణలు కూడా లేవు.

తొలి కస్టమర్ ఒక భారతీయుడు

ఫ్రాన్స్‌కు చెందిన దసో ఎయిర్‌లైన్స్ తొలిసారిగా భారత్‌లో ప్రదర్శనకు ఉంచిన ఫాల్కన్ 8 విమానం ఒక్కటే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ విమానాన్ని గత నెలలోనే అధికారికంగా మార్కెట్‌లోకి తెచ్చారు. 12 నుంచి 18 సీట్లు, 4 బెడ్లు ఉండే ఈ బిజినెస్ ఎయిర్‌క్రాఫ్ట్ తొలి కస్టమర్లలో ఒక భారతీయుడు కూడా ఉన్నట్టు దసో ఏవియేషన్ ప్రతినిధి వాదిమ్ ఫ్లెడ్జర్ తెలిపారు. ఆయన పేరు వెల్లడించడానికి నిరాకరించారు.





భారత స్టార్టప్స్‌తో ఎయిర్‌బస్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): యూరప్‌కు చెందిన విమానాల తయారీ కంపెనీ బోయింగ్ దాని అనుబంధ సంస్థ నవ్‌బ్లూ రెండు భారత స్టార్టప్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాయి. తమ సొంత, పరిశ్రమ అవసరాలను తీర్చేందుకు దోహదపడే ఇన్నోవేటివ్ సొల్యూషన్స్ కోసం నీవీ, ఇఫ్లైట్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఎయిర్‌బస్ తెలిపింది. ఎయిర్‌బస్ బిజ్‌లాబ్ టెక్నాలజీ యాక్సిలరేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ స్టార్టప్‌లను ఎంపిక చేశామని కంపెనీ పేర్కొంది. ఎంటర్‌ప్రెన్యూరియల్ కమ్యూనిటీతో కలిసి పని చేయడానికి, వారికి వ్యాపార అవకాశాలను కల్పించడానికి కట్టుబడి ఉన్నామనడానికి ఈ ఒప్పందాలే నిదర్శనమని ఎయిర్‌బస్ బిజ్‌లాబ్ హెడ్ బ్రూనో గుటీరెస్ తెలిపారు. నీవీస్ సొల్యూషన్ 'ప్రొక్యూసెన్స్' ద్వారా మాన్యుఫ్యాక్చరింగ్ సప్లయ్ చెయిన్, ప్రొక్యూర్‌మెంట్ కార్యకలాపాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

త్వరలో వరంగల్ ఎయిర్‌పోర్ట్‌పై నిర్ణయం

రాష్ట్రానికి మరిన్ని విమానాశ్రయాలు కావాలి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : తెలంగాణలో మరిన్ని ఎయిర్‌పోర్టులు ఏర్పాటు కానున్నాయి. వరంగల్, కొత్తగూడెం, ఆదిలాబాద్ విమానాశ్రయాలను పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలంగాణ స్టేట్ ఏవియేషన్ అకాడమీ (టిఎస్ఎఎ) సిఇఒ కెప్టెన్ ఎస్ఎన్ రెడ్డి చెప్పారు. కాకతీయ టెక్స్‌టైల్ పార్కుతో వరంగల్ నుంచి విమాన ప్రయాణాలతోపాటు సరుకుల రవాణాకు డిమాండ్ ఏర్పడే అవకాశం ఉంది. దీనిపై చర్చించేందుకు ఈ నెల 12 తర్వాత రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్‌తో సమావేశమవుతున్నట్టు టిఎస్ఎఎ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు పిఆర్ ప్రసాద రావు చెప్పారు. ప్రస్తుతం వరంగల్ విమానాశ్రయంలో 6,000 అడుగుల పొడవైన రెండు రన్‌వేలు ఉన్నాయి. బేగంపేట విమానాశ్రయంలో రద్దీ పెరిగిపోవడంతో వరంగల్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి అక్కడే పైలెట్ల శిక్షణా కేంద్రం ఏర్పాటు చేస్తే బాగుంటుందన్న ఆలోచన ఉన్నట్టు ప్రసాద్ చెప్పారు.

టి-హబ్ స్టార్టప్‌లో బోయింగ్ పెట్టుబడులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఇండస్ట్రియల్ ఐఒటి, ఆటోమేషన్, ఎనలిటిక్స్, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్. ఎఆర్/విఆర్ తదితర రంగాల్లోని స్టార్టప్స్‌లో పెట్టుబడులకు బోయింగ్ సిద్ధమైంది. ఇందులో భాగంగా బోయింగ్ హొరైజన్‌ఎక్స్ ఇండియా ఇన్నోవేషన్ చాలెంజ్‌ను నిర్వహిస్తోంది. ఇందులో ఇప్పటికే 82 స్టార్టప్స్ తమ ఆలోచనలను వెలిబుచ్చాయని, వీటిలో 13 స్టార్టప్స్‌ను ఎంపిక చేసినట్టు బోయింగ్ హొరైజన్‌ఎక్స్ డిస్రప్టివ్ హొరైజన్స్ డైరెక్టర్ ప్రదీప్ ఫెర్నాండేజ్ తెలిపారు. తుది దశలో భాగంగా వీటిలోంచి మూడు స్టార్టప్స్‌ను ఎంపిక చేస్తామని, ఈ స్టార్టప్స్‌కు ప్రత్యేక స్టార్టప్ ప్రోగ్రామ్‌ను మూడు నెలల పాటు నిర్వహిస్తామని చెప్పారు. ఇందుకోసం హైదరాబాద్‌లోని టి-హబ్‌తో జట్టుకట్టామని, యాక్సిలరేటర్ ప్రోగ్రామ్‌లో భాగంగా స్టార్టప్ కంపెనీలకు టి-హబ్ మార్గనిర్దేశం చేస్తుందన్నారు. ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా స్టార్టప్ సంస్థలు తమ ఉత్పత్తులు లేదా టెక్నాలజీకి తుది రూపం ఇవ్వాల్సి ఉంటుందని, ఈ సంస్థల్లో తాము మైనారిటీ వాటాను తీసుకుంటామని తెలిపారు.

విస్తారా విదేశీ విమాన సర్వీసులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టాటా-సింగపూర్ ఎయిర్‌లైన్స్ భాగస్వామ్యంలో ఏర్పాటైన విస్తారా .. అంతర్జాతీయ విమాన సర్వీసులకు సిద్ధమవుతోంది. ఈ సంవత్సరం ద్వితీయార్థం నుంచి (జూలై తర్వాత) తమ అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభమవుతాయని కంపెనీ సిఇఒ లెస్లీ థంగ్ చెప్పారు. ముందుగా మూడు నుంచి ఐదు గంటల ప్రయాణ సమయం ఉండే ఆగ్నేయాసియా దేశాలకే తమ తొలి అంతర్జాతీయ విమాన సర్వీసులు ఉంటాయని 'వింగ్స్ ఇండియా'కు హాజరైన విస్తారా సిఇఒ చెప్పారు. ప్రస్తుతం ఉన్న 19 విమానాలకు తోడు జూన్‌నాటికి మరో మూడు విమానాలు కంపెనీ చేరనున్నాయి.

పెద్ద విమానాలకే డిమాండ్

రోల్స్ రాయిస్ వైస్ ప్రెసిడెంట్ ఆంటోని జఫ్రెంక్



రోల్స్ రాయిస్... విమాన ఇంజిన్ల తయారీకి పెట్టింది పేరు. 'వింగ్స్ ఇండియా' వైమానిక ప్రదర్శనలో ఈ సంస్థ పాల్గొంటోంది. ఈ సందర్భంగా భారత వైమానిక మార్కెట్ స్థితిగతులపై కంపెనీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్స్) ఆంటోని జఫ్రెంక్ 'ఆంధ్రజ్యోతి బిజినెస్'తో సంస్థ కార్యకలాపాల విస్తరణ, మార్కెట్‌పై మాట్లాడారు. ఆ వివరాలు..

ప్రస్తుతం భారత మార్కెట్ ఎలా ఉంది?

భారత్ మాకు అత్యంత కీలక మార్కెట్. ఇక్కడ విమానాల్లో ప్రయాణించే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం ఏటా దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య 15-20 శాతం చొప్పున, అంతర్జాతీయ విమాన ప్రయాణికుల సంఖ్య 10-12 శాతం చొప్పున పెరుగుతున్నారు. ఈ లెక్కన 2025నాటికి ప్రయాణికుల పరంగా అమెరికా, చైనా తర్వాత భారత్ మూడో అతి పెద్ద మార్కెట్ అవుతుంది.

భారత వైమానిక రంగంలో రోల్స్ రాయిస్ పాత్ర?

అనేక పౌర విమానయాన సంస్థలు వైడ్‌బాడీ విమానాల కోసం రోల్స్ రాయిస్ ఇంజిన్లు ఉపయోగిస్తున్నాయి. భారత వైమానిక దళానికి చెందిన కొన్ని యుద్ధ విమానాలకూ మేము ఇంజిన్లు సరఫరా చేస్తున్నాం. బెంగళూరులో మాకు ప్రత్యేకంగా ఒక పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డి) కేంద్రం ఉంది. ఈ కేంద్రంలో దాదాపు 600 మంది ఇంజినీర్లు పని చేస్తున్నారు. వైడ్ బాడీ (పెద్ద) విమానాల మార్కెట్‌పైనే మా దృష్టంతా. చిన్న పట్టణాలు, నగరాల మధ్య నడిచే ప్రాంతీయ మార్గాల్లో ప్రారంభంలో చిన్న చిన్న విమానాలకు గిరాకీ ఉన్నా, మున్ముందు వైడ్‌బాడీ విమానాలకే డిమాండ్ ఉంటుంది. ప్రయాణికుల సంఖ్య పెరిగేకొద్దీ విమానయాన సంస్థలు ఎక్కువ మందిని తీసుకెళ్లే సామర్థ్యం ఉన్న వైడ్‌బాడీ విమానాలకే మొగ్గు చూపుతాయి. చిన్న విమానాల్లో మహా అయితే 170 మంది ప్రయాణించవచ్చు. అదే వైడ్ బాడీ విమానాల్లో అయితే 200 నుంచి 400 మంది వరకు ప్రయాణించవచ్చు.

భారత విమాన ఇంజిన్ల మార్కెట్లో రోల్స్ రాయిస్ వాటా?

ప్రస్తుతం ఆసియా, పసిఫిక్ దేశాల్లో తిరుగుతున్న 700 వైడ్ బాడీ విమానాలు రోల్స్ రాయిస్ ఇంజిన్లతో నడుస్తున్నాయి. ఎయిర్ ఇండియాతో సహా అనేక భారత విమానయాన సంస్థలు అంతర్జాతీయ రూట్లలో నడిపే తమ విమానాల కోసం రోల్స్ రాయిస్ ఇంజిన్లనే ఉపయోగిస్తున్నాయి. వైడ్ బాడీ విమానాల ఇంజిన్ల మార్కెట్లో మా కంపెనీ వాటా ప్రస్తుత 30 శాతం నుంచి వచ్చే ఐదేళ్లలో 40 శాతానికి పెరగనుంది.

ఎంఆర్‌ఒ యూనిట్ ఏర్పాటు యోచన ఉందా?

రోల్స్ రాయిస్ ఇంజిన్ల నిర్వహణ, మరమ్మతుల కోసం భారత్‌లో మాకు ఇప్పటి వరకు ఎంఆర్‌ఒ యూనిట్ లేదు. వ్యాపార విస్తరణను బట్టి సమీప భవిష్యత్‌లో భారత్‌లో ఈ యూనిట్ ఏర్పాటు చేసే విషయం పరిశీలిస్తాం.

కొత్తగా ఏయే విమానాలు రోల్స్ రాయిస్ ఇంజిన్లతో నడవబోతున్నాయి?

బోయింగ్ 787, ఎయిర్‌బస్ 330 నియో విమానాలు రోల్స్ రాయిస్ కొత్త తరహా ట్రెంట్ ఇంజిన్లతో నడవబోతున్నాయి. ఇందులో ట్రెంట్ 7000 ఇంజిన్లతో 10 శాతం, ట్రెంట్ 1000 ఇంజిన్లతో 20 శాతం వరకు ఇంధనం ఆదా అవుతుంది. డ్రీమ్‌లైనర్ విమానాల కోసం బోయింగ్ కంపెనీ రోల్స్ రాయిస్ ట్రెంట్ 1000 ఇంజిన్లనే ఎంచుకుంది.

20 ఏళ్లలో 2,100 కొత్త విమానాలు

భారత ఎయిర్‌లైన్ మార్కెట్‌పై బోయింగ్ నివేదిక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రపంచంలో అత్యధిక వృద్ధి రేటుతో దూసుకుపోతున్న విమాన సేవల మార్కెట్ భారతేనని బోయింగ్ పేర్కొంది. గడిచిన కొన్నేళ్లుగా భారత ఎయిర్‌లైన్ మార్కెట్ 20 శాతానికిపైగా వృద్ధి నమోదు చేసుకుంటుండగా.. ప్రపంచ మార్కెట్ వృద్ధి కేవలం 7.4 శాతం స్థాయిలో ఉందని బోయింగ్ ఆసియా పసిఫిక్, ఇండియా సేల్స్ విభాగ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ దినేష్ ఎ కేస్కర్ తెలిపారు. హైదరాబాద్‌లో గురువారం ప్రారంభమైన ఏవియేషన్ షోలో భాగంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది 11.67 కోట్లుగా నమోదైన భారత్ విమాన ప్రయాణికుల సంఖ్య.. ఈ ఏడాదిలో 13.5 కోట్ల స్థాయికి చేరుకోవచ్చన్నారు. దేశీయ ఎయిర్‌లైన్ మార్కెట్ ట్రెండ్స్‌పై బోయింగ్ నివేదికలోని ముఖ్యాంశాలు..

- వచ్చే 20 ఏళ్లలో భారత ఎయిర్‌లైన్ ఆపరేటర్లు డిమాండ్ తగ్గట్టుగా సేవలందించేందుకు 29,000 కోట్ల డాలర్ల (రూ.18.85 లక్షల కోట్లు) విలువైన 2,100 కొత్త విమానాలు కొనుగోలు చేయవచ్చు.
- చౌక విమానయాన సేవలు, నిబంధనల సడలింపు, పెరుగుతున్న మధ్యతరగతి వర్గాల ఆదాయం, విమానాశ్రయాలతోపాటు ఇతర మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలు భారత్‌లో ఈ రంగ వృద్ధికి దోహదపడనున్నాయి.
- 2037కల్లా భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుంది. దేశంలో విమాన ప్రయాణికుల సంఖ్య మున్ముందు సంవత్సరాల్లో భారీగా పెరగనుంది.
- పెరుగుతున్న విమాన ప్రయాణికుల రద్దీతోపాటు రూపాయి మారకం విలువ బలపడటం విమాన సంస్థల లాభాలకు దోహదపడింది.
- 2016 సంవత్సరంలో అత్యంత కనిష్ఠ స్థాయిని నమోదు చేసుకున్న నాటి నుంచి ఇప్పటివరకు విమాన ఇంధన ధరలు 81 శాతం పెరిగాయి. భారత విమాన సంస్థలు ఇంధనం కోసం అమెరికన్ ఆపరేటర్ల కంటే 110 శాతం అధికంగా వెచ్చిస్తున్నాయి. మున్ముందు విమాన ఇంధన ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున సంస్థల లాభదాయకతపై ప్రభావం పడవచ్చు.

ప్రపంచవ్యాప్తంగా 41,030 విమానాలు అవసరం

ప్రపంచవ్యాప్తంగా వచ్చే ఇరవై ఏళ్లలో 6.1 లక్షల కోట్ల డాలర్ల (రూ.396.5 లక్షల కోట్లు) విలువైన 41,030 విమానాల అవసరం ఉంటుందని బోయింగ్ అంచనా వేస్తోంది. అందులో 39 శాతం (2.5 లక్షల కోట్ల డాలర్ల విలువైన 16,050 విమానాలు) ఆసియా మార్కెట్‌కు చెందిన సంస్థలు కొనుగోలు చేసే అవకాశం ఉందని పేర్కొంది. వచ్చే రెండు దశాబ్దాల్లో ప్రపంచవ్యాప్తంగా విమానాల ఎంఆర్‌ఒ, కార్గో వంటి సేవలకు డిమాండ్ 8.5 లక్షల కోట్ల డాలర్లు ఉండవచ్చని అంచనా.

భారత్‌కు రావడం అసాధ్యం

పాస్‌పోర్ట్ లేదు..ఆపై ఆరోగ్య సమస్యలు.. తేల్చి చెప్పిన చోక్సీ

ముంబై : పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)ని నిండా ముంచి విదేశాలకు పారిపోయిన గీతాంజలి జెమ్స్ అధినేత మెహుల్ చోక్సీ.. సిబిఐ విచారణకు హాజరయ్యేందుకు తాను భారత్‌కు రావడం అసాధ్యమని తేల్చిచెప్పారు. ఆరోగ్యం, పాస్‌పోర్ట్ ఈ రెండు అంశాల కారణంగా తాను భారత్‌కు తిరిగి వచ్చే సమస్యేలేదని పేర్కొన్నారు. తన ఆరోగ్యం బాగాలేదని ఈ పరిస్థితుల్లో ప్రయాణం కష్టమని సిబిఐకి పంపిన ఇ-మెయిల్‌లో తెలిపారు. సిబిఐ అరెస్ట్ చేస్తే ఇండియాలో తన ఆరోగ్యాన్ని గురించి అసలే మాత్రం పట్టించుకునే అవకాశం ఉండదనీ తీసుకెళ్లి ప్రభుత్వాసుపత్రిల్లో చికిత్స చేయిస్తారని చోక్సీ పేర్కొన్నారు. గుండెజబ్బుకు సంబంధించి ప్రస్తుతం విదేశాల్లో చికిత్స పొందుతున్నట్టుగా తెలిపారు. ముంబై రీజినల్ పాస్‌పోర్ట్ అధికారులు తన పాస్‌పోర్ట్‌ను చెప్పాపెట్టకుండా సస్పెండ్ చేశారనీ వివరణ ఏమీ లేకుండా, "దేశ భద్రతకు ముప్పు" అనే సాకు చూపించారని చోక్సీ ఆరోపించారు. పిఎన్‌బి వ్యవహారాన్ని చిలువలుపలువలుగా చిత్రీకరిస్తూ, మీడియా తనపై సొంత విచారణ కొనసాగిస్తోందనీ దీనివల్ల తన మౌలిక హక్కులకు దిక్కులేకుండా పోయిందని చోక్సీ తన లేఖలో వాపోయారు. రాజకీయ పార్టీలు కూడా తమ స్వప్రయోజనాల కోసం ఈ వ్యవహారాన్ని రాజకీయం చేస్తున్నాయని ఆరోపించారు. తనను కోర్టులు ఇప్పటికే దోషిగా నిర్ధారించినట్టుగా మీడియా రాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా రాతలు, రాజకీయ నాయకుల ప్రకటనల వల్ల వాతావరణం ఇప్పటికే తనకు వ్యతిరేకంగా తయారైందని అన్నారు.



బోగస్ ఎల్‌ఒయులతో పిఎన్‌బిని 12,000 కోట్ల రూపాయల మేర కొల్లగొట్టిన చోక్సీ ఆయన మేనల్లుడు నీరవ్ మోదీ దేశం విడిచి పారిపోయిన విషయం తెలిసిందే. ఈ కేసు విషయంలో సిబిఐ, ఇడి, ఎస్‌ఎఫ్‌ఐఒ దర్యాప్తు చేస్తున్నాయి. బ్యాంకులను మోసగించడంతో పాటు మనీలాండరింగ్‌కు పాల్పడినట్టుగా చోక్సీ, మోదీలపై కేసులు నమోదయ్యాయి.

స్కామ్ సైజు పెరగకపోవచ్చు...

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను నీరవ్ మోదీ, చోక్సీ సుమారు 12,646 కోట్ల రూపాయల మేర ముంచి ఉంటారని ప్రస్తుతానికి లెక్కలు వేశారు. ఈ మొత్తం మరింత పెరిగే అవకాశాలు ప్రస్తుతానికి లేవని ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ వెల్లడించారు.

ఆర్థిక శాఖ అధికారులపై దర్యాప్తు

- ప్రధానికి స్వామి సూచన

నీరవ్ మోదీ నుంచి గతేడాది దీపావళికి కొందరు ఆర్థిక శాఖ సీనియర్ అధికారులు కోటి రూపాయల విలువైన బహుమతులు తీసుకున్నారనీ వారిపై విచారణ జరిపించాలని బిజెపి ఎంపి సుబ్రమణియన్ స్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి ఆయన ఒక లేఖ రాశారు.

'ఇడి'ని నిలువరించండి

- హైకోర్టును ఆశ్రయించిన కార్తీ చిదంబరం



న్యూఢిల్లీ : ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) తనకు వ్యతిరేకంగా జారీ చేసిన సమన్లను రద్దు చేయాలనీ, దర్యాప్తు ప్రక్రియను నిలిపివేయాలని కోరుతూ కార్తీ చిదంబరం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. కార్తీ పిటిషన్‌పై శుక్రవారం నాడు విచారణ జరగనుంది. సుప్రీం కోర్టు సూచనల మేరకు కార్తీ హైకోర్టులో ఈ పిటిషన్ దాఖలు చేశారు. గతేడాది మేలో సిబిఐ తనపై దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లోని ఆరోపణలతో సంబంధంలేని అంశాలపై దర్యాప్తు చేపట్టే అధికారం ఇడికి లేదని ప్రకటించాలని సుప్రీం కోర్టును కార్తీ కోరారు. చట్టబద్ధమైన అధికారం లేకుండా, తన పరిధిలోనూ లేకున్నా నిర్హేతుకంగా దురుద్దేశ్యపూర్వకంగా ఇడి తనపై దర్యాప్తు ఎక్కుపెట్టిందని సుప్రీం కోర్టులో కార్తీ ఆరోపించారు. అయితే ఈ పిటిషన్‌ను ఇడి తీవ్రంగా వ్యతిరేకించింది. సుప్రీం కోర్టు మాత్రం దీనిని పట్టించుకోకుండా విచారణ జరిపి హైకోర్టును ఆశ్రయించాల్సిందిగా కార్తీకి సూచించింది.

స్మార్ట్‌ఫోన్‌తో ఎయిర్ కూలర్ నియంత్రణ

- బజాజ్ నుంచి తొలి ఐఒటి ఎయిర్ కూలర్
- ధర రూ.15,999

బెంగళూరు : ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి) ఆధారితంగా పని చేసే తొలి ఎయిర్ కూలర్‌ను బజాజ్ ఎలక్ట్రికల్స్ మార్కెట్లోకి విడుదల చేసింది. దీని పేరు బజాజ్ కూల్ ఐనెక్స్. ధర 15,999 రూపాయల వరకు ఉందని తెలుస్తోంది. క్రోమా రిటైల్ స్టోర్ల ద్వారా దీన్ని విక్రయించనున్నట్టు కంపెనీ తెలిపింది. వైఫై, ఇంటర్నెట్ ఆధారితంగా స్మార్ట్‌ఫోన్ యాప్ ద్వారా ఈ కూలర్‌ను సులభంగా ఆపరేట్ చేయవచ్చు. ఇందులోని ఇంటెలిజెంట్ సెన్సార్ గదిలోని ఉష్ణోగ్రతను సులభంగా గుర్తిస్తుంది. ఆటో మోడ్ ఫీచర్‌తో ఫ్యాన్, కూలింగ్ వేగం ఉష్ణోగ్రతను బట్టి మారుతుంది. 22 లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన ఈ కూలర్‌లో నీరు తగ్గితే డిజిటల్‌లో వాటర్ లెవల్ ఇండికేటర్ తెలియజేస్తుంది.



అమ్మకానికి రెడీ

ఎయిరిండియా, పవన్ హన్స్‌పై చౌబే ప్రకటన



ప్రభుత్వ విమానయాన సంస్థలు ఎయిరిండియా, పవన్ హన్స్ అమ్మకానికి రంగం సిద్ధమైందని, రానున్న రెండు వారాల్లో ఆసక్తి వ్యక్తీకరణలు (ఇఒఐ) వస్తాయని ఆశిస్తున్నామని పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఆర్ఎన్ చౌబే తెలిపారు. వింగ్స్ ఇండియా 2018 ప్రారంభ కార్యక్రమంలోను, తర్వాత పత్రికా ప్రతినిధుల సమావేశంలోను ఆయన మాట్లాడారు. ఎయిరిండియా, పవన్ హన్స్ పట్ల ఆసక్తి గల వర్గాల నుంచి ఇఒఐలు ఇప్పటికే ఆహ్వానించామని చెప్పారు. అంతకు మించి వివరాలు ప్రకటించడానికి ఆయన నిరాకరించారు. గత మూడేళ్ల కాలంలో 20 శాతం వృద్ధిని సాధించిందని చౌబే తెలిపారు. దేశం స్వాతంత్ర్యం సాధించిన తర్వాత ఏడు దశాబ్దాల కాలంలో విమానయాన సంస్థలు 395 విమానాలు మాత్రమే సమకూర్చుకోగా గత మూడేళ్ల కాలంలో 900 విమానాలకు ఆర్డర్లు జారీ చేశాయని, అలాగే 70 సంవత్సరాల్లో కేవలం 75 విమానాశ్రయాలు అభివృద్ధి కాగా ఉడాన్ స్కీమ్ ప్రారంభించిన రెండేళ్లలోనే 56 విమానాశ్రయాల అభివృద్ధికి అనుమతులు మంజూరు చేశామని ఆయన చెప్పారు. ఉడాన్ స్కీమ్ కింద విమాన సర్వీసులు కావాలనుకునే రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ భారం భరించేందుకు సిద్ధమైతే అలాంటి ప్రాంతాలకు కూడా పథకం పరిధిని విస్తరించడానికి తాము సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

ఎటిఎఫ్‌పై వ్యాట్ తగ్గించాలి...

విమానయాన రంగం అభివృద్ధికి ముడిచమురు ధరలే ప్రధాన అడ్డంకి అని చౌబే అన్నారు. క్రూడాయిల్ ధరలు కనీసం ప్రస్తుత స్థాయిలో నిలకడగా ఉన్నా విమానయాన రంగం వచ్చే 20 ఏళ్ల కాలంలో సగటున 15 శాతం వృద్ధిని సాధిస్తుందని ఆయన చెప్పారు. క్రూడ్ ధరల్లో నిలకడ ప్రశ్నార్థకమే అయినందు వల్ల విమానయాన ఇంధనాలను జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావాలని లేదా రాష్ట్రప్రభుత్వాలు వ్యాట్‌ను తగ్గించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఎటిఎఫ్‌పై సగటున 14 శాతం వ్యాట్ అమలులో ఉన్నదంటూ దాన్ని 4 లేదా 5 శాతానికి తగ్గించడం శ్రేయస్కరమన్నారు. అలాగే విమానయాన రంగంలో ప్రస్తుత వృద్ధిని పరిగణనలోకి తీసుకుంటే ప్రతి ఐదేళ్లకు ఒకసారి విమానాశ్రయాలను విస్తరించడం అవసరమని, తగినన్ని స్థలాలు అందుబాటులో లేకపోవడం ఒక పెద్ద అవరోధమని చౌబే పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో హెలీ టాక్సీ సేవలు!

- ఆసక్తి కనబరుస్తోన్న పవన్ హన్స్
- సంస్థ సిఎండి బిపి శర్మ వెల్లడి





హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లో ఒక చోట నుంచి మరొక చోటికి వెళ్లేందుకు త్వరలో విహంగ సేవలు కూడా అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వ రంగ హెలీకాప్టర్ సర్వీసుల సంస్థ పవన్ హన్స్ నగరంలో హెలీ టాక్సీ సేవలను ప్రారంభించాలనుకుంటోంది. ఇప్పటికే ఈ దిశగా ప్రయత్నాలు కూడా మొదలు పెట్టింది. గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైన ఏవియేషన్ షోలో పవన్ హన్స్ చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ బిపి శర్మ మాట్లాడుతూ.. తమ సంస్థ హైదరాబాద్‌లో హెలీ టాక్సీ సేవలను ప్రారంభించాలనుకుంటోందని అన్నారు. అయితే, ప్రతిపాదన ఇంకా ప్రాథమిక దశలోనే ఉందన్నారు. త్వరలోనే ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంతో చర్చించనున్నట్లు ఆయన చెప్పారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే తొలుత నగరంలోని ఐటి హబ్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు హెలీ టాక్సీ సేవలందించాలనుకుంటున్నట్లు శర్మ వెల్లడించారు. దేశంలో మెట్రో నగరాలు శరవేగంగా విస్తరిస్తున్నాయని, దాంతో పాటు ట్రాఫిక్ కూడా విపరీతంగా పెరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన నగరాల్లో హెలీ టాక్సీ సర్వీసులను ప్రారంభించాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని, తమ సంస్థ కూడా ఈ విభాగంలోకి ప్రవేశించేందుకు ఆసక్తిగా ఉందన్నారు.

హెలీకాప్టర్ పైలట్ శిక్షణ

దేశంలో ఇప్పటివరకు హెలీకాప్టర్ పైలట్ల శిక్షణ కేంద్రం లేదని, ఔత్సాహికులకు తమ సంస్థ ట్రైనింగ్ ఇవ్వనుందన్నారు. ఇంటర్మీడియెట్ పాసైన వారు పైలట్ శిక్షణకు అర్హులని శర్మ తెలిపారు.

2027కల్లా రూ.4,000 కోట్ల పెట్టుబడులు

సంస్థ వ్యాపార విస్తరణ ప్రణాళికలో భాగంగా పదేళ్ల (2027 నాటికి)లో రూ.4,000 కోట్ల పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నట్లు శర్మ తెలిపారు. ఈ నిధులతో మరిన్ని కొత్త హెలీకాప్టర్ల కొనుగోలు, పాత వాటి ఆధునీకరణతోపాటు వ్యాపార విస్తరణకు తగిన మౌలిక వసతులను ఏర్పాటు చేసుకోనున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం 43 హెలీకాప్టర్లతో సేవలందిస్తున్న పవన్ హన్స్.. 2025 నాటికి సంఖ్యను 100కు పెంచుకోవాలనుకుంటోంది.

త్వరలో సీ ప్లేన్ సర్వీసులు

సముద్ర విమాన సేవలపై సంస్థ గతంలో పైలట్ ప్రాజెక్టు చేపట్టిందని, తగిన అనుమతులు లభిస్తే త్వరలోనే ఈ సేవలను కూడా ప్రారంభించాలనుకుంటున్నట్లు శర్మ వెల్లడించారు. ఈ విషయంలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కూడా సానుకూలంగా ఉందన్నారు. సీ ప్లేన్ సర్వీసులతోపాటు స్మాల్ ఫిక్స్‌డ్ వింగ్ అపరేషన్స్, ఐలాండ్, టూరిజం సేవలు, హెలీపోర్టులు, హెలీప్యాడ్‌ల అభివృద్ధి, శిక్షణ, నైపుణ్య అభివృద్ధి, ఎంఆర్ఒ కన్సల్టెన్సీ సర్వీసులను సైతం విస్తరించాలనుకుంటోంది.

ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు

ప్రత్యేక వేదిక

- డబ్ల్యుఇపి పేరుతో ఏర్పాటు

న్యూఢిల్లీ : మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించేందుకు గాను నీతి ఆయోగ్ ప్రత్యేకంగా మహిళా ఔత్సాహికుల వేదిక (డబ్ల్యుఇపి) పేరుతో ఒక ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించింది. మహిళలు విజయవంతంగా తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేందుకు ఈ వేదిక ఎంతగానో దోహదపడుతుందని నీతి ఆయోగ్ తెలిపింది. దేశవ్యాప్తంగా మహిళల కోసం సరైన వాతావరణం అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఉమెన్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ ప్లాట్‌ఫామ్ (డబ్ల్యుఇపి)ను ఏర్పాటు చేసినట్లు నీతి ఆయోగ్ సిఇఒ అమితాబ్ కాంత్ తెలిపారు. మహిళల్లోని ఆలోచనలు, నవకల్పనలను దీర్ఘకాలిక వ్యూహాలతో కొనసాగించేందుకు ఇది తోడ్పడుతుందని అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా భారత్‌లో యుఎన్ రెసిడెంట్ కో ఆర్డినేటర్ యూరి అఫానసీవ్ సమక్షంలో అమితాబ్ కాంత్ డబ్ల్యుఇపి ని ప్రారంభించారు. సరికొత్త భారతవనిని ఆవిష్కరించేందుకు గాను ఇది బాటలు వేస్తుందన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలు ఎదుర్కొంటున్నసమస్యలను పరిష్కరించటమే కాకుండా ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలోని పథకాలను దీని ద్వారా వివరించనున్నట్లు ఆయన చెప్పారు. డైస్ డిస్ట్రిక్ట్ ద్వారా 10 కోట్ల రూపాయల వరకు నిధిని ఏర్పాటు చేసి పెట్టుబడులను సమకూర్చనున్నట్లు అమితాబ్ కాంత్ తెలిపారు. డబ్ల్యుఇపికి నాస్కామ్, సిఐఐ, ఫిక్కీ, సిడ్బీ, ఫేస్‌బుక్ తోడ్పాటును అందించనున్నాయని చెప్పారు.

ఆరు రోజుల తర్వాత ఊరట

- 318 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై : దేశీయ స్టాక్ మార్కెట్లు ఆరు రోజుల వరుస నష్టాల తర్వాత లాభాల్లోకి ప్రవేశించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాలతోపాటు తక్కువ ధరకు చేరిన షేర్లను కొనుగోలు చేయడానికి ఇన్వెస్టర్లు ఆసక్తి చూపిన ఫలితంగా మార్కెట్లు మళ్లీ రిలీఫ్ ర్యాలీ తీసేందుకు అవకాశం ఏర్పడింది. గురువారం బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 381.48 పాయింట్ల లాభంతో 33351.57 పాయింట్లు, నిఫ్టీ 88 పాయింట్ల లాభంతో 10242.65 పాయింట్ల వద్ద ముగిశాయి. ఉక్కు, అల్యూమినియంపై దిగుమతి సుంకాలను పెంచే విషయంలో అమెరికా ప్రభుత్వం వెనక్కి తగ్గినట్టు వచ్చిన వార్తల నేపథ్యంలో అంతర్జాతీయ వాణిజ్య యుద్ధ భయాలు తొలగిపోయాయని, ఫలితంగా మార్కెట్లలో సానుకూల సెంటిమెంట్ నెలకొందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. గురువారంనాటి సెషన్‌లో సెన్సెక్స్‌లోని 30 షేర్లకు దేశీయ ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు, రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి మంచి కొనుగోళ్ల మద్దతు లభించింది. ఈ నేపథ్యంలో ఒక దశలో సెన్సెక్స్ 33439.97 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. గత ఆరు సెషన్లలో సెన్సెక్స్ 1,412.66 పాయింట్లు కోల్పోయింది. కాగా మిడ్, స్మాల్ క్యాప్ షేర్లు ఇంకా ఒత్తిడికి గురవుతూనే ఉన్నాయని, వీటి విషయంలో ఇన్వెస్టర్లు వేచి చూసే ధోరణిని అవలంబిస్తున్నారని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.



- బుధవారంనాటి గణాంకాల ప్రకారం.. దేశీయ ఇన్వెస్టర్లు 409.34 కోట్ల రూపాయలు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పిఐ) 719.78 కోట్ల రూపాయల విలువైన షేర్లను కొనుగోలు చేశారు.
- ఉక్కు, అల్యూమినియం షేర్లకు గిరాకీ పెరిగింది. నాల్కో, హిందుస్తాన్ జింక్ షేర్లు వరుసగా 1.83 శాతం, 1.15 శాతం మేర పెరిగాయి. జిందాల్ స్టీల్, ఎన్ఎండిసి, సెయిల్, జెఎస్‌డబ్ల్యు స్టీల్ షేర్లు కూడా లాభాల బాటలో కొనసాగాయి.
- భూషణ్ స్టీల్‌ను టాటా స్టీల్ కొనుగోలు చేసే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో భూషణ్ స్టీల్ షేరు 16.26 శాతం మేర పెరిగింది.
- సెన్సెక్స్ షేర్లలో ఎస్‌బిఐ ఎక్కువ లాభపడింది. ఈ షేరు 4.09 శాతం మేర పెరిగింది. ఐసిఐసిఐ బ్యాంక్, అదానీ పోర్ట్స్, ఎం అండ్ ఎం, ఆర్ఐఎల్, హెచ్‌డిఎఫ్‌సి, ఏషియన్ పెయింట్స్, ఎల్ అండ్ టి, లార్సన్ అండ్ టూబ్రో, ఇన్ఫోసిస్, మారుతి సుజుకీ, పవర్ గ్రిడ్ షేర్లు లాభాల బాటలో సాగాయి.

మార్చి 15న బంధన్ బ్యాంక్ పబ్లిక్ ఇష్యూ

కోల్‌కతా కేంద్రంగా ఉన్న బంధన్ బ్యాంక్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)ను మార్చి 15న ప్రారంభించనుంది. ఈ ఇష్యూ ద్వారా 4,473 కోట్ల రూపాయల వరకు నిధులు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. ఇష్యూలో భాగంగా 11.92 కోట్ల ఈక్విటీ షేర్లను కంపెనీ విక్రయించనుంది. ఒక్కో షేరు కనిష్ఠ ధర 370 రూపాయలు, గరిష్ఠ ధర 375 రూపాయలుగా నిర్ణయించారు. ఈ ఐపిఒ మార్చి 19న ముగుస్తుంది.

సనంద్‌లో మాక్సిస్ ప్లాంట్ ప్రారంభం

టూ వీలర్ టైర్ల తయారీ రంగంలోని మాక్సిస్ గ్రూప్‌నకు చెందిన మాక్సిస్ ఇండియా.. గుజరాత్‌లోని సనంద్‌లో తన తొలి ప్లాంట్‌ను ప్రారంభించింది. 2,640 కోట్ల రూపాయల పెట్టుబడితో 106 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్లాంట్‌ను నిర్మించినట్టు కంపెనీ తెలిపింది.

రోజుకు 20,000 టైర్లు, 40,000 ట్యూబ్‌లు తయారు చేసే సామర్థ్యం ఈ ప్లాంట్‌కు ఉందని కంపెనీ పేర్కొంది. ఈ ఉత్పత్తి సామర్థ్యంతో ఐదేళ్ల కాలంలో దేశీయ టైర్ల మార్కెట్లో కనీసం 15 శాతం మార్కెట్ వాటాను మాక్సిస్ కంపెనీ లక్ష్యంగా చేసుకుంది.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,490	31,450	31,490	31,350	30,610
క్రితం ముగింపు	31,640	31,550	31,560	31,400	30,710
22 క్యారెట్లు	29,160	29,100	28,970	29,030	29,150
క్రితం ముగింపు	29,300	29,250	29,030	29,180	29,250
వెండి (కిలో)	39,500	39,800	39,500	39,700	41,500
క్రితం ముగింపు	39,900	40,200	39,600	40,000	41,800

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	68.00	విజయవాడ	68.00
కరీంనగర్	69.00	గుంటూరు	68.00
వరంగల్	68.00	ఒంగోలు	70.00
మహబూబ్‌నగర్	68.00	చిత్తూరు	67.00
కర్నూలు	68.00	నెల్లూరు	67.00
విశాఖపట్నం	72.00	అనంతపురం	71.00
గోదావరి	68.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.05 నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	345.00	చిత్తూరు	378.00
వరంగల్	347.00	చెన్నై	385.00
విజయవాడ	328.00	నమక్కల్	370.00
గోదావరి	328.00	బెంగళూరు	375.00
విశాఖపట్నం	335.00	ముంబై	390.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	59.08	68.50
పౌండ్	82.14	95.26
యూరో	73.28	84.97
ఆస్ట్రేలియా డాలర్	46.26	53.53
బహ్రెయిన్ దినార్	160.00	183.35
కువైట్ దినార్	179.13	222.99
ఒమని రియాల్	156.68	179.25
సౌదీ రియాల్	15.71	18.61
సింగపూర్ డాలర్	44.96	53.25
యుఎఇ దిరమ్	16.08	18.80

మైనర్ రికవరీ

టెక్ వ్యూ

అంతర్జాతీయ మార్కెట్లకు అనుగుణంగా నిఫ్టీ పాజిటివ్‌గా ప్రారంభమై 10240 స్థాయిల వద్ద మైనర్ రియాక్షన్‌ను కనబరిచింది. చివరి సెషన్‌లో మళ్లీ తేరుకుని ముగింపులో 80 పాయింట్లకు పైగా లాభపడింది. టెక్నికల్‌గా మార్కెట్ కొన్ని వారాల కరెక్షన్ అనంతరం మైనర్ పుల్ బ్యాక్ బౌన్స్ బ్యాక్‌ను కనబరిచింది. స్వల్పకాలిక ఓవర్‌సోల్డ్ పొజిషన్ నుంచి బయటపడి రికవరీ సాధించింది. అయితే మార్కెట్ ఇంకా డౌన్‌ట్రెండ్‌లోనే ఉంది. నిఫ్టీ మరికొద్ది రోజులు కన్సాలిడేట్ అయితే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌లోకి ప్రవేశిస్తుంది.

శుక్రవారం స్థాయిలివే...

నిరోధం : 10300 **మద్దతు :** 10100

- ప్రధాన నిరోధం 10300 ఎగువన నిలదొక్కుకుంటే తదుపరి రికవరీ సాధిస్తుంది.
- ప్రధాన నిరోధ స్థాయిలకు ఎగువన పటిష్ఠంగా ముగిసినప్పుడే స్వల్పకాలిక రికవరీ కనబరుస్తుంది.
- వీక్లీ చార్టులకు శుక్రవారం నాటి ముగింపు కీలకం
- ఇంట్రాడేలో 10180 స్థాయిల దిగువకు చేరితే బలహీనతను సూచిస్తుంది.
- తదుపరి మద్దతు స్థాయిలు 10100, 10000

■ వి.సుందర్ రాజా

మిడ్‌సెషన్ మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి : ఫాల్గుణ బహుళ అష్టమి **నక్షత్రం :** జ్యేష్ఠ

కృత్తిక, ఉత్తర, ఉత్తరాషాఢ నక్షత్ర జాతకులు, ధనుస్సు, మేష రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10242.65 (88.45)

ట్రెండ్ మార్పు వేళలు : 2.01

ధోరణి: గ్రహగతులను బట్టి నిస్తేజంగా ప్రారంభమై 10.15 వరకు అదే ధోరణిలో ట్రేడవుతూ తదుపరి 2.15 వరకు మెరుగ్గా ట్రేడయ్యే ఆ తర్వాత చివరి వరకు ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 10.15 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 2 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2.30 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవలసి ఉంటుంది.

నిరోధం : 10285, 10220

మద్దతు స్థాయిలు : 10200, 10165

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinanciala strologer.blogspot.in

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు

ACI INFOCOM 3.96(4.16)551105
AGRO TECH FO 625(632)1826
AISHWARYA TE 5.51(5.4)5087
ALPHAGEO (I) 773.95(779.3)3262
ALU FLUORIDE 108.85(108.45)9637
AMAR RAJA BA 794.45(773)33135
ANDHRA BANK 39.5(39.35)957115
ANDHRA CEMEN 10.25(10.27)44020
ANDHRA PETRO 54.95(52.35)236045
ANJANI PORTL 181.35(182)2226
ASTRA MICRO 85.85(87.3)46374
AUROB.PHARMA 588.95(592.75)120068
AVANTEL LTD 529.55(528.2)3579
AVANTI FEEDS 2329.55(2369.3)11764
B.N.RATHI SE 39.5(38.2)777
BALAJI AMINE 597.5(591.5)11154
BAMBINO AGRO 242.7(235.45)1238
BARTRONICSIN 12.03(12.49)21503
BHAGIRA.CHEM 284.75(287.25)1091
BHAGYA INL 48.9(50.8)107471
BHARATFIN 1033.5(1035.5)62064
BNR UDYOG 28.7(28.7)1057
CAMBRIDGE 74.6(75.35)3747
CCHHL 13.45(13.36)47867
CCL PRODUCTS 293.9(294.45)4238
CELESTIAL 14.85(15.75)28603
CIL SECURITS 26.55(26.65)651
COROM INTER 521.95(536.65)9300
CUBEX TUBING 24.95(25.5)39
CYBERMATE 2.84(2.85)41095
CYIENT 620.9(626)5421
DANLAW TECH. 69.85(69.55)10722
DECAN CEMENT 540.35(547.35)20399
DECCAN POLYP 3.05(3.01)100
DHAN ROTO SP 50.4(52.95)957
DIAMONPOWER 12.27(12.87)54502
DIVI'S LAB. 1001.2(991.05)20295
DIVYA.GRANIT 92(90.1)766
DQ ENT 13.05(13.3)5520
DR.REDDY'S 2145.5(2148.45)14730
EMPEE SUGARS 3.91(4.11)7923
EVEREST ORG. 140.15(138.45)18176
FACOR ALLOYS 2.77(2.81)91355
FIRSTOBJ 15.85(16.1)328
GATI LTD. 100.95(102.35)71218
GAYATRI PROJ 206.55(204.7)25431
GENNEX LAB 3.86(3.86)227504
GMR INFRASTR 17.35(17.35)2502340
GODAVARI DRU 34.35(33.55)5568
GOLDST INFRA 197.5(197)26523
GOLDSTONE EN 13.47(13.43)5300
GRANULES (I) 108.15(108.05)149267
GVK POWERINF 14(14.25)2282415
HBL P SYS 51.15(51.7)77428
HERITGFOOD 686.05(670.95)987
HIND.FLUROCA 10.5(10.9)16025
I.C.S.A. IND 3.1(3.1)7820
IKF TECHNO .63(.64)77722
INCAP LTD. 81.3(85.2)1867
IPAPPM 289.45(293.95)10030
IVRCL LTD 4.1(3.96)329830
KAKATIYA CEM 263.3(271.25)3643
KAKATIYA TEX 2.4(2.5)200
KALLAM SPG. 31.25(31.05)53951
KARAN WOO-SN 1.91(1.9)500
KAVERI SEED 474.55(460)46233
KCP LTD 116.85(116.2)12546
KERNEX MICRO 38.35(39.1)1900
KNR CONST 296.45(291.85)7352
KREBS BIOCHM 199.65(190.15)3340
LANCO INFRA 1.1(1.14)1007076
LOKESH MACH 61(60.95)14053
LOTUS CHOC 51.45(50)1940
MADHUCON PRJ 24.95(25.65)15822
MOLD-TEK TEC 54.85(57.05)100844
MOSCHIP SEMI 29.35(30.15)36761
MSR INDIA 49.75(49)7002
N C L IND. 207.1(204.9)48896
NACLIND 38.3(38.9)40771
NATCO PHARM 717.15(722.65)65301
NCC 120.1(118.6)481185
NEHA INTER. 6.88(6.72)10056
NETTLINX LTD 73.3(74.15)178763
NEULAND LAB. 698.25(695.4)766
NIHAR INFO 12.6(13.25)50
NILE LTD. 734(767.7)7704
NTL 3.73(3.74)13339
OIL COUNTRY 38.7(39.1)7017
PADMALAYA TE 3.99(4.2)5440
PALRED 71.65(74.5)4431
PANYAM CEMEN 42.6(41.5)42327
PENNAR STEEL 54(54.6)70561
PFL INFOTECH 8.4(8.01)64614
PHYTOCHEM I. 61.8(61.5)1576
PITTI LAMIN. 88.1(87.65)12029
POKARNA LTD 198.9(196.35)4591
PRAJAY ENGS. 12.62(12.04)60407
PREMIER EXPL 365.1(365.9)4299
PRISM CEMENT 119.65(115.75)98153
RAIN 381.9(367.3)511742
RAJ PACKAGIN 35(33.95)1522
REG.CERAMIC 5.65(5.42)779
RESTILE CER. 6.57(6.97)900
SAGAR CEM. 921.25(937.05)450
SAMKRG PIST. 284.25(289.85)8127
SAMPRE NUTRI 55(54.5)1454
SANGHI IND. 112.3(109.35)38030
SATVAH.ISPAT 20.75(21.95)11503
SAVEN TECHNO 26(25.55)19997
SMPL 1.35(1.35)23035
SMS PHARMACE 77.8(80.9)8407
SREE RAYALA 155.45(157.1)1637
STEEL EXCH 25.65(26.8)31034
SUJANA INDUS .85(.89)12251
SURANATP 5(5.09)18387
SURYACHAKRA .9(.89)31586
SURYAMBA SP 71.9(71.8)205
SURYAVA SPIN 6.35(6.09)162
SURYLAK.COTT 73.5(75.5)4629
SUVEN LIFE S 174.45(177.25)53996
TAJ GVK HOTL 153.4(157.15)65150
TANLA 33.95(34.6)141038
TRANSCORP IN 31.85(31.5)16106
TRANSGENE BI 2.47(2.59)2200
TRANSPORT CO 270.9(269.95)5812
USHER AGRO 5.57(5.75)7001
VICEROY HOTE 14.25(14.45)20416
VIJAY TEXTIL 47.65(49.9)4377
VIMTA LABS 198.35(195.85)2786
VIRAT CRANE 55.75(55.2)13927
VIRINCHI 108.25(109.85)59041
VISAKA IND. 657.95(662.3)14895
VISTA PHARMA 44.1(43.7)22996
VIVIMED LABS 70.5(69.35)156375
VST INDUS. 2926.4(2942.2)118
WATERBASE 275(276.75)223800
XLENERGY 2.53(2.45)5952
YBRANTDIGI 5.08(5.1)123782
ZEN TECH 121(122.35)43854
ZENOTECH 38.75(40.5)63514

డీఎంఈ రమేష్‌రెడ్డి నియామకం చెల్లదు

- నిబంధనల మేరకు కొత్త డీఎంఈని నియమించండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఇన్‌చార్జి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)గా డాక్టర్ కె.రమేష్‌రెడ్డిని నియమించడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. మెడికల్ ఎడ్యుకేషన్ నిబంధనలకు, హైకోర్టు తీర్పునకు విరుద్ధంగా ఆయన నియామకం జరిగిందని స్పష్టం చేసింది. ఆయన నియామకాన్ని సస్పెండ్ చేసింది. హైకోర్టు తీర్పు, మెడికల్ ఎడ్యుకేషన్ నిబంధనలు, తెలంగాణ సబార్డినేట్ రూల్ 10(హెచ్)కు లోబడి కొత్త డీఎంఈని నియమించాలని స్పష్టం చేసింది. ఈ కేసులో న్యాయమూర్తి జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు గురువారం తీర్పునిచ్చారు. డీఎంఈగా రమేష్‌రెడ్డిని చట్టవిరుద్ధంగా ఎంపిక చేశారంటూ పెథాలజీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రవణ్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి విచారించారు. పిటిషనర్ తరఫున న్యాయవాది లక్ష్మీనరసింహం వాదనలు వినిపించారు. బోధనారంగం నుంచి(అసిస్టెంట్ ప్రొఫెసర్) వచ్చిన వారి సీనియారిటీ ఆధారంగా డీఎంఈ నియామకం చేయాల్సి ఉందని, అలాకాకుండా సివిల్ అసిస్టెంట్ సర్జన్స్‌కు సంబంధించిన వారితో సీనియారిటీ జాబితా రూపొందించిందని న్యాయవాది అన్నారు. బోధనారంగం నుంచి వచ్చిన వారితో కాకుండా సివిల్ అసిస్టెంట్ సర్జన్లుగా నియమితులైన వారితో సీనియారిటీ జాబితా రూపొందించిన వారిలో ఒకరిని ఏపీ ప్రభుత్వం డీఎంఈగా నియమించిందని, ఈ నియామకాన్ని ఇదే హైకోర్టు ధర్మాసనం కొట్టివేసిందని తెలిపారు. ఏపీ తరహాలోనే ఇక్కడ కూడా నిబంధనలకు విరుద్ధంగా డీఎంఈ నియామకం జరిగిందని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రూపొందించిన సీనియారిటీ జాబితాలోకూడా రమేష్ రెడ్డి 59వ స్థానంలో ఉన్నారని పేర్కొన్నారు. ఆయన్ని ఇన్‌చార్జి డీఎంఈగా నియమించడంకూడా తెలంగాణ సబార్డినేట్ రూల్ 10(హెచ్)కు విరుద్ధమని తెలిపారు. ఈ వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి డీఎంఈ నియామకాన్ని సస్పెండ్ చేశారు.

రైతు సమితి కార్పొరేషన్ చైర్మన్‌గా..
12న గుత్తా బాధ్యతల స్వీకరణ!

- నియామకపు ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్‌గా నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఈ నెల 12వ తేదీ సాయంత్రం 4 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు. వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో జరిగే ఈ కార్యక్రమానికి సీఎం కేసీఆర్ హాజరయ్యే అవకాశం ఉందని అధికారవర్గాలు చెబుతున్నాయి. వ్యవసాయ శాఖ కమిషనర్ జగన్మోహన్, ఉద్యానవన శాఖ, మార్కెటింగ్ శాఖల డైరెక్టర్లు ఎల్.వెంకట్రామిరెడ్డి, లక్ష్మీబాయి, ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి సాయిప్రసాద్ డైరెక్టర్లుగా కొనసాగనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గుత్తా బాధ్యతల స్వీకరణ తర్వాత పాలక మండలి సమావేశం నిర్వహించి డైరెక్టర్ల సంఖ్యను పెంచే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. గుత్తా సూచన మేరకు కార్పొరేషన్ చైర్మన్ ఆఫీసును కమిషనరేట్‌లోని మూడో అంతస్తులో ఏర్పాటుచేయాలని అధికారులు నిర్ణయించారు. కార్పొరేషన్ విధివిధానాలు విడుదల చేసిన సర్కారు కంపెనీల చట్టం కింద రిజిస్ట్రేషన్ కోసం కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు దరఖాస్తు చేసింది. రిజిస్టర్ చేసిన కేంద్రం కార్పొరేషన్ గుర్తింపు సంఖ్యను కూడా కేటాయించింది.

టీఎస్ సెట్ -2018 నోటిఫికేషన్ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డిగ్రీలెక్చరర్ల కోసం నిర్వహించే తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటి టెస్ట్(టీఎ‌స్-సెట్ 2018) నోటిఫికేషన్‌ను సెట్ సభ్య కార్యదర్శి ప్రొఫెసర్ యాదగిరి స్వామి గురువారం విడుదల చేశారు. మార్చి 14 నుంచి ఆన్‌లైన్ అప్లికేషన్లు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 14వ తేదీ వరకు అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.1500 అపరాధ రుసుముతో ఏప్రిల్ 24 వరకు, రూ.2000తో మే 4వరకు, రూ.3000తో మే 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. సెట్ ఎగ్జామ్ జులై 15న నిర్వహిస్తున్నట్లు యాదగిరి స్వామి తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణసెట్.ఓఆర్‌జీ లేదా ఉస్మానియా.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చన్నారు.

సభ్యులకు ఎలాంటి అసౌకర్యం కలుగొద్దు

- బడ్జెట్ సమావేశాల ఏర్పాట్లపై స్పీకర్ సమీక్ష

హైదరాబాద్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఉండాలని, సభ్యులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులకు స్పీకర్ మధుసూదనాచారి సూచించారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తంగా ఉండాలని పోలీసులను ఆదేశించారు. ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల దృష్ట్యా చేయాల్సిన ఏర్పాట్లపై శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్‌తో కలిసి వివిధ విభాగాల ఉన్నతాధికారులతో ఆయన అసెంబ్లీ కమిటీ హాల్‌లో గురువారం సమీక్షించారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో వచ్చే పండుగలు, ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. అసెంబ్లీ సమావేశాల భద్రత, ఇతర ఏర్పాట్లకు 2 వేల మంది పోలీసులను నియ మించనున్నట్లు డీజీపీ మహేందర్‌రెడ్డి తెలిపారు. అసెంబ్లీకి 4 కిలోమీటర్ల పరిధిలో ఆంక్షలు అమలవుతాయని పోలీసు కమిషనర్ శ్రీనివాసరావు చెప్పారు.

మూడో ఫ్రంటే ప్రత్యామ్నాయం!

- దేశరాజకీయాలు కాంగ్రెస్, బీజేపీకే పరిమితం కాదు: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మూడో ఫ్రంట్‌పై దేశవ్యాప్తంగా వాడీవేడి చర్చ జరుగుతున్న సందర్భంలో మంత్రి కేటీఆర్ స్పందించారు. దేశ రాజకీయాల్లో మూడో ఫ్రంటే ప్రత్యామ్నాయం అవుతుందని ఆయన స్పష్టం చేశారు. భారత్‌లో కాంగ్రెస్, బీజేపీ మాత్రమే బలమైన పార్టీలు కావని, భారత్‌లో ద్విధ్రువ రాజకీయ వ్యవస్థ లేదని అన్నారు. బహుళ పార్టీ వ్యవస్థ కొనసాగుతున్నందున పటిష్టమైన ప్రాంతీయ పార్టీలు కూడా ఉన్నాయని అన్నారు. గురువారం బేగంపేట విమానాశ్రయంలో ఏవియేషన్ షో సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో మూడో ఫ్రంటే ప్రత్యామ్నాయం అవుతుందని, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మూడో ఫ్రంట్‌కు మంచి అవకాశం ఉందని చెప్పారు. 'కాంగ్రెస్, బీజేపీలకు దేశ ప్రజలు ఎన్నో అవకాశాలిచ్చారు. వారి ఆకాంక్షలను ఆ పార్టీలు తీర్చలేకపోయాయి. అంచనాలను చేరుకోలేకపోయాయి. అందుకే ప్రత్యామ్నాయ ఫ్రంట్ అవసరమని సీఎం కేసీఆర్ చెప్పారు. అందులో తప్పులేదు. ఎన్నికలకు ఇంకా ఏడాది గడువుంది. మున్ముందు సమీకరణాలు ఎలా మారుతాయో వేచి చూద్దాం' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.



కలిసి ఓడిద్దాం రండి!

- 2019లో బీజేపీని మట్టికరిపిద్దాం
- ప్రాంతీయ పార్టీలకు మమత పిలుపు

కోల్‌కతా, మార్చి 7: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని మట్టికరిపించేందుకు ప్రాంతీయ పార్టీలన్నీ కలిసి పనిచేయాలని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం నుంచి టీడీపీ మంత్రులు వైదొలగిన నేపథ్యంలో వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ప్రాంతీయ శక్తులన్నీ ఏకం కావాలని మమత చెప్పారు. బెంగాల్‌లో అధికారం చేజిక్కించుకోవాలని బీజేపీ కలలు కంటోందని, ముందు కేంద్రంలో తిరిగి అధికారంలోకి రావడంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎన్డీయే సర్కారుకు ఇప్పటికే ప్రమాద ఘంటికలు మోగడం ప్రారంభమైందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారమిక్కడ నిర్వహించిన ర్యాలీలో మమత ఈ వ్యాఖ్యలు చేశారు. త్రిపురలోనూ బీజేపీ అధికార దుర్వినియోగంతో పాటు ధన బలాన్ని ఉపయోగించి గెలిచింది తప్ప స్వశక్తితో కాదని ఆరోపించారు.



అవార్డులు పొందిన మహిళలతో మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి

స్టార్టప్‌లకు కోటి

(మొదటి పేజీ తరువాయి)

సిలికాన్ వ్యాలీ సృష్టిస్తాం' అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. మహిళా స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు దేశంలోనే తొలి ఇంక్యుబేషన్ సెంటర్ 'వీ-హబ్'ను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంత్రి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీ-హబ్ ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రం ఇప్పటికే సత్తా చాటిందని, ఇప్పుడు దేశంలో వీ-హబ్‌ను ప్రారంభించిన తొలి రాష్ట్రంగా చరిత్ర సృష్టించామన్నారు. రూ.15కోట్ల మూలనిధితో దీన్ని ప్రారంభిస్తున్నామని, జూబ్లీహిల్స్‌లోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ క్యాంపస్‌లోని టీ-శ్యాట్ కార్యాలయంలో వీ-హబ్ తాత్కాలిక కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం నుంచే కార్యకలాపాలు ప్రారంభమవుతాయని, అందిన దరఖాస్తులను నిపుణుల బృందం క్షుణ్నంగా పరిశీలించి స్టార్టప్‌లను ఎంపిక చేస్తుందన్నారు. కేవలం టెక్నాలజీ ఆధారిత స్టార్టప్‌లకే కాకుండా ఉత్పత్తులు, సేవలు, ఇతర ఎలాంటి స్టార్టప్‌లనైనా స్వాగతిస్తామని మంత్రి ప్రకటించారు. తాత్కాలిక కార్యాలయంలో వందమంది స్టార్టప్‌లకు అవకాశం కల్పిస్తామన్నారు. స్టార్టప్‌లలోని ఆవిష్కరణలకు రాష్ట్ర ప్రభుత్వమే తొలి వినియోగదారు అవుతుందని చెప్పారు. రాష్ట్రంలో ఇంటర్ విద్యార్థులకు ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ తప్ప వేరే అవకాశాలు కన్పించడం లేదని, విద్యార్థుల్లో ఆ ఆలోచనను మార్చేందుకు కృషి చేస్తున్నామని, దీనికోసం విద్యార్థుల ఆసక్తి ఉన్న రంగాలను గుర్తించేందుకు చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ ఫణీంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నామని మంత్రి చెప్పారు.



వీ-హబ్ ప్రారంభోత్సవ సభలో మంత్రి కేటీఆర్, టెస్సీ థామస్, జయేశ్ రంజన్ తదితరులు

దేశానికే ఆదర్శం కావాలి: టెస్సీ థామస్

ప్రోత్సాహం లేకపోవడం వల్లే మహిళలు లక్ష్యాలను సాధించలేకపోతున్నారని మిసైల్ వుమన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన డీఆర్‌డీవో ఇండియన్ మిసైల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ టెస్సీ థామస్ అన్నారు. అనేకమంది మహిళలు చిన్న, మధ్యతరహా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు సిద్ధంగా ఉన్నారని, వారికి కుటుంబం, సమాజం, ప్రభుత్వాలు అండగా నిలవాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన వీ-హబ్ అన్ని రాష్ట్రాలకూ ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. 'వీ-హబ్'ను ప్రారంభించినందుకు కేటీఆర్‌కు ట్విటర్‌లో "ఐ సెల్యూట్ యూ సర్"అంటూ ట్వీట్ చేశారు. వీ-హబ్ కార్యకలాపాలు శుక్రవారం నుంచే ప్రారంభమవుతాయని ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తెలిపారు. సీఈవోగా దీప్తి రావులను నియమించామని, wehub.telangana.gov.inవెబ్‌సైట్ ద్వారా ఔత్సాహికులు దరఖాస్తులు పంపవచ్చన్నారు. టీ-హబ్ ఫేజ్-2 కార్యాలయ నిర్మాణం రాయ్‌దుర్గ్‌లో జరుగుతోందని, ఈ ఏడాది చివరికల్లా పనులు పూర్తవుతాయన్నారు. కేంద్రప్రభుత్వ సంస్థ నీతిఆయోగ్ వీ-హబ్‌తో కలిసి పనిచేస్తుందన్నారు. ప్రారంభ సమావేశంలో ఐఐఎం బెంగళూరు, సీఐఐ-ఇండియన్ వుమెన్ నెట్‌వర్క్, యుఎన్‌డీపీ(యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం)తో పాటు మరో మూడు సంస్థల ప్రతినిధులు మంత్రి కేటీఆర్ సమక్షంలో వీ-హబ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు.

త్వరలో హైదరాబాద్‌లో
మహిళా వర్సిటీ

- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి తుమ్మల
- ఆడపిల్లల చదువుతోనే మహిళా సాధికారత: నాయిని

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో త్వరలో మహిళా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటుతో రాష్ట్రంలో మహిళల సాధికారత మరింత మెరుగులు దిద్దుకుంటుందని ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శాసనసభ ఉప సభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి అధ్యక్షతన ప్రభుత్వం గురువారం అధికారికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహిళలకు ఎటువంటి ప్రోత్సాహం కావాల్సి వచ్చినా సహకారం అందించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తుమ్మల తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళల పక్షపాతి అని ఆయన వ్యాఖ్యానించారు. తాగునీటి కోసం మహిళలు పడుతున్న కష్టాల నేపథ్యంలో కేసీఆర్ 'మిషన్ భగీరథ' పథకాన్ని తీసుకొచ్చారని వెల్లడించారు. మహిళల భద్రతను బాధ్యతగా భావించినందునే సీఎం కేసీఆర్.. షీ టీమ్స్‌కు శ్రీకారం చుట్టారని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. మహిళా సాధికారతలో మరింత పురోభివృద్ధి సాధించాలంటే ప్రతి ఆడపిల్లనూ కచ్చితంగా చదివించాలని పిలుపునిచ్చారు. మహిళలు తమ ప్రతిభా సామర్థ్యాలతో ఎదగాలి తప్ప వారసత్వం ద్వారా ఎదిగేందుకు యత్నించాలని తపనపడొద్దని పద్మాదేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు.

ఎంబీసీ యువతకు రుణాలు

- రాయితీ ఫైలుపై సీఎం కేసీఆర్ సంతకం

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు అందిస్తున్నట్లుగానే అత్యంత వెనుకబడిన తరగతుల(ఎంబీసీ)కి చెందిన యువతకు కూడా స్వయం ఉపాధి పథకాలకు ఆర్థిక సహకారం అందించాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. దీంతో పాటు రాయితీలు ఇవ్వాలన్నారు. ఎంబీసీల స్వయం ఉపాధి పథకాలకు ఇచ్చే రాయితీకి సంబంధించిన ఫైలుపై సీఎం గురువారం సంతకం చేశారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు గత బడ్జెట్లో రూ. వెయ్యి కోట్లు కేటాయించామని, ఈసారి కూడా బడ్జెట్లో నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. అదే విధంగా రూ. లక్ష నుంచి రూ. 12 లక్షల వరకు యూనిట్లు నెలకొల్పేందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని ఆదేశించారు. వీలైనంత ఎక్కువ రాయితీలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బీసీలకు అమలు చేసే ఆర్థిక మద్దతు పథకానికి గతంలో రూ. లక్ష రుణానికి గాను రూ. 60 వేలు(60%) రాయితీ ఇచ్చేవారు. అయితే రాయితీ మరింత పెంచి.. రూ. లక్ష రుణానికి రూ. 80 వేలు (80%), రూ. 2 లక్షల లక్షల విలువైన యూనిట్ నెలకొల్పే వారికి రూ. 1.40లక్షలు(70%), రూ. 2 నుంచి రూ. 12 లక్షల విలువైన యూనిట్లు నెలకొల్పే వారికి 60% (గరిష్ఠంగా రూ.5 లక్షలు) రాయితీ ఇవ్వాలని సీఎం ఆదేశించారు. రాయితీల విషయంలో స్పష్టత వచ్చినందున ఎంబీసీల కోసం అమలు చేయాల్సిన పథకాలకు వెంటనే రూపకల్పన చేసి, సహాయం అందించడం ప్రారంభించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి నిర్ణయంపై ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేసి సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.



ఉలిక్కి పడ్డ కాంగ్రెస్

- కేసీఆర్ మూడో ఫ్రంట్ యోచనతో ఆందోళన
- యూపీఏని నిలబెట్టుకోవాలని 'హస్తం' తాపత్రయం
- కేసీఆర్ వ్యూహాలతో బీజేపీకే లాభమని ఆందోళన

న్యూఢిల్లీ, మార్చి 8: కాంగ్రెస్, బీజేపీల్లేకుండా ఓ ఫెడరల్ కూటమి ఏర్పాటు చేస్తానంటూ టీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రకటన కాంగ్రెస్‌కు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. తెలంగాణలో టీఆర్‌ఎస్‌కు గట్టి ప్రత్యామ్నాయం కాంగ్రెస్సే. 'రాష్ట్రంలో కుస్తీ- ఢిల్లీలో దోస్తీ' అనే వైఖరి కేసీఆర్‌కు సరిపడదని, అంచేత బీజేపీపై కత్తి దూసినట్లే తమనుకూడా అంతే తీవ్రతతో ఆయన ఎదుర్కొంటారని కాంగ్రెస్ నేతలు విశ్వసిస్తున్నారు. "జాతీయ నేతలను కలిసి ఒప్పించడం కేసీఆర్‌కు కొత్తేం కాదు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన తన రాజకీయ పరిణితితోనే 15 పైచిలుకు ప్రధాన పార్టీల మద్దతు కూడగట్టారు. రాష్ట్రసాధన సమయంలో మాకు ఇచ్చిన హామీని బుట్టదాఖలు చేసి వదిలించుకున్నారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఆయన టీడీపీని ఎలా కూకటివేళ్లతో పెకలించినదీ, మా పార్టీని కూడా ఒక పథకం ప్రకారం ఎలా బలహీనపర్చినదీ మేమింకా మర్చిపోలేదు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే.. కేసీఆర్ ఫ్రంట్ ప్రధానంగా మమ్మల్నే టార్గెట్‌గా చేసుకుంటుందని, మా వెంట ఉన్న పార్టీలను లాగేసి, మా సంప్రదాయక ఓటుబ్యాంకును కూడా ఎగరేసుకుపోడానికి ప్రయత్నిస్తున్నట్లు అనిపిస్తోంది" అని సీనియర్ కాంగ్రెస్ నేత ఒకరు విశ్లేషించారు.

బీజేపీకే లాభం?

కేసీఆర్ ఫ్రంట్ వల్ల లాభపడేది బీజేపీయేనని కాంగ్రెస్ నేతలు విశ్లేషిస్తున్నారు. వారు చెబుతున్నదాని ప్రకారం.. ఇప్పటికే బీజేపీ అనేక రాష్ట్రాల్లో అధికారంలో ఉండడం ఆ పార్టీకి ఒక అడ్వాంటేజి. ఈ సమయంలో కాంగ్రెస్ ఓటుబ్యాంకును కేసీఆర్ ఫ్రంట్ చీలిస్తే అంతిమంగా కమలనాథులే విజయతీరాలకు చేరతారు. అందుకే కేసీఆర్ తృతీయ ఫ్రంట్ ప్రయత్నాల వెనుక బీజేపీ హస్తం ఉన్నదని కాంగ్రెస్ గట్టిగా అనుమానిస్తోంది. రాహుల్ ప్రధాని కాకుండా చేసేందుకు పన్నుతున్న కుట్రలో కేసీఆర్ ఫ్రంట్ ఒక భాగమని కాంగ్రెస్ ముఖ్యనేతలు అందుకే ఆరోపిస్తున్నారు.

ఆ రెండు ఫ్రంట్‌లకే మనుగడ!

గతంలో చిన్న పార్టీల సారథ్యంలో ఏర్పడ్డ నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్.. రెండిటికీ కాంగ్రెస్ లేదా బీజేపీ వెలుపలి నుంచి మద్దతిచ్చాయి. అయినా ఆ రెండూ ఎక్కువ కాలం మనుగడ సాగించలేక పోయాయి. కానీ బీజేపీ సారథ్యంలో ఏర్పడిన ఎన్డీఏ, కాంగ్రెస్ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న యూపీఏ మాత్రం పూర్తికాలం అధికారంలో కొనసాగగలిగాయి. కాంగ్రెస్ నేతలు దీన్నే గుర్తు చేస్తున్నారు. 'ఏ ఫ్రంట్‌కైనా జాతీయ పార్టీలే మూలాధారం. సారథ్యం కూడా వారిదే కావాలి. కాంగ్రెస్ నేతృత్వమైనా ఉండాలి లేక బీజేపీదైనా.. ఇవి కాకుండా ప్రాంతీయ పార్టీలు గనక కూటమి ఏర్పరిస్తే అది చుక్కాని లేని నావలా మారుతుంది.. అంతా తలో దిక్కూ లాగుతారు.. చివరకు మధ్యంతరాలు తప్పవు' అని వారు అభిప్రాయపడుతున్నారు. అయితే, అప్పటికీ ఇప్పటికీ పరిస్థితి మారిందని.. కాంగ్రెస్ పార్టీగానీ, పార్టీ అధినాయకత్వంగానీ అప్పుడున్నంత బలంగా ఇప్పుడు లేదని థర్డ్ ఫ్రంట్ మద్దతుదారులు గుర్తుచేస్తున్నారు. మరోవైపు ఇరవై ఒక్క రాష్ట్రాల్లో అధికారం కోల్పోయినా కాంగ్రెస్ ఆశలు సజీవంగా ఉన్నాయంటే దానికి కారణం.. వారికి సంప్రదాయంగా ఉన్న ఓటుబ్యాంకే. దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్‌కు 15 నుంచి 18 శాతం ఓటు బ్యాంకు పదిలంగా ఉంది. పటిష్ఠ నాయకత్వం, మంచి ఎజెండా, పటుతర ఎన్నికల వ్యూహాలు ఉంటే తమకొచ్చే ఓట్ల శాతం పెరుగుతుందని వారి విశ్వాసం. అయితే, కేసీఆర్ ఫ్రంట్ గనక తమ ఓటుబ్యాంకును చీలిస్తే అది తమ పార్టీ అస్తిత్వానికే దెబ్బ కాగలదని కాంగ్రెస్ ఆందోళన చెందుతోంది.

ఇవీ కాంగ్రెస్ భయాలు!

తెలంగాణ ఉద్యమ సమయంలో అనుసరించిన ఎత్తుగడనే కేసీఆర్ ఇప్పుడూ రచిస్తారని కాంగ్రెస్‌వాదుల అభిప్రాయం. అదను చూసి దెబకొట్టే ఆ వ్యూహం ఫలించినా ఫలించవచ్చని వారి ఆందోళనగా కనిపిస్తోంది. 'దేశవ్యాప్తంగా మోదీపై మోజు తగ్గుతోంది. మరోపక్క రాహుల్‌గాంధీ నేతృత్వానికి జాతీయస్థాయిలో పూర్తి అనుకూలత, సమ్మతి లేవు. మమతా బెనర్జీ, ప్రకాష్ కారత్ లాంటి నేతలు ఆయన నాయకత్వాన్ని సమర్థించట్లేదు. ఈ అనిశ్చితి వాతావరణాన్ని కేసీఆర్ తెలివిగా సొమ్ము చేసుకోగలరు' అని కాంగ్రెస్ నేతలు విశ్లేషిస్తున్నారు.

ఎస్పీ, బీఎస్పీలను లాగేస్తే...!

పార్లమెంట్‌కు దారి ఉత్తరప్రదేశ్ మీదుగానేనని అంతా భావిస్తారు. అక్కడున్న రెండు ప్రధాన పార్టీలు- సమాజ్‌వాదీ, బీఎస్పీలు ఎక్కువగా కాంగ్రెస్ అనుకూలత ఉన్నవి. వాటికి వివిధ వర్గాల్లో.. ముఖ్యంగా నిమ్న వర్గాల్లో గల ఓటు బ్యాంకు వల్ల ఆ పార్టీల వైఖరి చాలా కీలకం. ఆ రెండు పార్టీలూ ఇప్పుడు పొత్తు పెట్టుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో.. ఆ రెండు పార్టీల్లో ఏదో ఒకదాన్ని, వీలైతే రెంటినీ మూడో కూటమిలోకి కేసీఆర్ లాగేయగలిగితే అది తమకు శరాఘాతమవుతుందని కాంగ్రెస్ ఆందోళన చెందుతోంది. మొత్తం మీద కేసీఆర్ ఫ్రంట్ వల్ల తమకు కొంత ముప్పు ఉండవచ్చని కాంగ్రెస్ భావిస్తున్న మాట నిజం. దీన్ని ఎదుర్కొనడానికి ఏం చేయాలన్నదానిపై ఆ పార్టీ తీవ్రంగా తర్జనభర్జన పడుతోంది.

కేసీఆర్ వేగం చూసే సోనియా కదిలారు

న్యూఢిల్లీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): థర్డ్ ఫ్రంట్ ఏర్పాటుపై కేసీఆర్, మమతాబెనర్జీల మధ్య చర్చలు జర గడం వల్లనే సోనియాగాంధీలో కదలిక వచ్చిందని ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్ అన్నారు. అందుకే ఆమె మార్చి 13న వివిధ పార్టీలతో విందు సమావేశానికి ఏర్పాటు ప్రారంభించారని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే గతంలో కాంగ్రెస్ పార్టీకి, ఇప్పటి కాంగ్రెస్ పార్టీకి తేడా ఉన్నదని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా చాలా చిన్న పార్టీలతో సమానంగా మారిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మళ్లీ పూర్వవైభవం సంపాదిస్తుందనే ఆశాభవం కలిగినప్పుడే ఇతర పార్టీలు ఆ పార్టీ వద్దకు చేరుతాయన్నారు. సోనియా గాంధీ విందుకు తమకు ఆహ్వానం ఇంకా రాలేదని వస్తే ఆలోచిస్తామని చెప్పారు. కాగా సోనియాగాంధీ విందుకు తెలుగుదేశం పార్టీని ఆహ్వానించారన్న వార్తలో నిజం లేదని, ఒక వేళ ఆహ్వానించినా టీడీపీ హాజరు కాదని తమకు తెలుసని ఒక సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చెప్పారు.



క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన హోమంలో పూర్ణాహుతి చేస్తున్న హరీశ్‌రావు

దేశంలో మార్పు కోసం సీఎం యత్నం

- సమస్యలను కాంగ్రెస్, బీజేపీ పట్టించుకోలేదు
- మంత్రుల మామూళ్లను బంద్ చేయించిన కేసీఆర్: హరీశ్

గజ్వేల్, మార్చి 8: దేశరాజకీయాల్లో మార్పు కోసం ఎవరో ఒకరు పూనుకోవాలని, అందుకు సీఎం కేసీఆర్ ముందుకొచ్చారని భారీనీటిపారుదల శాఖ మంత్రి టీ హరీశ్‌రావు తెలిపా రు. అసాధ్యంగా ఉన్న తెలంగాణను సుసాధ్యం చేసిన కేసీఆర్ అనుకుంటే ఏదైనా చేయగలరని ధీమా వ్యక్తం చేశా రు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో సీఎం మినీ క్యాంపు కార్యాలయాన్ని(ఎమ్మెల్యే క్వార్టర్స్) గురువారం మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర రాజకీయాలపై సీఎం కేసీఆర్ చేసిన ప్రకటనకు మేధావులు, రాజకీయ నాయకుల మద్దతు లభిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, కాంగ్రెస్, బీజేపీలు విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో విఫలమయ్యాయని దుయ్యబట్టారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లవుతున్నా వ్యవసాయరంగం గురించి కేంద్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదని, ధరలు నిర్ణయించే అధికారం కేంద్రానికే ఉండటంతో గిట్టుబాటుధర రాక రైతు ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలో అగ్రదేశాల సరసన భారత్‌ను నిలపాలన్నదే సీఎం కేసీఆర్ కల అని హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ చేపట్టిన బస్సు యాత్ర తుస్సు యాత్రగా మారిందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. గతంలో హైదరాబాద్‌లోని క్లబ్‌లు, పబ్‌ల నుంచి నగర మంత్రులు నెలనెలా మామూళ్లు తీసుకునేవారని, వాటన్నింటినీ బంద్ చేయించి, అసాంఘిక శక్తుల భరతం పట్టించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మడుపు భూంరెడ్డి, గడ ప్రత్యేకాధికారి హనుమంతరావు పాల్గొన్నారు. కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా శృంగేరీ పండితుడు గోపీకృష్ణశర్మ ఆధ్వర్యంలో చండీ పూజ, రాష్ట్ర వాస్తు సలహాదారు సుద్దాల సుధాకర్‌తేజ ఆధ్వర్యంలో వాస్తుహోమం నిర్వహించారు.

సీఎం ఆజ్ఞల అమలులో బిజీగా ఉన్నా

సీఎం కేసీఆర్ ఇచ్చిన ఆజ్ఞలను, ఆలోచనలను అమలు చేయడంలో తాను బిజీగా ఉన్నానని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే కథనాలను చదివేంత సమయం తనకు లేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియా కథనాలు, హరీశ్‌రావు భవితవ్యంపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన పైవిధంగా బదులిచ్చారు.



ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రతినిధుల సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వంగపల్లి శ్రీనివాస్, హనుమంతు, మురళి తదితరులు

మాదిగలకిచ్చిన హామీలను అమలు చేయాలి: వంగపల్లి

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మాదిగ, మాదిగ ఉప కులాలకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం ప్రకటించాలని తెలంగాణ ఎమ్మార్పీఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం ఈ నెల 11న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నాన్ టీచింగ్ గ్రౌండ్‌లో మాదిగ, మాదిగ ఉపకులాల రాష్ట్ర ప్రతినిధుల సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం విద్యానగర్‌లోని సంస్థ కార్యాలయంలో వంగపల్లి ఆవిష్కరించారు. ప్రభుత్వ వైఖరిని బట్టి ఈ నెల 11న జరిగే సదస్సులో భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

జీతాల కోసం బిచ్చమెత్తుకోవాలా..?

- ప్రభుత్వంపై కాంట్రాక్ట్ లెక్చరర్ల మండిపాటు

హైదరాబాద్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వేతనాల కోసం ప్రభుత్వాన్ని బిచ్చమెత్తుకోవాల్సి వస్తోందని, ప్రతి నెల ప్రాధేయ పడాల్సిన దుస్థితి నెలకొందని ప్రభుత్వ కాలేజీల కాంట్రాక్టు లెక్చరర్లు ఆవేదన వ్యక్తం చేశారు. 4 నెలల నుంచి వేతనాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తారని ఆశపడ్డామని, కానీ సమయానికి వేతనాలు కూడా అందని గడ్డు పరిస్థితి నెలకొందని సంఘం నేత సయ్యద్ జబీవుల్లా విమర్శించారు. కనీసం 'కాంట్రాక్ట్' అనే పదాన్ని తొలగించలేకపోయిందని ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై స్పందించకుంటే త్వరలో కాంట్రాక్టు అధ్యాపకులు కుటుంబాలతో సహా ఉద్యమం చేపడతారని హెచ్చరించారు. వేతనాలు విడుదల చేయకుంటే ఇంటర్మీడియట్ మూల్యాంకనాన్ని బహిష్కరిస్తామన్నారు.

బీజేపీ మిత్రధర్మం పాటించడం లేదు : రమణ

హైదరాబాద్ సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సమస్యల పరిష్కారం విషయంలో బీజేపీ మిత్రధర్మం పాటించడం లేదని టీడీపీటీఎస్ అధ్యక్షుడు రమణ ఆరోపించారు. టీడీపీ కార్యాలయంలో గురువారం మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల తర్వాత తెలంగాణలో టీడీపీకి దూరంగా ఉంటామని ప్రకటించిన బీజేపీ.. ఇప్పుడు ఏపీలోనూ అదే తరహాలో వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. తెలంగాణలో టీడీపీ అధికారంలోకి వస్తే రైతుల రుణాలన్నీ మాఫీ చేస్తామని, ఎన్నికల మేనిఫెస్టోలో ఈ అంశాన్ని చేరుస్తామని ప్రకటించారు. మహిళలకు రాజకీయంగా, సామాజికంగా చేయూతనిచ్చినిచ్చింది టీడీపీ మాత్రమేనని స్పష్టం చేశారు.



సంగారెడ్డి జిల్లా కందిలో విలేకరులతో మాట్లాడుతున్న లక్ష్మణ్

కేసీఆర్‌కు బీజేపీ ఫోబియా

- మజ్లిస్ కోసమే థర్డ్ ఫ్రంట్ : లక్ష్మణ్

కంది/హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధిని చూసి.. కేసీఆర్‌కు బీజేపీ ఫోబియా పట్టుకుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. మజ్లిస్ పార్టీ కోసం థర్డ్ ఫ్రంట్ అంటూ కొత్త నాటకం మొదలుపెట్టారని మండిపడ్డారు. సంగారెడ్డి జిల్లా కందిలో బీజేపీ జిల్లా కార్యాలయ నిర్మాణానికి గురువారం ఆయన భూమి పూజ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టిన సీఎం.. దేశాన్ని ఉద్ధరిస్తానంటూ మాట్లాడటం చూస్తుంటే సిగ్గేస్తుందన్నారు. హక్కులపై నిలదీసిన ప్రజాసంఘాలు, ప్రతిపక్ష నేతలు, దళితులు, రైతులను జైలులో పెట్టించారని దుయ్యబట్టారు. 2019 ఎన్నికల్లో కేసీఆర్‌ను ప్రజల ముందు దోషిగా నిలబెడతామని హెచ్చరించారు. మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్గంలో ఒక్క మహిళకూ ప్రాతినిధ్యం కల్పించకపోవడంపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమాన్ని గాలికొదిలేశారని ఆరోపించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుంటే, తెలంగాణలో అందుకు భిన్నమైన పాలన సాగుతోందని విమర్శించారు. రాజకీయ పార్టీల్లో మహిళలకు మూడోవంతు అవకాశాలు కల్పిస్తున్న ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్, టీఆర్ఎస్‌లు రెండూ పాపాల పుట్టలని ఆరోపించారు.

రిజర్వేషన్ల పెంపు సున్నితమైన అంశం: శేషగిరిరావు

మతపరమైన రిజర్వేషన్ల పెంపు సున్నితమైన అంశమని బీజేపీ సీనియర్ నేత ప్రొఫెసర్ ఎస్‌వీ శేషగిరిరావు అభిప్రాయపడ్డారు. రిజర్వేషన్ల పెంపు అంశాన్ని రాష్ట్రాలకే వదలిపెట్టాలన్న సీఎం కేసీఆర్ డిమాండ్ సమర్థనీయం కాదన్నారు. రిజర్వేషన్ల వ్యవహారం రాష్ట్రాలకు ఇవ్వడమన్నది ఆషామాషీ వ్యవహారం కాదని, ఒక వేళ ఇస్తే.. వైషమ్యాలు, విద్వేషాలు చెలరేగే ప్రమాదం ఉందన్నారు. టీఆర్ఎస్.. ప్రాంతీయ పార్టీ అని జాతీయ దృక్కోణం లేదని పేర్కొంటూ, నదీజలాల విషయంలో మాట్లాడే హక్కు కేసీఆర్‌కు లేదని అన్నారు.



రాష్ట్రపతి చేతుల మీదుగా నారీ శక్తి పురస్కారం అందుకుంటున్న జయమ్మ

తెలంగాణ మహిళకు నారీ శక్తి పురస్కారం

- రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్న జయమ్మ

న్యూఢిల్లీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మనుషుల అక్రమ రవాణా ఫలితంగా జీవితం కోల్పోయిన మహిళలకు అండగా నిలబడిన జయమ్మకు జాతీయ స్థాయిలో నారీ శక్తి పురస్కారం దక్కింది. మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర పతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణలో సెక్స్ వర్కర్ల కుటుంబాల్లోని మహిళలను ఆదుకోవడం, హెచ్ఐవీ విస్తృతం కాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, అక్రమ రవాణా ద్వారా పడుపు వృత్తిలోకి చేరిన యువతులను గుర్తించి వారిని రక్షించడం వంటి సేవాకార్యక్రమాలు 20 ఏళ్లగా చేస్తున్నందున ఆమెకు ఈ గౌరవం దక్కింది. తాను కూడా అక్రమ రవాణా బాధితురాలినేనని, అందుకే వారికి మానసిక ధైర్యాన్నిచ్చి గౌరవప్రదమైన పని చేసుకునేందుకు చాలాకాలంగా ఉపాధి కల్పిస్తున్నట్లు జయమ్మ వెల్లడించారు. ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చానని ఉద్వేగానికి గురయ్యారు. రాష్ట్ర సర్కారు ఒంటరి మహిళ పింఛను ఇస్తోందని వెల్లడించారు.

క్రీడా కోటాలో అనర్హురాలికి వైద్యసీటు!

- ద్విసభ్య కమిటీ విచారణలో వెలుగులోకి
- 'సాట్స్' నిర్వాకమే కారణమని గుర్తింపు
- ఈఏడాది సీటు కోల్పోయిన దళిత విద్యార్థిని
- 'కోటా'లో అక్రమాలంటూ గతంలో హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి'

హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (సాట్స్) నిర్వాకంతో అర్హత లేకున్నా ఓ విద్యార్థినికి వైద్య విద్యలో ప్రవేశం లభించింది. నిర్మల్ జిల్లాకు చెందిన ఇవాంజిలిన్ జాతీయస్థాయిలో జరిగిన విలు విద్య పోటీల్లో 9 సార్లు పాల్గొంది. క్రీడా కోటాలో వైద్య సీటు పొందేందుకు ఆటకు సంబంధించిన ధ్రువపత్రాలను 'సాట్స్'కు సమర్పించింది. అయితే సంబంధిత అధికారులు ఆమె ధ్రువపత్రాలు సరిగా సమర్పించలేదనే సాకు చూపి ఒక ర్యాంకు బదులు మరో ర్యాంకు ఇచ్చారు. దీంతో క్రీడా కోటాలో అర్హత ఉండి కూడా ఆ విద్యార్థిని సీటు కోల్పోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో 'క్రీడా కోటా.. అక్రమాల పుట్ట' అంటూ ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై సీఎం కార్యాలయం (సీఎంఓ) స్పందించింది. అయితే ఈ వ్యవహారంపై అప్పటికే ఏర్పాటైన ద్విసభ్య కమిటీ తన ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. విద్యార్థి విషయంలో 'సాట్స్' తప్పు చేసిందని కమిటీ విచారణలో బహిర్గతమైంది. అయితే ప్రస్తుత విద్యా సంవత్సరం చివర్లో ఉండడంతో ఆమెకు సీటు ఎలా ఇవ్వాలన్న విషయమై చర్చ నడుస్తోంది. ఇదిలాఉండగా.. ద్విసభ్య కమిటీ విలు విద్య అసోసియేషన్ ప్రతినిధులను పిలిపించి మాట్లాడింది. విద్యార్థినికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలనూ సాట్స్‌కు ఇచ్చామని, ఇందులో తమ తప్పు లేదని కమిటీకి అసోసియేషన్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఇంజనీరింగ్, వైద్య, వ్యవసాయం వంటి వృత్తి విద్యా కోర్సుల్లో ప్రతి ఏడాది క్రీడా కోటా కింద సీట్లు పొందే విద్యార్థులు సమర్పించిన ధ్రువపత్రాల పరిశీలనకు ప్రభుత్వం 2015లో ఓ కమిటీని నియమించింది. 2017-18 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్లకు వచ్చిన విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలనకు గతేడాది ఏప్రిల్‌లో సాట్స్‌కే చెందిన 9 మందితో ఓ కమిటీని ఏర్పాటు చేశారు. క్రీడా కోటాలో కాళోజీ వర్సిటీకి పంపిన సిఫార్సుపై కూడా వీరే సంతకాలు చేసినట్లు తెలుస్తోంది. వాస్తవానికి జీఓ 8 ప్రకారం వీరి సిఫార్సును పరిగణనలోకి కూడా తీసుకోకూడదు. మరోవైపు జీవో 11ను కూడా తుంగలో తొక్కినట్లు తెలిసింది. జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొన్న అభ్యర్థులకు సంబంధించిన పత్రాలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) ధ్రువీకరించాల్సి ఉన్నా.. 'స్కాట్' 2016 వరకూ పట్టించుకోలేదు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో మాత్రం ఇద్దరు విద్యార్థుల విషయంలో 'శాయ్' ధ్రువీకరణ కావాలంటూ పట్టుబట్టింది. దీంతో ద్వంద్వ విధానం వెల్లడైంది.

'రిజర్వేషన్లు' రాష్ట్రాల హక్కు!

(మొదటి పేజీ తరువాయి)



పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద రిజర్వేషన్ల అంశంపై ప్లకార్డులతో నిరసన చేపట్టిన టీఆర్ఎస్ ఎంపీలు

చేయాలంటూ అన్నాడీఎంకే పార్టీ ఎంపీలు, నీరవ్ మోదీ అంశంపై తృణమూల్ ఎంపీలు, కొందరు కాంగ్రెస్ ఎంపీలూ నిరసనకు దిగారు. పార్లమెంట్ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ బ్యాంకుల్లో లోపాలపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పీకర్‌కు తెలిపారు. సభాకార్యకలాపాలు జరగనీయకుండా పెద్దఎత్తున ఎంపీలు నినాదాలు చేయడంతో సుమిత్రా మహాజన్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. గురువారం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే రోజూలాగా టీఆర్ఎస్ ఎంపీలు స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి నిరసనకు దిగలేదు. మహిళా దినోత్సవం నేపథ్యంలో స్పీకర్ వచ్చి మహిళలను ఉద్దేశించి సందేశం ఇచ్చే వరకు నినాదాలు ఇవ్వకుండా ఎంపీలు సంయమనం పాటించారు. అది పూర్తయిన వెంటనే వెల్‌లోకి వెళ్లి ఆందోళనలు కొనసాగించారు. మహిళలను గౌరవించేందుకే తాము నిరసనను ఆపినట్లు జితేందర్‌రెడ్డి తెలిపారు.

కేంద్రానికి అర్థం కాకనే..

తెలంగాణ పంపిన రిజర్వేషన్ల బిల్లు కేంద్రానికి అర్థంకాకనే అది మతపరమైన బిల్లుగా భావిస్తోందని టీఆర్ఎస్ ఎంపీ వినోద్ ఆరోపించారు. షెడ్యూల్ కులాలు, తెగలు, వెనకబడిన తరగతులను ఉద్దేశించి అసెంబ్లీ తీర్మానం చేసిందని స్పష్టం చేశారు. టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ సమయంలోనే రాష్ట్రం విడిపోతే ఇక్కడి వారికి రిజర్వేషన్లు పెరుగుతాయని, గిరిజనులు, మైనారిటీలకు న్యాయం జరుగుతుందని కేసీఆర్ ప్రకటించారని.. దానికి అనుగుణంగా అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసేందుకు కృషి చేశారని చెప్పారు. జనాభా పెరిగిందని నిరూపించగలిగితే రిజర్వేషన్లు పెంచుకోవచ్చని ఇంద్ర సహానీ కేసులో సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందన్నారు. అలా నిరూపించేందుకే విశ్రాంత ఐఏఎస్‌లు ఎస్.చెల్లప్ప, జి.సుధీర్‌ల నేతృత్వంలో వేర్వేరు కమిషన్లు వేసి నివేదిక తెప్పించారని వివరించారు. వాటి ఆధారంగానే అసెంబ్లీలో బిల్లును ఆమోదించారని.. గవర్నర్ ఆమోదం కూడా పొందిందని తెలిపారు. అది కేంద్ర ప్రభుత్వానికి పంపి 10 నెలలైనా స్పందించలేదని, ఆ చట్టాన్ని తొమ్మిదో షెడ్యూల్‌లో పెడితే సుప్రీంకోర్టు పరిధిలోకి రాదని చాలాసార్లు విజ్ఞప్తి చేశామని చెప్పారు. అయినా స్పందన లేకపోవడంతోనే ఆందోళనకు దిగామన్నారు. ఈ రిజర్వేషన్లు ఎలా వర్తిస్తాయని డీవోపీటీ పేర్కొనడం దారుణమని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే దీన్ని ఆపేశారని ఆరోపించారు. ఇది మతపరమైన బిల్లు కాదని స్పష్టం చేశారు.

గాంధీ విగ్రహం వద్ద..

సభ వాయిదా పడిన తర్వాత టీఆర్ఎస్ ఎంపీలందరూ పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని రిజర్వేషన్ల అంశంపై నిరసన చేపట్టారు. ప్లకార్డులు చూపుతూ ఆందోళనకు దిగారు. ఎండలో నిలబడి చాలాసేపు కేంద్ర వైఖరిని ఎండగట్టారు. అనంతరం తిరిగి సభ ప్రారంభమైనా పరిస్థితిలో మార్పులేదు. ఐదు పార్టీల ఎంపీలు వెల్‌లోకి వచ్చి నినాదాలివ్వడంతో సభలో గందరగోళం నెలకొంది. 10 నిమిషాల పాటు ఆందోళనల నడుమే స్పీకర్ సభను నడిపారు. నినాదాల హోరు పెరగడంతో సభను వాయిదా వేశారు.

నాలుగో రోజూ నిరసనలు

- స్తంభించిన పార్లమెంటు ఉభయ సభలు
- కావేరీ బోర్డుపై అన్నాడీఎంకే, పీఎన్‌బీ స్కాంపై కాంగ్రెస్, తృణమూల్
- క్షణం కూడా సాగకుండానే వాయిదాలు

న్యూఢిల్లీ, మార్చి 8: పార్లమెంటు ఉభయ సభలూ వరుసగా నాలుగో రోజూ దద్దరిల్లాయి. మహిళా దినోత్సవం సందర్భంగా గంటపాటు చర్చను మినహాయిస్తే.. ఎటువంటి కార్యక్రమాలూ చేపట్టకుండానే వాయిదా పడ్డాయి. మూడు రోజులుగా ఒక్క క్షణం కూడా ఎటువంటి చర్చ జరగకుండా అడ్డుకుంటున్నా.. మహిళా దినోత్సవంపై చర్చకు మాత్రం పార్టీలకతీతంగా అంతా సంఘీభావం తెలిపారు. అది పూర్తయిన వెంటనే, ప్లకార్డులు పట్టుకుని వివిధ పార్టీల నేతలు వెల్‌లోకి దూసుకొచ్చారు. బ్యాంకింగ్ కుంభకోణం, కావేరీ బోర్డు ఏర్పాటు తదితర అంశాలపై నినాదాలతో హోరెత్తించారు. దాంతో, రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తీవ్ర గందరగోళంలో ఆయన ఏం మాట్లాడుతున్నారో కూడా వినిపించలేదు. దీంతో సభను వాయిదా వేశారు. మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి సమావేశమైన వెంటనే ప్రతిపక్ష ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. కావేరీ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నాడీఎంకే, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్‌లు పీఎన్‌బీ కుంభకోణంపై ఆందోళన చేశారు. తీవ్ర గందరగోళం నెలకొనడంతో డిప్యూటీ చైర్మన్ పీజే కురియన్ సభను శుక్రవారానికి వాయిదా వేశారు. లోక్‌సభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మహిళా దినోత్సవం సందర్భంగా, స్పీకర్ సుమిత్రా మహాజన్ మాట్లాడే వరకూ సభ్యులు వేచి చూశారు. ఆమె ప్రసంగం ఎంపీలు వెల్‌లోకి దూసుకొచ్చి, ప్లకార్డులతో నిరసన తెలిపారు. సభ్యుల ఆందోళన మధ్య తొలుత మధ్యాహ్నానికి, ఆ తర్వాత శుక్రవారానికి స్పీకర్ సభను వాయిదా వేశారు.

చెప్పి చూద్దాం

(మొదటి పేజీ తరువాయి)

గురువారం సుదీర్ఘంగా సమీక్షించారు. ఉన్నతాధికారులు, న్యాయ నిపుణులతో ఆయన భేటీ అయ్యారు. కేంద్రానికి సవివర నివేదికను పంపడం ఎలా అనే విషయమై తర్జనభర్జన జరిగింది. రాష్ట్రంలో ఎస్టీ జనాభా పెరుగుదలపై సమగ్ర నివేదిక ఇవ్వాల్సిన చెల్లప్ప కమిషన్ గడువును ఈ ఏడాది చివరి వరకూ పొడిగించిన అంశం ప్రస్తావనకు వచ్చింది. ముస్లింలు, ఎస్టీలు.. రెండు వర్గాలకూ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించిన బిల్లులను కలిపి కాకుండా విడివిడిగా పంపి, మరోసారి కేంద్రాన్ని కోరితే ఎలా ఉంటుందనే అంశంపైనా చర్చ జరిగింది. తొలుత, కేంద్రం అడిగిన వివరణకు జవాబిద్దామని, దానిని బట్టి తదుపరి చర్యలు తీసుకుందామని నిర్ణయించినట్లు తెలిసింది. నిజానికి, బీసీ, ఎస్సీ, ఎస్టీ (విద్యా సంస్థలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్) బిల్లును రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించి, రాష్ట్రపతి ఆమోదానికి తీర్మానాన్ని ఢిల్లీకి పంపిన విషయం తెలిసిందే. మైనారిటీలకు 12 శాతానికి, ఎస్టీలకు 10 శాతానికి రిజర్వేషన్లు పెంచాలని అందులో రాష్ట్ర ప్రభుత్వం కోరింది. జనాభా దామాషా ప్రకారం ఆ రెండు వర్గాలకు రిజర్వేషన్ పెంచడానికి అనుమతి ఇవ్వాలని కోరింది. తెలంగాణ పంపిన తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వం సిబ్బంది, శిక్షణ శాఖ, గిరిజన సంక్షేమ శాఖల అభిప్రాయాలను కోరుతూ పంపించింది. అయితే, ఆ బిల్లుపై ఎటువంటి చర్యలు తీసుకున్నారంటూ టీడీపీ సభ్యుడు దేవేందర్ గౌడ్ బుధవారం అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ గంగారాం అహిర్ లిఖితపూర్వకంగా జవాబు ఇచ్చారు. కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి మరింత వివరణ కోరామని తెలిపారు. "ఇందిరా సవానీ కేసులో 16.11.1992న 9 మంది సభ్యుల సుప్రీం ధర్మాసనం ఇదే అంశంలో తీర్పు ఇచ్చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 16లోని 4వ క్లాజు ప్రకారం, రిజర్వేషన్ల కల్పనకు సంబంధించి 'తగినంత ప్రాతినిధ్యం' అని మాత్రమే ఉంది. 'దామాషా ప్రాతినిధ్యం' అని లేదు. అలాగే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4) ప్రకారం కల్పించే రిజర్వేషన్లు 50% దాటరాదనీ ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు పరిశీలనల ప్రకారం.. అసాధారణ పరిస్థితుల్లోనే ఈ విషయంలో మినహాయింపు ఇవ్వగలం. ఇటువంటి పరిస్థితుల్లో 50 శాతానికి మించి రిజర్వేషన్లు పెంచాలంటే అత్యంత జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే, తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి పంపించిన ప్రతిపాదనల్లో అనుమతి ఇవ్వడానికి తగిన ఆధారాలు, వాస్తవాలను చూపలేదు. పైగా, ఈ ప్రతిపాదన సుప్రీం ఆదేశాలకు వ్యతిరేకం కూడా. ఈ మేరకు సిబ్బంది, శిక్షణ శాఖ వ్యక్తం చేసిన అభిప్రాయాలపై వివరణ ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాం. గిరిజన శాఖ పంపిన అభిప్రాయాలను కూడా రాష్ట్రానికి అందజేశాం" అని రాజ్యసభకు లిఖితపూర్వకంగా ఇచ్చిన జవాబులో కేంద్రం పేర్కొంది. ఇందులోని ప్రతి అంశంపైనా వివరణ పంపాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. తమిళనాడులో ప్రస్తుతం అమలవుతున్న రిజర్వేషన్ల పద్ధతి అంశం మరోసారి సీఎం సమీక్షలో ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. తమిళనాడు బిల్లు 1994లో చట్ట రూపం దాల్చిందని, దానిని కేంద్రం తొమ్మిదో షెడ్యూలులో చేర్పించిందని గుర్తు చేయనుంది.

తమిళనాట ఎలా ఇచ్చారు!

రిజర్వేషన్ల పెంపులో కరుణ, జయలదే కీలకపాత్ర.. 41శాతం నుంచి 69శాతానికి పెంచిన ఘనత

- షెడ్యూలు 9లో చేర్చి, రక్షణ
- మిగతా రాష్ట్రాల దృష్టి ఇప్పుడు తమిళనాడు వైపే



చెన్నై, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో జనాభా ప్రాతిపదికన ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వడం కుదరదని పార్లమెంటు సాక్షిగా కేంద్రం తేల్చి చెప్పిన నేపథ్యంలో రిజర్వేషన్ల పెంపు మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రిజర్వేషన్లు 50శాతానికి మించరాదని సుప్రీంకోర్టు గతంలో పేర్కొనడం, కేంద్రం కూడా రిజర్వేషన్ల పెంపునకు విముఖత చూపడంతో... దేశంలో రిజర్వేషన్ల పెంపుకోసం ప్రయత్నాలు మొదలుపెట్టిన రాష్ట్రాలన్నీ ఇప్పుడు తమిళనాడువైపే చూస్తున్నాయి. ఏ రాష్ట్రంలో లేనంతగా తమిళనాట 69 శాతం రిజర్వేషన్ల అమలు ఎలా సాధ్యమైందంటూ బూతద్దంతో కారణాలను వెతుకుతున్నాయి. వెనుకడుగువేయని నాయకత్వం, కేంద్రంలో చక్రం తిప్పగలిగిన రాజకీయ చాణక్యం కలగలిపి ఈ రిజర్వేషన్ల అమలకు దోహదపడిందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ద్రవిడ పార్టీలే ఈ రిజర్వేషన్ల అమలులోనూ దృఢంగా వ్యవహరించాయి. మద్రాసు ప్రెసిడెన్సీ హయాంలో ఎస్సీ, ఎస్టీలకు 16 శాతం, ఓబీసీలకు 25 శాతం చొప్పున మొత్తం 41 శాతం రిజర్వేషన్లు వుండేది. 1971లో రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కరుణానిధి రిజర్వేషన్ల కల్పనకు సట్టనాథన్ కమిషన్‌ను ఏర్పాటు చేసి.. ఆ కమిషన్ సిఫారసుల మేరకు క్రిమిలేయర్‌ను ప్రవేశపెట్టి బీసీలకు 31 శాతం రిజర్వేషన్ పెంచారు. బీసీలకు 16 శాతం, ఎంబీసీలకు 15 శాతం చొప్పున రిజర్వేషన్లు పెంచారు. ఎస్సీ, ఎస్టీలకు 18 శాతానికి పెంచి మొత్తం రిజర్వేషన్ల శాతాన్ని 49 శాతానికి చేర్చింది. 1980లో ఎంజీఆర్ నేతృత్వంలోని అన్నాడీఎంకే ప్రభుత్వం ఓబీసీలను రిజర్వేషన్ల సదుపాయాలకు క్రిమిలేయర్‌ను విధిస్తూ, రిజర్వేషన్ పొందటానికి వార్షిక ఆదాయం రూ.9వేలు మాత్రమే ఉండాలని నిబంధన విధించింది. అయితే ఆ నిర్ణయాన్ని ప్రధాన ప్రతిపక్షం డీఎంకే సహా అన్ని పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దీంతో క్రిమిలేయర్‌ను ఉపసంహరించుకున్న ఎంజీఆర్ ప్రభుత్వం ఓబీసీ (అదర్ బ్యాక్‌వర్డ్ క్లాస్)ల రిజర్వేషన్ శాతాన్ని 50కి పెంచడంతో మొత్తం రిజర్వేషన్ల శాతం 68కి చేరింది. అప్పట్లోనూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంతశాతం రిజర్వేషన్ అమలు కాలేదు. అయితే 1989లో కరుణానిధి మూడోసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) మాతృసంస్థ 'వన్నియార్ల సంఘం' తమకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్ర ప్రభుత్వోద్యోగాల్లో 2 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త ఆందోళనకు దిగింది. కరుణ ప్రభుత్వం వన్నియార్లకు రిజర్వేషన్ కల్పించింది. ఓబీసీల రిజర్వేషన్లను రెండుగా విభజించింది. ఓబీసీలకు 30 శాతం, ఎంబీసీలకు 20 శాతం రిజర్వేషన్లు ఇచ్చి వన్నియార్లను ఎంబీసీల్లో చేర్చింది. ఎస్టీలకు మరొక్క శాతం రిజర్వేషన్ పెంచింది. రిజర్వేషన్ 69 శాతానికి పెరిగింది. 1992లో సుప్రీంకోర్టు మండల్ కమిషన్‌పై తీర్పు వెలువరిస్తూ ఏ రాష్ట్రంలోనూ రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని స్పష్టం చేసింది. విజయన్ అనే వ్యక్తి తమిళనాడు రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. 50 శాతం రిజర్వేషన్లను మాత్రమే పాటించాలని ఆదేశించింది. 1994లో అప్పటి ముఖ్యమంత్రి జయలలిత రాష్ట్రంలో 69 శాతం రిజర్వేషన్లను అమలు పరచడానికి అనువుగా 'వెనుకబడిన తరగతుల చట్టం'ను రూపొందించటమే గాకుండా పార్లమెంట్ ద్వారా రాజ్యాంగ ధర్మాసనంలోని 9వ షెడ్యూలులో పొందుపరిచేలా చేశారు. ఈ విషయంలో జయకు అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు తన వంతు సహాయ సహకారాలను అందించారు. తమిళనాట అన్నాడీఎంకేతో పొత్తుకు సిద్ధమైన ఆయన.. జయ వినతిని మన్నించారు. ఆ చట్టాన్ని న్యాయస్థానాలలో సవాలు చేయడానికి వీలులేకుండా పోయింది.

ఇది ప్రభుత్వ వాదన...

తమిళనాట 69 శాతం రిజర్వేషన్లను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా అప్పటి జయ ప్రభుత్వం సమర్థవంతంగా వాదనలు వినిపించింది. తమిళనాట 1921 నుండి విద్యా సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగావకాశాల్లో రిజర్వేషన్లు అమలవుతూ వచ్చాయని, జనాభాలో పెరుగుతూ వస్తున్న కులాల శాతానికి అనుగుణంగా రిజర్వేషన్లను అమలు చేయడమే సామాజిక న్యాయమవుతుందని నాటి ప్రభుత్వం సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. కాగా, బిల్లును 9 షెడ్యూలులో పొందపరచడాన్ని సవాలు చేస్తూ మళ్లీ కోర్టును ఆశ్రయించేందుకు ప్రయత్నించిన న్యాయవాది విజయన్‌పై కొందరు దాడి చేశారు. వారెవరన్నది తేలకపోయినా.. ఆతర్వాత ఆయన ప్రయత్నం విరమించుకున్నారు.

రాజ్యాంగం ఏం చెబుతుందంటే..

ఆర్టికల్ 31బీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించే ప్రత్యేక చట్టాలేవైనా 9వ షెడ్యూలులో పొందుపరిస్తే వాటిని న్యాయస్థానాల్లో సవాలు చేయడానికి వీలులేదు. ఈ వెసులుబాటునే జయ సద్వినియోగం చేసుకున్నారు. పీవీ నరసింహారావుపై ఒత్తిడితెచ్చి, తన హయాంలో రిజర్వేషన్లు తగ్గాయన్న అపవాదు రాకుండా చూసుకున్నారు.

ఎవరెవరికి ఎంత శాతం?

ప్రస్తుతం బీసీలకు 50 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 19 శాతం రిజర్వేషన్ అమలులో వుంది. వెనుకబడిన తరగతులకు (బీసీలకు) 26.5 శాతం, వెనుకబడిన ముస్లిం (బీసీఎం)లకు 3.5 శాతం చొప్పున మొత్తం 30 శాతం, ఎంబీసీలకు 20 శాతం రిజర్వేషన్ వుంది. అరుంధతీయులకు 3 శాతంతో కలిపి ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు 1 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారు.

సీఎం కార్యదర్శిగా సుల్తానియా

(మొదటి పేజీ తరువాయి)

జారీ అయ్యేవరకు పశుసంవర్ధకశాఖ బాధ్యతలను కూడా ఆయనే నిర్వహించనున్నారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న మాణిక్‌రాజ్‌ను ముఖ్యమంత్రి కార్యాలయంలో అదనపు కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
సందీప్‌కుమార్ సుల్తానియా	పశుసంవర్ధక శాఖ కార్యదర్శి	సీఎం కార్యదర్శి
మాణిక్‌రాజ్	సంగారెడ్డి కలెక్టర్	సీఎంవోలో అదనపు కార్యదర్శి
కె.ధర్మారెడ్డి	మేడ్చల్ జేసీ	మెదక్ కలెక్టర్
టి.వినయ్‌కృష్ణారెడ్డి	ఖమ్మం జేసీ	జనగామ కలెక్టర్
సీహెచ్ శివలింగయ్య	నిర్మల్ జేసీ	మహబూబాబాద్ కలెక్టర్
వి.వెంకటేశ్వర్లు	సంగారెడ్డి జేసీ	సంగారెడ్డి కలెక్టర్
డి.అమోయ్‌కుమార్	భూపాలపల్లి జేసీ	భూపాలపల్లి కలెక్టర్
ఎం.హరిత	వరంగల్ రూరల్ జేసీ	వరంగల్ రూరల్ కలెక్టర్



యువ షూటర్ కోసం పరీక్షల రీషెడ్యూల్!

● అనీష్‌కు ఊరట ● సీబీఎస్ఈ బోర్డు సంచలన నిర్ణయం

న్యూఢిల్లీ: చదువా? క్రీడలా? ప్రతి ఆటగాడి జీవితంలో ఎదుర్కొనే క్లిష్టపరిస్థితి. టీనేజ్ సంచలనం అనీష్ భన్వాలాకు ఇలాంటి సంకట స్థితే ఎదురైంది. అయితే సీబీఎస్ఈ బోర్డు మాత్రం అతడికి ఊరటనిచ్చింది. యువ షూటర్ కోసం ప్రత్యేకంగా పరీక్షలను రీ షెడ్యూల్ చేస్తూ నూతన ట్రెండ్‌కు శ్రీకారం చుట్టింది. 15 ఏళ్ల అనీష్‌కు ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. మరోవైపు మెక్సికోలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ వరల్డ్‌కప్‌లో 25 మీ ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో నీరజ్‌తో కలసి భన్వాలా ఫైనల్ రౌండ్‌కు చేరుకున్నాడు. టోర్నీ నేపథ్యంలో ఈ నెల 6న జరిగిన హిందీ పరీక్షకు గైర్హాజరయ్యాడు. మెక్సికో వరల్డ్‌కప్ ముగిసిన తర్వాత మధ్యలో ఆరు రోజుల విరామం. ఆ తర్వాత సిడ్నీలో జరిగే జూనియర్ వరల్డ్‌కప్, గోల్డ్ కోస్ట్‌లో కామన్వెల్త్ గేమ్స్‌లో అనీష్ పాల్గొననున్నాడు. ఈ నేపథ్యంలో తన కుమారుడు తర్వాత పరీక్షలు రాసేవిధంగా అవకాశం కల్పించాలని అనిష్ తండ్రి వేడుకోవడంతో అతను మిస్ అయిన హిందీతోపాటు మిగతా పరీక్షలను సీబీఎస్ఈ బోర్డు రీషెడ్యూల్ చేసింది.



ఎందుకంత వివక్ష..!

మహిళల సెంట్రల్ కాంట్రాక్ట్‌పై నెటిజన్లు

న్యూఢిల్లీ: మహిళా దినోత్సవానికి ముందు రోజు పురుషులు, మహిళల క్రికెటర్లకు సంబంధించిన సెంట్రల్ కాంట్రాక్ట్‌లను బీసీసీఐ విడుదల చేసింది. ముఖ్యంగా పురుష క్రికెటర్ల వార్షిక జీతాలను ఊహించని రీతిలో భారీగా పెంచింది. అయితే అన్నింటిలో సగం.. సగం అనే మహిళల పట్ల వివక్ష చూపడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. కోహ్లీ లాంటి వారికోసం కొత్తగా ఎ-ప్లస్ గ్రేడ్ కింద రూ. 7 కోట్లు చెల్లించనున్నట్లు ప్రకటించారు. బోర్డు ఇంత భారీగా ఆటగాళ్ల వేతనాలను పెంచడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేయడంతోపాటు.. మహిళల కాంట్రాక్ట్ వివరాలు తెలుసుకుని ముక్కున వేలేసుకున్నారు. కొత్త సెంట్రల్ కాంట్రాక్ట్ ప్రకారం పురుషుల సి-గ్రేడ్ ప్లేయర్లకు కోటి రూపాయలు ఉంటే.. మహిళల ఎ-గ్రేడ్ ప్లేయర్లకు అందులో సగం రూ. 50 లక్షలుగా ఉంది. ఇంత భారీ అంతరాన్ని గమనించిన నెటిజన్లు.. మహిళల పట్ల ఎందుకంత వివక్ష అంటూ ట్వీట్లతో దండెత్తారు. భారత మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్.. 'సిగ్గు.. అబ్బాయిలకు రూ. 7 కోట్లు.. అమ్మాయిలకు రూ. 50 లక్షలా..! బీసీసీఐ సిగ్గు పడాల'ని ఘాటుగా ట్వీట్ చేశాడు. 'పురుషుల గ్రేడ్-సి చెల్లింపుల కంటే మహిళలకు టాప్ గ్రేడ్‌కు ఇచ్చేది సగమా' అంటూ టీమిండియా క్రికెటర్ రవీంద్ర జడేజా కామెంట్ చేశాడు. మహిళా దినోత్సవానికి మంచి కానుక అంటూ కొందరు సెటైర్ వేశారు.

కోహ్లీ ఎంపికవల్లే నా పోస్టు ఊడింది!

సెలెక్షన్ కమిటీ మాజీ చీఫ్ వెంగ్‌సర్కార్



ముంబై: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ పేరు ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో మార్మోగుతోంది. అతడి సామర్థ్యాన్ని పసిగట్టి చిన్న వయస్సులోనే భారత జట్టుకు ఎంపిక చేసినందుకు అప్పటి సెలెక్షన్ కమిటీని ఎవరైనా ప్రశంసించక మానరు. కానీ కోహ్లీని జట్టుకు ఎంపిక చేయడమే తన సెలెక్షన్ కమిటీ చైర్మన్ పదవికి ఎసరు తెచ్చిందని దిలీప్ వెంగ్‌సర్కార్ వెల్లడించాడు. 2008లో తమిళనాడుకు చెందిన బద్రీనాథ్‌కు బదులు కోహ్లీని సీనియర్ జట్టులోకి తీసుకోవడంతో బీసీసీఐ అప్పటి కార్యదర్శి ఎన్.శ్రీనివాసన్ ఆగ్రహానికి లోనుకావాల్సి వచ్చిందని, దరిమిలా చైర్మన్ పదవి నుంచి తనను తప్పించారని తెలిపాడు. 'అప్పట్లో ఆస్ట్రేలియాలో యువ ఆటగాళ్లకోసం ఎమర్జింగ్ టోర్నీ జరిగింది. అప్పుడే అండర్-19 వరల్డ్ కప్ గెలిచిన భారత్‌కు కెప్టెన్‌గా ఉన్న కోహ్లీకి ఆసీస్ టోర్నీలో చోటు కల్పించాం' అని వెంగ్‌సర్కార్ చెప్పాడు. ఆ టోర్నీలో ఓపెనర్‌గా బరిలో దిగిన కోహ్లీ ఓ సెంచరీ కూడా చేశాడని చెప్పాడు. అలా కోహ్లీ సత్తా చాటడంతో తర్వాతి శ్రీలంక పర్యటనకు వెళ్లే టీమిండియాకు విరాట్‌ను ఎంపిక చేశామన్నాడు. 'సాంకేతికంగా మంచి బ్యాట్స్‌మన్ అయిన విరాట్ అప్పట్లో లంక పర్యటనకు వెళ్లిన భారత జట్టులో ఉండడం సబబని నాతోపాటు మిగిలిన సెలెక్టర్లూ భావించారు' అని తెలిపాడు. అయితే కెప్టెన్ ధోనీ, కోచ్ గ్యారీ కిర్‌స్టెన్ తమ ఎంపికను సందేహించారన్నాడు. 'మేం అతడి (కోహ్లీ) ఆటను చూడలేదు. అందువల్ల పాత జట్టును ఎంపిక చేయాలని మహీ, గ్యారీ సూచించారు. మీరు చూడలేదు కానీ అతడి ఆటను నేను గమనించా. ఈ యువ క్రికెటర్‌ను తీసుకోవాల్సిందే అని వారికి స్పష్టంజేశా' అని తెలిపాడు. ఆస్ట్రేలియాలో ఎమర్జింగ్ టోర్నీ సందర్భంగా అక్కడకు వచ్చిన వెంగ్‌సర్కార్..ఇన్నింగ్స్ ప్రారంభించాలని తనకు సూచించాడని గతంలో పలు మార్లు కోహ్లీ బహిరంగంగానే చెప్పడం విశేషం. నాటి శ్రీలంక పర్యటనకు టీమిండియాలో మిడిలార్డర్‌లో ఆరో స్థానంకోసం విరాట్, బద్రీనాథ్ తీవ్రంగా పోటీ పడ్డారు. 'నేను, మిగిలిన సెలెక్టర్లు బ్రిస్బేన్ వెళ్లి న్యూజిలాండ్‌తో భారత్ మ్యాచ్‌ను తిలకించాం. గప్టిల్, కోరె ఆండర్సన్, జెస్సీ రైడర్ వంటి చక్కటి క్రికెటర్లతో నిండిన కివీస్‌పై ఓపెనర్‌గా దిగిన కోహ్లీ అజేయంగా 120 పరుగులు చేశాడు. దాంతో అతడు సీనియర్ జట్టుకు ఆడాల్సిందేనని నేను భావించా' అని వెంగ్‌సర్కార్ వివరించాడు. కానీ బోర్డు కార్యదర్శి శ్రీనివాసన్ యాజమాన్యంలోని చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తమిళనాడు క్రికెటర్ బద్రీనాథ్‌ను కాకుండా కోహ్లీని ఎంపిక చేయడంతో ఆయన ఆగ్రహించాడని తెలిపాడు. 'బద్రీని ఎందుకు తీసుకోలేదు' అని శ్రీనివాసన్ ప్రశ్నించాడన్నాడు. 'ఆసీస్ టోర్నీలో కోహ్లీ బాగా ఆడాడు. అందుకే అతడిని ఎంపిక చేశాం' అని తాను బదులిచ్చానని తెలిపాడు. 'బద్రీనాథ్ తమిళనాడు తరపున 800 పరుగులు చేశాడు. అతడికి 29 ఏళ్లు. ఇంకెప్పుడు అవకాశం ఇస్తారు' అని శ్రీనివాసన్ మరింత ఆగ్రహంగా అడిగాడని వెంగీ తెలిపాడు. 'సమయం వచ్చినప్పుడు అతడు ఎంపికవుతాడని నేను బదులిచ్చా' అని చెప్పాడు. ఇక ఆ తర్వాత తనను సెలెక్షన్ కమిటీ చైర్మన్ పదవినుంచి తప్పించి తమిళనాడుకే చెందిన కృష్ణమాచారి శ్రీకాంత్‌ను అందులో నియమించారని వెంగ్‌సర్కార్ వెల్లడించాడు.


కోహ్లీ (2008 నాటి ఫొటో)

అలవోకగా...

● ధవన్ అర్ధ సెంచరీ ● బంగ్లాపై భారత్ గెలుపు ●ముక్కోణపు సిరీస్

తొలి మ్యాచ్‌లో శ్రీలంక ఇచ్చిన షాక్ నుంచి భారత జట్టు త్వరగానే కోలుకుంది. ఫీల్డింగ్‌లో ఆటగాళ్లు నిరాశ పరిచినా బౌలర్లు మాత్రం కట్టుదిట్టమైన బంతులతో బంగ్లాదేశ్‌ను స్వల్ప స్కోరుకే పరిమితం చేయగలిగారు. పేసర్లు ఉనాద్కట్, విజయ్ శంకర్ దెబ్బ తీశారు. ఆ తర్వాత ఓపెనర్ శిఖర్ ధవన్ సూపర్ ఫామ్ ఈ మ్యాచ్‌లోనూ కొనసాగడంతో 140 పరుగుల లక్ష్యాన్ని భారత్ సునాయాసంగా ఛేదించింది.


శిఖర్ ధవన్ (43 బంతుల్లో 55)

కొలంబో: సమష్టి ఆటతీరును కనబరిచిన భారత జట్టు ముక్కోణపు సిరీస్‌లో బోణీ చేసింది. తొలి మ్యాచ్‌లో ఎదురైన పరాభవంతో జాగ్రత్తగా ఆడిన రోహిత్ సేన.. శిఖర్ ధవన్ (43 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 55) అర్ధ సెంచరీ సహాయంతో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో నెగ్గింది. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 139 పరుగులు చేసింది. లిటన్ దాస్ (30 బంతుల్లో 3 ఫోర్లతో 34), సబ్బీర్ రహమాన్ (26 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 30) మాత్రమే ఓ మాదిరిగా ఆడారు. ఉనాద్కట్ (3/38), విజయ్ శంకర్ (2/32) బౌలింగ్‌లో చెలరేగారు. అయితే ఎనిమిది ఓవర్లలోపే భారత ఆటగాళ్లు మూడు క్యాచ్‌లు వదిలేయడం గమనార్హం. అనంతరం లక్ష్యం కోసం బరిలోకి దిగిన భారత్ 18.4 ఓవర్లలో నాలుగు వికెట్లకు 140 పరుగులు చేసి నెగ్గింది. సురేశ్ రైనా (27 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్‌తో 28) సహకారం అందించగా ఆఖర్లో మనీశ్ పాండే (19 బంతుల్లో 3 ఫోర్లతో 27 నాటౌట్) వేగం కనబరిచాడు. రుబెల్‌కు రెండు వికెట్లు దక్కాయి. విజయ్ శంకర్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

మళ్లీ ధవనే...: స్వల్ప లక్ష్యం కోసం బ్యాటింగ్‌కు దిగిన భారత ఇన్నింగ్స్‌లో మరోసారి ధవన్ హవా కనిపించింది. కెప్టెన్ రోహిత్ శర్మ (13 బంతుల్లో 3 ఫోర్లతో 17) ఈసారీ తక్కువ స్కోరుకే అవుటయ్యాడు. అయితే ఉన్నంతసేపు కాస్త వేగాన్ని ప్రదర్శించాడు. అనూహ్యంగా వన్‌డౌన్‌లో వచ్చిన యువ బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ (7) ఏమాత్రం ఆకట్టుకోలేకపోయాడు. ఫుట్‌వర్క్ లోపంతో రుబెల్ బౌలింగ్‌లో బౌల్డయ్యాడు. అయితే ధవన్, రైనా జోడీ బంగ్లా బౌలర్లపై ఎదురుదాడికి దిగి స్కోరును పెంచింది. స్కోరు తక్కువగా ఉన్నా... భారీ షాట్లకు పోకుండా జాగ్రత్తగా ఆడింది. ఏడో ఓవర్‌లో రైనా ఓ స్వీప్ షాట్‌తో భారీ సిక్సర్ కొట్టగా ఆ తర్వాత ఓవర్‌లో ధవన్ వరుసగా 6,4తో చెలరేగాడు. 35 బంతుల్లో తను ఓ ఫోర్‌తో వరుసగా రెండో అర్ధ సెంచరీ చేశాడు. అయితే రుబెల్ షార్ట్ బాల్‌కు రైనా స్క్వేర్ లెగ్‌లో క్యాచ్ అవుట్ కావడంతో మూడో వికెట్‌కు 68 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. విజయానికి 17 పరుగుల దూరంలో టస్కిన్ బౌలింగ్‌లో ధవన్ అవుటయ్యాడు. అయితే ఆఖర్లో పాండే బౌండరీలతో మరో 8 బంతులు ఉండగానే మ్యాచ్ నెగ్గింది.

ఆరంభం నుంచే తడబాటు: బంగ్లాదేశ్ ఆరంభం నుంచి దూకుడుగా ఆడే ప్రయత్నంలో ఒత్తిడికి లోనై వికెట్లను కోల్పోయింది. ఓపెనర్ సౌమ్య సర్కార్ ఓ ఫోర్, సిక్స్‌తో మంచి టచ్‌లో కనిపించినప్పటికీ మూడో ఓవర్‌లో ఉనాద్కట్‌కు దొరికిపోయాడు. ఆ తర్వాత ఐదో ఓవర్ వేసిన ఠాకూర్ బౌలింగ్‌లో తమీమ్ వరుసగా రెండు ఫోర్లు బాది చివరి బంతికి షార్ట్ ఫైన్ లెగ్‌లో క్యాచ్ ఇచ్చాడు. విజయ్ శంకర్ వేసిన ఇన్నింగ్స్ ఏడో ఓవర్‌లో లిటన్ దాస్ ఇచ్చిన రెండు సులువైన క్యాచ్‌లను రైనా, సుందర్ వదిలేశారు. కానీ తన మరుసటి రెండు ఓవర్లలో విజయ్ అద్భుత బౌలింగ్‌తో అదరగొట్టాడు. తొమ్మిదో ఓవర్‌లో ముష్ఫికర్ (18) ఇచ్చిన క్యాచ్‌ను వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ పట్టినా అంపైర్ నాటౌట్‌గా ప్రకటించడంతో భారత్ రివ్యూకు వెళ్లింది. రీప్లేలో బంతి బ్యాట్‌కు తాకినట్టు తేలడంతో విజయ్ కెరీర్‌లో తొలి వికెట్‌ను సాధించినట్టయింది. 11వ ఓవర్‌లో కెప్టెన్ మహ్మదుల్లా కవర్స్‌లో ఇచ్చిన క్యాచ్‌ను ఠాకూర్ అందుకున్నాడు. అయితే కీలక ఇన్నింగ్స్ ఆడిన లిటన్ దాస్‌ను చాహల్ అవుట్ చేశాడు. ఆఖర్లో వికెట్ల పతనం వేగంగా సాగడంతో బంగ్లా స్వల్ప స్కోరుకే పరిమితమైంది.

స్కోరు బోర్డు

బంగ్లాదేశ్: తమీమ్ (సి) ఉనాద్కట్ (బి) ఠాకూర్ 15; సౌమ్య సర్కార్ (సి) చాహల్ (బి) ఉనాద్కట్ 14; లిటన్ దాస్ (సి) రైనా (బి) చాహల్ 34; ముష్ఫికర్ రహీమ్ (సి) దినేశ్ కార్తీక్ (బి) శంకర్ 18; మహ్మదుల్లా (సి) ఠాకూర్ (బి) శంకర్ 1; సబ్బీర్ (సి) దినేశ్ కార్తీక్ (బి) ఉనాద్కట్ 30; మెహిదీ హసన్ (సి) పాండే (బి) ఉనాద్కట్ 3; టస్కిన్ (నాటౌట్) 8; రుబెల్ (రనౌట్) 0; ముస్తాఫిజుర్ నాటౌట్ 1; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 20 ఓవర్లలో 8 వికెట్లకు 139.**

వికెట్ల పతనం: 1-20, 2-35, 3-66, 4-72, 5-107, 6-118, 7-134, 8-135.

బౌలింగ్: ఉనాద్కట్ 4-0-38-3; వాషింగ్టన్ సుందర్ 4-0-23-0; ఠాకూర్ 4-0-25-1; చాహల్ 4-0-19-1; విజయ్ శంకర్ 4-0-32-2.

భారత్: రోహిత్ (బి) ముస్తాఫిజుర్ 17; ధవన్ (సి) లిటన్ (బి) టస్కిన్ 55; పంత్ (బి) రుబెల్ 7; రైనా (సి) మెహిదీ (బి) రుబెల్ 28; పాండే నాటౌట్ 27; దినేశ్ కార్తీక్ నాటౌట్ 2; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 18.4 ఓవర్లలో 4 వికెట్లకు 140. వికెట్ల పతనం:** 1-28, 2-40, 3-108, 4-123. **బౌలింగ్:** ముస్తాఫిజుర్ 4-0-31-1; టస్కిన్ 3-0-28-1; రుబెల్ 3.4-0-24-2; మెహిదీ హసన్ 4-0-21-0; సౌమ్య సర్కార్ 1-0-8-0; మహ్మదుల్లా 1-0-11-0; నజ్ముల్ 2-0-15-0.

వివేక్‌కు షాక్!

- హెచ్‌సీఏ అధ్యక్ష, కార్యదర్శులపై అనర్హత వేటు
- రెండు పదవులకు మళ్లీ ఎన్నికలు
- అంబుడ్స్‌మన్ సంచలన తీర్పు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ)లో అనూహ్య పరిణామం. చినికి చినికి గాలివానగా మారిన అధ్యక్ష, కార్యదర్శుల ఆధిపత్య పోరు.. వారి పదవులకే ఎసరు తెచ్చింది. హెచ్‌సీఏ అధ్యక్షుడు జి.వివేకానంద్, సస్పెండ్ అయిన కార్యదర్శి శేష్ నారాయణకు షాక్ తగిలింది. వీరిద్దరిపై అనర్హత వేటు పడింది. వివేక్, శేష్ సంఘంలో ఎలాంటి పదవులు నిర్వర్తించేందుకు అర్హులు కారని హెచ్‌సీఏ అంబుడ్స్‌మన్ జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి గురువారం సంచలన తీర్పు ఇచ్చారు. ఈ నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుందన్నారు. వారు వెంటనే పదవుల నుంచి వైదొలగాల్సి ఉంటుందని స్పష్టంజేశారు. ఈ రెండు పదవులకు నిబంధనల ప్రకారం ఎన్నికలు జరపాలని తీర్పులో వెల్లడించారు. అప్పటివరకు హెచ్‌సీఏ ఉపాధ్యక్షుడు ఇన్‌చార్జ్ అధ్యక్షుడిగా, కోశాధికారి ఇన్‌చార్జ్ కార్యదర్శిగా వ్యవహరిస్తారని చెప్పారు. వివేక్‌కు వ్యతిరేకంగా శేష్, మాజీ క్రికెటర్ అజరుద్దీన్, మాజీ ఎంపీ వి. హనుమంతరావు దాఖలు చేసిన పిటిషన్లతో పాటు సంఘం మాజీ సభ్యుడు బాబూరావు ప్రత్యేకంగా వేసిన పిటిషన్‌పై సుదీర్ఘ విచారణ తర్వాత ఈ తీర్పునిచ్చారు. వివేక్..


వివేక్ · శేష్‌నారాయణ్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా హెచ్‌సీఏ అధ్యక్షుడిగా జోడు పదవులు నిర్వర్తించడంతో పాటు విశాక ఇండస్ట్రీస్‌తో సంబంధం ఆయన పదవి కోల్పోయేలా చేసింది. హెచ్‌సీఏతో కమర్షియల్ కాంట్రాక్టు ఉన్న విశాక ఇండస్ట్రీస్‌కు డైరెక్టర్‌గా వ్యవహరించడం పరస్పర విరుద్ధ ప్రయోజనాల కిందకు వస్తుందని అంబుడ్స్‌మన్ తన తీర్పులో స్పష్టంజేశారు. అలాగే, ప్రభుత్వ సలహాదారు పదవి వల్ల కూడా వివేక్ అధ్యక్షుడిగా అనర్హుడని చెప్పారు. ఇక, పలు అవినీతి కేసుల చార్జ్‌షీట్లలో పేరున్న కారణంగా శేష్‌పై అనర్హత వేటు పడిందని తెలిపారు. కాగా, ఈ తీర్పు చార్జ్‌షీట్లలో పేరున్న హెచ్‌సీఏ సభ్యులు 30 నుంచి 40 మందిపై ప్రభావం చూపనుంది. వారంతా భవిష్యత్‌లో హెచ్‌సీఏలో ఎలాంటి పదవులు చేపట్టేందుకు అర్హులు కాబోరు. ఈ జాబితాలో అర్షద్ అయూబ్ సహా పలువురు ప్రముఖులు ఉన్నారు. దీనిపై స్పందించిన వివేక్... 'అంబుడ్స్‌మన్ తీర్పు గురించి ఇప్పుడే విన్నా. నేను చెన్నైలో ఉండడం వల్ల తీర్పులో ఏముందో పూర్తిగా తెలియదు. అయినా, అంబుడ్స్‌మన్ నిర్ణయాన్ని గౌరవిస్తాన'ని తెలిపారు. 'నా విషయంలో అంబుడ్స్‌మన్ నిర్ణయం.. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధం అని మా న్యాయవాది చెప్పారు. దీనిపై నేను న్యాయ పోరాటం చేస్తాన'ని శేష్ చెప్పారు.

దేవధర్ విజేత భారత్-బి



ధర్మశాల : టోర్నీ ఆసాంతం అద్భుత ఆటతీరుతో అదరగొట్టిన కర్ణాటక దేవధర్ ట్రోఫీ ఫైనల్లో చతికిలపడింది. గురువారం జరిగిన ఫైనల్లో భారత్-బి ఆరు వికెట్ల తేడాతో కర్ణాటకను ఓడించి విజేతగా నిలిచింది. టాప్, మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ హాఫ్ సెంచరీలతో రాణించడంతో 280 పరుగుల లక్ష్యాన్ని భారత్-బి ఇంకా 10 బంతులు మిగిలి ఉండగానే 281/4తో ఛేదించింది. అంతకుముందు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన కర్ణాటక ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సమర్థ్ సెంచరీ (107), గౌతమ్ (76) సత్తా చాటడంతో నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 279 పరుగులు చేసింది.

సంక్షిప్త స్కోర్లు

కర్ణాటక: 50 ఓవర్లలో 279/8 (సమర్థ్ 107, గౌతమ్ 76, గోపాల్ 38, ఉమేష్ యాదవ్ 2/48, ఖలీల్ అహ్మద్ 3/49); **భారత్-బి:** 48.2 ఓవర్లలో 281/4 (ఆర్.గైక్వాడ్ 58, ఈశ్వరన్ 69, శ్రేయాస్ అయ్యర్ 61, మనోజ్ తివారీ నాటౌట్ 59, ఎస్.గోపాల్ 2/55)

కొరియా చేతిలో భారత్ ఓటమి

సియోల్: దక్షిణ కొరియా పర్యటనలో భారత మహిళల హాకీ జట్టుకు తొలి పరాజయం ఎదురైంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం హోరాహోరీగా జరిగిన మూడో గేమ్‌లో భారత్ 1-2తో ఆతిథ్య కొరియా చేతిలో ఓడింది.



షమి ఓ ఫిక్సర్!

● కోల్‌కతాలో కేసు ● పాక్ అమ్మాయి నుంచి డబ్బు
● బాలీవుడ్ నటితో పెళ్లికి తహతహ ● భార్య ఆరోపణ

న్యూఢిల్లీ, కోల్‌కతా: తన భర్తకు పలువురు అమ్మాయిలతో అక్రమ సంబంధాలున్నాయని సంచలన ఆరోపణలు చేసిన టీమిండియా పేసర్ మహ్మద్ షమి భార్య హసీన్ జహా..గురువారం మరో బాంబు పేల్చింది. తన భర్త మ్యాచ్‌లు ఫిక్స్ చేసేవాడని వెల్లడించింది. అతడిపై కోల్‌కతాలో పోలీస్ కేసు నమోదైందని తెలిపింది. 'షమి నాతోపాటు దేశాన్నీ మోసగించగలడు. దుబాయ్‌లో అలీ సబా అనే పాకిస్థాన్ అమ్మాయి నుంచి డబ్బు తీసుకున్నాడు. అందుకు నా వద్ద ఆధారాలున్నాయి. ఇంగ్లండ్‌కు చెందిన మహ్మద్ భాయ్ సూచన మేరకు అతడు ఆ సొమ్ము స్వీకరించాడు. ఆ డబ్బు ఎందుకు తీసుకున్నాడో షమి వెల్లడించాల'ని డిమాండ్ చేసింది.

తప్పు చేశానని అంటుండేవాడు..: తనను వివాహం చేసుకొని పెద్ద తప్పుచేశానని షమి తరచూ అంటుండేవాడని హసీన్ వెల్లడించింది. మాజీ మోడల్, కోల్‌కతా నైట్‌రైడర్స్ చీర్ లీడర్ అయిన హసీన్ జహాతో ప్రేమలోపడ్డ షమి..ఆమెను 2014లో పెళ్లిచేసుకున్నాడు. 'వెనకా ముందు చూసుకోకుండా నిన్ను పెళ్లి చేసుకున్నానంటూ గత రెండేళ్లుగా నన్ను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. విరాట్ మాదిరే ఓ బాలీవుడ్ నటిని వివాహం చేసుకోవాలనే కోరిక షమిలో బలంగా ఉంది. అందుకే నాకు విడాకులివ్వాలని నన్ను ఎప్పటినుంచో ప్రయత్నిస్తున్నాడు. 2017 లంక పర్యటనకు నన్ను కాకుండా పాకిస్థాన్ గాళ్‌ఫ్రెండ్‌ను తీసుకెళ్లాలని అనుకున్నాడు. అంతే కాదు నన్ను చంపి శవాన్ని అడవుల్లో పూడ్చాల్సిందిగా యూపీలోని అతడి సోదరుడికి చెప్పాడ'ని వాపోయింది. 27 ఏళ్ల షమికి పెళ్లికిముందునుంచే ఓ అమ్మాయితో అఫైర్ ఉండేదని వెల్లడించింది. 'తుబా అనే అమ్మాయితో అతడికి వివాహేతర సంబంధం ఉంది. పాకిస్థాన్, దుబాయ్ యు వతులతోనూ అక్రమ సంబంధాలున్నాయి. గతనెల దక్షిణాఫ్రికా నుంచి అతడు వస్తున్న సందర్భంగా ఈ విషయాలు వెల్లడయ్యాయి. జట్టు సభ్యులంతా భారత్ వచ్చేయగా షమి దుబాయ్‌లో ఆగాడు. పాక్‌కు చెందిన ఓ మహిళను అతడు ఎయిర్‌పోర్టులో కలుసుకోవాల్సి ఉందని ఫోన్ చాటింగ్ ద్వారా తెలిసింది. ఫిబ్రవరి 18న ఆమెతో కలిసి అతడు ఓ హోటల్‌లో చెక్‌ఇన్ అయ్యాడు. దుబాయ్, పాకిస్థాన్ వెళ్లిన ప్రతిసారి ఆ మహిళలను అతడు హోటల్‌కు రప్పించుకుంటాడు. వాటిని నేను ధ్రువీకరించుకోవడంతో ఏం చేసుకుంటావో చేసుకో అని బెదిరించాడ'ని హసీన్ చెప్పింది. షమి, అతని కుటుంబ సభ్యులపై గురువారం కోల్‌కతా పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది.

అవన్నీ శుద్ధ అబద్ధం : షమి

భార్య హసీన్ తనపై చేసిన ఆరోపణలు నిజమని తేలితే ఆమెకు క్షమాపణ చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని షమి ప్రకటించాడు. తనపై ఆరోపణలు శుద్ధ అబద్ధమని, కెరీర్‌ను నాశనం చేసేందుకు పన్నిన కుట్రగా అభివర్ణించాడు. 'ఆ ఆరోపణలు అర్థంపర్థంలేనివి. నేను ఐదేళ్లుగా ఆమెను వేధిస్తున్నానని తెలిపింది. మరి ఇంతకాలం ఆమె ఎందుకు బయటకు చెప్పలేదు. వాస్తవం ఏమిటంటే మా పెళ్లయ్యే నాలుగు సంవత్సరాలు అయింద'ని వివరించాడు.


హసీన్ జహా


హైదరాబాద్‌కు చెందిన కరాటే క్రీడాకారిణి సయిదా ఫలక్‌ను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భారత కరాటే సంఘం తరపున గురువారం చెన్నైలో సన్మానిస్తున్న సూపర్‌స్టార్ రజనీకాంత్

ప్రామీలకు స్వర్ణం

బ్యాంకాక్: ఆసియా కప్ ఆర్చరీ స్టేజ్-1లో భారత క్రీడాకారిణి ప్రామీల డైమేరి వ్యక్తిగత స్వర్ణంతో మెరిసింది. దీంతో భారత జూనియర్లు మూడు స్వర్ణాలు, రెండు కాంస్యాలతో టోర్నీని ముగించారు. అమ్మాయిల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ప్రామీల బంగారు పతకం సాధించింది. మధు విద్వాన్ కాంస్యం, ఆకాష్, ఘోరాహా, గౌరవ్‌లతో కూడిన జట్టు స్వర్ణం సొంతం చేసుకుంది. కాంపౌండ్ విభాగంలో ముస్కాన్ కిరార్ పసిడి పట్టగా.. టీమ్ ఈవెంట్‌లో మరో కాంస్యం దక్కింది.



ఇంజెక్షన్ ఖరీదు రూ.14.. పేషెంట్ నుంచి 5,000 వసూలా?

- బెంబేలెత్తిస్తున్న వైద్య చికిత్స ఖర్చు
- సామాన్యుడు భరించలేకపోతున్నాడు
- ఏదైనా చేయండి: కేంద్రానికి సుప్రీం సలహా

న్యూఢిల్లీ, మార్చి 8: వైద్య చికిత్సకు అవుతున్న ఖర్చు నానాటికీ పెరిగిపోవడంపై సుప్రీంకోర్టు గురువారం నాడు ఆందోళన వ్యక్తం చేసింది. "ప్రజలు భరించలేని స్థితిలో ఉన్నారు. మందుల తయారీకెంత అవుతోంది... చికిత్సకు ఎంత అవుతుంది. ఆసుపత్రులు ఎంత వరకూ వసూలు చేయవచ్చు? అసలు ఎంత వసూలు చేస్తున్నాయి.. ఈ అంశంపై దృష్టిపెట్టి, సర్వే చేయించండి" అని జస్టిస్ మదన్ బీ లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం సూచనలు చేసింది. ఢిల్లీలోనూ, శివార్లలోనూ వాయుకాలుష్యం వల్ల ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలపై ప్రజలు చేస్తున్న ఖర్చులమీద విచారణ చేపడుతూ బెంచ్ ఈ వ్యాఖ్యలు, సూచనలు చేసింది. కేంద్ర ఔషధ ధరల అథారిటీ (ఎన్‌పీపీఏ) ఈ మధ్య చేసిన ప్రకటనను ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఉదాహరించింది. ఢిల్లీలోని నాలుగు ప్రైవేట్ ఆస్పత్రులు మందుల అసలు ధరకన్నా 1,192 శాతంఎక్కువ వసూలు చేస్తున్నారని పేర్కొంది. ముఖ్యంగా ప్రాణం మీదకొచ్చిన కేసుల్లో ఉపయోగించే మందుల విషయంలో ఇలా జరుగుతోందని వివరించింది. "అడ్రెనర్ 2ఎంఎల్ ఇంజెక్షన్ ఎంఆర్పీ రూ.189.95 ఉండగా, అది ఆస్పత్రులకు రూ.14.70 కే వస్తోంది. రోగుల నుంచి మాత్రం ఒక్కో ఇంజెక్షన్‌పై పన్నులతో కలిసి రూ.5,318.60 వసూలు చేస్తున్నట్లు ఎన్‌పీపీఏ తెలిపింది. 14 రూపాయలు ఖరీదు చేసే మందుకు 5 వేలు పిండుతారా..? ఇది చాలా తీవ్రమైన అంశం" అని బెంచ్ పేర్కొంది. గుర్గావ్ లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో కొన్ని నెలల కిందట ఓ ఏడేళ్ళ బాలుడు డెంగ్యూ జ్వరంతో చేరాడు. చికిత్స సమయంలోనే అతని ప్రాణం పోయింది. ఆ పిల్లాడి వైద్యానికి రూ 18 లక్షల బిల్లు వేసిందా ఆసుపత్రి. ఇది తీవ్ర సంచలనం రేపింది. తగిన చర్యలు తీసుకుంటామని ఆరోజున చెప్పిన కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా - ఇప్పటి దాకా కనీసం ఒక్క నోటీసు కూడా జారీ చేయలేదు. ఇది సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. ఇలాంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని సుప్రీం కోర్టు తాజా వ్యాఖ్యలు చేసింది.

> ప్రజలు ఆస్పత్రులకెళ్లేందుకు భయపడిపోతున్నారు. వందలు దాటి ఇపుడు చికిత్సలకు వేలూ, లక్షలూ పోయాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని మార్చండి.. వైద్య చికిత్సకు అయ్యే ఖర్చు తగ్గించండి
> – సుప్రీంకోర్టు

మెట్రో నగరాల్లో స్మోక్ 'క్వీన్స్'

పనిచేసే మహిళల్లో పెరుగుతున్న ధూమపానం



హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) 'పొగ తాగనివాడు దున్నపోతై పుట్టును' అంటాడు కన్యాశుల్కంలో గిరీశం. ఆ కాలానికి మగవారికే అన్వయించిన మాట అది. కాలం మారిందిగా.. అందుకే ఇప్పుడు యువతులు, మహిళలు పొగను తెగ ఊదేస్తున్నారట. పొగతాగడం పురుషులకేనన్న అభిప్రాయం క్రమంగా మారిపోయి పొగరాణులు పెరిగిపోతున్నారని 'అసోచామ్' చెబుతోంది. మెట్రో నగరాల్లో పనిచేసే మహిళల్లో ఈ సంస్కృతి పెరుగుతోందట. 22-30 ఏళ్ల యువతులు సిగరెట్ తాగకుండా ఉండలేకపోతున్నారట.ఢిల్లీ, బెంగళూరు, కోల్‌కతా, చెన్నై, అహ్మదాబాద్, హైదరాబాద్, జైపూర్, లక్నో, ముంబై, పూణెలో 2వేల మంది మహిళా ఉద్యోగులపై అసోచామ్ సర్వే నిర్వహించగా ఆడవారి సిగరెట్ వాడకానికి సంబంధించి దిమ్మతిరిగే నిజాలు బయటపడ్డాయి.

ఉఫ్.. ఉఫ్‌కు కారణాలివే..

ఒత్తిడిని తగ్గించుకునేందుకు,బరువు తగ్గేందుకు మహిళలు పొగ తాగుతున్నారట. ఎక్కువ మంది కొట్టినపుడు ధూమపానం చేస్తామని తెలిపారు. కొంతమంది అదో సోషల్ స్టేటస్‌గా, స్వాతంత్ర్యానికి చిహ్నంగా భావిస్తారట. సర్వే ప్రకారం.. స్మోకింగ్ చేసేవారిలో 2% మంది చైన్ స్మోకర్లు ఉన్నారు. రోజుకు ఒకటి, రెండు సిగరెట్ డబ్బాలను అవలీలగా కాల్చేస్తారట. వారిలో బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా, ముంబై మహిళలే ఎక్కువగా ఉన్నారు. 40% మంది లైట్ స్మోకర్స్, 12% మంది రోజుకు 2-3 సిగరెట్స్ కాలుస్తారట. కాగా 46% మంది ధూమపానాన్ని వదిలేసినట్లు సర్వేలో వెల్లడైంది. వీళ్లలో చాలా మంది యుక్తవయసు వచ్చాక పొగతాగడం అలవాటు చేసుకున్నారట. ధూమపానంతో గర్భం రాదని, రొమ్ము కేన్సర్ వస్తుందన్న భయంతో వదిలేశారట. పొగాకు హెచ్చరికల సంజ్ఞలు, సిగరెట్ ప్యాకెట్లపై ఉండే జబ్బుల చిత్రాల వల్ల మిగిలిన వారు దాని జోలికే పోలేదట. పొగతాగే మహిళల సంఖ్య పెరగడంపై అసోచామ్ ఆందోళన వ్యక్తం చేసింది.

'టెక్ టీచర్ల'కు ఎసరు!

రోడ్డున పడనున్న 2 లక్షల మంది.. ఏఐసీటీఈ మార్గదర్శకాలతో సంఖ్య కుదిస్తున్న కాలేజీలు

- అన్యాయమంటూ సుప్రీంకెక్కిన టీచర్లు- నేడు విచారణ

న్యూఢిల్లీ, మార్చి 8 : అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) జారీచేసిన మార్గదర్శకాల వల్ల దేశవ్యాప్తంగా వృత్తి విద్యా కళాశాల్లో పనిచేస్తున్న సుమారు రెండు లక్షల మంది టీచర్లు తమ ఉద్యోగాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. కాలేజీల్లో టీచర్లు-విద్యార్థుల నిష్పత్తిని 1:15 నుంచి 1:20కు తగ్గించాలని ఏఐసీటీఈ సూచించింది. ఇది వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి రావాలి. యాజమాన్యాలు ఇప్పటి నుంచే అనేకమంది లెక్చరర్లను ఇంటికి పంపేస్తున్నాయి. మే నెల నుంచి వైదొలగండని మరికొన్ని కాలేజీల యాజమాన్యాలు లెక్చరర్లకు శ్రీముఖాలు పంపుతున్నాయి. దీంతో దేశవ్యాప్తంగా టీచర్ల సంఘాలు ఏఐసీటీఈ మార్గదర్శకాలను సవాలుచేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. వీరి పిటిషన్ను అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం విచారణకు స్వీకరించనుంది. ఇంతకుముందు బీఈ, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో టీచ



ర్లు-విద్యార్థుల నిష్పత్తి 1:15గా, డిప్లొమా కోర్సుల్లో 1:20గా ఉంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ నిష్పత్తిని 1:20, 1:25కు తగ్గించాలని ఏఐసీటీఈ మార్గదర్శకాలను రూపొందించింది. టీచర్ల సంఖ్యను తగ్గించాలనే డిమాండ్‌ను విద్యాసంస్థలు ఎప్పటి నుంచో చేస్తున్నాయని ఏఐసీటీఈ తెలిపింది. ఈ నిర్ణయం విద్యార్థులకు మేలు చేయదని, మార్గదర్శకాలు అమల్లోకి వస్తే విద్యార్థులు టీచర్ల కొరతను తీవ్రంగా ఎదుర్కోవాల్సి వస్తుందని అఖిల భారత ప్రైవేటు కళాశాలల ఉద్యోగుల సంఘం నాయకుడు (ఏఐపీసీయూ) కార్తిక్ ఆందోళన వ్యక్తం చేశారు. తక్కువ జీతాలకు పని చేయాలని, లేదా ఉద్యోగాన్ని వదులుకోవాలని కాలేజీలు టీచర్లను బెదిరించవచ్చని ఆయన అన్నారు. ఈ పిటిషన్‌లో టీచర్ల సంఘాలు మరో మెలిక కూడా పెట్టాయి. అనేక కాలేజీలు సరిపడనంత స్థాయిలో సిబ్బందిని తీసుకోవడం లేదని, ఇతర కాలేజీల నుంచి గంటల ప్రాతిపదికన లెక్చరర్లను తెచ్చి మేనేజ్ చేస్తున్నాయని, కొన్ని ఇంజినీరింగ్, ఎంబీఏ కాలేజీలైతే -ఎవరినీ రిక్రూట్ కూడా చేయకుండా రిజిస్టర్లలో చూపుతున్నాయని యూనియన్లు ఆరోపించాయి. "దేశవ్యాప్తంగా దాదాపు 80,000 మంది నకిలీ టీచర్లున్నట్లు ఆధార్ ద్వారా తేలిందని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి జనవరి 5న వెల్లడించారు. ఈ నకిలీ టీచర్ల బాగోతం బయటపడాలంటే- టీచర్లకు జీతాలను జాతీయ బ్యాంకుల ద్వారా చెల్లించాలి. ఈవిధంగా చెల్లించిన జీతాల బ్యాంకు స్టేట్‌మెంట్లను ఏఐసిటిఇ తనిఖీ చేయాలి. అప్పుడు కాలేజీల్లో వాస్తవ సిబ్బంది గురించి తెలుస్తుంది' అని తమ పిటిషన్‌లో సంఘాలు పేర్కొన్నాయి.

ప్రజలను విభజిస్తున్నారు: రాహుల్



సింగపూర్‌లో భారత సంతతి సీఈవోలతో గురువారం జరిగిన సమావేశంలో రాహుల్‌గాంధీ


సింగపూర్, మార్చి 8 : బీజేపీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. భారత్‌లో వారు (బీజేపీ) ప్రజలను విభజించే రాజకీయాలు చేస్తున్నారని, బెదిరించే వాతావరణం సృష్టించారని, ఎన్నికల్లో గెలవడానికి హింసకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. గురువారం సింగపూర్‌లోని ప్రఖ్యాత లీ కువాన్ ఈవ్ స్కూల్‌లో రాహుల్ మాట్లాడారు. దేశ సంస్థాగత స్వరూపానికి సవాళ్లు ఎదురవుతున్నాయన్నారు. ఇటీవల నలుగురు సుప్రీంకోర్టు జడ్జీలు చేసిన వ్యాఖ్యలపై కూడా ఆయన స్పందించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులే మీడియా ముందుకు వచ్చారంటే దేశం ఎటువంటి పరిస్థితుల్లో ఉందో తెలుస్తోందన్నారు. అంతకుముందు ఆయన సింగపూర్‌లోని భారత జాతీయ ఆర్మీ స్మారకాన్ని సందర్శించారు. ఇక్కడి నేతాజి స్మారకానికి నివాళులర్పించారు. సింగపూర్, మలేషియాలో ఆయన మూడు రోజులు పర్యటిస్తారని కాంగ్రెస్ పార్టీ ట్విటర్‌లో తెలిపింది.


దావూద్‌కు షాక్

డాన్ కీలక అనుచరుడు ఫరూక్ టక్లా అరెస్టు

- ఢిల్లీ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న సీబీఐ

న్యూఢిల్లీ, మార్చి 8: అండర్‌వరల్డ్ డాన్, ముంబై పేలుళ్ల కేసులో ప్రధాన సూత్రధారి దావూద్ ఇబ్రహీంకు అతిపెద్ద దెబ్బ. దావూద్ కీలక అనుచరుడు, ముంబై పేలుళ్ల కేసులో కీలక నిందితుడు అయిన మహ్మద్ ఫరూక్ అలియాస్ ఫరూక్ టక్లా (57) పట్టుబడ్డాడు.





దుబాయ్ నుంచి గురువారం ఉదయం ఢిల్లీలో దిగిన ఫరూక్‌ను సీబీఐ అధికారులు విమానాశ్రయంలోనే అదుపులోకి తీసుకున్నారు. సీబీఐ కార్యాలయంలో అతడిని సుదీర్ఘంగా విచారించి టాడా కోర్టులో ప్రవేశపెట్టినట్టు తెలిసింది. ముంబై పేలుళ్ల తర్వాత ఫరూక్ దుబాయ్‌కి పారిపోయాడు. 25 ఏళ్లుగా అక్కడే ఉంటున్నాడు. పేలుళ్ల జరిగింది మొదలు ఫరూక్ కోసం సీబీఐ గాలిస్తోంది. 1995లో సీబీఐ అధికారులు అతడిపై రెడ్ కార్నర్ నోటీసును జారీ చేశారు. 1993 మార్చి 12న ముంబైలో సంభవించిన పేలుళ్లు భారత్‌ను కు దిపేశాయి. నాటి ఘటనలో 257 మంది ప్రాణాలను కోల్పోయారు. 700మందికిపైగా గాయపడ్డారు. ఈ కేసులో 27మంది నిందితుల్లో ఫరూక్ ఒకడు. పేలుళ్ల కోసం అతడు బాంబులను తయారు చేసినట్టు, మరో నిందితుడికి ఆశ్రయమిచ్చినట్టు ఫరూక్‌పై ఆరోపణలున్నాయి. పేలుళ్ల తర్వాత 1993లోనే ఫరూక్ దుబాయ్ వెళ్లిపోయినా.. అక్కడి నుంచే భారత్‌లో డీ-కంపెనీ వ్యవహారాలను పర్యవేక్షించేవాడు. పేలుళ్లకు ముందే డీ-గ్యాంగ్‌లో ఫరూక్ కీలక వ్యక్తి. 1990 తొలినాళ్లలో ఫరూక్ గల్ఫ్‌లో హవాలా ఆపరేటర్‌గా పనిచేసేవాడు. బాంబులు, ఆయుధాల తయారీలో శిక్షణ కోసం మనుషులను దుబాయ్ నుంచి కరాచీకి అక్రమంగా తరలించేవాడని ఫరూక్‌పై ఆరోపణలున్నాయి. గురువారం ఇందిరాగాంధీ ఎయిర్‌పోర్టులో దిగిన ఫరూక్‌ను ఇమ్మిగ్రేషన్ కౌంటర్ వద్ద సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. రెడ్ కార్నర్ నోటీసు పెండింగ్‌లో ఉన్న దశలో ఫరూక్ ఢిల్లీకి ఎలా రాగలిగాడనే దానిపై వ్యాఖ్యానించేందుకు సీబీఐ అధికారులు తిరస్కరించారు. ఫరూక్‌ను ఢిల్లీకి రప్పించడంలో కేంద్ర ఇంటెలిజెన్స్ విభాగం సహకారం ఉందని సీబీఐ వర్గాలు వ్యాఖ్యానించాయి. పశ్చిమ ఆసియా దేశాలతో విభిన్న అంశాల్లో ఇటీవల పెరిగిన పలు ఒప్పందాల ఫలితంగా పలువురు నేరగాళ్ల ఆట కట్టవుతోందని ఆ వర్గాలు వ్యాఖ్యానించాయి.

● సోనియాను దాటేసిన సుష్మ

అత్యంత ప్రభావశీల రాజకీయ నాయకురాలిగా గుర్తింపు



న్యూఢిల్లీ, మార్చి 8: దేశంలోనే అత్యంత ప్రభావవంతమైన రాజకీయ నాయకురాలిగా విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ నిలిచారు. ఇప్పటివరకు అత్యంత ప్రభావవంతమైన రాజకీయ నాయకురాలిగా ఉన్న కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీతో పాటు పలువురిని దాటి సుష్మాస్వరాజ్ అగ్రస్థానానికి చేరుకున్నారు. డిస్కవరీ అండ్ కామర్స్ ప్లాట్‌ఫాం 'మ్యాజిక్‌పిన్' నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ఈ సంస్థ నిర్వహించిన సర్వేలో అత్యధికంగా సుష్మాస్వరాజ్ 37శాతం ఓట్లు సాధించారు. 33 శాతం ఓట్లతో పుదుచ్చేరి గవర్నర్ కిరణ్‌బేడీ రెండో స్థానంలో నిలిచారు. కాగా, సోనియాగాంధీకి కేవలం 19శాతం మందే ఓటేశారు. ఇక బాలీవుడ్ నటీమణుల్లో అత్యంత శక్తిమంతమైన మహిళగా దివంగత నటి శ్రీదేవికి అత్యధిక ఓట్లు వచ్చాయి. క్రీడారంగంలో 33శాతం ఓట్లతో బాక్సర్ మేరీకోమ్ ముందంజలో నిలిచారు. అత్యంత ఇష్టమైన రచయితగా సరోజిని నాయుడు 55 శాతం ఓట్లు సంపాదించారు.

● కర్ణాటకకు కొత్త జెండా..గుర్తింపు కోసం వినతి



బెంగళూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న తరుణంలో కర్ణాటక ప్రభుత్వం కొత్త జెండాను ఆవిష్కరించింది. కర్ణాటక రాష్ట్రం కోసం ప్రత్యేకంగా రూపొందించిన మూడు రంగుల జెండాను ముఖ్యమంత్రి సిద్దరామయ్య గురువారం లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ కొత్త జెండాకు గుర్తింపు కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని నిర్ణయించారు. జెండాను పసుపు, తెలుపు, ఎరుపు రంగులతో రూపొందించగా మధ్యలో రాష్ట్ర చిహ్నమైన 2 తలల గండభేరుండ పక్షి రూపాన్ని పొందుపరిచారు.

● 'నీట్' దరఖాస్తుకు ఆధార్ అక్కర్లేదు: సీబీఎస్ఈ

హైదరాబాద్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్‌లో అడ్మిషన్ల కోసం రాసే నీట్ ప్రవేశ పరీక్షకు ఆధార్ నెంబర్ లేకుండానే దరఖాస్తు చేసుకోవచ్చని సీబీఎస్ఈ గురువారం వెల్లడించింది. ఆధార్ తప్పనిసరి కాదన్న కోర్టు తీర్పు మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నది. నీట్ దరఖాస్తు గడువును ఈ నెల 12 వరకు పెంచుతున్నట్లు తెలిపింది. అభ్యర్థులు పరీక్ష ఫీజును ఈ నెల 13 ఉదయం 11.50 వరకు చెల్లించవచ్చని పేర్కొన్నది.

● నాగాలాండ్ సీఎంగా రియో ప్రమాణం

కోహిమా, మార్చి 8: నాగాలాండ్ ముఖ్యమంత్రిగా ఎన్‌డీపీపీ(నేషనలిస్ట్ డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ) నాయకుడు నెఫ్యూ రియో ప్రమాణం చేశారు. గురువారం ఇక్కడ బహిరంగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ పి.బి.ఆచార్య ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. రియో సీఎం పగ్గాలు చేపట్టడం ఇది నాలుగోసారి. ఉప ముఖ్యమంత్రిగా బీజేపీ నాయకుడు వై.పట్టాన్, మంత్రులుగా మరో ఐదుగురు బీజేపీ సభ్యులు, ముగ్గురు ఎన్‌డీపీపీ, ఒక జేడీయూ, ఒక స్వతంత్ర సభ్యుడు ప్రమాణం చేశారు.

● జయ కాళ్లు తొలగించలేదు: డ్రైవర్ అయ్యప్పన్

చెన్నై, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన జయలలిత కాళ్లను తొలగించారనే ప్రచారంలో వాస్తవం లేదని ఆమె కారు డ్రైవర్ అయ్యప్పన్ తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జయలలిత మరణంపై ప్రభుత్వం నియమించిన మాజీ న్యాయమూర్తి ఆర్ముగస్వామి కమిషన్ ఎదుట గురువారం అయ్యప్పన్ హాజరయ్యారు. జయ ఆసుపత్రిలో ఉన్న 75 రోజులు తాను అక్కడే ఉన్నానని అనంతరం ఆయన విలేకరులకు తెలిపారు.

నచ్చినవాడిని పెళ్లాడు





యుక్తవయస్కుల పెళ్ళిళ్లలో కోర్టు జోక్యం కుదరదు

- హదియా కేసులో సుప్రీంకోర్టు అభిప్రాయం
- కేరళ అమ్మాయి వివాహ రద్దు తీర్పు కొట్టివేత

న్యూఢిల్లీ, మార్చి 8: సంచలనం రేపిన లవ్ జీహాద్ కేసులో కేరళ యువతి అఖిలా అశోకన్ అలియాస్ హదియాకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఓ ముస్లిం యువకుడితో ఆమె వివాహాన్ని రద్దు చేస్తూ కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును ముగ్గురు సభ్యుల ధర్మాసనం గురువారం నాడు కొట్టేసింది. తనకు నచ్చిన వాణ్ణి స్వేచ్ఛగా పెళ్ళి చేసుకొనే హక్కు ఆమెకు ఉందని, షఫీన్ జహాన్ అనే యువకుడితో ఆమెకు జరిగిన పెళ్ళి చెల్లుతుందని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ ఖాన్విల్కర్‌లతో కూడిన ధర్మాసనం తేల్చిచెప్పింది. మహిళా దినోత్సవం రోజున హదియాకు లభించిన ఈ ఊరట నారీలోక విజయమని, మహిళ హక్కులకు ఓ సంకేతమని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ హర్షం వ్యక్తం చేసింది. ఈ కేసు తుది విచారణ సమయంలో సుప్రీం బెంచ్ కీలకమైన వ్యాఖ్యలు చేసింది.

- యుక్త వయస్కులైన యువతీ యువకులు వారికి నచ్చిన వారిని పెళ్ళిళ్లు చేసుకోవచ్చు.
- పెళ్లిళ్ళలో కోర్టు జోక్యాలు చెల్లవు.
- రాజ్యాంగంలోని 226వ అధికరణం కింద హైకోర్టులకు విశేషాధికారాలు ఉన్నప్పటికీ స్వేచ్ఛ హక్కును హరించే ఏ ఆదేశమూ, తీర్పూ చెల్లదు.
- ఒకరినొకరు ఇష్టపడి, సంప్రదించుకొని చేసుకొనే వివాహాల్లో జోక్యం పనికిరాదు.. చెల్లదు. చట్టం గానీ, రాజ్యం గానీ వ్యక్తిగత వివాహ విషయాల్లో తలదూర్చలేవు.
- ఫలానా వ్యక్తిని పెళ్లి చేసుకోవడం సమ్మతమని ఆడ లేదా మగ వ్యక్తి చెప్పినప్పుడు దానికి అడ్డుచెప్పే వీల్లేదు
- పెళ్లి మాటున ఓ అక్రమ, చట్టవిరుద్ధమైన పనికి ఓ వ్యక్తి పాల్పడితే.. ఆ వ్యక్తిని విచారించవచ్చు..అంతే తప్ప ఆ వివాహాన్ని ప్రశ్నించజాలరాదు.
- ఇద్దరు వ్యక్తులు పెళ్లి చేసుకొని, అందులో ఒకరు (భార్య లేదా భర్త) రెండో వారిని విదేశాలకు తీసుకుపోదలిస్తే దాన్ని కోర్టులు ఆపలేవు. ఆ వ్యక్తిపై గనక కేసు ఉంటే ప్రభుత్వంతో చెప్పి ఆ ప్రయాణం ఆపవచ్చు.. కానీ వారి వివాహం జోలికి మాత్రం పోరాదు. పెళ్ళి కాకముసుపు ఓ యువతి కోర్టును సంప్రదించి తనకు నచ్చిన వ్యక్తితో ఉండదల్చుకున్నానని చెబితే కోర్టు ఆ నిర్ణయాన్ని ఆపలేదు.
- ఇద్దరు వ్యక్తులు పెళ్లి చేసుకొని, విడాకులు తీసుకొని- తిరిగి ఏడాది తర్వాత కలిసి ఉండాలని నిర్ణయించుకొన్న సందర్భంలో కూడా కోర్టు ఏమీ చెయ్యలేదు.
- ఆర్టికల్ 226 స్ఫూర్తి ఒక హక్కును కాపాడడమే తప్ప ఆ హక్కును కాలరాయడం కాదు.

లవ్ జీహాద్..

ప్రేమ పేరుతో అన్య మతాలకు చెందిన అమ్మాయిలకు వల వేసి వారిని ముస్లిం యువకులు బలవంతంగా పెళ్ళి చేసుకొంటున్న వైనం 'లవ్ జీహాద్' పేరుతో ఏడాది కిందట దేశవ్యాప్తంగా సంచలనాన్ని, చర్చను రేపాయి. ఈ కోవ లోనిదే హదియా కేసు. తన కుమార్తె హదియాను బలవంతంగా మత మార్పిడి చేయించి షఫీన్ జహాన్ అనే వ్యక్తి పెళ్ళి చేసుకొన్నాడని ఆమె తండ్రి కేఎమ్ అశోకన్ గత ఏడాది మేలో కేరళ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. వాదనలు విన్న హైకోర్టు వారి వివాహం చట్టవిరుద్ధమని నిర్ధారించి, పెళ్లిని రద్దుచేసింది. దీనిపై షఫీన్ జహాన్ గత సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. తన భార్యను ఆమె తల్లిదండ్రుల నుంచి విడుదల చేసి.. ప్రభుత్వ వసతి గృహానికి తరలించాలని గత నవంబరులో సుప్రీంకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసి ఈ వ్యవహారంపై దర్యాప్తు జరపాల్సిందిగా ఎన్ఐఏను ఆదేశించింది. హదియాను యెమెన్ దేశానికి తీసికెళ్ళి ఆమెతో వ్యభిచారం చేయించడానికే షఫీన్ పెళ్ళాడాడని తండ్రి ఆరోపణ. కానీ హదియా అతనితో పెళ్ళి తనకు ఇష్టమేనని సుప్రీంకోర్టుకొచ్చి తెలిపింది. దాంతో కేరళ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు కొట్టేసింది. ఎన్ఐఏ దర్యాప్తును కొనసాగించాలని, అది వారి వివాహం జోలికి పోరాదని స్పష్టం చేసింది.

క్యాబ్ డ్రైవర్.. నేడు ఆర్మీ అధికారి



పుణె, మార్చి 8: కష్టించి పట్టుదలతో కృషి చేస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చు. మహారాష్ట్రలోని ఓలా క్యాబ్ డ్రైవర్ అలా స్వయంకృషితో సైనికాధికారిగా ఎంపికయ్యారు. పుణెకు చెందిన క్యాబ్ డ్రైవర్ ఓమ్ పైథాన్ ఓలాలో డ్రైవర్‌గా ఉద్యోగం చేసుకుంటూనే, పోటీ పరీక్షలకు సమాయత్తమయ్యారు. తాను ఒకసారి ఒక మాజీ ఆర్మీ అధికారిని క్యాబ్‌లో తీసుకువెళ్లినప్పుడు మాటల సందర్భంగా ఆయన తనను ప్రోత్సహించి, మార్గదర్శకం చేశారని ఓమ్ చెప్పారు. ఆర్మీ అధికారిగా ఓమ్ ఎంపిక కావడంతో ఆయన తండ్రి ఆనందానికి అవధుల్లేవు. దేశసేవకు తన కుమారుడు ఎంపిక కావడం తనకు గర్వంగా ఉందని ఆయన తండ్రి ఉద్వేగంతో చెప్పారు. రిటైర్డు కర్నల్ బక్షి ప్రేరణతోనే తానీ విజయాన్ని సాధించానని ఓమ్ చెప్పారు. "కర్నల్ బక్షి సార్ నా జీవితాన్ని మార్చేశారు. సాయుధ దళాలలో ఉపాధికి ఎన్నో అవకాశాలు ఉంటాయని ఆయన చెప్పారు. దాంతో నేను సీడీఎస్ పరీక్షలు రాసి సెలక్టయ్యాను" అని ఆయన వివరించారు.



పురుషులకేదీ రక్షణ?

- మహిళల కారణంగా రోడ్డున పడుతున్నాం.. వారి వేధింపుల నుంచి కాపాడండి
- మహిళా దినోత్సవం రోజున చెన్నైలో పురుషుల ధర్నా

చెన్నై, మార్చి 8(ఆంధ్రజ్యోతి): 'ప్రపంచవ్యాప్తంగా మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నారు సరే! వారి బాధితులైన మమ్మల్ని కాపాడేది ఎవరు?' అంటూ గురువారం చెన్నైలో పురుషులు ధర్నా చేశారు. సుమారు 50 మంది ధర్నాలో పాల్గొని మహిళల కు, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు అరుళ్‌తమిళన్ మాట్లాడుతూ మహిళల వల్ల ఎంతోమంది పురుషులు రోడ్డున పడుతున్నారని, వారి వేధింపులకు గురవుతున్నారని వాపోయారు. పురుషుల ఆత్మహత్యకు కారణమవుతున్న మహిళలను కఠినంగా శిక్షించాలని, జాతీయ మహిళా హ క్కుల కమిషన్‌లాగే పురుషుల హక్కుల కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

ఎండ నుంచి కాపాడే అద్దాలు



వాషింగ్టన్, మార్చి 8: అద్దాలకు బ్లాక్‌కోట్ ఫిల్మ్ వేసినా ఎండ వేడిని కొంత మేరకే నిరోధించగలం. శీతాకాలంలో అయితే పొగమంచుకు చెమ్మపట్టి చుక్కలుగా కిందకు కారుతుంటాయి. ఇలాంటి ఇబ్బందులు లేకుండా కొత్తరకం అద్దాలను మన శాస్త్రవేత్తలు రూపొందించారు. పైగా ఇవి ధర తక్కువని అంటున్నారు. నెక్ట్స్ జనరేషన్ గ్లాస్ ప్యానళ్లగా వీటిని పేర్కొంటున్నారు. ఈ స్మార్ట్ గ్లాస్ సాంకేతికతలో సన్నని రెండు అద్దాలు కలిసి ఉంటాయి. అందులో ఉపయోగించిన మిథైల్ సలిక లైట్ వల్ల ఆయా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రతిస్పందిస్తుటాయి. ఎండ వేడిని గ్రహించి చల్లదనం ఇవ్వడం వీటి ప్రత్యేకత. 'పరిశోధనల తర్వాత మేము ఊహించనదానికంటే ఎక్కువగా ఈ అద్దాలు పనిచేస్తున్నాయి' అని అమెరికాలోని డెల్వర్ విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ కీత్ గుస్సేన్ పేర్కొన్నారు. ఈ అద్దాల తయారీలో ఆయన త్రీడీ సాంకేతికతపై ఆధారపడ్డారు. అయితే ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉన్న సమయంలో ఈ అద్దాలు ఎలా పనిచేస్తాయనే దానిపై గుస్సేన్ పరిశోధనలు చేస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

సొగసు

ట్రెం'డీసెంట్'గా..

ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో గెట్ టు గెదర్‌లు... పార్టీలు, ఫంక్షన్లు... వేడుక ఏదైతేనేం స్పెషల్‌గా కనిపిస్తే బాగుంటుంది కదా! ఇటువంటి ప్రత్యేక సందర్భాలకోసం రెగ్యులర్‌గా వేసుకునే డ్రెస్‌లకు బిగ్ 'నో', భారీ డ్రెస్‌ల వైపయితే చూడనే చూడరు. మరి ఎలాగైతే బాగుంటుందబ్బా! అని ఆలోచనల్లో పడిపోయారా? ఆ ఆలోచనలకు బ్రేక్ వేసి ఇక్కడ ఇచ్చిన డ్రెస్‌ల వైపు ఓ లుక్ వేయండి.

నేవీ బ్లూ లేయర్డ్ హ్యాండ్ బ్లాక్ ప్రింట్ ఇండో వెస్ట్రన్ డ్రెస్. నాణ్యమైన కాటన్ ఫ్యాబ్రిక్‌తో కుట్టారు. ఆకర్షణీయమైన పువ్వులు, చుక్కల హ్యాండ్ బ్లాక్ ప్రింట్స్, లేయర్డ్ స్టయిలింగ్, నడుముకు పెట్టిన బెల్ట్‌తో ఇండో వెస్ట్రన్ స్టయిల్ స్టేట్‌మెంట్ లుక్ వచ్చేసింది. ఈ బెల్ట్ అటు ఇటు కదిలిపోకుండా సపోర్టు హుక్స్ కుట్టారు. సాలిడ్ ప్రింట్ స్ప్లిట్ నాచ్ కాలర్‌తో, నేలమీద తాకుతున్నట్టున్న స్టయిలిష్ డ్రెస్ ఇది.

ధర: 2,070 రూపాయలు

రావిషింగ్ అనార్కలి లాంగ్ డ్రెస్‌ను ఫ్యామిలీ గ్యాదరింగ్‌లకు వేసుకెళ్తే గ్లామరస్ దివా మీరే అవుతారు. మోచేయి దాటి కాస్త కింద వరకు కుట్టిన చేతులు, రౌండ్ నెక్ లైన్, పీచ్ బుటి, జాల్ ప్రింట్స్‌తో యునిక్‌గా స్టయిలింగ్ చేశారు.

ధర: 2,160 రూపాయలు

పసుపు, నీలం రంగులతో ఉన్న ఎసిమెట్రికల్ లాంగ్ డ్రెస్ నడుముకు బెల్ట్ డిజైన్ చేయడం వల్ల స్పెషల్ లుక్ వచ్చింది. పొడవుగా కుట్టిన చేతులకు కఫ్స్ ఇచ్చారు. కుర్తీ కింద భాగంలో ఎసిమెట్రికల్‌గా కుట్టారు. రేయాన్ ఫ్యాబ్రిక్‌తో కుట్టిన ఈ డ్రెస్‌కు రౌండ్ డిజైనర్ నెక్ కుట్టారు.

ధర: 2,880 రూపాయలు

బ్లూ ఎసిమెట్రికల్ బ్లాక్ ప్రింటెడ్ ఇండో వెస్ట్రన్ డ్రెస్ వేసుకుంటే రాయల్ లుక్ రావడం ఖాయం. దీనికి వాడిన ఫ్యాబ్రిక్ మోడాల్(రేయాన్‌లోనే ఒక రకం). రౌండ్ కాలర్ నెక్, త్రీఫోర్త్ చేతులు, ఎసిమెట్రికల్ డ్రెస్‌ను మోకాలి కింది వరకు పొడవు వచ్చేలా కుట్టారు.

ధర: 2,160 రూపాయలు

గులాబీ రంగు అంగ్రఖ స్టయిల్ చందేరి హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ ఇండో వెస్ట్రన్ డ్రెస్. చందేరి ఫ్యాబ్రిక్‌కు కాటన్ లైనింగ్ ఇచ్చారు. సాలిడ్ ప్రింట్ స్లీవ్స్ త్రీఫోర్త్ వరకు కుట్టారు. ఓ పక్కకు డిజైనర్ కుచ్చులు ఇవ్వడంతో స్పెషల్ లుక్ వచ్చింది. చేతులకు బంగారు లేస్ ఇచ్చి, నెక్‌లైన్‌కు గోల్డెన్ పైపింగ్ ఇచ్చారు.

ధర: 2,250 రూపాయలు



సౌజన్యం: www.missprintclothing.com

కౌన్సెలింగ్ కార్నర్

చాడీలకు దూరంగా...?

మేడమ్... నాకు రెండు సమస్యలున్నాయి. ఒకటి ఆఫీసులో చాడీలకు, పుకార్లకు దూరంగా ఉంటూ పనిలో ఏకాగ్రత, నైపుణ్యం పెంచుకోవడం ఎలా? రెండోది ఇంట్లో ఎవరైనా (ముఖ్యంగా తల్లి) డిప్రెషన్‌తో బాధపడితే ఆ ప్రభావం పిల్లలపై ఉంటుందా? వారు కూడా అలాగే ఉండే అవకాశం ఉందా?

- రమ



చాలా సున్నితమైన మనస్తత్వం గల వారిలా ఉన్నారు. మీకు అన్నీ తెలుసు. అయినా బాధపడుతున్నారు. అయితే ఆఫీసుల్లో రకరకాల రాజకీయాలుంటాయి. కొన్నిసార్లు మన పని మనం చేసుకుపోయినా ఇబ్బందులే! మీరన్నది నిజమే! చుట్టూ పుకార్లు, చాడీలు చెప్పేవారు ఉంటే మానసిక ప్రశాంతత ఉండదు. కానీ పనే ముఖ్యం అనుకునేవారిని ఎవరూ ఏమీ చేయలేరు. పనిలో ఏకాగ్రత, నైపుణ్యం మీ లక్ష్యం అయినప్పుడు మిగతా విషయాలు పట్టించుకోనక్కరలేదు. మనలో ప్రతిభ ఉంటే ఎవరూ ఏమీ చెయ్యలేరు. అలా అని ఎవరితో మాట్లాడకుండా గిరి గీసుకొని కూర్చోమని కాదు. వీలైనంత సౌమ్యంగా ఉంటూనే ఉద్యోగమే మీకు ముఖ్యమని సూచించవచ్చు. అయినా మీకిష్టం లేకపోతే పనిగట్టుకుని వచ్చి చాడీలు చెప్పరు కదా! మనల్ని బట్టే ఎదుటివారి ప్రవర్తన ఉంటుంది.

ఇక మీరు అడిగిన రెండో విషయం... ఇంట్లో తల్లి డిప్రెషన్‌తో బాధపడితే ఆ ప్రభావం పిల్లల పైన ఉంటుందా అని! పూర్తి వివరాలు తెలియకుండా చెప్పడం కష్టం. కానీ ఆ ప్రభావం ఎంతో కొంత ఉంటుంది. వైద్యపరంగా సంప్రతిస్తే మీకు మరింత మంచి సలహా లభించే అవకాశం ఉంది.

• **కె.శోభ**
ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్,
shobhas292@gmail.com

నగధగ



ధోతీ ధగధగలు

ధోతీ ఫంక్షన్ వేడుకలో మగ పిల్లల దుస్తులతో పాటు ఆభరణాల అలంకరణ మీద కూడా దృష్టి పెట్టాలి. అయితే మగ పిల్లలకు ఆభరణాల ఎంపిక దగ్గరకొచ్చేసరికి అయోమయంలో పడిపోతూ ఉంటారు. కానీ ప్రత్యేకంగా ధోతీ వేడుకలో మగపిల్లల అలంకరణకు ఆభరణాలున్నాయి. అయితే వాటి ఎంపికలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అవేంటంటే...

ఆభరణాలు అనేకం: మగపిల్లలకు ధోతీ వేడుకలో సర్‌పేంచ్, కడియం, మెడలో ముత్యాల హారాలు లేదా పులి గోర్లు వేసుకోవచ్చు. అయితే ఈ ఆభరణాలు వేడుక తర్వాత పనికిరావు అనుకుంటే, ముత్యాల్లోనే తక్కువ ఖరీదు కలిగినవి ఎంచుకోవచ్చు. తలపాగా పెట్టకపోతే సర్‌పేంచ్ కూడా కొనక్కర్లేదు. కడియం స్థోమతకు తగిన బంగారంతో



తయారు చేయించుకోవచ్చు.

పులి గోరు, ముత్యాల హారాలు: ముత్యాల హారాల్లో నాలుగు లేదా ఐదు వరసలవి బాగుంటాయి. ప్రత్యేకంగా మగపిల్లల కోసం ముత్యాల హారాలు బంగారం షాపుల్లో దొరుకుతాయి. ఇవి ఆడపిల్లల హారాల కంటే కొంచెం లావుపాటి ముత్యాలతో తయారై ఉంటాయి. నాణ్యతను బట్టి క్యారెట్ 250 రూపాయల నుంచి వెయ్యి రూపాయల ధరల్లో దొరుకుతాయి.



కాస్త భారీగా వేయాలనుకుంటే ఐదు హారాలకు కలిపి 50 వేలలో కొనుక్కోవచ్చు. అంతలో వద్దనుకుంటే పది వేలలోనే దొరుకుతాయి. పులిగోరు నిజంగా పులి గోరు కాకపోయినా, రాజసం ఉట్టిపడేలా ఉంటుంది కాబట్టి పక్షులు, అడవి దున్నల గోర్లతో తయారు చేస్తూ ఉంటారు. ఇవి కూడా బంగారం షాపుల్లో దొరుకుతాయి. ఈ పులి గోళ్లకు బంగారం తొడుగు చేయించి, దాని మీద వజ్రాలు పొదిగిస్తే ఆకర్షణీయంగా ఉంటాయి. ఇలాంటిది ఒక గోరు వేసుకున్నా బాగుంటుంది.

సర్ పేంచ్: తలపాగా పెడితే తప్పనిసరిగా సర్‌పేంచ్ అలంకరించాలి. కుందన్, అన్ కట్ డైమండ్స్ సర్‌పేంచ్‌లు ఆకర్షణీయంగా ఉంటాయి.


కడియం: చేతి కడియాల్లో నక్ష్ స్టయిల్ తాజా ట్రెండ్. వీటిలో పులి ముఖాకృతిలో ఉండే కడియాలు ధరించే ట్రెండ్ ఇప్పుడు నడుస్తోంది. కాబట్టి ఏదో ఒకటి కాకుండా ప్రత్యేకంగా కనిపించే కడియం ఎంచుకోవాలి.



మంజుల రావు
మంజుల జ్యువెల్స్,
హైదరాబాద్

సమ్మర్ జ్యూస్

గ్రీన్ గ్రేప్ జ్యూస్



కావలసినవి:


ఆకుపచ్చని ద్రాక్షపండ్లు - రెండు కప్పులు, నిమ్మరసం - ఒక టేబుల్ స్పూన్, ఐస్‌క్యూబ్స్ - ఆరు, పంచదార - ఒక టీస్పూన్ (ఇష్టపడితే).

తయారీ:

- ద్రాక్షపండ్లను శుభ్రంగా కడగాలి.
- ద్రాక్షపండ్లు, ఐస్‌క్యూబ్స్, పంచదార, నిమ్మరసాలను బ్లెండర్‌లో వేసి ఒక నిమిషం మిక్సీ పట్టాలి.
- చల్లచల్లటి ద్రాక్షజ్యూస్‌ను గ్లాసులో పోసుకుని తాగితే తాజాదనాన్ని ఇస్తుంది.

ప్రోత్సాహంతో ఉత్సాహం!

పేరెంటచ్



పిల్లల్లో సహజసిద్ధంగా శక్తిసామర్థ్యాలుంటాయి. అయితే ఉత్సాహపరిచే మాటలతో అవి రెట్టింపవుతాయి. నిరుత్సాహపరిస్తే కుదించుకుపోతాయి. "అసలే నీకు మతిమరుపు. ఒకటికి నాలుగుసార్లు చదువు" అనే మాటలు తరచూ తల్లిదండ్రులు అంటుంటే ఆ మాటలు తప్పకుండా పిల్లల్ని నిరుత్సాహపరుస్తాయి. పిల్లల్ని పాజిటివ్ మాటలతో ముందుకు నడపాలే గానీ, నెగిటివ్ మాటలనుంచి పాజిటివ్ వైపు నడపాలంటే కష్టం. ఎవరికైనా మరిచిపోవడం అనేది ఉంటుంది. అదేదో చిన్నపిల్లల్లో మాత్రమే ఉండే లోపమైనట్లు వాళ్లనే ఎందుకు ఎత్తిపొడవడం? ఎత్తిపొడుపులతో ఎవరికీ కొత్త శక్తి రాదు. "పక్కింటి పిల్లలు రోజంతా చదువుతారు. మీరు నాలుగు గంటలు చదివేసరికే గుడ్లు వేలాడేస్తారు?" అంటే ఏం చెబుతారు? ఎవరి పరిమితులు వాళ్లకు ఉంటాయి.

"వెరీ గుడ్! బాగా చదువుతున్నావు. ఈ స్పిరిట్‌ను ఇలాగే కొనసాగించు ఈసారి నీకు మంచి ర్యాంకు రావడం ఖాయం!" ఇలాంటి ప్రోత్సాహకర మాటలు తల్లిదండ్రుల నుంచి వస్తూంటే, అవి వాళ్ల మీద మంత్రంలా పనిచేస్తాయి. అందుకే పిల్లల్ని నిరుత్సాహ పరిచే మాటలకు పేరెంట్స్ ఎంత తొందరగా ఫుల్‌స్టాప్ పెడితే అంత మంచిది. దానివల్ల పిల్లలకు ఎంతో మేలు కలుగుతుంది. పరీక్షల సమయంలో వారిని నిరుత్సాహానికి గురి చేసే మాటలేవీ అనకపోతేనే బెటర్.



ఆనంద రహస్యం

జీవితమనేది ఒక తోట లాంటిది. తోటలో... సహజంగానే ఆకులు రాలిపోతుంటాయి. పువ్వులు రంగు వెలిసిపోతుంటాయి. అలాగే జీవితంలోనూ! రాలిపోయిన ఆకులన్నిటినీ ఏరి, పారేసినట్లే, మనం మన గతం తాలూకు చేదు జ్ఞాపకాలను మనసులో నుంచి వదిలించుకోవాలి. అప్పుడే కొత్తగా వేసిన చిగుళ్ళు, పూసిన పువ్వులను ఆస్వాదించగలం. జీవితమంటే మరేదో కాదు... మరచిపోవడమనేది జ్ఞాపకం ఉంచుకోవడం! ఏవేవి క్షమించాలో, వాటిని క్షమించండి. ఏవేవి మర్చిపోవాలో వాటిని మర్చిపోండి. ఇనుమడించిన ఉత్సాహం, ఉద్వేగాలతో జీవితాన్ని అక్కున చేర్చుకోండి. అప్పుడే విరబూసిన పుష్పం లాగా జీవితంలోని ప్రతి క్షణాన్నీ కొత్త ఆశతో అందుకోవాలి. ఆస్వాదించాలి.

జీవితంలో ఒక తేనెటీగలా ఉండడం నేర్చుకోవాలి. తేనెటీగ ఎక్కడెక్కడికి వెళ్ళినా... కేవలం తేనెనే సేకరిస్తుంది. అలాగే, మనం ఎక్కడకు వెళ్ళినా, అవతలివారిలోని చెడును వదిలేసి, కేవలం మంచినే గ్రహించాలి. మీ గుండెల నిండా ప్రేమనూ, కృతజ్ఞతాభావాన్నీ నింపుకోండి. జీవితమనేది మనకు అవసరమైనది ఇస్తుంది. అంతేతప్ప, మనం కోరుకున్న ప్రతీదీ ఇవ్వదు. ఆ విషయం గ్రహించాలి. జీవితం తనదైన వివేకంతో ముందుకు సాగుతుంది. చాలా సందర్భాల్లో అది మన స్వల్ప బుద్ధికి అర్థం కాకపోవచ్చు. కాబట్టి, జీవితంలో ఎలాంటి సంఘటనలు, సందర్భాలు ఎదురైనా వాటిని అంగీకరించి, ముందుకు సాగడం నేర్చుకోవాలి. ఇలా జీవితంలో ఏది ఎదురైనా, దాన్ని అంగీకరించే మనస్తత్వమే ఆనంద రహస్యం.

మెహర్ మాట

ముందే చెప్పిన బాబా!



మెహెర్‌బాబాను మానవ రూపంలో వచ్చిన భగవంతునిగా భక్తులు ఆరాధిస్తారు. ఆయనను గురువుగా భావించే వారూ, మహిమాన్వితునిగా కీర్తించే వారూ ఎందరో! వీరిలో ప్రముఖులు కూడా ఉన్నారు.

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ యం.హిదయతుల్లాకు సంబంధించిన ఒక యథార్థ సంఘటన ఇది. ఈ విషయాలను జస్టిస్ హిదయతుల్లా తన జీవిత చరిత్ర 'మై ఓన్ బోస్వెల్'లో రాసుకున్నారు. బోస్వెల్ అంటే తెలుగులో 'జీవిత చరిత్ర' అని సమానార్థకంగా చెప్పుకోవచ్చు. ఆ పుస్తకం 217వ పేజీలో మెహెర్‌బాబాతో తన పరిచయాన్ని జస్టిస్ హిదయతుల్లా ప్రస్తావించారు. "1967లో ఢిల్లీ మెహెర్‌బాబా సెంటర్‌వారు మెహెర్‌బాబా జన్మదినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఒక సభలో ప్రసంగించే అవకాశం నాకిచ్చారు. నాతోపాటు పలువురు మెహెర్‌బాబా జన్మదినోత్సవాల్లో ప్రసంగించారు. ఆ వివరాలన్నిటినీ మెహెర్‌బాబాకు నిర్వాహకులు తెలియజేశారు. అప్పుడు బాబా నాకొక చిన్న సందేశం ప్రత్యేకంగా పంపారు. ఆ తదుపరి సంవత్సరం (1968లో) వచ్చే తన జన్మదినోత్సవాన్ని గుర్తుంచుకోమని బాబా ఆ సందేశంలో చాలా స్పష్టంగా పేర్కొన్నారు. "రిమెంబర్ మీ ఆన్ మై నెక్స్ట్ బర్త్‌డే" అని!



ఎం. హిదయతుల్లా

అప్పట్లో నాకు ఆ సందేశంలోని విశేషం గురించి ఏమీ అంతుపట్టలేదు. మరుసటి ఏడాది రానే వచ్చింది. అది 1968 ఫిబ్రవరి 25- అవతార్ మెహెర్‌బాబా జన్మదినోత్సవం మాత్రమే కాదు...నేను భారతదేశ అత్యున్నత న్యాయస్థానం- సుప్రీం కోర్టులో ఛీఫ్ జస్టిస్‌గా ప్రమాణం చేసిన రోజు! అసలు విషయానికి వస్తే నాకు ప్రధాన న్యాయమూర్తిని కాగల అవకాశాలు చాలా తక్కువ. న్యాయమూర్తుల సీనియారిటీలో నా పేరు చివరలో ఉంది. నాకు ప్రమోషన్ వచ్చే అవకాశం ఏ మాత్రం లేదు. జస్టిస్ వాంఛూ ఛీఫ్ జస్టిస్‌గా రిటైరవుతున్నారు. ఆయన స్థానంలో నా పేరు సిఫార్సు చేశారు. ఆ విధంగా మెహెర్ బాబా నా భవిష్యత్తును ముందుగానే తెలియజేశారు!" అని హిదయతుల్లా పేర్కొన్నారు.

ఛీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాగా వ్యవహరించిన తొలి మహమ్మదీయుడు జస్టిస్ మహమ్మద్ హిదయతుల్లా. ఆయన ఉప రాష్ట్రపతిగా (1979-1984) పూర్తి కాలం పనిచేశారు. 1969లో ఛీఫ్ జస్టిస్ హోదాలో కొనసాగుతూ భారత తాత్కాలిక రాష్ట్రపతిగా పనిచేశారు. ఛీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాగా, భారత ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి పదవి వంటి మూడు అత్యున్నత పదవులలో పనిచేసిన ఏకైక వ్యక్తి హిదయతుల్లా. ఇదంతా మెహెర్‌బాబా కృప అని ఆయన ఎప్పుడూ చెబుతుండేవారు.

ఆధ్యాత్మికత వ్యాపారం కాదు!

ధర్మపథం



ఆధ్యాత్మికతను, ధార్మికతను వ్యాపారంగా మార్చుకొని ధనం సంపాదించేవారు కొందరున్నారు. బుద్ధుని కాలంలో జీవించిన చందాభుడు అలాంటివాడే! చందాభునికి కోసల రాజధాని శ్రావస్తిలో ఒక విలాసవంతమైన ఆశ్రమం ఉంది. కొన్ని మహిమలు చూపించి జనాన్ని ఆకర్షించుకొనేవాడు. ఆయన చూపించే మహిమల్లో ఒకటి ఆయన మెరిసే పొట్ట. బొడ్డు చుట్టూ కాంతిమంతంగా మెరిసే వెలుగు చూపించేవాడు. కష్టాల్లో ఉన్నవారు, కోర్కెలు తీరాల్సినవారు ఆ వెలుగును తాకితే కష్టాలు పోతాయనీ, కోర్కెలు తీరతాయనీ నమ్మించాడు. అలా తాకాలంటే ఎక్కువ మొత్తంలో సొమ్ము చెల్లించాలని రుసుము ప్రకటించాడు.

అదే సమయంలో శ్రావస్తి నగర పొలిమేరలో ఉన్న జేతవనంలో బుద్ధుడు ఉంటున్నాడు. ఆయన ధర్మ ప్రసంగాలు వినడానికి ఎందరో వెళ్లేవారు. ఆయన మానవీయ మధుర ప్రబోధాలే చేసేవాడు కానీ మహిమలు చూపే వాడు కాదు.

బుద్ధుణ్ణి తన మంత్రశక్తితో ఓడించాలని చందాభుడు అనుకొన్నాడు. దానికి ఆయన అనుయాయులు మరింత ఊతాన్నిచ్చారు. ఒకనాడు తన పరివారంతో కలసి జేతవనానికి వెళ్లాడు. బుద్ధుని ముందు కూర్చొని "ఓ! గౌతమా! నా దివ్యశక్తిని చూస్తావా? మహిమలుంటాయని ఒప్పుకుంటావా?" అని అడిగాడు. బుద్ధుడు మౌనంగా అతని ముఖంలోకి చూసి చిరునవ్వు నవ్వాడు.

చందాభుడు ఒక భంగిమలో కూర్చొని తన పొట్టను బిగబట్టాడు. ఎలాంటి వెలుగూ రాలేదు. రెండుమూడు సార్లు ప్రయత్నించాడు. ఫలితం లేదు. గబగబా లేచి, దూరంగా పోయి ప్రయత్నించాడు. వెలుగు కన్పించింది. మరలా బుద్ధుని ముందు కూర్చొని ప్రయత్నించాడు. వెలుగు కనిపించలేదు. 'ఈయన నాకంటే గొప్ప మహిమలు తెలిసినవాడు. ఈయన శిష్యరికం చేసి ఆ మహిమలన్నీ నేర్చుకొని, ఇంకా బాగా సంపాదించాలి' అనుకొని, తన వెంట వచ్చినవారిని పంపించి, బుద్ధుని అనుమతితో భిక్షువుగా మారాడు.

బుద్ధుడు మహాజ్ఞాని. అతని ఆలోచనల్ని పసిగట్టాడు. అతని అజ్ఞానాన్ని తొలగించాలనుకున్నాడు. మానవ శరీరాన్ని గురించి, శారీరక, మానసిక ధర్మాలను గురించి చందాభునికి ప్రబోధించాడు. మరీ ముఖ్యంగా నైతిక జీవనం గురించి, దానివల్ల కలిగే తృప్తి గురించి వివరించాడు.

"చందాభా! జ్ఞానం, శీలం, ధ్యానం మాత్రమే మనల్ని మాననీయులుగా తీర్చిదిద్దుతాయి. మనం ప్రజ్ఞ సాధించి ప్రజల్ని జ్ఞానవంతుల్నీ, నీతిమంతుల్నీ చేయాలి. శీలవంతులుగా మలచాలి. మన ప్రజ్ఞను అంగడి సరుకుగా మార్చి, అమ్ముకోకూడదు. అది అకుశలకర్మ. మాయలూ, మహిమలూ ప్రదర్శిస్తూ జనాన్ని మూఢంగా మార్చి ధనాన్ని ప్రోగు చేసుకునే ఆధ్యాత్మిక గురువులు ఎలాంటి వారంటే.. తమ సరుకుల్ని విశేషంగా అమ్ముకోవడం కోసం, జనాకర్షణ కోసం నాట్యకత్తెల్ని చూపించి, ప్రచారం చేసుకునే వ్యాపారుల్లాంటి వారు. ఇలాంటివన్నీ అకుశల కర్మలే!" అని హితోపదేశం చేశాడు. అనంతర కాలంలో చందాభుడు తన బుద్ధిమార్చుకొని మంచి ధార్మిక ప్రబోధకుడిగా పేరుపొందాడు.


● బొర్రా గోవర్ధన్

నవజీవనవేదం

శ్రీరమణ కథామృతం

శ్రీభగవాన్ విద్వత్తు

(గత సంచిక తరువాయి)



శ్రీభగవాన్ సన్నిధిలో చర్చ జరుగుతున్న సమయంలో ఉన్నట్టుండి శ్రీభగవాన్ లేచి బయటకు వెళ్లారు. హాలు బయట ఉన్న గ్రామస్థుని వద్దకువెళ్లారు. అక్కడ వాళ్లిద్దరూ కాసేపు మాట్లాడుకున్నారు. కాసేపటికి ఆ గ్రామస్థుడు శ్రీరమణులకు నమస్కరించాడు. శ్రీభగవాన్ తిరిగి వచ్చారు. దీన్ని గమనిస్తున్న ప్రొఫెసర్ స్వామినాధన్ ఉత్సుకతతో ఆ గ్రామస్థుని వద్దకు వెళ్లి శ్రీభగవాన్ ఏమి చెప్పారని అడిగారు. అప్పుడు అతను ఇలా చెప్పాడు. 'శ్రీభగవాన్ నన్ను ఎందుకు దూరంగా నిలబడ్డావని అడిగి, నా పేరునీ, నా కుటుంబం గురించీ, మా గ్రామం గురించీ అడిగారు. నాకేమి కావాలని అడిగారు. మీ ఆశీర్వచనాలు కావాలని నేనన్నాను. వారు మా గ్రామంలో గుడి ఏదైనా ఉందా అని అడిగి, ఆ గుడిలోని దేవత పేరునే జపిస్తూ ఉండు. నీకు కావాల్సిన ఆశీర్వచనాలన్నీ దొరుకుతాయి' అని అన్నారు. *(సశేషం)*

● పింగళి సూర్యసుందరం

అదే పరిణతి!...ప్రశాంతం!!



ఆత్మసాక్షాత్కార సాధన చేస్తున్న కొద్దీ మనస్సు మౌనంగా ఉండటాన్ని కోరుకుంటుంది. మనోమౌనమే తత్వదర్శనం. అంతకుముందు అన్నింటి మీద అభిప్రాయాలు చెప్పాలనీ, వాదించాలనీ, పత్రికలకు వ్యాసాలు రాయాలనీ, వారినీ, వీరినీ ఓడించాలనీ ఉంటాయి. ఇవన్నీ క్రమంగా తగ్గిపోవడమే ఆరాధన ఫలితం. దాన్నే పరిణతి, పరిపక్వత అంటారు. కాయ, పండు అయిన తరువాత రాలి తీరుతుంది. ఆ రాలిన పండును ఎవరో ఒకరు తింటారు. లేదంటే భూమిలో కలిసి మళ్లీ మొక్కగా పుడుతుంది. మనుషులందరూ అంతే! దేవునిలో ఐక్యం కావాల్సిందే!

ఈ ప్రపంచంలోకి ఏమీ లేకుండా నిరాధారంగా, నిరంజనంగా, నిర్మలంగా, నిత్యంగా, నిరాశ్రయంగా వచ్చాం. అదే విధంగా ముగిసిపోవాల్సిందే! ఈ మధ్యలో వచ్చినవి గాలివాటం. వస్తుంటాయి, పోతుంటాయి. ఇంద్రధనుస్సులో ఏడురంగులు. కానీ తెలుపు, నలుపే స్థిరమైన రంగులు. అవి ఇంద్రధనుస్సులో ఉండవు. అందుకే ఇంద్రధనుస్సు అజ్ఞానానికి ప్రతీక. తెలుపు, నలుపు జ్ఞానానికి ప్రతీక. ఇంద్రధనుస్సు ఎప్పుడూ సూర్యునికి వ్యతిరేకంగా పడుతుంది. అంటే జ్ఞానానికి వ్యతిరేకం.

నిన్ను చూడవలయు నిశ్చలంబుగనని
తలపులన్ని మూసి నిలిచియుండ
అంతలోనే పద్యమాబగా పలికింతువు
ఇంత మౌనవీయవేమి తల్లీ!

నిన్ను నిశ్చల మనస్సుతో చూద్దామనుకుంటే, చూడనీయవేమిటమ్మా సౌందర్యలహరీ! పద్యాలు చెప్పిస్తున్నావు. ఇదేమిటమ్మా! కవి కావడం అదృష్టమా, దురదృష్టమా! కాసేపు మౌనంగా ఉండే అదృష్టం ఇయ్యవేమి తల్లీ! అంతిమంగా మనం అందరం కోరుకోవాల్సింది ఆ మౌనాన్నే! రమణమహర్షి చెప్పినట్టుగా మౌనం అంటే మాట్లాడకపోవడం కాదు, మాట్లాడాలని అనిపించకపోవడం! ఈ పరిణతి సాధిస్తే ప్రతిదానికీ వాదించాలనే చాపల్యం పోతుంది. నిశ్చలమైన మౌనంలోకి వెళ్లినప్పుడే మనస్సులోని అశాంతి, ఆందోళన దూరమవుతాయి. అవి దూరమైతేనే మౌనంలోకి వెళతాం. దీనికి అదీ కారకమే. దానికి ఇదీ కారకమే. అశాంతి, ఆందోళనలకు అర్థం తెలిస్తే అప్పుడు సరైన వైద్యం చేయించవచ్చు. ప్రశాంతత అంటే ఏమిటి? 'చెరువు చూడు ఎంత ప్రశాంతంగా ఉందో' అంటాం. చెరువు ప్రశాంతంగా ఉండటం ఏమిటి? చెరువు మనిషా? పైగా మనిషి అంటున్నాడు చెరువు ప్రశాంతంగా ఉందని! చెరువుకు శాంతి, అశాంతి ఏమిటో తెలియదు. మన దృష్టిలో చెరువు ప్రశాంతంగా ఉండటం అంటే, చేపలు కూడా చలించనప్పుడు, తరంగాలు కూడా ఏర్పడనప్పుడు... వెండి దారేదో పరిచినట్టుగా ఉంటే చెరువు నిశ్చలంగా ఉన్నట్టు! మన మనస్సును కూడా అలా నిశ్చలంగా ఉంచుకోవాలి. మనస్సు ఎందుకు అశాంతికి లోనవుతుందంటే ఉన్న చోట స్థిరంగా లేకపోవడమే కారణం!



● డా. గరికిపాటి నరసింహారావు

మీకు తెలుసా?

పంచాయుధాలు

మహా విష్ణువు ఆయుధాలు అయిదు. వాటి పేర్లు పాంచజన్యం (శంఖం), శార్‌ఙ్గము (ధనుస్సు) సుదర్శనం (చక్రం), కౌమోదకి (గద), నందకం (చక్రం).



ఉపదేశం

స్వీయజ్ఞానం



మీ గురించి మీరు ఎంత ఎక్కువ తెలుసుకుంటే అంత ఎక్కువ స్పష్టత వస్తుంది. స్వీయ జ్ఞానానికి ముగింపు అంటూ లేదు. అది అనంతమైన నది లాంటిది.

● జిడ్డు కృష్ణమూర్తి

దైవమార్గం

దేవుణ్ణి చేరువ చేయాలంటే...

'సుఖారు' అనే నిషిద్ధ సమరయ గ్రామాన్ని ఒకసారి యేసుప్రభువు తన శిష్యులతో సందర్శించాడు. ఆయన అలిసిపోయి, దాహంతో అక్కడి యాకోబు బావి వద్ద కూర్చున్నాడు. ఇంతలో... అప్పటికి ఐదుగురు భర్తల్ని వదిలేసి మరొక వ్యక్తితో సహజీవనం చేస్తున్న ఒక స్త్రీ నీళ్లు తోడుకోవడానికి బావి వద్దకు వచ్చింది. యేసు ఆమెతో సంభాషించి, ఆమె ఆత్మీయ దాహాన్ని తీర్చాడు. అలా యేసు ప్రభువు ప్రేమనూ, క్షమా సువార్తనూ విని ధన్యురాలైన ఆ స్త్రీ పరుగెత్తుకొని వెళ్లి, "నేను క్రీస్తును కనుగొన్నాను! ఆయన్ను మీరు కూడా వచ్చి చూడండి!" అంటూ గ్రామస్థులందరికీ 'సువార్త' ప్రకటించింది. వాళ్లంతా వచ్చి యేసును చూసి, ఆయన బోధ విని ఆయనను విశ్వసించారు (యోహాను 4: 4-42). ఒక అస్పృశ్యుల గ్రామంలో, సమాజం అంతగా గౌరవించని ఒక స్త్రీ పరిచర్య, ప్రోత్సాహంతో, ఇలా అనుకోకుండా ఒక అద్భుతమైన 'సువార్త మహాసభ' జరిగింది. వందలాదిమంది సువార్తను అంగీకరించగా, దేవుని రాజ్యం దివ్యంగా కట్టబడిన ఒక అరుదైన సంఘటన ఇది.

ఇంతకీ ఆ సమరయ స్త్రీ చేసిన పరిచర్యలోని విశేషమేమిటి? ఏమీ లేదు! యేసు ప్రభువనే జీవజలమున్న బావి నీటిని తాను ముందుగా సేవించి, ఆత్మీయ దాహం తీర్చుకొంది. ఆ బావి వద్దకు తన గ్రామ ప్రజల్ని తీసుకొచ్చి, ఆ బావిలోని జీవజలాన్ని వారికీ తోడి పోసింది. అలా గ్రామస్థుల ఆత్మీయదాహం కూడా తీర్చింది. ఒక బావి, దాంట్లో పుష్కలంగా నీళ్లుంటే సరిపోదు! అవి చేది ప్రజలకు పోసే ఒక వ్యక్తి తప్పక కావాలి!! తన పరిచర్య కోసం ఆహ్వానించిన పరిచారకులు, సువార్తికులు, బోధకులకు... దేవుడు ఆ పనే అప్పగించాడు. వారి పని దానికే పరిమితం.

కానీ 'ఈ నీళ్లు తోడిపోసిన నేనే గొప్ప!' అన్న అహంకారం పరిచారకుల్లో తలెత్తిన మరుక్షణం వారి పతనం ప్రారంభమవుతుంది. అందుకే పరిచారకుల్లో వినయం, దీనత్వం, సరళత్వం, మృదుత్వం, సాత్వికత్వం, పారదర్శకత వంటి దైవిక సుగుణాలు ఎంత పుష్కలంగా ఉంటే వారి పరిచర్య అంత ఫలభరితంగా ఉంటుంది. 'ఈ నీళ్లు నావి' అని బావి మిడిసిపడినా అర్థమున్నదేమో కాని, నీళ్లు తోడిపోసిన వ్యక్తి, చాంతాడు, బకెట్టు మిడిసి పడితే అర్థమేమైనా ఉందా?

కానీ 'సెలబ్రిటీలు'గా అవతారాలెత్తుతున్న నేటి అతి సాధారణ పరిచారకులతో అదే సమస్య తలెత్తుతోంది. సామాన్యుల్లోకి, అస్పృశ్యుల్లోకి కూడా చొచ్చుకొని పోయి, వారి జీవితాలను స్పృశించి ధన్యం చేసిన ప్రేమ యేసుప్రభువుది కాగా, 'ఆయన పరిచారకులేనా వీళ్ళు?' అనిపించేలా ఉంటున్నాయి డాబు, దర్పంతో కూడిన ఈనాటి పరిచారకుల పోకడలు! వినయం లేకపోగా అహంకారంతో నిండిన పరిచారకులను ఏమనాలి? దేవదూతల్ని దయ్యాలుగా మార్చింది ఆ అహంకారమే కదా! అహంకారం శాపాలకు, వినయం ఆశీర్వాదాలకు ద్వారాలు అని తెలిపే ఉదంతాలు బైబిల్లో ఎన్ని లేవు? దేవుని రాజ్యాన్ని కట్టేది... పాపిని ప్రభువు వైపునకు తిప్పి పరివర్తన తెచ్చేది... తన వంటి వ్యక్తిని దర్శించి, గౌరవించిన యేసు పట్ల వినయం, కృతజ్ఞత మూర్తీభవించిన ఆ సమరయ స్త్రీ వంటి స్వచ్ఛమైన సువార్తికులే! సిద్ధాంతాలు, మర్మాలు, మేధావుల చర్చలు కాదు... స్వచ్ఛమైన యేసు క్షమా సువార్త మాత్రమే దేవుణ్ణి ప్రజలకు చేరువ చేస్తుంది. "ఇదిగో చూడండి, ఆయన నన్ను మార్చాడు! వచ్చి ఆయన మాటలు వింటే మీరూ మారుతారు!!' అంటూ తన అనుభవాన్ని జోడించి ఆమె ప్రకటించిన 'సువార్త' మొత్తం గ్రామాన్ని దేవుని ప్రేమతో నింపింది. అందుకే యేసు ఎన్నుకున్న అనమాన సువార్తికురాలు ఆ సమరయ స్త్రీ!

● సుశీల్ సందేశ్



సద్గురువాణి

స్త్రీత్వం అందుకే!

మనిషిని సృష్టించడంలో పురుషుడికంటే స్త్రీకే ఎక్కువ బాధ్యత ఇవ్వడానికి ప్రకృతి నిశ్చయించుకుంది. అంటే ఉత్పత్తి రంగంలో వాళ్లు బాగా రాణించగలరనే అర్థం కదా! పురుషులు సృజించినదాని కంటే స్త్రీలే ఎక్కువ సృజించారు. నిజంగానే, గౌరవంతో చెబుతున్నాను.


విడిభాగాలను కలిపి కూర్చి, యంత్రాలుగా తయారుచేయడం (అసెంబ్లింగ్) వంటి పని ముఖ్యంగా పురుషుల పని. మహిళ కర్మాగారంలో పనిచేయటం తన జీవితానికి, ఇంట్లో తన కుటుంబ బాధ్యతలకు అడ్డంకి అవుతుంది. స్త్రీలు ఈ పనులకు తగరని నా ఉద్దేశం కాదు, కాని వాళ్లు నిర్దిష్ట సమయాలలో విరామం తీసికోవలసి ఉంటుంది. ఉత్పత్తి రంగంలో కర్మాగారంలో కూర్చోబెట్టే బదులు డిజైనింగ్, డెవలప్‌మెంటు, మార్కెటింగ్ రంగాల్లో ఆమె సృజనాత్మకతను మరింత మెరుగ్గా ఉపయోగించుకోవచ్చునని నా ఉద్దేశం.

నిత్యం పోటీ తత్త్వంలో పరిగెత్తే పురుషుడికి పెద్దగా గమనించే సామర్థ్యం ఉండదు. కాని మహిళ విశ్రాంతంగా కూర్చుని ఏం జరుగుతున్నదో గమనించే సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకుంది. వాణిజ్య, రాజకీయ నాయకత్వాలు రెండింటిలోను స్త్రీల పాత్ర తప్పకుండాలి, ఎందుకంటే మానవజాతిలో సున్నిత స్వభావాలు మహిళలే.

స్త్రీ-పురుషులు అంటే శారీరకంగా స్త్రీ అనో, పురుషుడనో అర్థం కాదు. స్త్రీత్వం స్త్రీలో ఎంత సజీవంగా ఉంటుందో పురుషుడిలోనూ అంత సజీవ చైతన్యంతో ఉంటుంది. ఈ రెండు లక్షణాలూ సమతుల్యంగా కలిసి ఉన్నప్పుడే మనిషి జీవితం సంపూర్ణమైన తృప్తి ఉంటుంది.

ఇవ్వాళ సాఫల్యం అన్న ఆలోచనను నడిపిస్తున్నది వ్యక్తిగత ఆకాంక్ష. అది చాలా మూర్ఖమైన పద్ధతి. తీవ్రమైన ఆకాంక్ష లేకుండానే మనం సాఫల్యం సాధించే మార్గం ఉంది. మీ చుట్టూ ఉన్న వాటి గురించి మీరు నిజంగా పట్టించుకుంటూ, మీలో కలుపుకొంటూ పనిచేయడం స్త్రీ లక్షణం. లోకంలో, పని చేయడంలో ఇంతకంటే మంచి మార్గం మరొకటి లేదు.

ఇక్కడ, ఇప్పుడు ఏముంది? అని చూసుకోకుండా, దానిపట్ల సరైన శ్రద్ధ లేకుండా పనిచేయడం పురుషుడి పద్ధతి. స్త్రీత్వం ఉన్నది ఉన్నచోటే సంతోషంగా ఉంటుంది. ఈ రెండు లక్షణాలు సమతుల్యంగా ఉన్నట్లయితే మనం ముందుకూ నడుస్తాము, దానితో పాటు మనం ఇప్పుడు ఉన్నచోట కూడా ఆనందంగా ఉంటాం. ప్రపంచంలో ఇప్పుడు జరగవలసింది ఇదే.



● సద్గురు జగ్గీవాసుదేవ్

సందేశం

స్త్రీకి సముచిత స్థానం

సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు అన్నీ ఇన్నీ కావు. ఆడపిల్లలంటే వివక్ష, నిరక్షరాస్యత, గృహహింస, వరకట్న దురాచారం నేటి సమాజంలో సర్వ సామాన్యమయ్యాయి. గ్రామాలలో నేటికీ బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. అత్యాచారాల పర్వం మహిళలను క్రూరంగా బలిగొంటోంది. వ్యాపార ప్రకటనలు, అందాల పోటీలు స్త్రీలను బజారుకీడుస్తున్నాయి. మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, ప్రభుత్వ ప్రైవేట్ సంస్థలు అనే తేడా లేకుండా వేధింపులు పెరుగుతూనే ఉన్నాయి. చివరికి చట్టాలు చేసే అసెంబ్లీలు, పార్లమెంట్‌లోని మహిళా సభ్యులు కూడా వేధింపులకు గురవుతున్నారు. అన్ని రకాలుగా అణచివేతలో మగ్గుతున్న మహిళల విముక్తికి సామాజిక మార్పు చాలా అవసరం.



మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, వేధింపులను నిరోధించడానికి ప్రభుత్వం ఎన్ని చట్టాలు తెచ్చినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది పరిస్థితి.

ఇల్లాలే మహారాణిగా...

కుటుంబ వ్యవస్థలో స్త్రీని పురుషునికి సహాయకారిగా చేయడం జరిగింది. అంటే దీని అర్థం- పురుషుడి కంటే ఆమె తక్కువ అని ఏ మాత్రం కాదు. భార్యగా ఆమెకు మహారాణి స్థానం కల్పించింది ఇస్లాం. కుటుంబ బాధ్యతల నిర్వహణలో భార్యను కేవలం వంటింటి కుందేలుగా కాకుండా ప్రత్యేక హోదా ఇచ్చారు. స్త్రీ సాధికారత, స్త్రీ సమానత, స్త్రీ హక్కులు సాధించడం కోసం ఎన్నో సంఘాలు, సంస్థలు, ఉద్యమాలు మొదలయ్యాయి. మహిళా సంఘాలు ఎంత గొంతు చించుకున్నా, ఎన్ని ఉద్యమాలు చేసినా మహిళను వినిమయ వస్తువుగా వాడుకోవడం మాత్రం స్వేచ్ఛగా, నిరాటంకంగా జరుగుతూనే ఉంది.

స్త్రీల వ్యక్తిత్వానికి గుర్తింపు

స్త్రీల కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయి. అయినప్పటికీ ప్రతి ఏటా ప్రపంచంలో 40 శాతం మహిళలు లైంగిక వేధింపులకు గురవుతున్నారు. ఏడవ శతాబ్దానికి పూర్వం అరబ్బు దేశాల్లో కూడా స్త్రీల పరిస్థితులు ఇంచుమించు ఇలాగే ఉండేవి. కానీ ఇస్లాం సమాజం వారికి సముచిత స్థానం కల్పించింది. ఆస్తిలో వారికి వాటాను నిర్ణయించింది. దాంపత్య జీవితంలో స్త్రీ, పురుషుల హక్కులు, బాధ్యతలు నిర్ణయించింది. స్త్రీలకు కూడా ప్రత్యేక వ్యక్తిత్వం ఉందని ఘోషించింది. ఇస్లాం తీసుకువచ్చిన ఈ మార్పులన్నీ కేవలం చట్టాలు, తీర్మానాలు చేయడం వల్ల ప్రాప్తించినవి కావు. ఇస్లాం ధర్మాన్ని ఆచరణలోకి తీసుకువచ్చిన మహనీయ దైవ ప్రవక్త మహిళల ప్రగతికి పునాదులు వేసి, వారిపట్ల అనుసరించిన వైఖరి వల్ల సమాజంలో స్త్రీకి గొప్ప స్థానంతో పాటు గౌరవం కూడా దక్కింది.

మహిళలకు విద్యా హక్కు

స్త్రీలకు విద్య అనే ఆభరణం ఎంతో అవసరం. విద్య మనిషి జ్ఞాన వికాసానికి మూలం. వ్యక్తిత్వాన్నీ, స్వభావాన్నీ తీర్చి దిద్దడంలో నైతిక, ఆధ్యాత్మిక, ఆర్థిక వికాసాలకు కూడా ఇదే కీలక పాత్ర వహిస్తుంది. ప్రతి విద్యావంతుడైన పురుషుడూ 'తల్లి ఒడి' అనే బడిలో ప్రాథమిక శిక్షణ ముగించుకొని, ఆమె పెంపకంలో నైతికత, ఆధ్యాత్మికత అలవరచుకోవాల్సి ఉంటుంది. ఆ తరువాత అన్ని ప్రాపంచిక పరీక్షలను ఎదుర్కొంటాడు. కాబట్టి సహజంగా అన్ని ధర్మాలూ ఆ మొదటి గురువులైన అతివలకు పురుషులతో పాటు విద్యాభ్యాస హక్కును ప్రసాదించాయి.

అంతిమ దైవ ప్రవక్త గారికి 'చదువు' అనే ఆజ్ఞతో విద్యా వివేకం నేర్పించి, మానవ జీవితంలో (స్త్రీ, పురుష భేదం లేకుండా) విద్య విలువనూ, ప్రాముఖ్యాన్నీ తెలియపరిచాడు దైవం. తరువాత దైవం పట్ల విశ్వాసంతోపాటు విద్యను అభ్యసించిన వారికి ప్రాపంచిక జీవితంలోనే కాక పరలోక జీవితంలో కూడా ఉన్నత స్థానాలను అందజేయడం జరుగుతుందని అంతిమ పవిత్ర గ్రంథమైన 'దివ్య ఖుర్‌ఆన్' తెలియపరిచింది.

● మహమ్మద్ వహీదుద్దీన్

నవ్య సకల

విన్నర్

'నాన్నా! నాకు పిస్టల్ కొనివ్వవా?' అని కూతురు అడగ్గానే లక్షన్నర ఖర్చు పెట్టి కొనిచ్చేశాడా తండ్రి. కూతురు తనతో ఎప్పుడూ డబ్బు ఖర్చు పెట్టించదు. కానీ షూటింగ్‌లో తన సత్తా ఏంటో తనకు తెలుసు కాబట్టే ఖరీదైన పిస్టల్ కొనిపించుకుంది అనుకున్నాడా తండ్రి. కానీ అది ప్రపంచ కప్ షూటింగ్‌లో ఏకంగా రెండు బంగారు పతకాలు గెలుచుకునేంత సత్తా అని ఊహించలేకపోయాడు. ఆ కూతురే... 16 ఏళ్ల అతి పిన్న వయసు గోల్డ్ మెడల్స్ విన్నర్‌గా నిలిచిన మనూ భాకర్!



పదహారేళ్ల సంచలనం

కొంతమంది ఆడటం కోసమే పుట్టినట్టు ఆడతారు. ఆ కోవకి చెందినదే మనూ. కూతురు ఆటల్లో కనబరుస్తున్న ఆసక్తిని గమనించి మర్చంట్ నేవీ ఇంజనీర్ అయిన మను తండ్రి రామ్ కిషన్, ఆమెను ఆరేళ్ల వయసులోనే బాక్సింగ్‌లో చేర్పించారు. ఆ తర్వాత కబడ్డీ, టెన్నిస్, టంగ్‌టా (మణిపురి మార్షల్ ఆర్ట్స్), కరాటే... ఇలా వరుసగా తనకెదురైన ప్రతి క్రీడనూ నేర్చేసుకుంది మనూ. వాటిలో పతకాలూ నెగ్గింది. జాతీయ టంగ్‌టా పోటీల్లో బంగారు పతకం, కరాటేలో జాతీయ పతకం గెలుచుకుంది. ఆ తర్వాత 16వ ఏట షూటింగ్‌ను ఎంచుకుంది.

5 గంటల శిక్షణ... 25 కిలోమీటర్ల ప్రయాణం

ఓపక్క క్రీడలు, మరోపక్క చదువు...అలా రెండు పడవల ప్రయాణం చేస్తూ సురక్షితంగా ఒడ్డుకు చేరాలంటే, ఆ రెండిటినీ ఒక చోటికి చేర్చాలి. ఝజ్జర్ జిల్లా మొత్తంలో షూటింగ్ రేంజ్ కలిగి ఉన్న ఒకే ఒక స్కూల్ - యూనివర్సల్ సీనియర్ సెకండరీ స్కూల్. అదృష్టవశాత్తూ ఆ స్కూల్‌కి ప్రిన్సిపాల్ మనూ తల్లి సుమేధ! అందుకని ఇంటికి స్కూలు 25 కిలోమీటర్ల దూరమైనా, మరో ఆలోచన లేకుండా చేరిపోయింది మను. ఓ పక్క చదువులోనూ ప్రతిభ కనబరుస్తూ, మరో పక్క రోజుకి 5 గంటలపాటు షూటింగ్ ప్రాక్టీస్ చేస్తూ మెరికలా తయారైంది.

క్వాలిఫై అవటానికి 60 షాట్లు

మనూ ప్రపంచకప్ అరంగేట్రం క్లిష్టంగానే మొదలైంది. కానీ 2018 జనవరి నుంచి ప్రపంచకప్ షూటింగ్ నియమాలు మారాయి. స్త్రీలు, పురుషులతో సమానంగా 40 షాట్లకు బదులుగా 60 షాట్లు షూట్ చేయాలనే నిబంధన పెట్టారు. అన్ని షాట్లు కొట్టగలిగితేనే పోటీకి అర్హత సాధించినట్టు. అయితే మనూ ఆ క్వాలిఫయింగ్ రౌండ్‌ను అవలీలగా దాటేసి, మెక్సికో క్రీడాకారిణి అలెజెండ్రాను ఓడించి, మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో స్వర్ణం గెలుచుకుంది. తన విజయం గురించి ఆనందం వ్యక్తం చేస్తూ...'భవిష్యత్తులో మరింత ఎత్తుకు ఎదగటానికి ఈ మెడల్ నాకు స్ఫూర్తి. ఈ పతకం నన్ను ఇప్పటివరకూ సపోర్ట్ చేసిన నా కుటుంబం, కోచ్‌లకు అంకితం' అని చెప్పింది మను. పోటీలో చివరి షాట్ కొట్టబోయే ముందు మనసులో మెదిలిన భావాల గురించి చెబుతూ... 'ఫైనల్స్‌కి వచ్చాననే విషయం మీద కాకుండా, నేను నా టెక్నిక్ మీదే దృష్టి పెట్టాలి అని నాకు నేను చెప్పుకున్నాను. అదే చేశాను, పర్ఫెక్ట్ అయింది' అని సింపుల్‌గా చెప్పేసింది మనూ. మనూ విజయం ఆమె తండ్రినీ పెద్దగా ఆశ్చర్యానికి గురి చేయలేదు. 'షూటింగ్ ప్రాక్టీస్ మొదలుపెట్టిన కొన్ని రోజులకే నాచేత పిస్టల్ కొనిపించుకుంది మను. తను చాలా అంకితభావంతో ఆడుతుంది. అంతేకాదు. తనకేదైనా కావాలని అడిగిందీ అంటే... ఆ ఆటను తను తేలికగా తీసుకోవట్లేదని అర్థం' అంటూ తండ్రి రామ్ కిషన్ చెప్పుకొచ్చారు.

వరించిన రెండో స్వర్ణం

ఒక స్వర్ణం గెలిచిన తర్వాత 'ఇక చాల్లే!' అనుకుంటే, మను మరో స్వర్ణం గెలిచి ఉండేది కాదు. ఆడబోయే ఆట మీద దృష్టి పెట్టింది కాబట్టే రెండో స్వర్ణాన్నీ దక్కించుకోగలిగింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్‌లో ఓం ప్రకాశ్ మిథర్వాల్‌తో కలిసి, ఆటలో ఆరితేరిన, రియో గేమ్స్ గోల్డ్ మెడలిస్ట్ ప్రత్యర్థి జంటను అవలీలగా ఓడించేసింది. రెండో స్వర్ణం గెలిచిన తర్వాత మాట్లాడుతూ... 'మెక్సికోకు వచ్చినప్పుడు కాంస్యం, లేదంటే రజత పతకం గెలుస్తానేమో అనుకున్నాను. ప్రపంచ కప్‌లో మొదటిసారి పాల్గొంటున్నాను, ఒక స్వర్ణం గెలుస్తాననే నమ్మకం కూడా లేదు. కానీ ఒకసారి షూటింగ్ మొదలుపెట్టాక, నేనెప్పుడూ షూట్ చేసినట్టే చేశాను. స్వర్ణాలు దక్కాయి. ఇప్పుడు ఇక్కడ అంతర్జాతీయ షూటర్లందరూ నన్ను గుర్తు పడుతున్నారు. కానీ నాలో అయితే ఏ మార్పూ లేదు' అని చెప్పుకొచ్చింది మనూ భాకర్.

మాన్యువల్ రేంజ్‌లో శిక్షణ

మొదటి ప్రయత్నంలో రెండు స్వర్ణాలు గెలిచిందంటే మనూ అత్యద్భుతమైన ఆధునిక సాంకేతికతతో శిక్షణ పొంది ఉంటుందనుకుంటే పొరపాటు. ఒలింపిక్స్‌లో ఎలక్ట్రానిక్ టార్గెట్స్‌ను షూట్ చేయాలి. కానీ మను స్కూల్‌లో మాన్యువల్ రేంజ్‌లో మాత్రమే సాధన చేసింది. 'సాంకేతికంగా రెండిటికీ ఎంతో తేడా ఉంటుంది. అయినా పోటీలో గెలవటానికి సాధనాలు కాదు, అంకితభావం ముఖ్యం. షూటర్‌కి ఏకాగ్రత, అంకితభావం, శిక్షణ ప్రణాళిక అవసరం. శిక్షణలో నాకంటూ సొంత ప్రణాళిక ఉంది. కాబట్టే ఎలక్ట్రానిక్ టార్గెట్‌లు నన్ను భయపెట్టలేకపోయాయి' అంటూ హుషారుగా చెప్పిన మనూకు ఇంతకూ స్ఫూర్తి ఎవరు? 'నాకు ఎవరూ స్ఫూర్తి లేరు. ఆటనే తప్ప, ఎవర్నీ అనుసరించను. ఎందుకంటే... ఎవర్నో అనుసరించి, వాళ్లలా తయారవటం నాకిష్టం ఉండదు. నేను నాలా భిన్నంగా ఉండాలనుకుంటాను, ఇంకొకరిలా కాదు' అంటూ చెప్పింది మనూ. 11వ తరగతి చదువుతున్న ఈ టీనేజ్ సెన్సేషన్ షూటింగ్ ప్రయాణం ఇక్కడితో అయిపోలేదు. ఈ శనివారం 25 మీటర్ల పిస్టల్ షూటింగ్‌లో ఆమె పాల్గొనబోతోంది. మరి రెండు స్వర్ణాలు గెలిచింది కాబట్టి మూడో స్వర్ణం కూడా మనూ నుంచి ఆశించవచ్చా? 'ఇప్పుడు నేను గెలిచిన పతకాల గురించి ఆలోచించట్లేదు, గెలవబోయే పతకం మీదే నా గురంతా!' అంటూ పిస్టల్ చేతిలోకి తీసుకుంది మనూ భాకర్.

సైకాలజీ కౌన్సెలింగ్

ఆమెకు మొబైలే లోకం!

నా కూతురు వయసు 22 ఏళ్లు. పి.జిలో సీటు రాకపోవడంతో ఉద్యోగ ప్రయత్నాలేవో చేస్తూ ఇంటి వద్దే ఉంటోంది. కొన్నాళ్లుగా ఎక్కువ గంటలు మొబైల్ ఫోన్‌తోనే గడిపేస్తోంది. అస్తమానం నెట్ చూడటం, చాటింగ్ చేయడం ఇదే సరిపోతోంది. పలకరిస్తే ఏదో ముక్తసరిగా సమాధానం చెబుతుంది. పొద్దుపోయింది పడుకోవచ్చు కదా! అంటే దుప్పటి కప్పుకుని ఫోన్ మాట్లాడుతుంది. ఒకవేళ నిద్రపోయినా రాత్రి ఏ 3 గంటలకో లేచి మళ్లీ ఫోన్ మాట్లాడుతూనే ఉంటుంది. ఎందుకిలా అంటే మౌనంగా ఉండిపోతుంది. అమ్మాయి ధోరణి చూస్తూ ఉంటే మునుముందు ఏమైపోతుందోనన్న భయం వేస్తోంది.

- ఎన్. ప్రకాశ్ రావు, రాజమండ్రి



సోషల్ మీడియా ప్రభావంతో ఇటీవలి కాలంలో చాలా మంది యువతీయువకులు ఈ పరిస్థితికి చేరుకుంటున్నారు. కుటుంబ సభ్యులతో తనకు కావలసిన ప్రేమ, ఆత్మీయతలు లభించకపోవడం వల్ల కావచ్చు. లేదా లభించడం లేదని అనుకోవడం వల్ల కావచ్చు కొందరు ఈ స్థితిలోకి వెళుతుంటారు. కొంత మంది డిప్రెషన్ వల్ల కూడా ఇలా చేస్తుంటారు. వాస్తవిక ప్రపంచంతో సంతృప్తి పడలేక ఇలా ఒక కాల్పనిక ప్రపంచంలో తిరుగుతుంటారు. నెట్ ద్వారా మాట్లాడే పరిచితులు ఎవరైనా, కాస్త మనసుకు నచ్చేలా మాట్లాడితే వాళ్లకు ఆకర్షితులవుతారు. వాళ్ల వ్యక్తిగత వివరాల విషయంలో వాళ్లు చెప్పేది నిజమా, అబద్ధమా అని కూడా చూడరు. ఇది కొన్నిసార్లు ఈ పరిణామాలు ఒక ప్రమాదకర స్థితికి చేర్చే అవకాశం ఉంది. అయితే అవతలి వాళ్లే సమస్తం అని కూడా కాదు, వాళ్లను బేస్ చేసుకుని, తమ కల్పనను కూడా జోడించి అందులో జీవిస్తూ ఉంటారు. ఇది వారికో కొత్త లోకమే అవుతుంది. ఆ లోకంలో కొందరు ఎంత దూరం వెళతారంటే, మళ్లీ వెనక్కి తిరిగి రావడమే కష్టమైపోతుంది. ఇలాంటి స్థితిలో వారిని నలుగురితో కలిసిపోయేలా చేయడం ప్రథమ కర్తవ్యమవుతుంది. అందులో భాగంగా, శుభకార్యాలు, మరేవైనా సాంస్కృతిక కార్యక్రమాలకు ఆమె స్నేహితులతో కలిసి వెళ్లేలా ప్రోత్సహించాలి. ఆమె అంతో ఇంతో ఇష్టపడే వ్యక్తులతో ఎక్కువ సేపు మాట్లాడించే ప్రయత్నం చేయాలి. ఆ తర్వాత పుస్తకాలు చదివేలా ఆమె ఇష్టపడే పుస్తకాలను ఆమెకు అందుబాటులో ఉంచాలి. ఇది క్రమంగా మొబైల్ నుంచి పక్కకు వచ్చే అవకాశాలను పెంచుతుంది. ఒకవేళ ఆమె సమస్య డిప్రెషన్ అయితే, మానసిక నిపుణుల్ని సంప్రదించి వైద్య చికిత్సలు ఇప్పించాలి. ఈ చర్యల తర్వాత కొద్ది రోజుల్లోనే ఆమె తిరిగి మామూలు స్థితికి వచ్చేస్తుంది.

- డాక్టర్ ప్రవీణ్‌కుమార్ చింతపంటి
కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్, హైదరాబాద్

మీకు మీరే డాక్టర్

మూత్రవ్యాధులకు చెక్



- నేలములక ఆకు రసంలో కొంచెం పసుపు కలిపి, ఆ మిశ్రమాన్ని స్నానానికి ముందు పై పూతగా వాడితే గజ్జి, తామర తగ్గిపోతాయి. అయితే, ఈ మిశ్రమాన్ని వాడినన్ని రోజులు, సబ్బుకు బదులు సెనగపిండితో స్నానం చేయాలి.
- ఒక తులం వేరు చూర్ణం, అర తులం ఇంగువ కలిపి ఈ మిశ్రమాన్ని తేనెతో కలిపి తీసుకుంటే, ఉబ్బసం వ్యాధి నుంచి ఉపశమనం కలుగుతుంది.
- నేలములక పూలను నీడపట్టున ఎండించి చూర్ణం చేసి, కాస్తంత చూర్ణంలో తేనె కలిపి నాకిస్తూ ఉంటే చిన్న పిల్లలను చాలా రోజులుగా బాధిస్తున్న దగ్గు కూడా తగ్గిపోతుంది.
- నేలములక వేళ్ల రసంలో తగినంత తేనె కలిపి తాగుగూ ఉంటే మూత్రంలో మంట, పోటు వంటి అనేక రకాల మూత్రదోషాలు తొలగిపోతాయి.
- వేరు చూర్ణాన్ని తీయని పెరుగులో కలిపి కొద్ది రోజుల పాటు తాగితే మూత్ర పిండాల్లోని రాళ్లు ముక్కలై పడిపోతాయి.

త్రీ సుడోకు - 126

4				2	6			
7				9	4		8	
1							4	
8						1		4
		1		4		7		
2		3						8
	8							3
	7		5	8				6
			9	6				5

ఎలా పూరించాలి?

సుడోకు- 125 సమాధానం

8	1	9	3	7	6	5	2	4
3	2	4	1	8	5	6	7	9
7	5	6	2	9	4	8	3	1
6	8	7	4	1	3	2	9	5
5	4	1	9	2	8	3	6	7
9	3	2	6	5	7	4	1	8
2	7	3	8	4	1	9	5	6
1	9	8	5	6	2	7	4	3
4	6	5	7	3	9	1	8	2

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

నవ్య చిత్రజ్యోతి
ఆంధ్రజ్యోతి

రామలక్ష్మీ.. రంగమ్మ.. మంగమ్మ!

రాంచరణ్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న 'రంగస్థలం 1985' సినిమాకు సంబంధించి విడుదల చేసిన పోస్టర్, 'ఎంత సక్కగున్నావే', 'రంగా రంగా రంగస్థలానా' పాటలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సినిమాలోని 'రంగమ్మ మంగమ్మ' అని సాగే పాటను విడుదల చేశారు. దీని గురించి సమంత ట్విటర్ వేదికగా ఓ వీడియోను అభిమానులతో పంచుకున్నారు. "ఎంత సక్కగున్నావే', 'రంగా రంగా రంగస్థలానా' పాటల్ని సక్సెస్ చేసినందుకు ధన్యవాదాలు. మహిళా దినోత్సవం సందర్భంగా 'రంగమ్మ మంగమ్మ' అంటూ ఈ రామలక్ష్మి మీ ముందుకు వచ్చేస్తోంది. మీకు నచ్చుతుందని ఆశిస్తున్నా' అని సమంత ఆ వీడియోలో పేర్కొన్నారు. పల్లెటూరి నేపథ్యంలో 1985 కాలాన్ని తలపించేలా సుకుమార్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఈ నెల 30న విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు.

పెళ్లయ్యాక తొలిసారి...

తెరమీదే కాదు, నిజజీవితంలో కూడా సమంతకు బెస్ట్ పెయిర్ అనిపించుకుంటున్నారు నాగచైతన్య. ఇటీవల వివాహబంధంతో ఒకటైన ఈ జంట మరోసారి కలిసి ఓ సినిమాలో నటించబోతున్నట్లు గతంలో వార్తలొచ్చాయి. అందులో నిజంలేదని ఓ సందర్భంలో నాగచైతన్య ట్విట్టర్ ద్వారా స్పష్టం చేశారు. కానీ ఇప్పుడు తన సతీమణితో కలిసి సినిమా చేస్తున్నట్లు చైతన్య ప్రకటించారు. 'ఏమాయ చేశావె', 'ఆటోనగర్ సూర్య', 'మనం' చిత్రాలతో ఆకట్టుకున్న ఈ జంట వివాహం తర్వాత నటిస్తున్న తొలి చిత్రమిది. "శివ నిర్వాణ దర్శకత్వంలో నేను నటించబోతున్నందు కు సంతోషంగా ఉంది. నా అర్ధాంగి సమంత అవకాశమిస్తే ఆమెతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంటాను' అని సరదాగా ట్విట్టర్‌లో రాసుకొచ్చా రు చైతన్య. దానికి సమంత బదులిస్తూ.. 'ఎగ్జైటెడ్..ఎగ్జైటెడ్.. ఎగ్జైటెడ్' అని ట్వీట్ చేశారు.


సమంత, రామ్‌చరణ్

ముగ్గురు రవితేజలు..


రవితేజ, అను ఇమ్మాన్యుయెల్

రవితేజ హీరోగా శ్రీనువైట్ల దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'అమర్ అక్బర్ ఆంటోనీ'. అను ఇమ్మాన్యుయెల్ కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రానికి నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, మోహన్ నిర్మాతలు. రవితేజ త్రిపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రం గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి శ్రీనువైట్ల పెద్ద కుమార్తె ఆనంది క్లాప్ కొట్టగా.. రెండో కుమార్తె ఆద్య కెమెరా స్విచ్చాన్ చేసింది. శ్రీనువైట్ల గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "చాలా గ్యాప్ తర్వాత రవితో చేస్తున్న సినిమా ఇది. ఏడాది క్రితం ఈ కథకు బీజం పడింది. పది నెలలుగా కథ మీద పనిచేశాం. షూటింగ్ మొత్తం న్యూయార్క్, డెట్రాయిట్, సాల్ట్ లేక్ సిటీ వంటి ప్రాంతాల్లో చిత్రీకరిస్తాం. సునీల్ పూర్తిస్థాయి వినోదాత్మక పాత్రలో కనిపిస్తారు. నిన్నటితరం నటి లయ, ఆమె కుమార్తె శ్లోక కూడా ఈ చిత్రంలో కీలకపాత్ర పోషించనుండడం విశేషం. రవితేజ తనయుడు మహాధన్ మరో ముఖ్యపాత్ర పోషించడం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది" అని అన్నారు. "మా సంస్థకి ప్రత్యేకమైన సినిమా ఇది. రవితేజ-శ్రీనువైట్ల కాంబినేషన్‌లో పని చేయడం ఆనందంగా ఉంది. త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం" అని నిర్మాతలు చెప్పారు.

ఆ పాట పల్లవితో రామ్ సినిమా


అనుపమ, రామ్

రామ్ కథానాయకుడిగా నటిస్తున్న 'హలో గురు ప్రేమకోసం' చిత్రం గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మిస్తున్నారు. రామ్ సరసన అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తోంది. 'సినిమా చూపిస్త మావ', 'నేను లోకల్' వంటి హిట్ చిత్రాల తర్వాత త్రినాథరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. పూజా కార్యక్రమాల అనంతరం ఎర్నేని నవీన్, స్రవంతి రవికిషోర్ దర్శకుడికి స్క్రిప్ట్‌ను అందించారు. వంశీ పైడిపల్లి క్లాప్ కొట్టారు. అనిల్ రావిపూడి కెమెరా స్విచ్చాన్ చేయగా, హరీశ్ శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. నాగార్జున కథానాయకుడిగా నటించిన 'నిర్ణయం' చిత్రంలోని 'హలో గురూ ప్రేమకోసమేరో జీవితం' అన్న పాటలోని మొదటి మూడు పదాలను టైటిల్‌గా పెట్టడం ఆసక్తి నెలకొంది. ఈ నెల 12 నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తారు. ఇతర విషయాలు త్వరలో వెల్లడిస్తామని చిత్ర యూనిట్ తెలిపింది. ప్రకాశ్ రాజ్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి మాటలు: బెజవాడ ప్రసన్నకుమార్, రచన సహకారం: సాయికృష్ణ, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, సినిమాటోగ్రఫీ: విజయ్ కె.చక్రవర్తి ఆర్ట్: సాహి సురేశ్, ఎడిటింగ్: కార్తీక శ్రీనివాస్.

హై ఓల్టేజ్ యాక్షన్


నిత్యామీనన్

సుదీప్, నిత్యామీనన్ జంటగా కె.ఎస్. రవికుమార్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కోటికొక్కడు'. దుహర మూవీస్ పతాకంపై కళ్యాణ్ ధూళిపాళ్ల అనువదించారు. శుక్రవారం విడుదల కానున్న ఈ సినిమా గురించి నిర్మాత మాట్లాడుతూ "డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ఇటీవల 'రచయిత' సినిమా నిర్మించాను. అది మంచి పేరు తెచ్చింది. రెండో చిత్రంగా 'కోటికొక్కడు'ను 300 థియేటర్లకు పైగా రిలీజ్ చేస్తున్నాను. తెలుగులో కూడా కచ్చితంగా పెద్ద హిట్ అవుతుందని కాన్ఫిడెంట్‌గా వున్నాం" అన్నారు. ఎస్.వి.ఆర్. మీడియా శోభారాణి మాట్లాడుతూ " 'కోటికొక్కడు' చిత్రాన్ని చూశాను. ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం చాలా ఇంట్రెస్టింగా అనిపించింది. రవికుమార్‌గారు చాలా అద్భుతంగా తెరకెక్కించారు క్లైమాక్స్‌ని. పాటలు చాలా రిచ్‌గా వుంటాయి. కమర్షియల్ ఎలిమెంట్స్‌తో రూపొందిన హై ఓల్టేజ్ యాక్షన్ డ్రామా ఇది. తప్పకుండా పెద్ద హిట్ అవుతుంది" అని అన్నారు. అభిరుచి గల నిర్మాత అనువదిస్తున్న ఈ చిత్రం తప్పకుండా పెద్ద విజయాన్ని సాధిస్తుంది అని దర్శకుడు సముద్ర చెప్పారు.

మా హీరో గత చిత్రాలతో పోలిక ఉండదు!

\- శ్రీధర్



"టెక్నాలజీ మాయలో పడటం వల్ల మనుషుల మధ్య దూరం పెరిగిపోయింది. మన చుట్టూ ఉన్న వారి కన్నా ఆన్‌లైన్‌లో ఉన్నవారితో స్నేహాలు, సంబంధాలు పెరుగుతున్నాయి. ప్రతి చిన్న విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం వల్ల అది పర్సనల్ టీవీలా తయారైంది. నేను టెక్నాలజీ రంగంలో ఉండటం వల్ల దీని ఆధారంగానే 2014లో కథను తయారు చేసుకున్నాను. హై కాన్సెప్ట్ మూవీ" అని శ్రీధర్ మర్రి అన్నారు. ఆయన స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'ఏ మంత్రం వేశావె' చిత్రం శుక్రవారం విడుదల కానుంది. విజయ్ దేవరకొండ, శివానీసింగ్ జంటగా నటించారు. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ మల్కాపురం శివకుమార్ సమర్పిస్తున్నారు. దర్శక నిర్మాత శ్రీధర్ మర్రి మాట్లాడుతూ "మేం తెలుగువాళ్లమైనా చదువు, వృత్తిరీత్యా బెంగుళూరు, కోల్‌కతా, యు.ఎస్‌లో ఉన్నాను. చిన్నప్పట్నుంచి కథలు రాయడం.. పిల్లలతో నాటికలు వేయించడం పట్ల ఆసక్తి ఉండేది. జీవితంలో సెటిల్ అయ్యాక మనచుట్టూ ఉన్న పరిస్థితులను ఆధారంగా చేసుకుని కథ తయారు చేసి 'ఏ మంత్రం వేసావె' అని పేరు పెట్టాను. ఇలాంటి కథను ఇతర నిర్మాతలెవరూ నమ్మరు కాబట్టి నేనే నిర్మాతగా మారి సినిమా చేశాను. ఇది రెగ్యులర్ ఫార్మెట్ చిత్రం కాదు. శివకుమార్‌గారికి కాన్సెప్ట్ నచ్చడంతో విడుదల చేయడానికి ముందుకు వచ్చారు. విజయ్ దేవరకొండ గత చిత్రాలతో దీనికి పోలిక ఉండదు. డిఫరెంట్ బ్యాక్‌డ్రాప్‌లో సినిమాలు చేస్తేనే ప్రేక్షకులు ఆదరిస్తారు. నేను చెప్పాలనుకున్న మెసేజ్‌ను సినిమా రూపంలో తీశాను. నేను డబ్బులు సంపాదించడానికి ఇండస్ట్రీకి రాలేదు. భవిష్యత్‌లో కూడా మంచి ఐడియాతో సినిమాలు తీయడానికి ప్రయత్నిస్తాను" అని అన్నారు.

హాయి హాయిగా...


అరుణ్ తేజ్, ఛరిష్మా

అరుణ్ తేజ్, ఛరిష్మా శ్రీకర్ జంటగా బియన్ రెడ్డి అభినయ దర్శకత్వంలో డాక్టర్ ఎస్. కీర్తి, డాక్టర్ జి. పార్థసారథిరెడ్డి నిర్మిస్తున్న 'నీతోనే... హాయ్ హాయ్' బుధవారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి శివాజీరాజా కెమెరా స్విచాన్ చేయగా, శ్రీకాంత్ క్లాప్ ఇచ్చారు. రేలంగి నరసింహారావు గౌరవ దర్శకత్వం వహించారు. "సంపన్నుల వ్యక్తిత్వం ఎలా ఉంటుంది? మధ్యతరగతి మనుషుల మానవత్వం ఎలా ఉంటుంది? అనేది చిత్రనేపథ్యం. అందమైన ప్రేమకథకు వాణిజ్య హంగులు జోడించి చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం" అన్నారు దర్శకుడు బియన్ రెడ్డి అభినయ. "నిర్మాతలుగా మా తొలి ప్రయత్నమిది. మాకు మంచి పేరు తెచ్చే చిత్రం అవుతుందని ఆశిస్తున్నాం. ప్రేక్షకులు చిత్రాన్ని ఆదరిస్తారనే నమ్మకం ఉంది" అన్నారు కీర్తి, పార్థసారథి. "బియన్‌రెడ్డిగారికి నాటక రంగంలో మూడు నంది అవార్డులు వచ్చాయి. ఎన్నో నాటకాలు చేసిన, ఆయన చిత్ర రంగంలోనూ చక్కటి పేరు తెచ్చుకుంటారు" అని చిత్రసమర్పకులు యలమంచిలి ప్రవీణ్ అన్నారు. ఆనంద్, బెనర్జీ, ఏడిద శ్రీరామ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రవి కల్యాణ్.

కథ చెప్పింది ఎవరు?

బేబి చైత్ర సమర్పణలో తెరకెక్కిన చిత్రం 'దెయ్యం చెప్పిన కథ'. ఆరాధ్య ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. శివ, సుప్రియ, సురేశ్ జెండా, సునీల్, పద్మ కీలక పాత్రధారులు. పెనాక దయాకర్‌రెడ్డి నిర్మాత. ప్రదీప్ రాజ్ దర్శకుడు. ఈ చిత్రం ఆడియో హైదరాబాద్‌లో గురువారం ఉదయం విడుదలైంది. సాగర్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, సాయివెంకట్, ఎస్వీ రావు ముఖ్య అతిథులుగా పాల్గొని బిగ్ సీడీని విడుదల చేశారు. టైటిల్ వైవిధ్యంగా ఉందని, పాట మాస్‌ను ఆకట్టుకుంటుందని, సినిమా పెద్ద హిట్ కావాలని అతిథులు ఆకాంక్షించారు. చిత్ర దర్శకుడు మాట్లాడుతూ "కొత్త సబ్జెక్ట్‌తో తెరకెక్కించిన చిత్రమిది. ఇందులో మొత్తం 29 కేరక్టర్లు ఉంటాయి. అందరినీ కొత్తవారిని పరిచయం చేశాం" అని తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ "మంచి ప్రయత్నం చేశాం. సినిమా ఫ్రెష్‌గా అనిపిస్తుంది. నవీన్ మంచి సంగీతాన్నిచ్చారు" అని చెప్పారు.